www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

గురువారం | 17-1-2019 | పేజీలు: 18 + 20 | వెల: రూ. 6.50 | సంపుటి: 15 సంచిక: 191 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 10.35 తదుపరి ద్వాదశి; నక్షత్రం: కృత్తిక మ. 1.41 తదుపరి రోహిణి; వర్జ్యం: తె. 4.51-6.22; దుర్ముహూర్తం: ఉ. 10.35-11.20; మ. 3.00-3.44; అమృతఘడియలు: ఉ. 11.20-12.54; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.55; సూర్యాస్తమయం: 5.57 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai




www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



గురువారం | 17-1-2019 | పేజీలు: 18 + 20 | వెల: రూ. 6.50 | సంపుటి: 15 సంచిక: 191 | Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai | నిజామాబాద్ సిటీ*



అరుణ్ జైట్లీకి కేన్సర్

తొడ భాగంలో కణితి

శస్త్రచికిత్స కోసం న్యూయార్క్‌కు

గత ఏడాదే మూత్రపిండాల మార్పిడి

ఆపరేషన్ చేస్తే తట్టుకోలేకపోవచ్చు

అలాగని శస్త్రచికిత్స చేయకున్నా ముప్పే

ఇది వేగంగా పాకే మృదు కణజాల కేన్సర్

త్వరగా కోలుకోవాలని రాహుల్ ఆకాంక్ష

చివరి బడ్జెట్ ఎవరు ప్రవేశపెడతారు?

న్యూఢిల్లీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ (66).. మృదుకణజాల కేన్సర్‌తో బాధపడుతున్నారు. దీనివల్ల ఆయన తొడ భాగంలో కణితి ఏర్పడింది. రెండు వారాలపాటు వ్యక్తిగత సెలవు తీసుకున్నట్టు ప్రకటించిన జైట్లీ.. కేన్సర్‌కు శస్త్రచికిత్స చేయించుకునేందుకు న్యూయార్క్‌కు వెళ్లారు. గత ఏడాదే మూత్రపిండ మార్పిడి చేయించుకున్న ఆయన ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఇప్పుడు కేన్సర్‌కు కీమోథెరపీ ఇస్తూ, శస్త్రచికిత్స కూడా చేస్తే ఆ భారాన్ని ఆయన మూత్రపిండాలు తట్టుకోలేవని.. దీనివల్ల ఇతరత్రా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, అక్కడి వైద్యులు ఆయనకు శస్త్రచికిత్స చేయకపోవచ్చని, కొన్ని మందులు మాత్రం ఇచ్చి తగు జాగ్రత్తలు చెప్పి డిశ్చార్జ్ చేయవచ్చని సంబంధిత వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగని జైట్లీకి శస్త్రచికిత్స

మిగతా 12వ పేజీలో...

అమిత్‌షాకు స్వైన్‌ఫ్లూ



12

కొత్త పొత్తు

జగన్, కేటీఆర్ అధికారిక చర్చలు

లోటస్‌పాండ్ నివాసానికి టీఆర్ఎస్ బృందం



లోటస్‌పాండ్ నివాసంలో భేటీ అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న కేటీఆర్, జగన్

ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై వివరణ .. కేసీఆర్‌తో జగన్ ఫోన్ ద్వారా చర్చలు

వచ్చేనెల 14న అమరావతికి కేసీఆర్.. జగన్ గృహ ప్రవేశానికి హాజరు!

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాకు మా మద్దతు.. కేసీఆర్ కూడా ప్రకటించారు

జగన్‌తో 'ఫెడరల్'పై చర్చించాం.. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేసీఆర్ చొరవ హర్షణీయం.. ఎంపీల బలంతోనే కేంద్రం స్పందిస్తుంది: జగన్

ఫెడరల్ ఫ్రంట్ పార్టీలు ఎక్కడికైనా వచ్చి ప్రచారం చేస్తాయి: విజయసాయి

హైదరాబాద్/అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏపీలో విపక్షం వైసీపీ, తెలంగాణలో అధికారపక్షం టీఆర్ఎస్ మధ్య 'స్నేహం'లో అధికారికంగా తొలి అడుగు పడింది. ఏపీలో ఎట్టిపరిస్థితుల్లోనూ అధికారికంలోకి రావాలని భావిస్తున్న జగన్... 'ఏపీ రాజకీయాల్లో అడుగు పెడతాం. చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి తీరతాం' అని ప్రకటించిన కేసీఆర్ మధ్య నేరుగా సంప్రదింపులు మొదలయ్యాయి. కేసీఆర్ ఆదేశాల మేరకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ నివాసంలో వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను కలిశారు. పాదయాత్ర సమయంలోనే జగన్‌తో ఏపీలోనే కేటీఆర్ భేటీ కావాలని భావించినట్లు తెలిసింది. అయితే, పాదయాత్ర ముగిశాకే ఇతర రాజకీయాంశాలపై పూర్తిగా దృష్టి సారిస్తానని జగన్ వెల్లడించినట్లు సమాచారం. దీంతో.. మంగళవారం జగన్‌ను కేసీఆర్ ఫోన్‌లో సంప్రదించారు. బుధవారం కేటీఆర్ వచ్చి మాట్లాడతారని, ఆ తర్వాత తాను స్వయంగా సంప్రదింపులు జరుపుతానని

మిగతా 7వ పేజీలో...


ముసుగు తీయండి కలిసే పోటీ చేయండి!

కేసీఆర్‌తో జగన్ డ్రామా: చంద్రబాబు

జగన్.. కేసీఆర్ చేతిలో రిమోట్

ఏపీలో పెత్తనం చేయాలని చూస్తున్నారు

జగన్ ఆంధ్రా ద్రోహి.. ఏపీ మంత్రుల ఫైర్



7



ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ప్రమాణస్వీకారం అనంతరం అభినందిస్తున్న కేసీఆర్, నరసింహన్

నేటి నుంచి అసెంబ్లీ

ఉదయం 11.30 గంటలకు తొలి సమావేశాలు ప్రారంభం 8

ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణం.. గన్‌పార్క్ వద్ద కేసీఆర్ నివాళి

రేపు శాసనసభ స్పీకర్ ఎన్నిక.. 19న గవర్నర్ నరసింహన్ ప్రసంగం

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ప్రమాణం

ముగ్గురు రెబల్ ఎమ్మెల్సీలపై

అనర్హత

యాదవ్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాములు సభ్యత్వాలు రద్దు

శాసన మండలి చైర్మన్ నిర్ణయం

బులెటిన్ విడుదల చేసిన మండలి

కౌన్సిల్ చరిత్రలో ఇదే తొలిసారి

ఏడుకు చేరిన ఎమ్మెల్సీ ఖాళీలు



హైదరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శాసన మండలి సమావేశాల ప్రారంభం కావడానికి సరిగ్గా రెండు రోజుల ముందు ఎమ్మెల్సీలు రాములు నాయక్, యాదవ్‌రెడ్డి, భూపతిరెడ్డిలపై అనర్హత వేటు పడింది. పార్టీ ఫిరాయింపునకు సంబంధించి జారీ అయిన నోటీసులపై ముగ్గురు ఎమ్మెల్సీల వివరణ, వాదనలు విన్న మండలి చైర్మన్ స్వామిగౌడ్ భారత రాజ్యాంగం పదో షెడ్యూల్‌లోని రెండో పేరాను, తెలంగాణ శాసన మండలి ఆరవ నిబంధనను అనుసరించి వీరిపై అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆయన నిర్ణయాన్ని తెలియజేస్తూ శాసన మండలి కార్యాలయం బుధవారం వేర్వేరుగా బులెటిన్లు విడుదల చేసింది. దీంతో శాసన మండలిలో

మిగతా 8వ పేజీలో...

చీకటి రోజు!

అనర్హత నిర్ణయం ఏకపక్షం

టీఆర్ఎస్‌కు ఒక న్యాయం 8

కాంగ్రెస్‌కు మరో న్యాయమా?

అనర్హత మాకు వర్తించదు

వేటుపడ్డ ఎమ్మెల్సీల ఆగ్రహం



7

కుష్టుపై పోరాటయోధుడు

ససకావాకు గాంధీ శాంతి బహుమతి



4

బ్రహ్మానందానికి బైపాస్ సర్జరీ

ముంబై ఆస్పత్రిలో ఆపరేషన్

నిలకడగా ఆరోగ్య పరిస్థితి





సుప్రీం ప్రకంపన

జూనియర్లకు పదోన్నతా?.. కొలీజియంపై రగులుతున్న అసంతృప్తి



సీజేఐకు జస్టిస్ సంజయ్ కౌల్ లేఖాస్త్రం

నిర్ణయాలను మార్చేసి కొత్తవారికిస్తారా?

మాజీ సీజేఐ, న్యాయమూర్తుల విస్మయం

పరిస్థితేమీ మారలేదు: జస్టిస్ చలమేశ్వర్

కొలీజియం సిఫారసులకు కేంద్రం ఆమోదం

"ఢిల్లీ హైకోర్టులో ముగ్గురు సీనియర్లను కాదని జూనియర్‌కు పదోన్నతినిచ్చారు. దేశవ్యాప్తంగా 32 మంది సీనియారిటీని పక్కనపడేశారు. క్రిస్మస్ సెలవులకు ముందొక నిర్ణయం- వాటి తర్వాత వేరొక నిర్ణయమా? సీనియారిటీ అని చెప్పి జూనియర్లను ఎంపిక చేస్తారా?"

-హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ కైలాస్ గంభీర్

న్యూఢిల్లీ, జనవరి 16: దేశ అత్యున్నత న్యాయస్థానం లోపలా, బయటా అసంతృప్తి సెగలు.. పదోన్నతికి ఎంపిక చేసిన ఇద్దరు జడ్జీలను మార్చేసి- వారి స్థానే కొత్తవారికి కొలీజియం ప్రమోషన్ ఇవ్వడంపై తీవ్ర స్థాయిలో వివాదం చెలరేగింది.. డిసెంబరు 12న జరిగిన ఐదుగురు జడ్జీల కొలీజియం- ఢిల్లీ, రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు- జస్టిస్ రాజేంద్ర మీనన్, ప్రదీప్ నంద్రజోగ్‌లకు పదోన్నతినిచ్చి సుప్రీంకోర్టుకు తీసుకురావాలని నిర్ణయించింది. కానీ ఈ నిర్ణయం లీక్ కావడంపై సుప్రీం చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ అసంతృప్తి చెందారు. దీనిపై జనవరి 10న మళ్లీ కొలీజియం సమావేశమై ఎంపిక చేసిన ఇద్దర్నీ తీసేసి- కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టులో జడ్జిగా ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నాలను ఎంపిక చేసి-కేంద్రానికి సిఫారసు చేసింది. ఈ నిర్ణయం న్యాయవర్గాల్లో ప్రకంపనలు రేపింది. తీవ్ర వివాదం చెలరేగినా కేంద్రం దాన్ని పట్టించుకోకుండా ఈ సిఫారసును ఆమోదించి- ఈ ఇద్దరి పదోన్నతికీ ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు న్యాయమంత్రిత్వ శాఖ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. కొలీజియంలో సీజేతో పాటు జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ సభ్యులు. ఈ ఆకస్మిక మార్పు న్యాయవర్గాలను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. వ్యక్తిగత ఇష్టాయిష్టాల మీద సంస్థలు నడవరాదని, ఏ సంప్రదాయాలను అనుసరిస్తున్నారో వాటిని పరిరక్షించాలని సుప్రీం న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు, మాజీ జడ్జీలు

మిగతా 9వ పేజీలో...



ఇరాక్‌లో చిక్కుకున్న నిజామాబాద్ జిల్లా వాసులు

ఇందూరు అన్నదాతలు.. ఇరాక్‌లో పస్తులు

విజిటింగ్ వీసాతో ఏజెంట్ మోసం

15 మంది నుంచి రెండేసీ లక్షలు వసూలు

పని లేక డబ్బుల్లేక 4 నెలలుగా తిప్పలు

నిజామాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): యవుసంతో ఇల్లు గడుస్తలేదు. పెళ్లాం, పిల్లలను నడిపేదెట్లా అని రంధి పడిన ఆ బడుగు రైతులు 'విదేశాల్లో కొలువు' అంటూ ఏజెంట్ల చెప్పిన మాటలతో మంచి జీతం.. జీవితంపై కలలు కన్నారు. కష్టాలన్నీ తీరిపోతాయని అనుకున్నారు. ఉన్న కొద్ది పొలం, బంగారం అమ్మి.. అప్పు చేసి ఏజెంటు చెప్పినట్లుగా తలా రూ.2లక్షల దాకా చేతిలో పెట్టారు. విమానమెక్కి విదేశమైతే వెళ్లారు. కానీ అక్కడ వారి కష్టాలు తీరలేదు సరికదా రెట్టింపయ్యాయి. పెళ్లాం, పిల్లలకు బుక్కెడు బువ్వ పెడదామనే ఆశతో బయటదేశం పోయిన ఆ రైతులు అక్కడ ఆకలితో అలమటిస్తున్నారు. ఏజెంట్ మాటలు నమ్మి నాలుగు నెలలుగా ఇరాక్‌లో అవస్థలు

మిగతా 4వ పేజీలో...

తెలుగు రాదు.. చదవలేరు

8లోనూ తెలుగు చదవలేకపోతున్నారు

7వ తరగతిలో అక్షరాలూ గుర్తు పట్టట్లేదు

తెలంగాణ గ్రామీణ విద్యార్థుల పరిస్థితి ఇది

కొంచెం పెరిగిన టీచర్ల హాజరు శాతం

విద్యా వార్షిక నివేదిక చెబుతున్న నిజాలు



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) తెలంగాణలో ఎనిమిదో తరగతి చదువుతున్న గ్రామీణ విద్యార్థుల్లో 9.6 శాతం మందికి కనీసం తెలుగు పదాలను కూడా పూర్తిస్థాయిలో చదవడం రావడం లేదని విద్యా వార్షిక నివేదిక- 2018(ఎసర్) వెల్లడించింది. ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులో ప్రతి వంద మందిలో ఇద్దరు కనీసం అక్షరాలను కూడా గుర్తు పట్టలేకపోతున్నారని ఆ నివేదికలో చెబుతోంది. ఇక 100 పైబడిన అంకెలను వెంటనే గుర్తించడంలో ఏడో తరగతి

మిగతా 4వ పేజీలో...



12

ఈ ఏడాది నుంచే 10% కోటా

వర్సిటీల్లో అదనంగా 25% సీట్లు: జావడేకర్

అమలు చేసిన తొలి రాష్ట్రంగా గుజరాత్



పద్మనాభ స్వామి ఆలయంలోకి ప్రవేశిస్తున్న ప్రధాని మోదీ

"వారి పేర్లు వేరు కావచ్చు గానీ.. కేరళ సంస్కృతిని నాశనం చేయడంలో, రాజకీయ హింస విషయంలో రెండూ ఒకటే. కేరళ ఆధ్యాత్మికత, ప్రశాంతత, సామరస్యం, ఆనందం.. అన్నీ ఎల్డీఎఫ్, యూడీఎఫ్ అవినీతి, మతతత్వంలో బందీలైపోవడం నాకు బాధ కలిగిస్తోంది"

-ప్రధాని మోదీ

సిగ్గులేని వామపక్షం

కమ్యూనిస్టులు మన సంస్కృతిని గౌరవించరు.. ఆధ్యాత్మికతను పట్టించుకోరు

అయ్యప్పపై ఇంత ద్వేషమా?.. చరిత్రలో అత్యంత సిగ్గుమాలిన ప్రవర్తన లెఫ్ట్ సర్కారుది

యూడీఎఫ్ ఏమీ తక్కువ తినలేదు.. ఈ వివాదంపై కాంగ్రెస్‌ది ద్వంద్వవైఖరి

పార్లమెంటులో ఒకమాట, ఇక్కడొక మాట.. లింగ సమానత్వం చేతల్లో ఏదీ? 12

2 కూటములూ ఒకే నాణేనికి 2 పార్శ్వాలు.. కేరళ సంస్కృతిని కాపాడేది బీజేపీయే

లెఫ్ట్ సర్కారుపై ధ్వజమెత్తిన మోదీ.. అనంత పద్మనాభ స్వామి ఆలయం సందర్శన



Paramjyothi
పరంజ్యోతి

జీవన సార్థకత అంటే..



'నిన్ను నీవు తెలుసుకున్నప్పుడే నీ జీవితానికున్న అర్థమేమిటో బోధపడుతుంది' అంటారు రమణమహర్షి. మన మేమిటో మనకు అర్థమైనప్పుడే.. మనం చేసే పనులు ఎలా ఉండాలో తెలుస్తుందన్నది ఆయన అభిప్రాయం. ఇదే విషయాన్ని కబీర్ దాసు ఇలా చెప్పారు..

మాలీ ఆవత్ దేఖికర్, కలియన్ కరీ పుకార్
ఫూలే ఫూలే చున్ లియే, కాలి హమారీ బార్

తోటమాలి రావడం చూసిన మొగ్గలు 'ఈరోజు వికసించిన పూలను తెంపుకుపోతాడు. రేపు మేం కూడా వికసిస్తాం. మమ్మల్నీ ఎలాంటి దయా చూపకుండా కోసుకొని పోతాడు. మా బతుకులిలా ముగిసిపోవాల్సిందేనా?' అని దుఃఖిస్తాయని దీని అర్థం. పూలుగా వికసించినప్పుడే తమ జీవితం సార్థకం అవుతుందని తెలుసుకోలేని మొగ్గలు ఇలా బాధపడతాయని అంతరార్థం. భగవంతుడు ప్రసాదించిన జన్మను సఫలం చేసుకోవాలంటే మంచి కర్మలు చేయాలి. ఆ సత్కర్మలు ఆచరించగలిగినప్పుడే జన్మకు సార్థకత చేకూరుతుంది. అదే మనిషి జీవితం. ఇది తెలుసుకోనప్పుడు బతకడం కోసమే కాలాన్ని వాడుకుంటారుగానీ.. జీవించడం కోసం సమయాన్ని వెచ్చించరు. బతుకు కోసం దారిదోపిడీ చేసే రత్నాకరునికి.. నారద మహర్షి జీవించే సత్యమార్గాన్ని చూపిస్తాడు. ఆ మార్గంలో పయనించిన రత్నాకరుడు వాల్మీకిగా మారి రామాయణాన్ని రచించి జీవితాన్ని సార్థకం చేసుకున్నాడు. కర్తవ్యాన్ని మరిచి యుద్ధభూమిలో అస్త్రసన్యాసం చేసిన అర్జునునికి ధర్మోపదేశం చేసి కార్యోన్ముఖుణ్ని చేయడమే గాక జీవితం సఫలం చేసుకోవడానికి ఆచరించాల్సిన కర్మలను గురించి బోధించాడు శ్రీకృష్ణుడు. ఆ బోధను విన్న అర్జునుడు ఆచరించి యుద్ధంలో గెలిచి విజయుడయ్యాడు.

బతకడం కోసం కాదు.. సత్కర్మలతో జీవితానికి సార్థకత ఏర్పరచుకోవడమే లక్ష్యంగా జీవనయానం సాగిపోవాలని పాశ్చాత్యులకు ప్రబోధించిన మహాత్ములెందరో ఈ పావన భారతావనిన అవతరించారు. అందులో అగ్రగణ్యుడు స్వామి వివేకానందుడు. అమెరికాలో జరిగిన సర్వమత సమ్మేళనంలోను, ఆ తర్వాత పాశ్చాత్యులకు ఆయన జీవనసార్థకత గురించే ఎక్కువగా బోధించారు. భగవంతుడు ప్రసాదించిన అపురూపమైన జన్మను సార్థకం చేసుకోవడమే మానవధర్మమని తెలిపారు. ఈ విషయాన్ని అర్థం చేసుకోలేక చాలా మంది.. బెల్లంలో చిక్కుకున్న ఈగలైపోతారని, ఏ లక్ష్యమూ లేని మనుషులు కూడా అటువంటివారేనని చెప్పారు. కొందరు మనుషులు మాత్రమే మానవ జన్మ గొప్పదనాన్ని, అర్థాన్ని తెలుసుకుని.. తమకు తగిన లక్ష్యాన్ని ఏర్పరచుకొని జీవితాన్ని ప్రేమమయం చేసుకొంటారు. ఇతరుల అభివృద్ధిని కాంక్షించే నిస్వార్థమైన ప్రేమ అది. వారు సేవను తమ జీవితంలో భాగం చేసుకుని పరమాత్మను చేరుతారు.

-పరికిపండ్ల సారంగపాణి, 9849630290



గ్రామస్థులు నిప్పుపెట్టడంతో కాలిపోతున్న లారీలు

లారీ-ఆర్టీసీ బస్సు ఢీకొని నలుగురి మృతి

పది లారీలు బుగ్గి

» మహారాష్ట్రలో ఘటన... గ్రామస్థుల ఆగ్రహానికి పది లారీలు బుగ్గి

మహదేవపూర్, జనవరి 16 : లారీ-బస్సు ఎదురెదురుగా ఢీకొని నలుగురు చనిపోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహెరీ తాలూకాలో జరిగింది. గ్రామస్థుల, బాధితుల వివరాల ప్రకారం.. బుధవారం అహెరీ తాలూకా కేంద్రం నుంచి ఏటపల్లికి వెళ్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు, ఏటపల్లి నుంచి అహెరీకి వెళ్తున్న అదే రాష్ట్రానికి చెందిన లారీ ఎదురుగా ఢీకొన్నాయి. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న మంజులా కరిపే (48), శ్యామలా ఢోంగ్రీ (45), ప్రకాశ్ అంబడే (46), అమూల్ గారడే (10) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిని అహెరీ ఆస్పత్రికి, మరికొందరిని చంద్రపూర్‌కు తరలించారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన బస్సులోని ప్రయాణికులు, ఏటపల్లి గ్రామస్థులు రోడ్డుపై ప్రయాణిస్తున్న పది లారీలను దహనం చేశారు.

ఒరిగిన సాహితీ శిఖరం

మొదలి నాగభూషణశర్మ అస్తమయం.. తెనాలిలో 84ఏళ్ల వయసులో కన్నుమూత

» జనపదాల జాడల్లో విశేష పరిశోధనలు
» నాటకరంగంపై 2వేల పదాలతో డిక్షనరీ
» పూర్తైన అంత్యక్రియలు..ప్రముఖుల హాజరు

తెనాలి అర్బన్, జనవరి 16: రంగస్థల నటుడు, రచయిత, దర్శకుడు, పరిశోధకుడు మొదలి నాగభూషణశర్మ(84) మంగళవారం కన్నుమూశారు. చాలాకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, గుంటూరు జిల్లా తెనాలి నాజరుపేటలోని తన స్వస్థలంలో తుదిశ్వాస విడిచారు. అజోవిభో కందాళం ఫౌండేషన్ ప్రతిభామూర్తి జీవిత కాల సాధన పురస్కారాన్ని ఈ నెల ఆరో తేదీన అందుకొన్నారు. ఆ తరువాత పది రోజుల్లోపే నాగభూషణశర్మ తమకు శాశ్వతంగా దూరం కావడాన్ని ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. అభిమానులు, ప్రముఖుల సమక్షంలో బుధవారం తెనాలిలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఆచార్య మొదలి నాగభూషణ శర్మ మరణం నాటక రంగానికి తీరని లోటు అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఏడు దశాబ్దాల పాటు రంగస్థల నటుడిగా, రచయితగా, దర్శకుడిగా, అనువాదకుడిగా, ఆచార్యుడిగా, పరిశోధకుడిగా, బహు గ్రంథకర్తగా నాగభూషణశర్మ విరాజిల్లారు. ఆయన పూర్వీకుల స్వస్థలం బ్రాహ్మణకోడూరు కాగా, నరసరావుపేటలో మేనమామ భాగవతుల వెంకటసుబ్బారావు ఇంట 1935 జూలై 24న నాగభూషణశర్మ జన్మించారు. తండ్రి సుబ్రహ్మణ్య శర్మ ధూళిపూడిలో పని చేయడంతో, అక్కడే విద్యాభ్యాసం చేశారు. అమెరికాలోని ఇల్లినాయిస్ యూనివర్సిటీలో ఎంఎఫ్ఏ, భాషా శాస్త్రంలో పీహెచ్‌డీ డిప్లమో పొందారు. అమెరికా నాటక రంగంపై పరిశోధన చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా 18 ఏళ్లు పని చేశారు. ఆయన 1950ల్లో తన తొలి రచన 'అన్వేషణ'ను నాటిక రూపంలో రాశారు. 1954-74 వరకు చిన్నలు, పెద్దలు, వీలునామా, రాజదండం వంటి ఎన్నో నాటకాలను రచించారు. ఇంగ్లీష్, హిందీ, సంస్కృత భాషల్లో ఆయన పండితుడు. ప్రముఖ నటుడు బళ్లారి రాఘవ విశ్వరూపాన్ని వివరిస్తూ...బళ్లారి రాఘవ ప్రిన్స్ ఆఫ్ లేయర్స్ అనే గ్రంథాన్ని రచించారు. డిక్షనరీ ఆఫ్ థియేటర్ టెర్మ్స్ నిఘంటువులో రెండు వేల నాటక రంగ సంబంధ పదాలకు వ్యుత్పత్తి, అర్థ వివరణ ఇచ్చారు. ఏళ్ల తరబడి శోధించి ధర్మవరం వారి 20 నాటకాలను మూడు సంపుటాలుగా ముద్రించారు. గురజాడ కన్యాశుల్కం నాటకంపై వెలువడిన 182 వ్యాసాలను వెయ్యి పేజీలతో ముద్రించిన 'కన్యాశుల్కం - నూరేళ్ల సమాలోచనం' గ్రంథానికి సంపాదకునిగా వ్యవహరించారు. పాశ్చాత్య, భారతీయ, తెలుగు నాటక రంగంపై వెలువడిన 35 వేల పేజీల ముద్రిత సమాచారాన్ని సేకరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ యువ దర్శక నాటకోత్సవాల కమిటీకి సుదీర్ఘ కాలం సలహా సంఘం సభ్యులుగా వ్యవహరించారు. అమెరికా, ఫ్రాన్స్, రష్యా, జపాన్, గ్రీస్, టర్కీ వంటి దేశాల నాటకోత్సవాలలో పాల్గొని, ఆయా దేశాల నాటక రంగ లక్షణాలను పరిశీలించారు. 64 జానపద కళల పుట్టు పూర్వోత్తరాలను పరిశీలించి "ఫోక్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే గ్రంథాన్ని రచించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 2013లో ఎన్టీఆర్ రంగ స్థల పురస్కారం, 2018లో కళారత్న పురస్కారాన్ని అందించింది.



నాగభూషణశర్మ (ఫైల్)

అంతిమ ఘడియల్లోనూ..

అంతిమ ఘడియల్లో ఉన్న నాగభూషణశర్మను తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ మంగళవారం ఉదయం పరామర్శించారు. తన రచనలకు సముచిత స్థానం కల్పించాలని ఎమ్మెల్యేను ఆయన కోరారు. అదే రోజు సాయంత్రం కన్నుమూశారు. కాగా, రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, 'ప్రజ్వలిత' అధ్యక్షుడు నాగళ్ల వెంకటదుర్గాప్రసాద్, సినీ రచయిత డీఎస్ దీక్షితులు, వేమూరి విజయభాస్కర్, రావినూతల శ్రీరామమూర్తి, ఎంపీ కన్నెశ్వరరావు, పాండురంగారావు, జయధీర్ తిరుమలరావు సంతాపం వ్యక్తం చేశారు.

చదువులో బాలికలు టాప్

» లెక్కల్లో మాత్రం కుర్రాళ్లు బెస్ట్
» స్కూలుకెళ్లే బాలికల సంఖ్యలో పెరుగుదల
» అసర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 16: మొత్తం మీద చదువులో అమ్మాయిలు అబ్బాయిల కంటే మెరుగ్గా ఉన్నారని, అయితే ప్రాథమికంగా లెక్కల విషయంలో చూస్తే మాత్రం అబ్బాయిలు కాస్త పైనున్నారని ఓ సర్వేలో తేలింది. "14 నుంచి 16 సంవత్సరాల మధ్య నున్న కుర్రాళ్లు చాలా సులువుగా భాగహారం, గుణకారం... మొదలైన చిన్న చిన్న లెక్కల్ని చేయగలుగుతున్నారు. 50 శాతం మంది అబ్బాయిలు వీటిని చేయగలుగుతుంటే అమ్మాయిల సంఖ్య మాత్రం 44 శాతం మాత్రమే ఉంది. దేశ వ్యాప్తంగా- 596 జిల్లాల్లో- 3, 54. 944 ఇళ్లల్లో ఉన్న 3-16 ఏళ్ల మధ్యనున్న 5,46,527 మంది పిల్లలను సర్వే చేశారు. ఆ వివరాలను జాతీయ విద్యా పరిస్థితి నివేదిక (ఎఎస్ఇఆర్)గా వెలువరించారు. ఈ సర్వే ప్రధానంగా మూడు అంశాలపై పరిశీలన జరిపింది. స్కూళ్లలో పేరు నమోదు, హాజరు, స్కూలు వాతావరణం, క్రీడాస్థలం, క్రీడలకు వెసులుబాట్లు, చదువు, లెక్కలు, అవగాహన స్థాయి... మొదలైనవన్నీ మూడు భాగాలుగా చేసి సర్వే చేశారు. ఈ నివేదిక ప్రకారం చదువు సంధ్యల్లో అమ్మాయిలదే పైచేయి. ఒక్క లెక్కల అవగాహనలో మాత్రం అబ్బాయిలు ముందంజలో ఉన్నారు.

సర్వే వివరాలు

- స్కూళ్లలో విద్యార్థుల నమోదు పెరిగింది. 2018లో స్కూళ్లకు వెళ్లని 6-14 ఏళ్ల మధ్య పిల్లల సంఖ్య 2.8గా ఉంది. 3శాతం కంటే తక్కువ ఉండడం ఇదే మొదటిసారి.
- స్కూలుకు వెళుతున్న బాలికల సంఖ్య మెరుగుపడింది. 2006లో 11-14 ఏళ్ల బాలికల్లో 10.3 శాతం మంది స్కూల్‌కు వెళ్లేవారు కాదు. ఇది 2018లో 4.1 శాతానికి తగ్గింది.
- 2008లో 15-16ఏళ్ల లోపు అమ్మాయిల్లో దాదాపు 20 శాతానికి పైగా స్కూళ్లకు వెళ్లేవారు కాదు. 2018కల్లా ఈ సంఖ్య 13.1 శాతానికి తగ్గింది.
- పిల్లల్లో చదువుకోగల్గుతున్న సామర్థ్యం పెరుగుతోంది. మూడో తరగతి పిల్లలు రెండో తరగతి పుస్తకాలను సైతం చదివే పరిస్థితి ఐదేళ్ల కిందట కాస్త తక్కువ ఉండేది. అప్పుడు 21.6శాతం ఉంటే ఇప్పుడు 27.2 శాతానికి పెరిగింది
- పిల్లలంతా లెక్కల్లో బలహీనంగానే ఉన్నారు. 2016లో లెక్కలు చేయగల సామర్థ్యం ఉన్న 3వ తరగతి పిల్లలు 27.6 శాతం ఉంటే 2018లో 28.1 శాతానికి పెరిగింది.
- ప్రభుత్వ స్కూళ్లలోని మూడో తరగతి పిల్లల్లో 80% మందికి చిన్నచిన్న లెక్కలూ రావు. ఇదే గ్రామీణ భారతావని తీసుకుంటే 70% మంది పిల్లలకు తీసివేతలు, కూడికలు, గుణకారాలు కూడా రావు.
- ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్, కర్ణాటకల్లో పరిస్థితి దిగజారుతోంది. ఇక్కడ ఏడో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సగం మందికి భాగహారాలు, గుణకారాలు రావు.
- గ్రామీణ భారత్‌లో ప్రతీ ఎనిమిదిమందిలో ఒక విద్యార్థి తన పాఠ్య పుస్తకాలను చదవలేకపోతున్నాడు.
- విద్యా హక్కు చట్టం వల్ల పిల్లలు స్కూలుకెళ్లడం ఎక్కువవుతోంది. అయితే ఎనిమిదో తరగతికొచ్చిన ప్రతీ నలుగురిలో ఒకరు కనీసం తమ సబ్జెక్టులను చదవలేకపోతున్నారు(రీడింగ్). 2016 నుంచీ పరిస్థితి ఇంతే!
- గత నాలుగేళ్లలో ప్రైవేటు స్కూళ్లలో నమోదవుతున్న విద్యార్థుల సంఖ్య ఏ మాత్రం పెరగట్లేదు. 2006 నుంచి 2014 దాకా విపరీతంగా ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల నమోదు పెరిగింది. తరువాత 30.8 శాతం వద్దే నిల్చిపోయింది.

తెలుగు రాదు... చదవలేరు

(మూడోపేజీ తరువాయి)

విద్యార్థుల్లో 17 శాతం మందికి చేతకావడం లేదు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 14-16 ఏళ్ల అబ్బాయిలో 75.4 శాతం, అమ్మాయిలు 83 శాతం మందికి ప్రాథమికంగా చదవడం వస్తోందని నివేదిక తేల్చింది. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు ప్రస్తుతం 84.7 శాతంగా ఉందని, ఇది 2016 లో 82.1 శాతమని నివేదిక తెలిపింది. తాగు నీటి సౌకర్యం కేవలం 22.4 శాతం పాఠశాలల్లో మాత్రమే ఉంది. 57.2 శాతం పాఠశాలల్లో అందుబాటులో ఉంది. 2016లో జరిపిన సర్వేతో పోల్చితే ఇందులో మెరుగుదల దాదాపు లేనట్టేనని వెల్లడించింది. అప్పుడు 56.6 శాతం పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం ఉన్నట్టు గుర్తించారు. 3.5 శాతం పాఠశాలల్లో ఇంకా మరుగుదొడ్ల వసతే లేదని వెల్లడించింది.

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి

విషయం	పాఠశాలల శాతం
తాగు నీటి సౌకర్యం లేనివి	20.4
మరుగుదొడ్లు ఉన్నా వాడనివి	19.5
గ్రంథాలయాలు లేని స్కూల్స్	22.4
కంప్యూటర్స్ లేని పాఠశాలలు	89.5
బాలికలకు మరుగుదొడ్లు ఉన్నవి	8.7
ఆటల మైదానం లేని స్కూల్స్	16.7
వ్యాయామ టీచర్లు లేనివి	39.9
టీచర్స్ హాజరు శాతం	84.7
సదుపాయం ఉన్నా నీరులేనివి	22.4
బాలికలకు టాయిలెట్స్ ఉన్నా వాడనివి	8.9
గ్రంథాలయాలున్నా వాడనివి	22
విద్యుత్ లేని పాఠశాలలు	14
కంప్యూటర్స్ వినియోగించనివి	7.4



బ్రహ్మానందానికి బైపాస్ సర్జరీ

ముంబై ఆస్పత్రిలో ఆపరేషన్... నిలకడగా హాస్యనటుడి పరిస్థితి

హైదరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందానికి(62) రెండు రోజుల క్రితం ముంబైలోని ఒక ఆస్పత్రిలో బైపాస్ సర్జరీ అయ్యింది. ఆయన పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆదివారం బ్రహ్మానందం ఊపిరి తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందిపడడంతో హుటాహుటిన ముంబైలోని ఆసియన్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో చేర్పించారు. పలు రకాల పరీక్షలు చేసిన తర్వాత ప్రముఖ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండా సోమవారం ఆయనకు బైపాస్ సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. బ్రహ్మానందం వెంట ఆయన ఇద్దరు కుమారులు రాజాగౌతమ్, సిద్ధార్థ ఆస్పత్రిలో ఉన్నారు. ఆపరేషన్ తర్వాత తమ తండ్రి పరిస్థితి నిలకడగా ఉందని, ప్రస్తుతం ఆయన్ని అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు ఆయన కుమారుడు గౌతమ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వార్త బుధవారమంతా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వెయ్యికిపైగా చిత్రాల్లో వైవిధ్యభరితమైన పాత్రల్లో నటించి, గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించిన బ్రహ్మానందం పద్మశ్రీ అవార్డు గ్రహీత. హాస్యాన్ని పండించడంతో తనకంటూ ప్రత్యేక ఒరవడి సృష్టించుకున్నారు. ఆయన ఎన్టీఆర్ బయోపిక్ 'కథానాయకుడు' చిత్రంలో రేలంగి పాత్ర పోషించారు. చిరంజీవి 'సైరా' చిత్రంలో, ప్రభాస్ 'సాహో'లో నటిస్తున్నారు.

బోధన నుంచి నటనకు

బ్రహ్మానందం పూర్తి పేరు కన్నెగంటి బ్రహ్మానందం. ఏపీలోని గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో 1956 ఫిబ్రవరి 1న జన్మించారు. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలిలోని డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేశారు. తర్వాత సినీరంగంలో అవకాశాలు రావడంతో ఆ వృత్తిని వదిలిపెట్టారు. సినిమాల్లో విలక్షణ హాస్య పాత్రలను పోషించినందుకు 5 నంది అవార్డులు, ఒక ఫిల్మ్ ఫేర్ అవార్డు, ఆరు 'సినీమా' పురస్కారాలు అందుకున్నారు.

ఇందూరు అన్నదాతలు.. ఇరాక్‌లో పస్తులు

(మూడోపేజీ తరువాయి)

పడుతున్న 15మంది రైతులవీ తిప్పలు. నిజామాబాద్ నందిపేట మండలం షాపూర్‌కు చెందిన ఏజెంట్ నరేందర్ పని ఇప్పిస్తానని నమ్మించి నాలుగు నెలల క్రితం నందిపేట, నవీపేట, సిరికొండ, దర్పల్లి మండలాలకు చెందిన 15 మందిని విజిటింగ్ వీసాలపై ఇరాక్ పంపాడు. తర్వాత పత్తా లేకుండా పోయాడు. కొన్నాళ్లు అక్కడ గుట్టుగా తలదాచుకున్న బాధితులకు తాత్కాలిక నివాస అనుమతి (ఇఖామా) కల్పిస్తానంటూ మరో ఏజెంట్ రూ.50వేల చొప్పున తీసుకొని మొహం చాటేశాడు. వీరంతా ప్రస్తుతం ఇర్బిల్ అనే ప్రాంతంలో ఉంటూ తిండికి లేక అలమటిస్తున్నారు. అటు విజిటింగ్ వీసా గడువు ముగియడంతో ఇరాక్ అధికారులు జరిమానాలు విధించారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు రూ.8వేల చొప్పున కావాలని.. అంతమొత్తం తమ వద్దలేదని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. దుర్భర పరిస్థితుల్లో రోజులు గడుపుతున్నాం. ఆదుకోండి అంటూ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్‌కు వీడియోలో మొరపెట్టుకున్నారు. ఇళ్లకు ఫోన్లు చేసి బాధను కళ్లకు కట్టడంతో వారి కుటుంబ సభ్యులు.. డీజీపీ మహేందర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. నిజామాబాద్‌లో గల్ఫ్ కల్చర్ అసోసియేషన్ ప్రతినిధి బసంత్‌రెడ్డితో కలిసి బాధిత కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ తమ వారిని స్వదేశానికి తీసుకురావాలని వేడుకున్నారు. మోసపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఏజెంట్‌ను అరెస్టు చేయాలని తెలంగాణ గల్ఫ్ కల్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు బసంత్‌రెడ్డి కోరారు.

తిండికి తిప్పలైతుందని ఫోన్ చేస్తుండు



నా భర్త ఇరాక్ పోయి పనిచేసుకుంటే కుటుంబం బాగుపడ్తదని.. ఆడపిల్ల లగ్గం జరిపిస్తమని ఆశపడిన. పుస్తెలమ్మి.. ఇంకొంత మొత్తం ఐదు రూపాలదాకా మిత్తికి తెచ్చి రూ.1.8లక్షలు ఏజెంట్ చేతిల పెట్టిన. నా భర్త ఇరాక్ పోయి నాలుగు నెలలైంది. అక్కడ ఇంకా పనిలో కుదరలేదు. ఉల్టా మాకే ఫోన్ చేసి తిండికి తిప్పలైతుందని.. చేతిల పైసల్లేవని అంటున్నడు. కష్టాలు తీర్తయనుకుంటే.. మరింత అప్పులు పెరిగినయి.. ఆయన పానానికి కూడా ముప్పొచ్చిపడింది.

-ఊరట స్వరూప, నాగేపూర్, బాధితుడు గంగన్న భార్య

తల్లి ఒడిలోంచి బిడ్డను ఎత్తుకుపోయిన చిరుత

» 3 కిలోమీటర్ల దూరంలో మృతదేహం గుర్తింపు

సిలిగురి(పశ్చిమ బెంగాల్), జనవరి 16 : తల్లి ఒడిలోంచి మూడేళ్ల పసిపాపను ఓ చిరుతపులి ఎత్తుకెళ్లి పొట్టనపెట్టుకుంది. ఈ విషాద ఘటన పశ్చిమ బెంగాల్‌లోని అలీపూర్‌దార్ జిల్లాలో జరిగింది. ఇక్కడ గార్గండ టీ ఎస్టేట్‌లో పూజ అనే మహిళ కార్మికురాలిగా పనిచేస్తోంది. ఎస్టేట్‌లో తన బిడ్డను ఒడిలో పెట్టుకుని వంట చేస్తుండగా.. ఓ చిరుతపులి అకస్మాత్తుగా వచ్చింది. వెంటనే పూజ ఒడిలోంచి ఆమె బిడ్డను ఎత్తుకుని పారిపోయింది. చిరుత వెనకాలే పూజ కూడా కేకలు వేస్తూ పరిగెత్తసాగింది. కానీ ఎంత గాలించినా బిడ్డ ఆచూకీ తెలియలేదు. బుధవారం ఉదయం ఈ ప్రాంతంలోని మూడు కిలోమీటర్ల పరిధిలో పసికందు మృతదేహం లభ్యమైంది. పాపను చిరుత చాలా దారుణంగా చంపేసింది. మొండెం నుంచి తలను వేరు చేసింది. ఇతర శరీర భాగాలన్నీ ఛిద్రమయ్యాయి. దీంతో గ్రామస్థులు తీవ్రంగా ఆగ్రహించారు. బిడ్డ మృతదేహాన్ని తీసుకెళ్లడానికి వచ్చిన అటవీ అధికారులను అడ్డుకున్నారు. అయితే బాధితురాలి కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
నిర్మల్	10.0	27.3
కుమరంభీం	11.0	31.0
హైదరాబాద్	15.2	30.0
వరంగల్	14.5	28.5
ఖమ్మం	17.0	31.0

పొగమంచు.. పొడి వాతావరణం!

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మూడు రోజులపాటు పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో రాత్రి, ఉదయం వేళల్లో పొగమంచు ఏర్పడే అవకాశం అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్‌లో 10 డిగ్రీలు, భద్రాచలంలో 17, హన్మకొండలో 15, ఖమ్మంలో 16, మహబూబ్‌నగర్‌లో 19, మెదక్‌లో 13, నల్లగొండలో 17 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది.



కశ్మీరీ మిలిటెంట్లు మా సంపద

కశ్మీరీ మిలిటెంట్లు మా సంపద, వాళ్లు భూమిపుత్రులు. పెడదోవ పట్టి ఉగ్రవాద సంస్థల్లో చేరిన యువతను జనజీవన స్రవంతిలోకి తెచ్చేందుకు కేంద్రం చర్యలు చేపట్టాలి. తుపాకుల మోతకు చెక్‌పెట్టేందుకు, అవసరమైతే వేర్పాటువాదులు, పాకిస్థాన్ నాయకత్వాలతో చర్చలు జరపాలి. త్వరలో ఆ దిశగా అడుగులుపడతాయని భావిస్తున్నా.

- మెహబూబా ముఫ్తీ



రాహుల్ వల్లే కూటమిని వీడా

బిహార్ మహాకూటమి నుంచి తాను బయటికి రావడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీనే కారణం. తేజస్విపై సీబీఐ చార్జిషీటు దాఖలు చేసినా ఆయన స్పందించలేదు. అందుకే కూటమిని వీడాల్సి వచ్చింది. ఆర్జేడీ పనితీరు నా పనికి ఆటంకం కలిగించింది. రాజీనామా తప్ప నాకు మరో అవకాశం లేకుండా పోయింది

- బిహార్ సీఎం నితీశ్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.74.61	పాత ధర 70.22
కొత్త ధర రూ.74.76	కొత్త ధర 70.42
పెరిగింది 15 పైసలు	పెరిగింది 20 పైసలు



కూర్చొని చేసే పనితో గుండెకు చేటు

వాషింగ్టన్, జనవరి 16: ఎక్కువసేపు కూర్చొని పనిచేసే వారికి శారీరక శ్రమ తక్కువగా ఉంటుంది. బరువు సాధారణంగానే ఉన్నప్పటికీ అలాంటి వారు గుండె సంబంధిత వ్యాధులకు గురయ్యే ప్రమాదం అధికంగా ఉంటుందని అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అమెరికాలో 40 నుంచి 79 ఏళ్ల మధ్య వయసున్న వారిపై చేసిన అధ్యయనంలో ఈ విషయాన్ని గుర్తించారు. సాధారణ బరువు ఉన్నప్పటికీ నిశ్చల జీవనశైలి వలన గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామని ఫ్లోరిడా వర్సిటీ పరిశోధకుడు ఆర్క్ జి మెయినస్ తెలిపారు.

ఉపవాసంతో రోగాలకు చెక్!

వాషింగ్టన్, జనవరి 16: ఉపవాసం జీవక్రియను మెరుగు చేసేందుకు దోహదపడడమే కాదు.. వయసు సంబంధిత వ్యాధుల నుంచి కూడా రక్షణ కల్పిస్తుందని అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. ఎలుకలపై చేసిన ప్రయోగంలో వారు ఈ విషయాన్ని గుర్తించారు. ఉపవాసం అనేది రోజువారీ జీవక్రియపై ప్రభావం చూపుతుందని, ఆ సమయంలో ఏర్పడే కణజాల స్పందనలు.. తాత్కాలిక జన్యు నియంత్రణకు దోహదపడతాయని తాము గుర్తించామని పరిశోధకుల్లో ఒకరైన పాలో సాసోన్-కోర్సి తెలిపారు. పరిశోధనల్లో భాగంగా ఎలుకలకు తరచుగా 24 గంటలపాటు ఎలాంటి ఆహారం అందించకుండా ఉపవాసం ఉంచారు. ఆ సమయాల్లో ఎలుకలు ఆక్సిజన్ వినియోగం, శ్వాస మార్పిడి రేటు, శక్తి వినియోగాన్ని తగ్గించుకున్నట్టు వారు గర్తించారు.

గొంతు కోసిన చైనా మాంజా

- గాలిపటం కోసం పరిగెడుతుండగా కారు ఢీకొని ఒకరు
- చెట్టుపై పతంగి తీస్తుండగా కరెంట్‌షాక్‌తో మరొకరు
- ఇద్దరు బాలురు మృతి.. మరో ఇద్దరికి గాయాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పండుగపూట పతంగుల సరదా రెండు నిండు ప్రాణాలను బలి గొంది. తెగిపోయిన పతంగి కోసం రోడ్డుపై పరుగెత్తుకుంటూ వెళ్లి కారు ఢీకొని ఒక బాలుడు మృతి చెందగా.. చెట్టుకు చిక్కిన గాలిపటాన్ని తీయబోయి విద్యుదాఘాతంతో మరో బాలుడు ప్రాణాలు కోల్పోయారు. ఇక చైనా మాంజా గొంతుకు కోసుకుపోవడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో ధర్మపురి(11) పతంగి దారం తెగిపోవడంతో దాని కోసం జాతీయ రహదారిపై పరుగులు తీస్తూ కారు ఢీకొని మృతి చెందాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఆరెగూడెంలో చెట్టుకు చిక్కుకున్న గాలిపటాన్ని తీసే క్రమంలో కొమ్మల మధ్య ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో ఆగు ప్రవీణ్(15) మృతిచెందాడు. హైదరాబాద్‌లోని సచివాలయం సమీపంలో మెడకు చైనా మాంజా తగలడంతో శామీర్‌పేటలో నివాసం ఉండే బిహార్‌వాసి అశోక్ గుప్తా తీవ్రంగా గాయపడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లికి చెందిన చిన్నారి గౌస్‌కు మాంజా తగలడంతో గదవ దగ్గర తీవ్ర గాయమైంది. మరోవైపు సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఎడ్లబండి ముందు పరిగెడుతుండగా.. మరో బండి తగిలి తీవ్రంగా గాయపడటంతో నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలం వడ్డేమాన్‌లో ఉప్పుగంటి జనార్దన్(32) మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండతండాలో పండుగ ఉత్సవాలలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతిచెందాడు.

‘టోల్’ రద్దు!

- హైదరాబాద్ వెళ్లే కార్లకు వెసులుబాటు


ప్రత్యేక మార్గంలో వెళ్తున్న కార్లు

కంచికచర్ల(కృష్ణా), జనవరి 16: కృష్ణాజిల్లాలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే 65వ నెంబరు జాతీయ రహదారిపై కీసర, చిల్లకల్లు టోల్‌గేట్ల వద్ద కార్లకు గేట్లెత్తేశారు. విజయవాడ నుంచి హైదరాబాదు వైపు వెళుతున్న కార్లకు బుధవారం నుంచి ఎలాంటి టోల్ రుసుమును వసూలు చేయడం లేదు. సంక్రాంతి సందర్భంగా జాతీయ రహదారిపై వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని టోల్‌గేట్ల వద్ద 16, 17 తేదీ ల్లో కూడా టోల్ చార్జీ వసూలు చేయకుండా పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. హైదరాబాదు నుంచి స్వగ్రామాలకు వచ్చి పండగ జరుపుకొన్న వారిలో కొందరు బుధవారం ఉదయమే తిరుగు పయనమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం వరకు ఈ వెసులుబాటు ఉంటుంది.

ఎన్డీ నేత కాకి లక్ష్మారెడ్డి మృతి



సూర్యాపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు కాకి లక్ష్మారెడ్డి(89) బుధవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి వర్గం, న్యూడెమోక్రసీలో క్రియాశీలకంగా వ్యవహరించిన లక్ష్మారెడ్డి రాష్ట్ర స్థాయిలో వివిధ పదవుల్లో పని చేశారు.

10 ఓట్లున్న కుటుంబానికి ప్లాటు

బీంరా గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి హామీ?.. మరోచోట 75 గజాలు రాసిచ్చిన అభ్యర్థి

- ధరూరులో స్మశాన వాటికకు 2 ఎకరాలు
- ఆరు నెలల పాటు ఉచిత కేబుల్ కనెక్షన్
- బూరుగుపల్లి ‘సర్పంచ్’పై కేసు నమోదు

యాదాద్రి/గద్వాల/ కంగ్టి/ మెదక్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో 10కిపైగా ఓట్లున్నవారికి ఇది కాసులు రాలే కాలం! ఎందుకంటే సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థులు ఫ్యామిలీ ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు. “మీ ఇంట్లో ఉన్న 10 ఓట్లన్నీ నాకే వేస్తే.. ప్లాటు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తా! డౌటుంటే.. స్టాంపు కాగితంపై రాసిస్తా”.. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం బీంరాలో సర్పంచ్‌గా నిలబడ్డ ఓ అభ్యర్థి ఇలా హామీ ఇచ్చినట్లు తెలిసింది. గ్రామంలో 1469 ఓటర్లుంటే ఏకంగా 16మంది సర్పంచ్‌గా నామినేషన్లు వేశారు. పోటీ తీవ్రంగా ఉండడంతో గెలిచేందుకు ఎంత ఖర్చయినా వెచ్చించేందుకు అభ్యర్థులు వెనుకాడట్లేదు. ఇంకొన్ని చోట్లయితే హామీలను ముందే నెరవేరుస్తున్నారు. యాదాద్రి జిల్లా రూరల్ మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్‌గా నిలబడిన ఓ వ్యక్తి 10 ఓట్లున్న కుటుంబానికి 75 చదరపు గజాల స్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ ఇచ్చినట్లు తెలిసింది. గద్వాల జిల్లా ధరూరులో స్మశాన వాటిక లేకపోవడంతో ఓ అభ్యర్థి తనను సర్పంచ్‌గా గెలిపిస్తే రెండెకరాలను స్మశాన వాటికకు ఇస్తానంటూ ముందుకొచ్చారు. అతడి ప్రత్యర్థి కూడా ఇదే హామీ ఇచ్చారు. స్థలం కొనుగోలుకు గాను ఇద్దరూ రూ.50 వేల చొప్పున అడ్వాన్సు కూడా ఇచ్చారు. మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలం బూరుగుపల్లిలో సర్పంచ్ అభ్యర్థి యాదగిరి తనను గెలిపిస్తే..కేబుల్ ప్రసారాలను ఆరునెలల పాటు ఉచితంగా అందిస్తానని లోకల్ చానల్లో యాడ్ కూడా ఇచ్చాడు. యాదగిరి ఉచిత హామీపై కొందరు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎంపీడీవో రాంబాబు తెలిపారు. రియల్ బూమ్ ఎక్కువగా ఉన్న యాదాద్రి జిల్లాల్లోని 10 మండలాల్లో పంచాయతీ ఎన్నికలకు రూ.50 లక్షల నుంచి రూ.కోటిన్నర దాకా ఖర్చు చేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఓటుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ముందే ఇస్తున్నారు. యాదాద్రి సమీప ఆరేడు గ్రామాల్లో ఓటుకు రూ.5 వేలు పంచుతున్నట్లు సమాచారం.



ప్రచారంలో ఉద్రిక్తత

- ఇరువర్గాల మధ్య రాళ్లదాడులు..

నారాయణపేట రూరల్: పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆ ఊరిలో నిర్వహిస్తున్న ప్రచారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రత్యర్థి వర్గాల మధ్య పోరు రాళ్లదాడిగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట మండలం జాజాపూర్‌లో అభ్యర్థులు మంగళవారం రాత్రి ప్రచారం చేసుకుంటున్నారు. తమవారి ఇళ్లకు వచ్చి ప్రచారం ఎందుకు చేస్తున్నారంటూ.. ఓ వర్గాన్ని మరోవర్గం వారు అడ్డుకోవడం ఘర్షణకు దారితీసింది. రాళ్లు రువ్వుకోవడంతో.. ఆరుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు.. క్షతగాత్రుల్ని స్థానికులు ఆస్పత్రికి తరలించి, స్పెషల్ పార్టీలతో గ్రామంలో పికెట్‌ను ఏర్పాటు చేశారు.

ఐర్లాండ్ ఉద్యోగం వదిలి.. సర్పంచ్ బరిలో నిలిచి



ఎడపల్లి: ప్రజాసేవలో ఆ యువతికి తండ్రే ఆదర్శం. తండ్రి గ్రామాభివృద్ధికి పాటుపడటాన్ని చిన్నతనం నుంచి చూసిన ఆమె.. రాజకీయాలపై ఆసక్తి పెంచుకుంది. దీంతో ఐర్లాండ్‌లో ఉద్యోగాన్ని వదిలి పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు స్వగ్రామానికి వచ్చింది. ఆమే నిజామాబాద్ జిల్లా ఎడవల్లికి చెందిన మాజీ సర్పంచ్ శంకర్‌నాయుడు కుమార్తె సుస్మిత నాయుడు. ఆ గ్రామ పంచాయతీ బీసీ మహిళ రిజర్వేషన్ రావడంతో నామినేషన్ వేసింది.

84 ఏళ్ల వయసులో..

- రాయల వెంకటేశ్వర్లు పోటీ



ముదిగొండ: ఆ పెద్దాయన వయసు 84. గతంలో నాలుగుసార్లు ఉపసర్పంచ్‌గా పనిచేశారు. తన గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న తపన మాత్రం ఇంకా తీరలేదు. దీంతో 84 ఏళ్ల వయసులోనూ స్వతంత్ర అభ్యర్థిగా సర్పంచ్ బరిలో నిలిచారు. ఆయనే ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వెంకటాపురానికి చెందిన రాయల వెంకటేశ్వర్లు. తెలంగాణ సాయుధ పోరాటంలోపాల్గొన్నారు. సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శిగా పని చేశారు. ఆయనకు సీపీఎం, కాంగ్రెస్‌లు మద్దతు పలికాయి.

ప్రేమ కోసం ఒకరు.. పరువు కోసం మరొకరు..

- పండగపూట ఆత్మహత్యల విషాదం

వెంకటాపూర్ (రామప్ప), జనవరి 16: ప్రేమ విఫలమైందన్న బాధతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంటే.. అందుకు తన బిడ్డను బాధ్యుడిగా చేశారన్న ఆవేదనతో ఓ తండ్రి ప్రాణాలొదిలాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పాలంపేటలో జరిగిన ఈ ఆత్మహత్యలు, వారి సంక్రాంతిని విషాదంగా మార్చాయి. గ్రామానికి చెందిన బోడ సింధూజ (18) సోమవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. కడుపునొప్పి భరించలేకనే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఆమె తల్లి సుమలత వెంకటాపురం పోలీస్‌స్టేషన్‌లో తెలిపింది. అయితే వారి బంధువులు మాత్రం.. ప్రేమపేరుతో సింధూజను మోసం చేశాడంటూ అదే గ్రామానికి చెందిన కొంబత్తుల రమేష్ అనే వ్యక్తి ఇంటిఎదుట మృతదేహంతో ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు బంధువులకు నచ్చజెప్పి మృతదేహానికి దహనసంస్కారాలు చేయించారు. సింధూజ ఆత్మహత్యకు తన కొడుకును బాధ్యుడిని చేయడంపై మనస్తాపం చెందిన రమేష్ తండ్రి రాజు(50) పురుగుల మందు తాగాడు. ములుగు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశాడు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు ప్రారంభిచారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

- సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో ఘటనలు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో రహదారులు బుధవారం రక్తమోడాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా, 17మందికి గాయాలయ్యాయి. కృష్ణా జిల్లా నూజివీడు మండలం పోతినేనిపాలేనికి చెందిన మురళీకృష్ణ కుటుంబం.. సంక్రాంతికి సొంతూరుకు వెళ్లి కారులో తిరిగి వస్తుండగా సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ బైపాస్ రోడ్డులో టైరు పంక్చరైంది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న కారు మీద పడింది. ఆ వెనుకనే వస్తున్న ఇన్నోవా కారు ఈ కారును ఢీకొంది. ప్రమాదంలో మురళీకృష్ణ(48), ఆయన భార్య కవిత(35), కూతురు ధనుష్(16) అక్కడికక్కడే మృతి చెందారు. మరో రెండు కార్లలో మెదక్ జిల్లాకు చెందిన ఈశ్వర్, స్వామి, హైదరాబాద్‌కు చెందిన అనిత్‌రావు, గుజరాత్‌కు చెందిన పాండి, ఆయన భార్య విజితలకు గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాద సమయంలో కారు వేగం 160 కిలో మీటర్లు ఉందని పోలీసులు చెబుతున్నారు. కాగా, నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 33మంది విద్యార్థులు విహారయాత్రకు వెళ్లి వస్తుండగా చివ్వెంల సమీపంలో వారి బస్సు.. లారీని ఢీకొట్టింది.


ధ్వంసమైన కారు

10మంది గాయపడగా.. వారిలో 8మంది విద్యార్థులున్నారు. మరోవైపు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని గోగులపుడికి చెందిన అన్నదమ్ములు తమ్మిరెడ్డి(40), సత్తిరెడ్డి(34)తో పాటు పండారెడ్డి అశ్వారావుపేట నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా కారు ఢీకొంది. తమ్మిరెడ్డి, సత్తిరెడ్డి ఘటన స్థలంలోనే కన్నుమూయగా, మరో యువకుడు పండారెడ్డి గాయపడ్డాడు.

మూడవ విడతకు నామినేషన్లు షురూ

- 30న ఎన్నికలు, అదే రోజు ఫలితాలు

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మూడవ విడత ఎన్నికలు జరగనున్న గ్రామ పంచాయతీలకు బుధవారం నోటిఫికేషన్ జారీ అయింది. 166 మండలాల పరిధిలోని 4,116 సర్పంచ్ పదవులు, 36,718 వార్డుసభ్యుల పదవులకు నోటిఫికేషన్ వెలువడింది. మూడు రోజులపాటు నామినేషన్లను స్వీకరించనున్నారు. తొలివిడత పంచాయతీ ఎన్నికలకు ఈ నెల 21న పోలింగ్ నిర్వహించనున్నారు. రెండవ విడత ఎన్నికలకు సంబంధించి.. గురువారం సాయంత్రం అభ్యర్థుల తుది జాబితా ఖరారు కానుంది. జనవరి 25న రెండవ విడత పంచాయతీలకు పోలింగ్ నిర్వహిస్తారు. కాగా బుధవారం నోటిఫికేషన్ జారీ చేసిన చివరి విడత ఎన్నికలకు శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఈ పంచాయతీల ఎన్నికలు ఈ నెల 30న జరుగుతాయి. అన్ని విడతల్లోనూ.. ఎన్నికరోజే ఫలితాలను వెల్లడించనున్నారు. తుది విడత మొదటి రోజే సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలైనప్పటికీ.. వాటి సంఖ్యను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇంకా వెల్లడించకపోవడం గమనార్హం.

'రాజద్రోహ' రాజకీయం!

ఢిల్లీలోని జవాహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యు) విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్నయ్యకుమార్, విద్యార్థి నాయకులు ఉమర్ ఖాలీద్, అనిర్బన్ భట్టాచార్య తదితరులపై దేశద్రోహ ఆరోపణతో ఢిల్లీపోలీసులు సోమవారం చార్జిషీటు దాఖలు చేశారు. క్రిమినల్ కుట్ర, అల్లర్లను ప్రేరేపించడం, అనుమతి లేకుండా సమావేశం కావడం ఇత్యాది ఆరోపణలు కూడా చేశారు. అఫ్జల్ గురు ఉరిశిక్షను వ్యతిరేకిస్తూ 2016 ఫిబ్రవరి 9న యూనివర్సిటీలో నిరసన కార్యక్రమాలు నిర్వహించినప్పుడు వీరంతా దేశవ్యతిరేక నినాదాలు చేశారన్నది అభియోగం. మూడేళ్ళక్రితం నాటి ఈ ఘటనలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభియోగాలు నమోదు చేయడం వెనుక పాలకుల రాజకీయ లక్ష్యాలు స్పష్టంగా తెలుస్తూనే ఉన్నాయి. దానితో పాటు, ఈ మూడేళ్ళ కాలంలో న్యాయస్థానాల ముందు ఆరోపణలను బలంగా రుజువు చేయగలిగే కొత్త ఆధారాలను ప్రభుత్వం ఏమి సమకూర్చుకోగలిగిందన్నది ముఖ్యం.

యూనివర్సిటీలో వీరంతా నిర్వహించిన కార్యక్రమం దేశవ్యతిరేక నినాదాలతో దద్దరిల్లిపోయిందంటూ ఏబీవీపీ కార్యకర్తలు ఆరోపించడం, దాడులకు పాల్పడటం తెలిసిందే. వీరందరినీ సస్పెండ్ చేయాలన్న ఏబీవీపీ విద్యార్థి సంఘం ఒత్తిడి మేరకు వీరిని జేఎన్‌యూ యాజమాన్యం హాస్టల్‌లో ఉండటానికి అనుమతిస్తూనే, క్లాసులకు మాత్రం దూరం చేసింది. బీజేపీ ఎంపీ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు అప్పట్లో రాజద్రోహ నేరంపై కన్నయ్యకుమార్ ఇత్యాదులపై కేసు దాఖలు చేశారు. ఫిబ్రవరి 12న అరెస్టయిన కన్నయ్యకుమార్ మూడురోజుల పాటు జైల్లో ఉండి, తరువాత కోర్టుకు హాజరైనప్పుడు రెండు సందర్భాల్లో అక్కడ పెద్ద యుద్ధమే జరిగింది. జెఎన్‌యూ విద్యార్థులమీదా, అధ్యాపకులమీదా దాడి జరిగింది. కన్నయ్య భద్రతకు సంబంధించి న్యాయస్థానం స్పష్టమైన సూచనలు చేసినప్పటికీ న్యాయవాదులు కొందరు ఆయన మీద రాళ్ళవర్షం కురిపించారు. భౌతికంగా దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనలతో పాటియాల కోర్టు న్యాయమూర్తి విచారణ ప్రదేశాన్ని మార్చవలసి వచ్చింది. మార్చి 2న ఆర్నెల్ల మధ్యంతర బెయిల్ ఇచ్చిన ఢిల్లీ కోర్టు, ఆగస్టులో కన్నయ్యకుమార్‌కు పూర్తి బెయిల్ ఇచ్చింది. కన్నయ్య ఇత్యాదుల అరెస్టులు, తదనంతర పరిణామాలు, దేశంలో అవి రేపిన ఉద్వేగాలు గమనించినప్పుడు ఈ కేసును సజీవంగా ఉంచడం పాలకులకు ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు.

ఈ చార్జిషీటులో పోలీసులు చూపిన ఆధారాలేవీ కొత్తవేమీ కావనీ, అత్యధికశాతం గతంలోనివేనని నిపుణుల వాదన. న్యాయస్థానాలు నిందితులకు గతంలో బెయిల్ మంజూరు చేయడానికి పోలీసులు నకిలీ వీడియోలపై ఆధారపడటం ఒక కారణం. టెలివిజన్ చానెళ్ళలో ప్రసారమైన వీడియోలన్నీ నకిలీవేనని నిందితుల వాదన. పోలీసులు ఇప్పుడు కొత్తగా సమకూర్చుకున్నామంటున్న వాటిలో సైతం చానెళ్ళనుంచి సేకరించిన వీడియోలు ఒకటీ రెండూ ఉన్నాయట. అలాగే, కొందరు వ్యక్తులనుంచి కూడా కొత్త వీడియోలు సంపాదించామన్న పోలీసుల వాదన నిజమైన పక్షంలో గతంలోనే ఆ ప్రయత్నం బలంగా జరిగివుంటే కేసు ఈ పాటికే తేలిపోయి ఉండేదేమో! ఈ కార్యక్రమంలో తాను లేననీ, యూనివర్సిటీలో గొడవ జరుగుతున్నదని తెలియగానే సయోధ్య కుదిర్చే లక్ష్యంతో అక్కడకు వెళ్ళానని కన్నయ్యకుమార్ అంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, దేశవ్యతిరేక నినాదాలు చేస్తున్న కొంతమంది బృందానికి కన్నయ్య నాయకత్వం వహిస్తున్న దృశ్యాలు సంపాదించామన్న పోలీసుల ప్రకటన విశేషమైనదే. అలాగే, కార్యక్రమానికి అధికారులు అనుమతి నిరాకరించిన తరువాత, యూనివర్సిటీలోని ఒక ప్రాంతంలో కలుసుకోమంటూ కన్నయ్యకుమార్‌కు మరో నిందితుడు ఉమర్ ఖాలీద్ పంపిన మెసేజ్‌ను కూడా పోలీసులు ముఖ్య ఆధారంగా చెబుతున్నారు. కన్నయ్య స్వయంగా నినాదాలు చేయలేదని పోలీసులు సైతం అంగీకరిస్తున్న నేపథ్యంలో, కొత్త వీడియో ద్వారా, ఉమర్ ఖాలీద్ మెసేజ్ ద్వారా కన్నయ్య దుష్టపాత్రను పోలీసులు అంతబలంగా ఎలా రుజువు చేయగలుగుతారన్నది ప్రశ్న. దేశభక్తిని రాజేయగలిగే శక్తి ఈ కేసుకు ఎప్పటికీ ఉన్నదని పాలకుల నమ్మకం. ఒక ప్రజాస్వామిక అసమ్మతిని, ఒక సైద్ధాంతిక విమర్శను సైతం దేశభద్రతకు విఘాతంగా చూపినప్పుడు ప్రజలు విశ్వసిస్తారనీ, ఈ తరహా దేశద్రోహులనుంచి దేశాన్ని కాపాడుతున్నందుకు మెచ్చి తమ పక్షాన నిలుస్తారని పాలకుల విశ్వాసం. ప్రజావ్యతిరేకత చవిచూస్తున్న తరుణంలో, దేశం పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నదన్న భయాన్ని కలిగించడం, జాతీయతాభావాన్ని రెచ్చగొట్టడం చక్కని ఉపాయం. కేసు నిలబడటం కంటే ఎన్నికల కాలంలో అది నలుగురి నోట్లోనూ నానడం ప్రధానం.

ఆకలి ఒక్కటే, ఆధిక్యతలు వేరు

ఆధిపత్య సామాజిక వర్గాలు తమ ఆధిపత్యాలకు అనుకూలమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయి. ఇటువంటిదే ప్రస్తుతం బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో 124వ రాజ్యాంగ సవరణ ద్వారా 'ఆర్థిక బలహీన వర్గాల' విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల కోసం రూపొందించిన తాజా చట్టం.

బలపరీక్షలో 323–3 ఓట్ల తేడాతో లోక్‌సభలో, 165–7 ఓట్ల తేడాతో రాజ్యసభలో ఈ నెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో విపక్షాల అపూర్వ మద్దతు, మొక్కుబడి నిరసనల మధ్య అత్యధిక నాటకీయ మెజారిటీతో ఈ చట్టం ఆమోదించబడింది. కాంగ్రెస్, టిఆర్‌ఎస్, టిడిపితో సహా మనువాద పార్టీలన్నీ ఈ చట్టానికి దోహదపడ్డాయి. సామాజిక, విద్య, వెనుకబాటుతనాలు ప్రాతిపదికగా బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన రాజ్యాంగ స్ఫూర్తికి గొడ్డలిపెట్టుగా, ఆధిపత్య సామాజిక వర్గ రాజకీయ పార్టీల అధికార దుర్వినియోగంతో ఈ చట్టం జీవం పోసుకుంది. ఈ చట్టం బిల్లు రూపంలో ఉన్నప్పుడు కనీసం సెలెక్టు కమిటీకి కూడా పోలేదు. వాస్తవంగా సామాజికంగా బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై ఆధిపత్యాల అత్యాచారం ఈ చట్టం అని భావించాలి.

ఈ చట్టం చెల్లుబడి కావాలంటే లబ్దిదారుల వెనకబాటుతనానికి సంబంధించిన నిర్దిష్టమైన, ఖచ్చితమైన సమాచారాన్ని నిర్ధారించవలసి ఉంటుంది. ఇందుకోసం విచారణా సంఘాల చట్టం ప్రకారం ఒక కమీషన్ ఈ అంశంపై పరిశీలన, పరిశోధన చేసి, సూచనలు ఇచ్చి ఉండాలి. ఈ చట్టాన్ని అలాంటి నేపథ్యం ఉన్నట్టు కనిపించదు. కనుక ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమైనదిగా భావించాలి.

ఆధిపత్య వర్ణాలు, కులాలు, సామాజిక వర్గాలలోని పేద లబ్దిదారుల కోసం ఉద్దేశించిందే ఈ చట్టం కనుక అటువంటి లబ్దిదారులు కేవలం హిందువులే గనుక అది మతపరమైన రిజర్వేషన్లను ప్రోత్సహించినట్లు కాదా?



> **124వ రాజ్యాంగ సవరణ సామాజిక, విద్య, వెనుకబాటుతనాలు ప్రాతిపదికగా బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన రాజ్యాంగ స్ఫూర్తికి గొడ్డలిపెట్టు. ఆధిపత్య సామాజిక వర్గ రాజకీయ పార్టీలు పాలుపడిన అధికార దుర్వినియోగంతో ఆ సవరణ పార్లమెంటు ఆమోదం పొందింది.**

సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై గతంలో విధించిన యాభై శాతం పరిమితిని తొలగించి ఈ చట్టం ద్వారా అదనంగా సంక్రమించే పది శాతాన్ని అనుమతిస్తుందా? లేకపోతే ప్రస్తుత యాభైశాతం పరిధిలోకే ఈ కొత్త చట్టం ద్వారా వచ్చే పది శాతం రిజర్వేషన్లను అనుమతిస్తుందా? లేక రాజ్యాంగ మౌలిక స్వభావానికి విరుద్ధమైనది ఈ చట్టం అని రద్దు చేస్తుందా? ఏది ఏమైనా ఈ చట్టంతో నూతన రాజ్యాంగ సమస్యలు, సవాళ్ళు తలెత్తినాయనేది స్పష్టమౌతున్నది ఈ విధంగా వాస్తవ బలహీన వర్గాల వారి హక్కులకు ఈ చట్టం పోటీగా మారకూడదు.

పార్లమెంటు ఉభయ సభల్లో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సభ్యులంతా పార్టీలకతీతంగా ఏకం కావాల్సిన సమయం వచ్చిందిప్పుడు. వారు ఈ క్రింద పేర్కొన్న అంశాల్ని/ డిమాండ్లను ప్రభుత్వం ముందు ప్రభుత్వాలను నడిపిస్తున్న ఆధిపత్య సామాజిక వర్గాల పార్టీల ముందు ప్రతిపాదించాలి. ఒప్పించాలి. అవి; 1. వేలాది సంవత్సరాలుగా ఆధిపత్య సామాజిక వర్గాలు దేశంలో మా మీద, మా సామాజిక వర్గాల ప్రజల మీద ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, సాంస్కృతిక తదితర రంగాల్లో వివక్షల యుద్ధం కొనసాగిస్తున్నాయి. ఇందుకు యుద్ధపరిహారాలు చెల్లించాలి. 2. కులం, జాతి, తెగ, సామాజిక వర్గం, మతం, జెండర్ ఆధారిత, సూక్ష్మ స్థాయి పంపిణీ న్యాయం ఆధారిత బడ్జెట్, రిజర్వేషన్లు కావాలి. 3. సామాజికంగా బలహీన వర్గాల వారి సంక్షేమానికి, ఆర్థిక బలహీన వర్గాల వారి సంక్షేమాన్ని పోటీగా పెట్టరాదు. ఆకలి ఒక్కటే అయినా ఆధిక్యతలు, అణచివేతలు వేరనే సంగతి గమనించాలి. 4. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విధించిన యాభై శాతం పరిమితిని తొలగిస్తూ, మందిని బట్టి ఆయా అణగారిన సామాజిక వర్గాల జనాభా నిష్పత్తులకనుగుణంగా రిజర్వేషన్ల కల్పన కోసం రాజ్యాంగ సవరణలు చెయ్యాలి. 5. ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ ఓబీసీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ, ఎస్టీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ, మత మైనారిటీలకు రిజర్వేషన్ల కల్పనల కోసం తక్షణమే పార్లమెంటులో రాజ్యాంగ సవరణలు చెయ్యాలి. 6. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళల రిజర్వేషన్ హక్కులను నిర్ధారించి, నిర్ణయించే అధికారాలను రాష్ట్రాలకు కట్టబెడుతూ తక్షణమే పార్లమెంటు చట్టం చెయ్యాలి. 7. సాపేక్షిక కులాధిక్య ఆధారిత పన్నులను ప్రవేశపెట్టాలి. 8. ఆధిపత్య కులాలలోని, వర్ణాల్లోని పేదల రిజర్వేషన్లు పొందాలంటే, ముందుగా ఆధిపత్య కులాలు, వర్ణాలలోని వ్యక్తుల, కుటుంబాల సంస్థలకు చెందిన భూములు, పరిశ్రమలు, కంపెనీలు, వ్యాపారాలు, పదవులు, పెట్టుబడులు, లోహాలు, డబ్బు, తదితర అన్ని రూపాల్లోని ఆస్తులకు పరిమితులు విధించాలి. నిర్దిష్ట సామాజిక వార్గనికి తగిన పరిమితి అనే సంపద పరిమితి నిబంధన విధించాలి. మిగులు ఆస్తులను, లాభసాటి వ్యవహారాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని సామాజికంగా అణగారిన ప్రజల జాతీయ ఉమ్మడి సొత్తుగా ప్రకటించాలి. అటువంటి మిగులు సంపదను సామాజికంగా అణగారిన వర్గాల్లోని నిరుపేదలకు పంపిణీ చెయ్యాలి. 9. అణగారిన సామాజిక వర్గాలతో 'కంచం, మంచం పొత్తు' కలవడాన్ని ఆధిపత్య వర్ణాల/కులాల పేదలకు ఒక 'సామాజిక అవకాశం'గా గుర్తించాలి. దీనిని 'చట్టబద్ధమైన బాధ్యత'గా ప్రభుత్వం విధించాలి. దీన్ని ఉల్లంఘిస్తే శిక్షార్హమైన నేరంగా పరిగణించాలి. అప్పుడు కుల, వర్ణ రహిత ప్రజాస్వామిక సమాజం ఏర్పడుతుంది. ఇటువంటి ప్రాక్టీస్ ఉన్న పేదలకు ప్రభుత్వం ప్రత్యేక అవకాశాలు కల్పించుకోవచ్చు. అప్పటిదాకా కూటికి పేదనైనా కులానికి పేదను కాదనే వారితో సమస్యలు తప్పవు సమాజానికి కుల, వర్ణ ఆధిపత్యాలను కొనసాగించే రాజకీయాలు ఇంకెంతో కాలం చెల్లవు. మోడీ పేక కుర్చీ నిలవదు.

■ కృపాకర్ మాదిగ

ప్రకృతి ధర్మం అపవిత్రమా?

అనాదిగా యావత్తు భారతీయ సమాజంచేతమాతృమూర్తులుగాగౌరవించబడుతున్న స్త్రీలు కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించేందుకు మాత్రం అనర్హులని కొందరు మొండిగా వాదిస్తూ ఉండడం, తమ అర్థరహితమైన వాదనకు మద్దతుగావారు హింసాత్మకమైన ఆందోళనలకు సైతం దిగడంపై ఆలోచనాపరులలో దేశవ్యాప్తంగా నిరసనన వ్యక్తమవుతున్నది. ఈ సందర్భంగా భారతీయ సామాజిక వ్యవస్థలో స్త్రీ స్థానం సర్వోన్నతమైనదనీ, పితృ, ఆచార్య స్థానాలు కూడా మాతృ స్థానం తరువాతనే నని కొందరు సంప్రదాయవాదులు గుర్తుచేస్తున్నారు. అటువంటి తల్లిని, తల్లి కాగలిగే వయసులో ఉన్న స్త్రీని ఒక ప్రక్క దేవత అంటూనే, మరొక ప్రక్క దేవాలయంలోనికిఅడుగు పెట్టరాదంటూ ఆంక్షలు విధించడం ఏమేరకు సమంజసమనివారు ప్రశ్నిస్తున్నారు.

ఈ విజ్ఞుల ఆవేదన అర్థవంతమైనదే. అయితే తమ సాటి వారందరినీ ఆలోచింపజేయాలనే సదుద్దేశంతో ఈ ఆలోచనాపరులు మొదలెట్టిన చర్చను కొందరు మతావేశపరులు రచ్చగా మార్చారు. మహిళలు బహిష్టు సమయంలో గాయత్రీ మంత్రం ఉచ్చరించడం నిషిద్ధమనీ, ఋతుక్రమంలో ఉన్న భార్యను పక్కన కూర్చోబెట్టుకుని ఏ భర్తా సత్యనారాయణ వ్రతాల వంటివి చేయడనీ, అలాంటి మహిళలకు ఆలయ ప్రవేశమూ నిషిద్ధమేననేది వారి వాదన. అందుకే రజస్వల అయిన బాలిక మొదలు ముట్లు ఉడిగే దశ వరకు స్త్రీలకు శబరిమలలోని అయ్యప్ప ఆలయ ప్రవేశం నిషేధించబడిందట. ఒక పక్క 'మాతృ దేవోభవ' అంటూ మహిళనుకీర్తిస్తూనే మరో పక్క మాతృత్వానికి అర్హులైన యుక్త వయస్సులోని స్త్రీలందరిపై వారు ఆలయంలోనికి ప్రవేశించరాదని ఆంక్షలు విధించడం ఏ రకంగా సబబని ఆలోచనాపరులైన కొందరు సనాతనవాదులు ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క అన్నిరకాల దురలవాట్లు కలిగిన కొందరు పురుషులు కేవలం నలభై రోజులపాటు ఆ అలవాట్ల నుంచి విముక్తులు కావడం కోసం దీక్ష పూనితే వారిని మనం పవిత్ర భావంతో గౌరవంగా 'స్వామీ!' అని సంబోధిస్తూ వారి ఆలయ ప్రవేశానికి ఎలాంటి అభ్యంతరమూ చెప్పడం లేదు. వారిలో కొందరు శబరిమలలో మాల తీసివేసి దీక్ష విరమించగానే, కొండ దిగికిందనున్న పంబకు చేరుకున్న దగ్గర నుంచీ తిరిగి యథాప్రకారం తాగుడు మొదలైన తమ దుర్వ్యసనాలకు పునరంకితం కావడం అందరికీ తెలుసు. అయినా అలాంటి భక్తుల పవిత్రతపై ఎవరికీ, ఎలాంటి అనుమానాలు లేవు. రావు కూడా. దీక్షపూనిన మరి కొందరు దీక్షాసూచకంగా కేవలం పేరుకు మాత్రం నల్లని వస్త్రాలు ధరిస్తూ, దీక్షా కాలంలోనే నిస్సిగ్గుగా అన్ని చెడు అలవాట్లనూ కొనసాగిస్తున్నా, దానిపైన కూడా ఎవరికీ, ఎలాంటి అభ్యంతరాలూ ఉండవు. కానీ తాముగా ఎలాంటితప్పు చేయకుండానే ప్రకృతి ధర్మం ప్రకారం మాతృత్వమనే పవిత్రమైన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో భాగంగా బహిష్టు అయిన ఒక స్త్రీని మాత్రం అపవిత్రురాలుగా కొందరు భావించడం గర్హనీయం. ఈ తరహాకు సంస్కారం కేవలం హిందూ మతంలోనే కాదు; ఎక్కడ, ఏ మతంలో ఉన్నప్పటికీ అది సమర్థనీయం కాబోదు. మాతృత్వంలోనే ఆడ జన్మకు సార్థకత ఉందంటూ మెచ్చుకునే మన పెద్దలు సంతానం కలుగని గొడ్రాలు లేక వంధ్యను నీచంగా చూస్తూ, ఏదైనా పని మీద బయటకు వెళ్ళేటప్పుడు గొడ్రాలు ఎదురొస్తే ఖాళీ కుండలు ఎదురొచ్చినట్లే దుశ్శకునంగా భావించి, తమకు పంచమహా పాతకాలూ చుట్టుకున్నట్లు బాధపడిపోతారు. ఒక స్త్రీకి పిల్లలు లేకపోవడానికి కానీ, లేక మాతృత్వానికి దారితీసే క్రమంలో భాగంగా ఆమె బహిష్టు కావడంలో కానీ ఆమె వ్యక్తిగతంగా చేసిన, లేక చేస్తున్న తప్పొప్పులేవీ కారణం కాదు. మన ప్రాచీనులకు ఇదొక ప్రకృతి ధర్మమనే ఎరుక ఉన్నప్పటికీ తెలివిగా వంధ్యత్వాన్ని పూర్వ జన్మలో చేసిన పాపంగా చిత్రించి, పురాకృత కర్మలతో వారు దానిని ముడిపెట్టేశారు. ఒక భార్య గొడ్రాలు అయితే వివాహానంతరం ఎనిమిదవ ఏట పురుషుడు మరొక యువతిని పెండ్లాడవచ్చని, ఒక భర్త కేవలం ఆడపిల్లల్నే కన్న తన భార్య స్థానంలో తమవివాహానంతరం 11 వ ఏట మరో స్త్రీని పెండ్లాడవచ్చనీ నిర్ణయించిన స్మృతికారుడు మనువు ఏ వ్యక్తి భార్య అయినా గయ్యాళి అయిన పక్షంలో ఆ భర్త తక్షణం మరొక వివాహం చేసుకోవచ్చనే వెసులుబాటునూ పురుషులకు కల్పించాడు. (మనుస్మృతి 9



> దీక్షపూనిన మరికొందరు దీక్షాసూచకంగా కేవలం పేరుకు మాత్రం నల్లని వస్త్రాలుధరిస్తూ, దీక్షాకాలంలోనే నిస్సిగ్గుగా అన్ని చెడు అలవాట్లనూ కొనసాగిస్తున్నా, దానిపైన కూడా ఎవరికీ, ఎలాంటి అభ్యంతరాలూ ఉండవు. కానీ తాముగా ఎలాంటి తప్పు చేయకుండానేప్రకృతి ధర్మం ప్రకారం మాతృత్వమనే పవిత్రమైన లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో భాగంగా బహిష్టు అయిన ఒక స్త్రీని మాత్రం అపవిత్రురాలుగా కొందరు భావించడం గర్హనీయం.

81). ఆమె గయ్యాళి అని తాను అనుకుంటే చాలు పురుషుడు నిరభ్యంతరంగా పునర్వివాహం చేసేసుకోవచ్చట. మనువు పురుష పక్షపాతి అనీ, ఆయనకు స్త్రీల పట్ల వివక్ష ఉందనీ అనేందుకు ఇదొక స్పష్టమైన దృష్టాంతం. ఇది కూడా ఇస్లామిక్ షరియత్ ధర్మశాస్త్రం ప్రకారం తనకు నచ్చని భార్యకు తోచినప్పుడు 'తలాక్' చెప్పేందుకు పురుషులకు కల్పించిన వెసులుబాటు వంటిదే. పురుషాధిక్య పోకడలవిషయంలో ఎవరికెవరూ తీసిపోరు. అయితే బహుజాతుల, మతాల, ఆచారాల ప్రభావం కారణంగా భారతదేశంలో మొదట్నుంచీ సంఘ సంస్కరణోద్యమాలు ప్రబలమై హైందవ మతంలోని అనాగరికమైన ఆచారాలు చాలామేరకు వెనుకపట్టు పట్టాయి. బయటినుంచి వచ్చిన ఇతర మతాలు మాత్రం ఈ ప్రభావాలకు అతీతంగా తమ మతాచారాలను పట్టుదలతో కొంతమేరకు కాపాడుకోగలిగాయి. ఏది ఏమైనా ఈ ప్రజాస్వామ్య యుగంలో ప్రజల ఆకాంక్షల మేరకు ధర్మశాస్త్రాలలో ఇంకా మిగిలివున్న పురుషాధిక్యత వంటి అనాగరిక, అమానవీయ, అప్రజాస్వామిక ధోరణులు ఏ మతంలో ఉన్నా అవి సంస్కరింపబడవలసిందే. ఇదొక చారిత్రక ఆవశ్యకత కూడా. భారత రాజ్యాంగం లోని 51A(h) ప్రకారం సంస్కరణ వాదాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని, మానవవాదాన్ని, జిజ్ఞాసనూ మనమంతా పెంపొందించుకోవాలి.

శబరిమల ఆలయంలోకి అపవిత్రులైన 10 నుంచి 50 ఏళ్లలోపు స్త్రీలు ప్రవేశిస్తే బ్రహ్మచారి అయిన అయ్యప్ప స్వామి శీలం కళంకితమైపోతుందట. ఇది ఎంత అర్థంలేని వాదన? ఆంజనేయ స్వామి కూడా బ్రహ్మచారేననీ, అన్ని వయసుల స్త్రీలు ఆంజనేయుని ఆలయాలు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటుంటే ఆయనకు అంటని అపవిత్రత అయ్యప్పకు ఎలా అంటుతుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. కొందరు సంప్రదాయవాదులు ఆలయ నియమాలను ప్రశ్నించే హక్కు వ్యక్తులకుగానీ, కోర్టులకుగానీ ఎంతమాత్రం లేదనీ వాదిస్తున్నారు. కోర్టులు తీర్పు ఇచ్చినా అది మత వ్యవహారాలలో బలవంతపు చొరబాటు తప్ప వేరేమీ కాదని వారి వాదన. ఈ తరహా వాదనలు చేస్తున్నవారికి భారత రాజ్యాంగం పట్ల కనీస అవగాహన లేదనే అనుకోవాలి.


భారత రాజ్యాంగంలోని 15 వ అధికారణాన్ని అనుసరించి జాతి (పుట్టుక) లేక లింగంకారణంగా ఏ భారతీయ పౌరుడు వివక్షకు గురికారాదు. దళితులుగానో,స్త్రీలుగానోపుట్టినంత మాత్రంచేత, స్త్రీ సహజమైన ఋతుధర్మంలో వారు ఉన్న కారణం చేత వారు ఆలయ ప్రవేశానికి అనర్హులనడం వారిపట్ల స్పష్టమైనవివక్ష కిందికే వస్తుంది. మత విశ్వాసాలు కలిగి ఉండడానికి, ఏ మతాన్ని అయినా స్వీకరించడానికి, ఆచరించడానికి, ప్రచారం చేసుకొనడానికి భారత రాజ్యాంగంలోని 25 వ అధికరణం ప్రకారం పౌరులందరికీ సమానమైన హక్కుకల్పించబడింది. పౌరులకు కల్పించబడిన ఈ మత స్వేచ్ఛతో ప్రమేయం లేకుండా ప్రభుత్వానికి మత కార్యకలాపాలతో సంబంధమున్న ఆర్థిక, రాజకీయ లేక సంక్షేమ కార్యకలాపాలను నియంత్రించడానికి, పరిమితం చేయడానికి శాసనాలు రూపొందించే అధికారం ప్రభుత్వానికి ఉంది. అలాగే పబ్లిక్ స్వభావం కలిగిన హిందూ మతసంస్థలలో హిందువులలోని అన్ని తరగతులు, వర్గాల వారికి ప్రవేశం కల్పించడం లేదా హిందూ మత సంస్థల సంస్కరణ, సామాజిక సంక్షేమం దృష్ట్యా చట్టాలు చేసే అధికారం కూడా రాజ్యాంగం లోని 25 (2) అధికారణంలోని (బి) క్లాజు ప్రకారం ప్రభుత్వానికి ఇవ్వబడ్డది. ముస్లింల మసీదులలోకి, క్రైస్తవుల చర్చ్ లలోకి, జైనుల ఆలయాలలోకి అన్యమతస్థులతో సహా ఎవరైనా ప్రవేశించడానికి, ప్రార్థనలు చేసుకోవడానికి వీలుంది. కానీ హిందువుల ఆలయాలలోకి ప్రవేశించేందుకు, ప్రార్థనలు చేసుకునేందుకు అన్యమతస్థులనటుంచి హిందూ మతస్థులలోని బలహీన వర్గాలైన దళితులు మొదలైన వారికే ఇటీవలివరకూకేరళలో ఎలాంటి హక్కులూ ఉండేవి కాదు. కొన్ని ఇతర రాష్ట్రాలలోనిఆలయాలలోనూ స్వాతంత్ర్యం రాకపూర్వం ఇదే పరిస్థితి ఉండేది. దీనిని పురస్కరించుకునే రాజ్యాంగ నిర్మాతలు 25 (2) అధికరణం కింద స్పష్టమైన ఈ క్లాజును చేర్చడం జరిగింది.

2018 సెప్టెంబర్ చివర్లోసుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిజస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు జడ్జీల బెంచ్ 10 నుంచి 50 ఏళ్ల లోపు స్త్రీలకు శబరిమల ఆలయ ప్రవేశాన్ని నిషేధిస్తున్న నియమం రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెప్పింది. అంతర్రాష్ట్రీయ హిందూ పరిషత్, ఇతర హిందూత్వ గ్రూపుల నేతృత్వంలో నడుస్తున్న 'శబరిమల కర్మ సమితి'సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ, శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో మహిళలు ఎవరైనా ఆలయానికి వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుని పూజలు చేసుకోవాలని భావిస్తే వారికి తగు రక్షణ కల్పించాల్సిన బాధ్యతరాష్ట్రంలో శాంతిభద్రతలను పర్యవేక్షించే రాష్ట్ర ప్రభుత్వానికిఉంది. కేరళలోని పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం ప్రస్తుతం అదేపని చేస్తున్నది.రాజకీయ, మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా భారతరాజ్యాంగం పౌరులకుకల్పించిన హక్కుల్ని పరిరక్షించడంలో భాగంగా వామపక్షాల ఫ్రంట్ స్థానంలో కాంగ్రెస్ లేదా భాజపా ప్రభుత్వం ఉన్నా కూడా చేయాల్సింది ఇదే. అయితే భాజపా లోపాయికారీగాహిందూత్వ సంస్థలను ఉసిగొల్పుతూ,దీనినొక అవకాశంగా తీసుకునికేరళ రాష్ట్రంలో రాజకీయ లబ్ధి పొందడం కోసం, అక్కడ తమ పార్టీ ఓట్ బ్యాంకును పెంచుకొనే ఏకైక లక్ష్యంతో ప్రజల మనోభావాలను మత విశ్వాసాల పేరిట రెచ్చగొట్టడానికి పూనుకోవడం దారుణం. ప్రజాస్వామిక వాదులంతా దీనిని గమనించి మతోన్మాదుల ఎత్తుగడలను తిప్పికొట్టి కేరళ రాష్ట్రంలో సామరస్యపూర్వక, సుహృద్భావ వాతావరణం నెలకొనేటందుకు, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనేందుకుకృషిచేస్తారని ఆశిద్దాం.

■ ముత్తేవి రవీంద్రనాథ్

ది షో మస్ట్ గో ఆన్!

పండగ పూట రాత్రి పది గంటలు దాటాక మెసేజ్... రంగస్థల దిగ్గజం ఆచార్య మొదలి నాగభూషణశర్మ ఇక లేరు. ఊహించని షాక్. మద్రాసు ఎగ్మూర్ దాసప్రకాశ్ హోటల్ గదిలో మొదలి దంపతులతో జరిపిన ఆత్మీయ సంభాషణ, బెంగుళూరు మద్రాసు హైదరాబాద్‌ల మధ్య ఆయన పరిశోధక ప్రయాణాల ముచ్చట్లు... జ్ఞాపకాలెన్నో నిద్ర పోనివ్వకుండా మనసు పొరల్లో నుంచి ఒక్కసారిగా నిద్ర లేచాయి. ఆకర్షించే ప్రత్యేక రూపం... బక్కపల్చటి దేహం... మృదువైన మాట... ఏ అంశం గురించి ఎత్తినా దాని గురించి సాధికారికంగా మాట్లాడే వ్యక్తిత్వం... రంగస్థలంపై కొన్ని వందల మందిని దర్శకులుగా, నటులుగా తీర్చిదిద్దిన మార్గదర్శనం... 'రసరంజని' ప్రయోగం... మొదలి మాట మెదలగానే ఠక్కున గుర్తొస్తాయి. నాటకం, నాట్యం, జానపద కళలు మూడింటిపైనా పరిశోధనాత్మక సాధికారిక ప్రజ్ఞ చూపించిన నడిచే నాటక విజ్ఞాన సర్వస్వం ఆయన.


నివాళి
మొదలి నాగభూషణ శర్మ
(24.07.1935 – 15.01.2019)

నాయనమ్మ గారి ఊరైన గుంటూరు జిల్లా నరసరావుపేటలో జన్మించిన ఆయనకు నాటకంతో ఏడు దశాబ్దాల అనుబంధం. నాటక రచయిత, కవి అయిన తండ్రి గారి ప్రోత్సాహంతో ఎనిమిదో తరగతిలోనే నాటకం రాసి, వేసిన చరిత్ర ఆయనది. బందరు, గుడివాడ కాలేజీల్లో చదివే రోజుల్లోనూ ఆయన దాన్ని వదిలి పెట్టలేదు. ఎనభై నాలుగో ఏట ఇప్పుడు కన్నుమూసే వరకు ఆ అనుబంధాన్ని కొనసాగించారు. ఇరవయ్యేళ్ళ వయసులోనే కళాశాల విద్యార్థుల రేడియో నాటక రచన పోటీల్లో ఆయన ఆకాశవాణి బహుమతి అందుకోవడం, అప్పట్లోనే 'భారతి' పత్రికలో ఆయన నాటికలు ప్రచురణ కావడం, మధురవాణిగా పలు ప్రదర్శనల్లో అలరించడం కొద్దిమందికే తెలిసిన విషయాలు.

చాలామంది రంగస్థల కోవిదులకు భిన్నంగా నటుడు, నాటక రచయిత, దర్శకుడు, అధ్యాపకుడు, నట శిక్షకుడు, విమర్శకుడు ఇలా బహుపాత్రధారి మొదలి. గత శతాబ్దిలో కె.వి. గోపాలస్వామి, కె. వెంకటేశ్వర రావు, శ్రీనివాస చక్రవర్తి, ఏ.ఆర్. కృష్ణ, చాట్ల శ్రీరాములు లాంటి ప్రసిద్ధ రంగస్థల ప్రయోక్తలు ఎందరో ఉన్నారు. వారిలో కొందరి వెనుక, మరికొందరితో కలసి వేదికపై అడుగులు వేసిన మొదలి వారి పంథా మాత్రం ప్రత్యేకం. వారికి ఉన్న భారతీయ నాటకానుబంధంతో పాటు, వారిని మించిన పాశ్చాత్య నాటక పరిచయం, నాటకకళను శాస్త్రీయంగా అభ్యసించిన విధానం, పరిశోధన ఆయనకు బాగా అందివచ్చాయి. తెలుగు నాటకంతో, నాటక దిగ్గజాలు స్థానం నరసింహారావు, ఈలపాట రఘురామయ్య వంటి వారితో అనుబంధంతో పాటు ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ, వెస్ట్రన్ ఇల్లినాయ్ విశ్వవిద్యాలయం నుంచి నాటక దర్శకత్వంలో ఎం.ఎఫ్.ఏ డిగ్రీ, అమెరికన్ రంగస్థలంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి ... ఇవన్నీ ఆయన ఆలోచనకు వైవిధ్యాన్నీ, విస్తృతినీ, విద్యావ్యాసంగ కోణాన్నీ సంతరించాయి. రచన ప్రదర్శన ప్రయోక్తృత్వం, పరిశోధన ప్రచురణ ప్రచారం, అధ్యయనం అధ్యాపకత్వం ఆచరణాత్మక మార్గదర్శనం... ఇన్నీ కలగలసిన మూర్తిమత్వం ఆధునిక తెలుగు రంగస్థలంపై సమకాలీన చరిత్రలో మొదలి నాగభూషణశర్మ ఒక్కరిదే కావచ్చు. రంగస్థలాన్ని అలా శ్వాసించి, విద్యార్థులను అంతలా శాసించిన మరొకరు కనిపించరు.

అసలు ఆయన మొదలుపెట్టింది ఉస్మానియాలో ఆంగ్ల సాహిత్య ఆచార్యులుగా! అది పదహారేళ్ళ అనుభవం. ఆపైన ఏకంగా 22 ఏళ్ళు వివిధ విశ్వవిద్యాలయాల్లో పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ శాఖల్లో విద్యార్థి లోకానికి దారి దీపమయ్యారు. శతాధిక విద్యార్థి ప్రదర్శనలకు ప్రయోక్తగా విద్యా నాటకరంగానికి సేవ చేశారు. ఉస్మానియాలో రంగస్థల శాఖ ప్రారంభించినప్పుడు దానికి మొట్టమొదటి ఆచార్యులు మొదలి వారే. చాట్ల, రాజా రామ్‌దాస్ లాంటి నిష్ణాతులను ఆ శాఖలో అధ్యాపకులుగా రప్పించిందీ ఆయనే. తరువాత హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోనూ ఆయనే ప్రారంభ ఆచార్యులు. అలాగే, తెలుగు విశ్వవిద్యాలయంలో నాటకశాఖ మొదలైనప్పుడూ దానికి నారు పోసి, నీరు పెట్టిన మార్గదర్శకులూ ఆయనే. టికెట్ కొని, నాటకం చూసే అలవాటును తెలుగు ప్రేక్షకుల్లో పెంపొందించాలని పాతికేళ్ళ క్రితం హైదరాబాద్‌లో 'రసరంజని' సంస్థను స్థాపించిన నలుగురిలో (మిగతా ముగ్గురు గరిమెళ్ళ రామమూర్తి, జె.వి. సోమయాజులు, చాట్ల శ్రీరాములు) ఆయన ఓ మూలస్తంభం.

లెక్క చూస్తే, పది నాటకాలు, పదహారు నాటికలు ఆయన స్వతంత్ర రచనలు. ఇంగ్లీషు, సంస్కృతం, ఇంకా అనేక ఇతర భారతీయ భాషల నుంచి చేసిన అనువాదాలైతే అనేకం. విశేషం ఏమిటంటే, ఈ రచనలన్నిటినీ ఆయన రంగస్థలంపై ప్రదర్శించారు. ప్రయోగాత్మకంగా సరికొత్త ప్రదర్శన శైలీ రీతులకు శ్రీకారం చుట్టారు. సాధారణ వేదికపై కాక, పరిసరాలనే వేదికగా చేసుకొని ప్రదర్శనలిచ్చే ప్రయోగానికి హైదరాబాద్‌లో ఆయన నాంది పలికారు. కొండ ప్రాంతాన్నీ (గిరీశ్ కర్నాడ్ రచన 'తుగ్లక్'), హైదరాబాద్ కోఠి ఉమెన్స్ కాలేజ్‌లోని రెసిడెన్సీ భవనాన్నీ (ప్రసిద్ధ గ్రీకు విషాదాంత నాటకం 'రాజా ఈడిపస్'), నిజాం కాలేజీ ఆవరణనూ (అమెరికన్ నాటకపు తెలుగుసేత 'నరజాతి చరిత్ర సమస్తం'/ 'దొరా... నీ చావు మూడింది') రంగస్థల వేదికలుగా ఉపయోగించిన ప్రయోగశీలి ఆయన. అమెరికన్ నాటకమైనా, హిందీ నాటకమైనా... తెలుగులోకి తెచ్చినప్పుడు, ఇతివృత్తానికి తగ్గట్టు ప్రాంతీయ జానపద కళారూపాలైన ఒగ్గుకథ, శారదకథ, పాటలు, కీర్తనకారుల కీర్తనల్ని కూడా ఆ నాటక ప్రదర్శనలో భాగం చేయడం ఆయన చేసిన మరో సాహసం. టంగుటూరి ప్రకాశం పంతులు ఆత్మకథను నాటకీకరించి, 'ప్రజానాయకుడు ప్రకాశం' పేరిట రంగస్థలంపై పదులకొద్దీ ప్రదర్శనలివ్వడం మొదలి వారి మరో ఘనత. మైమ్, ఆట, పాట... అన్నిటినీ ప్రయోగిస్తూ ఆయన చేసిన 'సంపూర్ణ నాటక ప్రదర్శన'లూ ('కాయితం పులి') ఓ సంచలనం. అభిరుచి గల ప్రేక్షకులకు కళాఖండాలను అందించాలంటూ రంగస్థలం మీద ఆయన చేసిన ఇలాంటి అనేక ప్రయోగాలు మన నాటక రంగాన్ని మరో మెట్టు పైకి ఎక్కించాయి.

> **ఏ అంశం గురించి ప్రస్తావించినా దాని గురించి సాధికారికంగా మాట్లాడే వ్యక్తిత్వం, రంగస్థలంపై కొన్ని వందల మందిని దర్శకులుగా, నటులుగా తీర్చిదిద్దిన మార్గదర్శనం, 'రసరంజని' ప్రయోగం... ఆచార్య మొదలి నాగభూషణ శర్మ గురించి వినగానే ఠక్కున గుర్తొస్తాయి. నాటకం, నాట్యం, జానపద కళలు మూడింటిపైనా పరిశోధనాత్మక సాధికారిక ప్రజ్ఞ చూపించిన నడిచే నాటక విజ్ఞాన సర్వస్వం మొదలి వారు. ఆయన చేసిన పని, చూపిన మార్గం, ప్రసరించిన ప్రభావం అపూర్వం.**

తెలుగులో నాటక విమర్శకు ఆద్యులనే పట్టం అలనాటి పురాణం సూరిశాస్త్రి గారిదైతే, ఆధునికులనే గౌరవం ఈనాటి మొదలి వారిది. సాహిత్య, నాటక విమర్శలో ఆయన చేసిన కృషికి తెలుగులో, ఇంగ్లీషులో ఆయన చేసిన మూడుపదులకు పైగా రచనలే సాక్ష్యం. పండితుల ప్రశంసలు అందుకున్న 'తెలుగు సాహిత్యం గాంధీజీ ప్రభావం', 'తెలుగు నవలా వికాసం', 'సురభి నాటక సమాజాల చరిత్ర', 'కన్యాశుల్కం నూరేళ్ళ సమాలోచనం', 'నాటకరంగ పారిభాషిక పదకోశం', 'నాటక శిల్పం' లాంటివి వాటిలో కొన్ని మచ్చుతునకలు. సినీనటులు తనికెళ్ళ భరణి, విద్యాసాగర్, భిక్షు, తల్లావజ్ఝల సుందరం, డి.ఎస్.ఎన్. మూర్తి లాంటి పలువురు రంగస్థలంపై ఆయన ప్రత్యక్ష శిష్యులు. పరోక్ష ఏకలవ్య శిష్యుల జాబితా వేస్తే, ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడెమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ లాంటి ఎందరెందరో కనిపిస్తారు. వయసులో పెద్దవాళ్ళయిన చాట్ల శ్రీరాములు నుంచి చిన్నవాళ్ళయిన డి.ఎస్. దీక్షిత్ దాకా అందరూ మొదలి వారిని 'మాస్టారు'గానే భావించారు.



ఏదైనా అనుమానం వస్తే పెద్దలు సైతం అడిగేలా మొదలి వారి కీర్తికి కొత్త సొబగు తెచ్చింది ఆయన పరిశోధక దృష్టి. కేవలం నాలుగు గోడల తరగతి గదులకే పరిమితం కాకుండా, తెలుగు జానపద కళారూపాలపై సుదీర్ఘమైన క్షేత్రపర్యటనలు చేసి, గ్రంథాలు రాశారాయన. ఆ కళారూపాలను సాధికారికంగా ప్రయోగం చేయించి, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై గుర్తింపు సాధించారు. 'ఇండియన్ థియేటర్ జర్నల్', భారతీయ శాస్త్రీయ నృత్యరీతులను అధ్యయనం చేస్తూ 'నర్తనమ్' లాంటి పరిశోధనాత్మక పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించారు. వయసు మీద పడినా ఆయనలో పరిశోధన ప్రయత్నం తగ్గలేదు. మరుగునపడిన ఒకనాటి ప్రముఖుల సమాచారాన్ని శోధించి, సాధించి, ససాక్ష్యంగా, పరిశోధనాత్మక దృష్టితో రచనలు చేయడం మొదలి వారిలో కనిపించే మరో ప్రత్యేకత. గత దశాబ్ది కాలంలో ఆయన రచించిన 'తొలినాటి గ్రామఫోన్ గాయకులు', 'స్థానం నరసింహారావు నట జీవనప్రస్థానం', 'ఈలపాట (కల్యాణం) రఘురామయ్య నటజీవితం' లాంటివన్నీ అందుకు ఉదాహరణలు. ఆంధ్ర నాటక పితామహుడైన ధర్మవరం రామకృష్ణమాచార్యుల జీవితం, వారి నాటక సాహిత్యంపై సమగ్ర పరిశీలన... మొత్తం నాలుగు పుస్తకాలు సరిగ్గా ఏడాది క్రితం మొదలి వారి రచన, సంపాదకత్వంలో వచ్చాయి.

ఉస్మానియాలో ఆరు రోజుల 'ఆత్రేయ నాటకోత్సవాల' నిర్వాహకులూ, అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'అఖిలాంధ్ర నాటకోత్సవాల'కు కారకులు ప్రేరకులూ, ఆ తరువాత రోజుల్లో నంది నాటకోత్సవాల నిర్వహణకు మార్గనిర్దేశకులూ... అన్నీ మొదలి వారే. కాకినాడ దగ్గర మాధవపట్నంలో మూడేళ్ళు తోలుబొమ్మలాట నేర్చుకొన్న ఆయన విదేశాల్లో పలుమార్లు వాటిని ప్రదర్శింపజేశారు. సురభి నాటకరంగం, తోలుబొమ్మలాట, తూర్పు భాగవతంపై ఆయన చేసిన ఆంగ్ల రచనలు ప్రపంచానికి మన కళలను పరిచయం చేశాయి. ఇలాంటి విస్తృతమైన సేవలకు గుర్తింపు కేంద్ర సంగీత నాటక అకాడెమీ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆయనను తమ కార్యవర్గ సభ్యుణ్ణి చేసుకోవడం! ఆయన సేవలను వినియోగించుకోవడం! ఆయనకు లభించిన ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ పురస్కారాల జాబితా పెద్దది. తాజాగా అ.జో.వి.భొ ఫౌండేషన్ నుంచి 'ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారా'న్ని తెనాలిలో అందుకొని, పట్టుమని పదిరోజులైనా గడవక ముందే... ఇలా ఆయన జీవిత రంగస్థలం నుంచి నిష్క్రమించడం విషాదం.

మొదలి వారు చేద్దామనుకున్న పరిశోధనలు, రాద్దామనుకున్న రచనలు అనేకం ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. 'సాహితి' పేరుతో ద్వైమాసిక సాహిత్యపత్రికను నడపాలన్న ఆయన ప్రయత్నం ఇంకా ఆచరణ రూపం దాల్చలేదు. మరో పక్క 'ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా'కు సంపాదకత్వం వహించిన మన తెలుగువాడు, ప్రముఖ కళా విమర్శకుడు ఏ.ఎస్. రామన్ జీవితంపై సాధికారిక రచన కోసం కొన్ని నెలల పాటు ఆయన శోధించి, సేకరించిన సమాచారం అలాగే ఉంది. కూచిపూడి నాట్య ఆవిర్భావం, వికాసం, పరిణామం, భవిష్యత్ మార్గదర్శనాలపై వెలువరించదలచిన కొత్త పరిశోధన రచన అచ్చులోకి రావాల్సి ఉంది. ఆయన అక్షరాల్లో సిద్ధమైన మరి కొన్ని ప్రసిద్ధ అనువాద నాటకాలు రంగస్థలంపైకి రావాల్సి ఉంది. ఇవన్నీ మాస్టారి తీరని కోరికలు. కేంద్ర సంగీత నాటక అకాడెమీ పక్షాన తెలుగునాట యాక్టింగ్ స్కూల్ ప్రారంభం కోసం ఆయన చేసిన ప్రయత్నాలు తెలుసుకుంటే ఇప్పటికైనా ఎవరైనా కొనసాగించాలని ప్రేరేపిస్తాయి. "నాటకాలను సాహిత్యానికి దూరం చేశారు. ఎప్పుడు నాటకం... సాహిత్యంలో భాగంగా వస్తుందో, అప్పుడే నిలబడుతుంది" అన్న ఆయన మాటలు మనల్ని ఆత్మపరిశీలనకు నెడతాయి. ఒక్కమాటలో... ఆయన చేసిన పని, చూపిన మార్గం, ప్రసరించిన ప్రభావం అనిదం పూర్వం. హి ఈజ్ నో మోర్! బట్ ది షో మస్ట్ గో ఆన్... ఇన్ హిజ్ (రి)సెర్చ్ లైట్!

■ డాక్టర్ రెంటాల జయదేవ

'కారు'లో ప్రయాణం కొంప ముంచుతుందా!

» టీఆర్‌ఎస్‌తో దోస్తీ అవసరమా?.. వైసీపీ నేతల్లో అసంతృప్తి



అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రులు రాక్షసులు.. ఆంధ్రా పురోహితులకు ఆడంబరం ఎక్కువ.. ఆంధ్రులది పేడ బిర్యానీ'.. ఇలా సమయం చిక్కినప్పుడల్లా ఆంధ్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసీఆర్‌తో బహిరంగ స్నేహమా..? వైసీపీ నేతల్లో ప్రస్తుతం జరుగుతున్న చర్చ ఇది! ఇప్పటిదాకా ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న ఆరోపణలను నిజం చేస్తూ.. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వైసీపీ అధ్యక్షుడు జగన్ మధ్య జరిగిన భేటీ ఆ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొందరు వైసీపీ నేతలు ఈ పరిణామంపై అంతర్గతంగా అసంతృప్తి, ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌తో దోస్తీని సీమాంధ్ర ప్రజలు సహించరని చెబుతున్నారు. ప్రత్యేక హోదాపై వ్యతిరేకత, పోలవరంపై కేసులు, విద్యుత్తు వినియోగానికి సంబంధించి రూ.5200 కోట్ల ఎగవేత, ఉమ్మడి సంస్థల ఆస్తుల పంపిణీకి సహాయ నిరాకరణ.. వంటి అనేక అంశాల నేపథ్యంలో టీఆర్ఎస్‌తో చేతులు కలపడం ఆత్మహత్యాసదృశమే అవుతుందని వైసీపీ నేతలు చెబుతున్నారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని తెలంగాణ గడ్డపైనే సోనియా, రాహుల్ చేసిన ప్రకటనపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్ తదితర టీఆర్ఎస్ నేతలు వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సంప్రదింపులు జరపడం ద్వారా అధికార టీడీపీకి కొత్త ఆయుధం ఇచ్చినట్లయిందని వైసీపీ కీలక నేత ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు.

కేసీఆర్ చేతిలో రిమోట్.. జగన్

» ఆంధ్రా ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాడు : ఏపీ మంత్రులు

అమరావతి, విజయవాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): "రాజకీయాల్లో రంకు, బొంకు దాగవు. నాలుగేళ్ల కేసీఆర్, జగన్‌ల రాజకీయ రంకుతనం కనుమ పండుగ రోజున బట్టబయలైంది. రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం చేసిన టీఆర్ఎస్‌తో చేతులు కలపడం ద్వారా జగన్ ఆంధ్రప్రదేశ్‌కు నష్టం చేసేందుకు సిద్ధమయ్యారు. కేసీఆర్ జగన్‌ను రిమోట్ కంట్రోల్‌గా వాడుకొని ఆంధ్రపై పెత్తనం చేయాలని చూస్తున్నాడు" అని ఏపీ జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "పోలవరానికి వ్యతిరేకంగా టీఆర్ఎస్ ఎంపీ కవిత సుప్రీం కోర్టులో కేసు వేశారు. ఎన్జీటీలో కేసులు వేశారు. ఏడు మండలాలను గుంజుకున్నామంటూ కేసీఆర్ తిట్టారు. ప్రత్యేక హోదాను ఆ పార్టీ వ్యతిరేకించింది. జగన్‌ను అడ్డం పెట్టుకుని కేసీఆర్ ఆంధ్రప్రదేశ్‌పై పెత్తనం చెలాయించాలని చూస్తున్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్, వైసీపీ అధ్యక్షుడు జగన్, జనసేన అధ్యక్షుడు పవన్ కుట్రలు, కుతంత్రాలకు తెరతీశారు. మోదీతో మరో ముగ్గురు మోదీలు కలిసినా టీడీపీని ఏమీ చేయలేరు. ఖబడ్దార్ ఆంధ్రా ద్రోహుల్లారా.. మీ ఆటలు సాగవు" అని హెచ్చరించారు. జగన్, కేటీఆర్‌ల సమావేశంపై మంత్రులు యనమల రామకృష్ణుడు, కిమిడి కళా వెంకట్రావు, నారా లోకేశ్, శిద్దా రాఘవరావు, నక్కా ఆనందబాబు, గంటా శ్రీనివాసరావు, పి.నారాయణ, టీడీపీ ఎంపీలు, నేతలు విరుచుకుపడ్డారు. జగన్, కేసీఆర్‌ల ముసుగు బయటపడిందని, మోదీని గద్దె నెక్కించడానికే 'ఫ్రంట్' నాటకమంటూ స్వరం పెంచారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేసీఆర్‌తో చేతులు కలిపిన జగన్ ఆంధ్రా ద్రోహిగా మారాడని దుమ్మెత్తిపోశారు. 'జగన్, కేసీఆర్ ఇప్పుడు కలవడమేంటి? ఏడాది నుంచే కలిసి పనిచేస్తున్నారుగా? ఇవాళ జగన్, కేటీఆర్ భేటీ అయి కొత్తగా ఏం మాట్లాడుకుంటారు' అని అనంతపురం టీడీపీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్‌తో పాటు మరో పది మంది వచ్చినా ఆంధ్రలో టీడీపీని చేయగలిగేదేమీ లేదని స్పష్టం చేశారు.

● కేసీఆర్ పొత్తుతో జగన్ పాతాళానికే: రామకృష్ణ

విజయవాడ (గవర్నర్‌పేట), జనవరి 16: "ప్రధాని మోదీకి బీ టీం, కేసీఆర్ థర్డ్‌ఫ్రంట్‌తో ఏపీలో వైఎస్ జగన్ పొత్తు పెట్టుకుంటే పాతాళానికి పోతారు. మోడీ డైరెక్షన్‌లో కేసీఆర్ నడుస్తున్నారు. కేసీఆర్ డైరెక్షన్‌లో జగన్ నడవబోతున్నారు" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. "మోదీకి అనుకూలంగా వ్యవహరించాలనే ఎజెండాతోనే వైఎస్ జగన్‌తో కేటీఆర్ బృందం చర్చలు జరిపింది. ముసుగు తొలగించుకుని మోదీతో జతకడుతున్నట్లు ఇద్దరూ ఓపెన్‌గా చెప్పాలి." అని డిమాండ్ చేశారు.

● వైసీపీని ఫినిష్ చేయడానికే పొత్తు: తులసిరెడ్డి

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): "దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిపై టీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావుకున్న కక్ష కారణంగానే వైసీపీ అధ్యక్షుడు జగన్‌తో పొత్తు పెట్టుకుంటున్నారేమో!" అని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు నర్రెడ్డి తులసిరెడ్డి సందేహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "అప్పట్లో టీఆర్ఎస్‌ను తుడిచిపెట్టేయాలని వైఎస్ భావించారు. వైఎస్ బతికుంటే టీఆర్ఎస్ ఉండేది కాదు. వైఎస్‌పై ఉన్న ఈ ప్రతీకారంతోనే ఇప్పుడు జగన్‌తో కేసీఆర్ పొత్తు పెట్టుకుంటున్నారు. వైసీపీని కేసీఆర్ ఈ విధంగా ఫినిష్ చేస్తున్నారేమోనని నాకు అనుమానంగా ఉంది" అని తులసిరెడ్డి అన్నారు.

● మాకు శుభ పరిణామం: కేఏ పాల్

ఖైరతాబాద్/హైదరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను కలవడం తమకు శుభ పరిణామమని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేఏ పాల్ వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్క్ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో వైసీపీ, బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు ఒక్కటయ్యాయని అన్నారు. చంద్రబాబును పది శాతం ప్రజలు కూడా నమ్మడం లేదని, టీఆర్ఎస్ పార్టీ వైసీపీ తరపున ప్రచారం నిర్వహిస్తే అక్కడ వైసీపీకి డిపాజిట్లు రావని, ఈ పరిణామం తమ పార్టీకి మేలు చేస్తుందని కేఏ పాల్ వివరించారు.

● అమరుల శవాలపై కేసీఆర్ రాజకీయం : వీహెచ్

హిమాయత్‌నగర్/హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి అమరులైన 1200 మంది శవాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు విరుచుకుపడ్డారు. ఏమవసరముందని తెలంగాణను అడ్డుకున్న జగన్‌తో పొత్తు పెట్టుకుంటున్నారని ప్రశ్నించారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని ఫతేమైదాన్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మోదీ ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంతోనే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. కేంద్రంపై అవిశ్వాసం పెట్టారని, దానికి రాహుల్ గాంధీ మద్దతిచ్చారు కాబట్టే చంద్రబాబు యూపీఏ పట్ల విశ్వాసం ప్రదర్శించారని అన్నారు. మోదీకి లాభం చేకూర్చడానికే కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ పేరుతో జగన్‌ను కలుపుకుంటున్నారని విమర్శించారు.

టీఆర్ఎస్, వైసీపీ ముసుగు తొలగింది

» జగన్, కేటీఆర్ భేటీతో అది స్పష్టమైంది: రమణ

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఫెడరల్ ఫ్రంట్ ముసుగులో బీజేపీకి టీఆర్ఎస్, వైసీపీ 'బి' టీములుగా పనిచేస్తున్నాయని టీడీపీ-టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ ధ్వజమెత్తారు. వైసీపీ అధినేత జగన్, టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీతో టీఆర్ఎస్, వైసీపీ ఇన్నాళ్లుగా వేసుకున్న ముసుగు తొలగిందని అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర్‌రావుతో కలిసి బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఫెడరల్ ఫ్రంట్ ముసుగులో కేసీఆర్, కేటీఆర్ హైదరాబాద్ వేదికగా కొత్త నాటకానికి తెర లేపారని ఆరోపించారు. జగన్, కేటీఆర్ భేటీ అవ్వడాన్ని తాము బ్లాక్‌డే భావిస్తున్నామన్నారు.

పోలవరానికి వ్యతిరేకంగా కవిత వ్యాజ్యం

అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిజామాబాద్ ఎంపీ కవిత సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలి హోదాలో 2011లో ఆమె వేసిన ఈ వ్యాజ్యంపై ఇప్పటికీ సర్వోన్నత న్యాయస్థానంలో వాదనలు కొనసాగుతున్నాయి. ఏపీ ప్రభుత్వం బుధవారం ఈ వివరాలను బహిర్గతం చేసింది. పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో 10, హైకోర్టులో 9, ఢిల్లీ హైకోర్టులో ఒకటి, జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో రెండు వ్యాజ్యాలు ఉన్నాయి. ఇందులో ప్రాజెక్టుకు ఇచ్చిన పర్యావరణ అనుమతులపై స్టే ఇవ్వాలని కవిత పిటిషన్ వేశారు. కేంద్ర పర్యావరణ అటవీ శాఖ, కేంద్ర జల సంఘం, కేంద్ర సామాజిక న్యాయం, గిరిజన వ్యవహారాల శాఖలను, ఆంధ్ర ప్రభుత్వాన్ని ప్రతివాదులుగా చేర్చారు.

ముసుగు తీసి.. కలిసే పోటీ చేయండి!

» కేసీఆర్‌తో కలిసి జగన్‌ది 'హోదా' డ్రామా

» మోదీతో కలిసి ఏపీ అభివృద్ధికి అడ్డుపడుతున్నారు: చంద్రబాబు

చిత్తూరు/చంద్రగిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): "ముసుగులో గుద్దులాట ఎందుకు? ఆ ముసుగు తీసేసి వచ్చే ఎన్నికల్లో ఏపీలో కలిసే పోటీ చేయండి" అని వైసీపీ, టీఆర్ఎస్ పార్టీలను ఉద్దేశించి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కేసీఆర్‌తో కలిసి రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానంటూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. చిత్తూరు జిల్లాలోని సొంతూరు నారావారిపల్లెలో కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు సంక్రాంతి వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జగన్, కేసీఆర్, మోదీ.. ముగ్గురూ ఒక్కటేనని.. పక్కా ప్రణాళికతోనే ఏపీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి రూ.75 వేల కోట్లు రావలసి ఉన్నా.. ఇవ్వకుండా కేంద్రం అన్యాయం చేస్తోందని ఆగ్రహించారు. కేంద్రంలో మోదీ గద్దె దిగితే తప్ప.. మన ఏపీకి న్యాయం జరగదన్నారు. జగన్‌పై కత్తి దాడి కేసుకు సంబంధించి కేంద్రం అత్యుత్సాహం చూపుతోందని విమర్శించారు. రాష్ట్ర సమస్యల్లో ఎన్ఐఏ కల్పించుకోవడం మంచిది కాదన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతోనే కేంద్రం ఆర్థిక బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ ప్రకటించిందని విమర్శించారు.



నారావారిపల్లెలో ఎడ్లబండిపై మనవడు దేవాన్ష్‌తో చంద్రబాబు

కొత్త పొత్తు!



జగన్ నివాసంలో ఆయనతో భేటీ అయిన టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ నేతలు

(మూడో పేజీ తరువాయి)

తెలిపారు. ఆ మేరకు టీఆర్ఎస్ ఎంపీలు వినోద్‌కుమార్, సంతోశ్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులతో కలిసి కేటీఆర్ జగన్ నివాసానికి వచ్చారు. ఈ భేటీలో వైసీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ ఎంపీలు మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాదరావు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పాల్గొన్నారు. అంతా కలిసి అక్కడే భోజనం చేశారు. చర్చల సారాంశాన్ని కేటీఆర్ అక్కడి నుంచే కేసీఆర్‌కు ఫోన్‌లో వివరించారు. కేసీఆర్ జగన్‌తో ఫోన్లో మాట్లాడారు. తాను అమరావతికి వచ్చి కలుస్తానని కేసీఆర్ చెప్పినట్లు తెలిసింది. ఫిబ్రవరి 14న అమరావతి పరిధిలోని తాడేపల్లిలో తాను గృహప్రవేశం చేస్తున్నానని, ఈ కార్యక్రమానికి రావాలని జగన్ ఆహ్వానించారు. ఇందుకు కేసీఆర్ సుముఖత తెలిపారు. ఫెడరల్ ఫ్రంట్‌పై అక్కడే చర్చించుకుందామన్నారు.

హోదాపై మరో మాట లేదు: కేటీఆర్

లోటస్‌పాండ్ నివాసంలో చర్చల అనంతరం కేటీఆర్, జగన్ మీడియా ముందుకు వచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో తమ పార్టీ విధానాన్ని సీఎం కేసీఆర్ ఇప్పటికే స్పష్టం చేశారని కేటీఆర్ తెలిపారు. రాజ్యసభలో కేకే, లోక్‌సభలో కవిత తమ పార్టీ విధానాన్ని తెలిపారని గుర్తుచేశారు. హోదాకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని... ఈ విషయంలో రెండో అభిప్రాయమే లేదని తేల్చి చెప్పారు. "తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎలా పనిచేయాలనే విషయమై వైసీపీతో చర్చలు జరుపుతున్నాం. చర్చల కోసం సీఎం కేసీఆర్ త్వరలో ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తారు. మొత్తం అధికారాలను తమ వద్దే ఉంచుకుంటూ కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సమాఖ్య స్ఫూర్తితో జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయం కోసం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా కేసీఆర్ పశ్చిమ బెంగాల్, ఒడిసా, కర్ణాటక సీఎంలతోపాటు తమిళనాడులో స్టాలిన్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం అజిత్‌జోగి, పలువురు జాతీయ నాయకులను కలిశారు. ఈ క్రమంలోనే జగన్‌కు ఫోన్ చేసి ఫ్రంట్ గురించి వివరించారు" అని తెలిపారు. వివిధ రాష్ట్రాల సీఎంలు, పార్టీల అధ్యక్షులతో కేసీఆర్ చర్చలు జరుపుతున్నారని... త్వరలో ఏపీకి వెళ్లి జగన్‌తోనూ చర్చిస్తారని చెప్పారు. ఏపీ రాజకీయాల్లో టీఆర్ఎస్ పాత్ర గురించి విలేకర్లడిగిన ప్రశ్నకు.. 'అన్ని విషయాలూ ఇప్పుడే చెప్తే ఎలా? మీకు రాసుకునేందుకు ఏం ఉంటుంది?' అని కేటీఆర్ బదులిచ్చారు.

చర్చలు కొనసాగిస్తాం: జగన్

రాష్ట్రాల తరఫున మాట్లాడే ఎంపీల సంఖ్యా బలం పెరగాలని వైసీపీ అధ్యక్షుడు జగన్ అభిప్రాయపడ్డారు. అప్పుడే రాష్ట్రాల విషయంలో కేంద్రం జాగ్రత్తగా వ్యవహరిస్తుందన్నారు. ఆ దిశగా రాష్ట్రాలతో వేదిక ఏర్పాటుకు కేసీఆర్ చేస్తున్న ప్రయత్నం హర్షణీయమని.. ఫెడరల్ ఫ్రంట్ విషయమై తాను కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడానని తెలిపారు. "రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే రాష్ట్రాలన్నీ కలవాలి. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీకే దిక్కు లేని పరిస్థితి ఉంది. ఒక్క రాష్ట్రంలో ఉన్న ఎంపీ సీట్లతో దాన్ని అధిగమించే పరిస్థితి లేదు. 25 మంది ఎంపీలతో డిమాండ్ చేసినా పట్టించుకునే పరిస్థితి కనిపించదు. తెలంగాణ నుంచి మరో 17మంది తోడైతే మొత్తం 42 మంది ఎంపీలు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై స్పందించి, ప్రశ్నించగలిగితే, ప్రత్యేక హోదా కావాలని చెప్పగలిగితే రాష్ట్రానికి మేలు జరిగే పరిస్థితి మెరుగుపడుతుంది" అని జగన్ చెప్పారు. కేటీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ బృందంతో చర్చలు ప్రాథమిక స్థాయిలోనే జరిగాయని, వాటిని కొనసాగిస్తామని అన్నారు. కేసీఆర్ తనతో ఫోన్‌లో మాట్లాడారని, తదుపరి చర్చలకు తానే వస్తానని చెప్పారని తెలిపారు. కేటీఆర్ బృందం ప్రతిపాదనలపై తమ పార్టీలో చర్చించి, ఎలా ముందుకు వెళ్లాలో నిర్ణయించుకుంటామన్నారు. కేసీఆర్‌తో చర్చల అనంతరం ఒక రూపం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక హోదాపై అవసరమైతే కేంద్రానికి లేఖ రాస్తానని గతంలో కేసీఆర్ చెప్పిన సంగతి తెలిసిందే. వచ్చే నెలలో జగన్‌తో భేటీకి ముందే ఆ మేరకు లేఖ రాస్తారని టీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

టీఆర్ఎస్ ఏపీలో పోటీ చేయదు: విజయసాయిరెడ్డి

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ తన అభ్యర్థులను పోటీ చేయించదని, వాళ్లకు అలాంటి ఆసక్తి ఏదీ లేదని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ఫెడరల్ ఫ్రంట్‌లో ఉన్న పార్టీల నాయకులు భాగస్వామ్యపక్షాల అభ్యర్థుల తరఫున ఎక్కడికైనా వచ్చి ప్రచారం చేస్తారని చెప్పారు. జగన్ నివాసంలో విజయసాయిరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. కేసీఆర్ ప్రధాని అభ్యర్థి రేసులో ఉంటారా? అన్న ప్రశ్నకు.. "ఇంత పెద్ద దేశంలో 17 లేదా 25 ఎంపీ స్థానాలతో ఒక వ్యక్తి ప్రధాని కావడం దాదాపు అసాధ్యమే. కానీ, పార్టీలన్నీ కలిసి మెజారిటీ సాధించి, వాళ్లందరి ఆమోదం ఉంటే ఇది సాధ్యపడుతుంది" అని విజయసాయిరెడ్డి చెప్పారు. 'తెలుగు రాష్ట్రాల ప్రయోజనాల కోసం, ఏపీకి ప్రత్యేక హోదా కోసం చేయీ చేయీ కలపాలి' అని ట్విట్టర్‌లో పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆంధ్రుల గురించి అవమానకరంగా మాట్లాడితే.. ఆయనతో తెలంగాణ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని చంద్రబాబు ఎందుకు భావించారని ప్రశ్నించారు.



వీరభద్రస్వామి ఉత్సవాలకు వచ్చి తిరుగు ప్రయాణమైన జాతరబండ్లు

మమ్మేలు మా సామి ఐలోని మల్లన్న

ఐనవోలు, భీమదేవరపల్లి, జనవరి 16: ఐనవోలు మల్లికార్జున స్వామి పరిసరాలు మల్లన్న నామస్మరణతో మార్మోగాయి. ఆదివారం ప్రారంభమైన మహాజాతర మంగళ, బుధవారాల్లో మరోస్థాయికి చేరింది. మార్నేని వంశీయులు నిర్వహించే పెద్ద రథం (ఎడ్ల బండి) మంగళవారం రాత్రి పురవీధుల గుండా ఆలయ ప్రాంగణానికి చేరుకుంది. వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి కొత్తకొండ వీరభద్రస్వామి జాతర భక్త జనసంద్రమైంది. భోగి, మకరసంక్రాంతిని పురస్కరించుకొని ఆరు లక్షల మంది భక్తులు సోమ, మంగళవారాల్లో దర్శించుకున్నారు. సంక్రాంతి సందర్భంగా మంగళవారం బండ్లు తిరిగాయి.



భక్తులతో కిటకిటలాడుతున్న ఐనవోలు దేవస్థాన ప్రాంగణం. భక్తుల పూనకాలు (ఇన్‌సెట్‌లో)

2018లో వాతావరణం.. అసాధారణం!

» పెరిగిన ఎండలు, పిడుగులు, ఉరుములు, వరదలు

» గతేడాది 0.41 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదు

» భవిష్యత్తులో ఏటా ఏదో రూపంలో విపత్తులు

విశాఖపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో అసాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో వడగాడ్పులు, చలిగాలులు, ఈదురుగాలులు వరదలు, పిడుగులు, మెరుపులు, ఇసుక తుఫాన్లు, కరువు వంటి విపత్తులు సంభవిస్తున్నాయి. అంతర్జాతీయంగా గ్లోబల్ వార్మింగ్ ప్రభావం 2018లో స్పష్టంగా కనిపించింది. దేశంలో 1981-2010 మధ్యలో నమోదైన సగటు ఉష్ణోగ్రతల కంటే గతేడాది 0.41 డిగ్రీలు ఎక్కువగా నమోదైంది. వందేళ్లకుపైగా వివరాలను పరిగణనలోకి తీసుకుని 2018లో నెలకొన్న అసాధారణ పరిస్థితులపై భారత వాతావరణ శాఖ బుధవారం ప్రత్యేక బులెటిన్ విడుదల చేసింది. కాగా, ప్రపంచ వ్యాప్తంగా గ్లోబల్ వార్మింగ్ ప్రభావం పెరుగుతోందని, దీని ప్రభావంతో ఏటా ఎండలు పెరగడమే తప్ప తగ్గే అవకాశం లేని వాతావరణం నెలకొందని వాతావరణ నిపుణుడు ఆచార్య భానుకుమార్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏటా ఏదో ఒక రూపంలో విపత్తులు సంభవించడం ఖాయమని స్పష్టం చేశారు.



1901నుంచి ఇప్పటివరకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ఆరు సంవత్సరాల్లో 2018 కూడా ఒకటి. 2004-18వరకు మొత్తం 11 వేడి సంవత్సరాలుగా నమోదయ్యాయి.

- ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఎక్కువగా ఎండ తీవ్రత ఉన్న 5సంవత్సరాల జాబితాతో పాటు, మార్చి-మే వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదైన 7వేడి సంవత్సరాల జాబితాలోనూ 2018 చోటు దక్కించుకుంది. గతేడాది దేశంలో 85శాతం వర్షపాతం కురవగా, నైరుతి సీజన్‌లో 90.5శాతం నమోదైంది. అయితే ఇదే సమయానికి దక్షిణ, వాయవ్య భారతంలో 98శాతం, మధ్యభారతంలో 93శాతం వర్షపాతం నమోదవగా, తూర్పు, ఈశాన్య భారతంలో కేవలం 76శాతమే నమోదైంది.
- దక్షిణాదిలో కీలకమైన ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కేవలం 56శాతం వర్షపాతం కురవడంతో తీవ్ర దుర్భిక్షం నెలకొంది. 1901నుంచి ఇప్పటివరకు ఈశాన్య సీజన్‌లో అతితక్కువ వర్షపాతం నమోదైన ఆరు సంవత్సరాల్లో 2018 ఒకటి. వరదలు, భారీవర్షాలకు దేశంలో 800మంది మరణించగా, పిడుగుల ప్రభావానికి యూపీలో 166మంది మరణించారు.

కుష్ఠుపై పోరాడిన ససకావాకు

గాంధీ శాంతి బహుమతి



న్యూఢిల్లీ, జనవరి 16: గాంధీ శాంతి బహుమతి విజేతలను కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. 2015-18 వరకు మొత్తం నాలుగు సంవత్సరాలకు విజేతలను ప్రకటించారు. 2018 సంవత్సరానికి యోహీ ససకావా గెలుచుకున్నారు. ఈయన ప్రపంచ ఆరోగ్య సంస్థ తరఫున ప్రపంచవ్యాప్తంగా కుష్ఠు నివారణకు కృషి చేస్తున్నారు. గాంధీ బోధించిన అహింసా మార్గంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పును తీసుకురావడంలో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డును అందజేస్తారు. 2015 సంవత్సరానికి వివేకానంద కేంద్ర ఈ అవార్డును గెలుచుకుంది. 2016కు గాను అక్షయ పాత్ర ఫౌండేషన్, సులభ్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఈ అవార్డును గెలుచుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి కృషి చేసినందుకు 2017 సంవత్సరానికి ఏకై అభియాన్ ట్రస్ట్ ఈ అవార్డును గెలుచుకుంది. ప్రధాని మోదీ నేతృత్వంలోని జ్యూరీ ఈ అవార్డులను ప్రకటించింది. ఈ జ్యూరీలో కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే, ఎల్‌కే అడ్వాణీ సభ్యులు. ఈ అవార్డును 1995 నుంచి అందజేస్తున్నారు. విజేతలకు ఈ అవార్డుతో పాటు కోటి రూపాయల నగదు బహుమతి అందజేస్తారు. కాగా గాంధీ శాంతి బహుమతి గెలుచుకున్న సంస్థలు, వ్యక్తులను ప్రధాని మోదీ అభినందించారు.

ఎన్‌హెచ్‌ఎంలో 8 మందిపై వేటు!

» పనితీరు సరిగా లేదన్న కారణంతో తొలగింపు

» మరో 7-8 మంది మెడపై వేలాడుతున్న కత్తి

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న 8 మంది ఉన్నతోద్యోగులపై వేటు పడింది. పనితీరు సరిగా లేదన్న కారణంతో వారిని తొలగించారు. వీరిలో ప్రభుత్వ వైద్యులతోపాటు కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నవారూ ఉన్నారు. ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్‌గా కొద్ది నెలల క్రితమే బాధ్యతలు చేపట్టిన యోగితా రాణా.. వచ్చీ రాగానే సిబ్బందిని తొలగించడం ఆ శాఖలో పెద్ద చర్చనీయాంశమైంది. అయితే వీరే కాకుండా మరో 7-8 మందిపై కూడా వేటు పడనున్నట్లు, అందుకు సంబంధించిన ఫైలు కూడా సిద్ధమయినట్లు ఎన్‌హెచ్‌ఎం వర్గాలు చెబుతున్నాయి. కాగా, తొలగింపునకు గురైన వారిలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణ, డాక్టర్ కిరణ్మయి, క్వాలిటీ అష్యూరెన్స్ నిరంజన్, ఎన్ఆర్‌హెచ్‌ఎం ఐటీ విభాగంలో పనిచేసే రవికాంత్, రంజిత్‌తోపాటు ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీకృష్ణ ఉన్నారు. వీరే కాకుండా మరో ఇద్దరు కూడా ఉన్నట్టు సిబ్బంది చెబుతున్నారు.

స్వచ్ఛందంగా తప్పుకొన్న కేసీఆర్ కిట్ సీఈవో

వాకాటి కరుణ హయాంలో కేసీఆర్ కిట్ అమలు, పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా సీఈవోను నియమించారు. సత్యనారాయణరెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించారు. ఆయన వాకాటి కరుణ ఉన్నంతవరకు సీఈవోగా పని చేశారు. ఆమెను ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించగానే.. సత్యనారాయణరెడ్డి కూడా వైదొలగారు. ఆయన బాటలోనే ఎన్‌హెచ్‌ఎంలోని మరికొందరు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న మరికొంత మంది సిబ్బందికి జీతాలు కూడా నిలిపివేసినట్లు తెలిసింది. పనితీరు సరిగాలేని వారిపై ఇప్పటికే వేటు పడగా.. అదే కారణంతో మరికొందరికి జీతాలు నిలిపివేశారు. వారిలో కొందరిని తీసివేసే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. ఆరోగ్య పథకాలు విజయవంతం కావాలంటే కిందిస్థాయి సిబ్బందే కీలకమవుతారు. అయితే ప్రస్తుతం తొలగించిన సిబ్బంది గతంలో కేసీఆర్ కిట్, తెలంగాణ డయాగ్నస్టిక్స్, ఏఎన్‌ఎంలకు రెక్కల బండి, మొబైల్ అంబులెన్స్ అందజేత వంటి పథకాలు విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు.



తొలగింపు వాస్తవమే

పనితీరు సరిగా లేని కారణంగా ఎన్‌హెచ్‌ఎంలో కొందరిని తొలగించింది వాస్తవమే. ఇది నిరంతర ప్రక్రియ. ఇలాంటి మరికొందరిని కూడా తొలగిస్తామా? అంటే ఇప్పుడే చెప్పలేం. *- యోగితా రాణా, ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్*

మోదీకే తెలంగాణ ప్రజల మద్దతు

›› కుటుంబ రాజకీయాల కోసమే ఫ్రంట్‌లు: లక్ష్మణ్



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓటు వేసి నరేంద్రమోదీని మళ్లీ ప్రధానిగా ఎన్నుకునేందుకు ఆసక్తిగా ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. శాసనసభ ఎన్నికల్లో.. సీఎం కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీఆర్ఎస్‌ను గెలిపించారని, అయితే కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు దేశ భవిష్యత్తు కోసం తీసుకున్న సాహసోపేత నిర్ణయాలకు ఆకర్షితులై లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావుతో కలిసి లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఫ్రంట్‌ల పేరుతో హడావుడి చేస్తున్నారని, అవి వారి కుటుంబ రాజకీయం కోసం ఏర్పాటు చేసుకున్న ఫ్రంట్‌లని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలిస్తే ఢిల్లీలో చేసేదేమీ ఉండదన్నారు. కూటమిలో ప్రధాని అభ్యర్థి ఎవరో తెలియని పరిస్థితి ఉందన్నారు. రాహుల్‌గాంధీ కేవలం గాంధీ అనే ఇంటిపేరుతో ప్రజలతో సంబంధం లేకుండానే ప్రధాని కావాలని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈ నెలాఖరులో తెలంగాణ పర్యటనకు వస్తారని, లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పార్టీ బాధ్యులతో సమావేశమవుతారని తెలిపారు.

● మహిళలూ ఉద్యమించండి: విజయశాంతి



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మహిళలను మానసికంగా కుంగదీస్తున్న పురుషాధిక్య సమాజం రోజురోజుకూ పెరుగుతోందని టీపీసీసీ నేత, మాజీ ఎంపీ విజయశాంతి ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ షర్మిలపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారంపై ఆమె ఆవేదనను చూస్తుంటే మహిళల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతోందన్నారు. మహిళలను మానసికంగా కుంగదీస్తున్న వారిపై పోలీసులు, ప్రభుత్వం సత్వరమే స్పందించి చర్యలు తీసుకునేలా సోషల్ మీడియా వేదికగా ఉద్యమించాలని బుధవారం ఆమె మహిళలకు పిలుపునిచ్చారు.

● కొత్త జిల్లాల్లో కోర్టులకు భవనాలు: బీజేపీ

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లా కేంద్రాల్లో కోర్టులకు భవనాల నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని బీజేపీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో వినియోగదారుల ఫోరంలను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన బుధవారం నాడిక్కడ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. విభజనతో తెలంగాణ హైకోర్టుకు 10 వేలకు పైగా కేసులు ఎక్కువగా బదిలీ అయినందున సత్వర పరిష్కారానికి న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలంటూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. విపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై వేధింపులను నిలిపివేయకుంటే టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు.

● 28 నుంచి ఢిల్లీలో నిరాహార దీక్షలు : సీపీఎస్

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దు, పాత పింఛను విధానం పునరుద్ధరణ డిమాండ్లతో భారీ ఉద్యమాన్ని నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి గంగాపురం స్థితప్రజ్ఞ వెల్లడించారు. మొదటి దశలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఢిల్లీలో రోజూ 50 వేల మంది ఉద్యోగులతో నిరాహార దీక్షలు జరుపుతామని ఓ ప్రకటనలో తెలిపారు.

● సీఎంవో కార్యదర్శులకు 54 పోస్టుల మంజూరు

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో)లో పని చేసే కార్యదర్శులకు ప్రభుత్వం 54 పోస్టులను మంజూరు చేసింది. ఒక్కో కార్యదర్శికి 9 మందిని కేటాయించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో కార్యదర్శికి రెండు ప్రైవేటు సెక్రటరీ, ఒక అదనపు ప్రైవేటు సెక్రటరీ/పర్సనల్ అసిస్టెంట్, ఒక ఆఫీస్ సబార్డినేట్, ఒక డ్రైవర్ పోస్టులను కేటాయించారు. ఈ పోస్టులన్నీ డిసెంబరు13 నుంచే అమలులోకి వచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా... వీటిని డిప్యుటేషన్ లేదా ఓడీ(ఆదర్ డ్యూటీ)పై నియమించుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం వారు పని చేస్తున్న మాతృశాఖలోని వేతన స్కేళ్లే వర్తిస్తాయని స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి పదవిలో ఉన్నంత కాలం లేదా ప్రభుత్వం ఉపసంహరించుకునేంతవరకు ఈ పోస్టులు కొనసాగుతాయని తెలిపింది.

● సగం మంత్రి పదవులు మాకే: జాజుల

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చాక చేపట్టనున్న మంత్రివర్గంలో 50 శాతం పదవులను తమకే కేటాయించాలని సీఎం కేసీఆర్‌కు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. మంత్రివర్గంలో సామాజిక న్యాయం పాటించాలని, రాష్ట్ర జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాకు అనుగుణంగా సగం మంత్రులను బీసీ ఎమ్మెల్యేలతోనే పూరించాలని కోరారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ బుధవారం ముఖ్యమంత్రికి లేఖ రాశారు. భవిష్యత్తులో చేపట్టబోయే పార్లమెంటరీ కార్యదర్శులు, ప్రభుత్వ చీఫ్ విప్‌లు, విప్‌లు, శాసనసభ సభాపతి, ఉప సభాపతి పదవుల్లోనూ బీసీలకు సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

● క్యూనెట్ పాంజీ స్కీం కాదు: రస్సెల్

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): క్యూనెట్ పాంజీ స్కీం కాదని.. డైరెక్ట్ సెల్లింగ్ మల్టీ నేషనల్ కంపెనీ అని ఆ సంస్థ న్యాయ సలహాదారు రస్సెల్ స్టామెట్స్ అన్నారు. కొంతమంది స్వతంత్ర ప్రతినిధుల తప్పుడు వాగ్దానాలతో ఎక్కువ వ్యాపారం పొందాలని భావించడం వల్లే ఈ సమస్య వచ్చిందన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారం కల్పించినందుకు 2018లో 478 మంది స్వతంత్ర ప్రతినిధులను సంస్థ నుంచి తొలగించామన్నారు. ఈ సారి ఫిర్యాదు చేసిన మారుతీ ఫణీంద్ర శర్మ కూడా తిరిగి చెల్లింపులు తీసుకున్న తర్వాత మీడియా సమావేశంలో అబద్ధం చెప్పాడని ఆయన అన్నారు. ఈ విషయంలో లోతుగా విచారణ జరిపి అసలు నిందితులను శిక్షించాలని సైబరాబాద్ కమిషనర్‌ను కోరినట్లు ఆయన వెల్లడించారు.

20 మంది కలప స్మగ్లర్లపై 'పిడి'కిలి!

›› పోలీస్ శాఖకు అటవీ అధికారుల ప్రతిపాదన

హైదరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కరడుగట్టిన 20 మంది కలప స్మగ్లర్లపై పీడీ చట్టం ప్రయోగించాలని అటవీ శాఖ నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్త దాడుల్లో మూడు, అంతకన్నా ఎక్కువ కేసులు నమోదైన నిందితుల జాబితాను రూపొందించిన అటవీ శాఖ.. అందులోని 20 మందిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని పోలీస్ శాఖకు ప్రతిపాదనలు పంపామని అటవీ సంరక్షణ ప్రధానాధికారి(పీసీసీఎఫ్) ప్రశాంత్‌కుమార్ ఝా చెప్పారు. కాగా, కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని, అవసరమైతే నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని సీఎం కేసీఆర్ ఇటీవల ఆదేశించిన నేపథ్యంలో అటవీ శాఖ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. జనవరి 10 నుంచి 15 వరకు ఆరు రోజుల్లో 1297 ప్రాంతాల్లో అటవీ అధికారులు దాడులు చేశారు. 254 కేసులు నమోదు చేసి.. 155 మందిని కటకటాల వెనక్కినెట్టారు. మొత్తం దాడుల్లో సుమారు రూ.35 లక్షల విలువైన 174 ఘనపుటడుగుల కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

● 6 లక్షల హెక్టార్లకు చేరిన రబీ సాగు!

హైదరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ సాగు విస్తీర్ణం 6.06 లక్షల హెక్టార్లకు చేరింది. సాధారణ సాగు విస్తీర్ణం 13.38 లక్షల హెక్టార్లు కాగా... ఇప్పటివరకు 45 శాతం విస్తీర్ణంలో పంటలు సాగైనట్లు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక సమర్పించింది. ఈ రబీలో 7.05 లక్షల హెక్టార్లలో వరిసాగు అవుతుందని అంచనా వేయగా... ఇప్పటివరకు 2.15 లక్షల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. 94 వేల హెక్టార్లలో మొక్క జొన్న పంట సాగైంది. గోధుమ 42 శాతం, జొన్న 45 శాతం, మొక్క జొన్న 57 శాతం, రాగులు 23 శాతం విస్తీర్ణంలో సాగయ్యాయి. రాష్ట్రంలో పప్పుధాన్యాల సాగు అంతంత మాత్రంగానే ఉంది. ఇక వేరుశనగ 1.04 లక్షల హెక్టార్లలో సాగైంది. నూనె గింజలను 1.11 లక్షల హెక్టార్లలో సాగుచేశారు. పొగాకు, మిర్చి, ఉల్లిగడ్డలు చాలా తక్కువ విస్తీర్ణంలో సాగయ్యాయి. ఏడు జిల్లాల్లో మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు(ఫాల్ ఆర్మీ వామ్) ప్రభావం ఉంది. 18 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.





ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేసిన ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌కు స్వీటు తినిపిస్తున్న సీఎం కేసీఆర్; విద్యుద్దీప కాంతుల్లో శాసనసభ భవనం

నేటి నుంచి అసెంబ్లీ

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రెండో శాసనసభ గురువారం కొలువుదీరుతోంది. గత నెల 11న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక 36 రోజుల తరువాత తొలి సమావేశాల ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు నాలుగు రోజులపాటు కొనసాగనున్నాయి. శాసనసభ తొలి సమావేశాలు కావడంతో ఈ విడత రాజ్యాంగపరమైన కార్యక్రమాలు ప్రధానంగా జరగనున్నాయి. ఇందులో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణం, స్పీకర్ ఎన్నిక, ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం, ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి ఆమోదం వంటి కార్యక్రమాలు ఉండనున్నాయి. గురువారం ఉదయం 11.30 గంటలకు రెండో శాసనసభ మొదటి భేటీ ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన ప్రారంభం కానుంది. అంతకంటే ముందు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించనున్నారు. సభ ప్రారంభమయ్యాక ముందుగా ముఖ్యమంత్రి, సభా నాయకుడి హోదా పొందే కేసీఆర్‌తో ఎమ్మెల్యేగా ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయిస్తారు. తదుపరి మిగిలిన సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తారు. అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక షెడ్యూల్‌ను కూడా గురువారమే ప్రకటిస్తారు. స్పీకర్ పదవిని ఎవరికి కేటాయిస్తారనే విషయాన్ని సీఎం కేసీఆర్ గురువారం ఉదయం వెల్లడించే అవకాశం ఉందని టీఆర్ఎస్ ముఖ్యులు చెబుతున్నారు. శుక్రవారం స్పీకర్ ఎన్నిక, ప్రకటన ఉంటాయి. తదుపరి నూతనంగా ఎన్నికైన స్పీకర్ ఆధ్వర్యంలో సభా కార్యక్రమాలు కొనసాగుతాయి. శుక్రవారమే అసెంబ్లీ, మండలి బీఏసీ సమావేశాలు జరగనున్నాయి. సభా కార్యకలాపాలపై ఇందులో నిర్ణయం తీసుకోనున్నారు. శనివారం ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగించనున్నారు. అంతకు ముందు గవర్నర్ ప్రసంగానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఇక ఆదివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాలను ఉభయ సభల్లో విడివిడిగా ప్రవేశపెట్టి, ఆమోదం తెలిపే కార్యక్రమం ఉంటుంది.

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ ప్రమాణం

మజ్లిస్ సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ప్రొటెం స్పీకర్‌గా నియమితులయ్యారు. బుధవారం సాయంత్రం రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఆయనతో గవర్నర్ నరసింహన్ ప్రమాణం చేయించారు. అంతకుముందు రాజ్యాంగంలోని ఆర్టికల్ -178 ప్రకారం ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను నియమిస్తున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నరసింహాచార్యులు ప్రకటించారు. ముంతాజ్ అహ్మద్‌ఖాన్ ఉర్దూలో ప్రమాణం చేశారు. అనంతరం ఆయనకు గవర్నర్ అభినందనలు తెలపగా.. సీఎం కేసీఆర్ ఆత్మీయ ఆలింగనం చేసుకొని.. పుష్పగుచ్ఛం అందించారు. స్వీటు తినిపించారు. ఆ తర్వాత స్పీకర్ మధుసూదనాచారి కూడా పుష్పగుచ్ఛం అందించారు. దాంతో 34 ఏళ్ల తర్వాత మజ్లిస్‌కు ఎమ్మెల్యేకు ప్రొటెం స్పీకర్‌గా అవకాశం లభించినట్లయింది. 34 ఏళ్ల క్రితం ఆ పార్టీ అధినేత సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేయగా.. ఆ తర్వాత ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కే ఈ అవకాశం దక్కింది. ఈ కార్యక్రమానికి మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ దూరంగా ఉన్నారు. శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, బి.వినోద్‌కుమార్, సంతోష్‌కుమార్, మండలి విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారెడ్డి, సాధారణ పరిపాలన శాఖ అధర్ సిన్హా, డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం కేసీఆర్ రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. దాదాపు గంటన్నరపాటు వీరి భేటీ కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణ, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకం, శాసనసభ సమావేశాలపై చర్చించినట్లు తెలిసింది.

మాజీ స్పీకర్ అయిన మధుసూదనాచారి

తెలంగాణ తొలి అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి మాజీ స్పీకర్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు డిసెంబరు 11వ తేదీన వెలువడటంతో.. మంత్రులంతా ఆ రోజే మాజీల జాబితాలో చేరారు. మధుసూదనచారి మాత్రం 36 రోజుల తర్వాత ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారంతో మాజీ స్పీకర్‌గా మారిపోయారు.

సభ ముందుకు రెండు బిల్లులు!

అసెంబ్లీ తొలి సమావేశాల్లో రెండు బిల్లులు సభ ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పంచాయతీ రాజ్ చట్టంలో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఇటీవల ఆర్డినెన్స్‌ను జారీ చేశారు. దాని స్థానే ఈ బిల్లును తప్పనిసరిగా ప్రవేశపెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు 'రుణ విముక్తి' చట్టం కూడా సభ ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. 'తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ డెట్ రిలీఫ్' ఆర్డినెన్స్ కాలపరిమితి ముగియడంతో దీనిని పొడిగించాల్సిన అవసరం ఏర్పడింది. చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయకూలీలకు సంబంధించిన ఈ బిల్లును కూడా ప్రవేశపెట్టే అవకాశముంది. కాగా శాసనసభ సమావేశాలు 20వ తేదీ వరకే జరుగుతాయా? లేక ఒకటి, రెండు రోజులు పొడగిస్తారా? అనేది బీఏసీ భేటీలో తేలనుంది. ఇక ఫిబ్రవరి 10 నుంచి ప్రత్యేకంగా బడ్జెట్ సమావేశాలు నిర్వహించే అవకాశాలున్నాయి. శాసనసభ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీ పరిసరాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. అసెంబ్లీ భద్రతా సిబ్బందితో పాటు సెంట్రల్‌జోన్ పోలీసుల ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టనున్నారు. నాలుగు కిలోమీటర్ల పరిధిలో ర్యాలీలు, సభలు, సమావేశాలు, జనం గుమికూడటం వంటి చర్యలను నిషేధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు.

సీఎల్పీ నేత ఎంపిక నేడే!

›› టీపీసీసీ కోర్ కమిటీ సమావేశం

›› నేతల అభిప్రాయాలు సేకరించిన ఏఐసీసీ పరిశీలకుడు వేణుగోపాల్



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన 19 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో ఎవరు నాయకత్వం వహిస్తారో గురువారం తేలనుంది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో కాంగ్రెస్ శాసన సభాపక్షం (సీఎల్పీ) ఉదయం 9 గంటలకు సమావేశం కానుంది. ఈ ప్రక్రియకు అధిష్ఠానం తరఫున పరిశీలకుడిగా నియమితుడైన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. సీఎల్పీ భేటీ, సీఎల్పీ నేత ఎంపిక ప్రక్రియపై ఓ హోటల్‌లో టీపీసీసీ కోర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ ముఖ్యనేతల అభిప్రాయాలు తీసుకున్నారు. వాటిని ఆయన ఏఐసీసీకి నివేదిస్తారు. వాటి ఆధారంగా సీఎల్పీ నేతను అధిష్ఠానం నిర్ణయిస్తుంది. ఈ ప్రక్రియ మొత్తం గురువారమే పూర్తవుతుందని, సాయంత్రానికల్లా సీఎల్పీ నేతను ప్రకటిస్తారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాగా, సీఎల్పీ నేతగా భట్టివిక్రమార్క పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఉత్తమ్, డి.శ్రీధర్‌బాబు కూడా రేసులో ఉన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేరునూ పార్టీలోని కొన్ని వర్గాలు ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది.

టీడీపీకి శాసనసభా పక్షం లేనట్టే!

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ శాసనససభాపక్షంగా గుర్తింపు పొందే అవకాశాన్ని కోల్పోయింది. నిబంధనల ప్రకారం ఏ పార్టీ అయినా శాసనసభాపక్షంగా గుర్తింపు పొందాలంటే సభలో కనీసం ఐదుగురు ఎమ్మెల్యేలు ఉండాలి. కానీ, ఇటీవలి ఎన్నికల్లో టీడీపీ తరఫున ఇద్దరు ఎమ్మెల్యేలు (సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వర్‌రావు) మాత్రమే గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ఆ పార్టీ తరఫున శాసనసభాపక్ష నేతగా గుర్తింపు పొందే అవకాశం ఎవరికీ లేకుండా పోయింది. కాగా ఇద్దరు టీడీపీ సభ్యులు శాసనసభ సమావేశాలకు హాజరయ్యే ముందు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు సీనియర్ నేతలతో కలిసి ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వెళ్లి ఎన్టీఆర్‌కు నివాళులర్పించనున్నారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా శాసనసభకు వెళ్లనున్నారు.

నేటి అసెంబ్లీకి రాజాసింగ్ దూరం

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శాసనసభ తొలి సమావేశాల సందర్భంగా ప్రారంభం రోజున బీజేపీ నుంచి ప్రాతినిధ్యం ఉండటం లేదు. ఆ పార్టీ తరఫున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్ తొలి రోజు సమావేశాలకు దూరంగా ఉండనున్నారు. మజ్లిస్ నేత ప్రొటెం స్పీకర్‌గా ఉంటే ప్రమాణం చేయబోనని రాజాసింగ్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో స్పీకర్ ఎన్నిక తర్వాతే ఆయన సభకు హాజరవుతారని బీజేపీ వర్గాలు తెలిపాయి.

ముగ్గురు రెబల్ ఎమ్మెల్సీలపై అనర్హత వేటు

(మూడో పేజీ తరువాయి)

రాములు నాయక్, యాదవరెడ్డి, భూపతిరెడ్డిల సభ్యత్వాలు రద్దయినట్లయింది. దాంతో మండలిలో ఖాళీల సంఖ్య ఏడుకు చేరుకుంది. శాసనసభ ఎన్నికల ముందు టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కొండా మురళి, భూపతిరెడ్డి, యాదవరెడ్డి, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ రాములు నాయక్... కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల అనంతరం.. ఈ నలుగురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ టీఆర్ఎస్ విప్‌లు పల్లా రాజేశ్వర్ రెడ్డి, బోడకుంటి జనార్ధన్‌లు మండలి చైర్మన్‌కు పిటిషన్ దాఖలు చేశారు. టీఆర్ఎస్ సభ్యులై ఉండి కాంగ్రెస్ తరఫున ఎన్నికల్లో ప్రచారం చేసినందున పార్టీ ఫిరాయింపుల చట్టం కింద వీరిపై అనర్హత వేటు వేయాలని పిటిషన్లో కోరారు. ఆ పిటిషన్లను స్వీకరించిన చైర్మన్ స్వామిగౌడ్.. వివరణ కోరుతూ నలుగురు ఎమ్మెల్సీలకూ నోటీసులు జారీ చేశారు. వరంగల్ స్థానిక సంస్థల కోటా కింద ఎన్నికైన కొండా మురళి.. తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. దాన్ని వెంటనే స్వామిగౌడ్ ఆమోదించారు. యాదవరెడ్డి, భూపతిరెడ్డి, రాములు నాయక్‌లు తమ అడ్వకేట్ల ద్వారా నోటీసులపై వివరణ, వాదనలు వినిపించారు. తాను గవర్నర్ కోటాలో నామినేట్ అయినందున జారీ అయిన నోటీసులు చెల్లవంటూ రాములు నాయక్ తన వాదన వినిపించగా.. కాంగ్రెస్ శాసనసభా పక్షం టీఆర్ఎస్‌లో విలీనం అయినట్లుగా ప్రకటించిన నేపథ్యంలో ఫిరాయింపు ప్రశ్నే ఉత్పన్నం కాదంటూ యాదవరెడ్డి, భూపతిరెడ్డిలు తమ అడ్వకేట్ల ద్వారా వాదనలు వినిపించారు. అడ్వకేట్ల వాదనలు విన్న స్వామిగౌడ్ వేటు నిర్ణయం తీసుకున్నారు.

కాంగ్రెస్ సభాపక్షం విలీనం

నలుగురు ఎమ్మెల్సీలపై టీఆర్ఎస్ ఫిర్యాదు చేయడంతో వెంటనే అప్రమత్తమైన కాంగ్రెస్.. తమ పార్టీ నుంచి ఎన్నికై టీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్, కూసుకుంట్ల దామోదర్‌రెడ్డిల పైనా అనర్హత వేటు వేయాలంటూ పిటిషన్ దాఖలు చేసింది. నాలుగు రోజులు గడవకముందే పార్టీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, కూసుకుంట్ల దామోదర్‌రెడ్డి, ఎంఎస్ ప్రభాకర్, సంతోష్ కుమార్‌లు మండలిలో కాంగ్రెస్ శాసన సభాపక్షాన్ని టీఆర్ఎస్‌లో విలీనం చేస్తున్నట్లుగా చైర్మన్ స్వామిగౌడ్‌కు లేఖ ఇచ్చారు. దాన్ని పరిశీలించిన ఆయన విలీనాన్ని గుర్తిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కాగా ఉమ్మడి రాష్ట్రంలో 2006లో శాసనమండలి పునరుద్ధరణ జరిగిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయడం చోటు చేసుకోలేదు. తొలిసారిగా బుధవారం ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు పడింది.

ఏడుకు చేరిన ఖాళీలు

అనర్హత వేటుతో సభలో ఖాళీల సంఖ్య ఏడుకు చేరుకుంది. మండలి మొత్తం సభ్యుల సంఖ్య నలభై. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, టీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పట్నం నరేందర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావులు తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. ఫిరాయింపు నోటీసులు అందుకున్న కొండా మురళి తమ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తాజాగా ముగ్గురిపై అనర్హత వేటు పడింది. మండలిలో కాంగ్రెస్ సభాపక్షం టీఆర్ఎస్‌లో విలీనం కావడంతో ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ఇద్దరు ఎమ్మెల్సీలు షబ్బీర్‌అలీ, పొంగులేటి సుధాకర్ రెడ్డిలు మాత్రమే కాంగ్రెస్‌కు మిగిలారు. వీరి పదవీ కాలమూ ఏప్రిల్ నెలతో ముగియనుంది. ఆ తర్వాత మండలిలో కాంగ్రెస్ ప్రాతినిధ్యం లేకుండా పోనుంది.



విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు భూపతిరెడ్డి, యాదవ్‌రెడ్డి, రాములు నాయక్

ప్రజాస్వామ్యానికి చీకటి రోజు!

›› అనర్హత నిర్ణయం ఏకపక్షం

›› స్థానిక కోటాకు పార్టీ వర్తించదు: భూపతిరెడ్డి

›› గవర్నర్ కోటా ఫిరాయింపు కాదు: రాములు

›› చైర్మన్ల విశిష్ట అధికారాలను తొలగించాలి: యాదవరెడ్డి

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యున్నత చట్టసభలైన శాసనసభ, శాసనమండలిలోనే సమన్యాయం అమలు కావటం లేదని అనర్హత వేటుకు గురైన తాజా మాజీ ఎమ్మెల్సీలు భూపతిరెడ్డి, రాములు నాయక్, యాదవరెడ్డి మండిపడ్డారు. అధికార టీఆర్ఎస్‌లో చేరి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా వర్తించని ఫిరాయింపుల చట్టం విపక్షంలో చేరితే వెంటనే వర్తిస్తుందా? అని మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను, అధికార టీఆర్ఎస్‌ను నిలదీశారు. శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ బుధవారం వారిని అనర్హులుగా ప్రకటించిన తర్వాత ముగ్గురూ వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. ఫిరాయింపు నోటీసులు ఇచ్చి రోజుల వ్యవధిలోనే చట్ట వ్యతిరేకంగా అనర్హులుగా ప్రకటించారని వాపోయారు. కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, ఆకుల లలిత, సంతోష్ కుమార్, ఎం.ఎస్. ప్రభాకర్‌రావుల విషయంలో ఫిరాయింపుల చట్టాన్ని ఎందుకు అమలు చేయటం లేదని నిలదీశారు. మండలిలోని కాంగ్రెస్ శాసనసభాపక్షం టీఆర్ఎస్‌లో విలీనమయిందని ప్రకటించాక కాంగ్రెస్‌లోకి ఫిరాయింపు అన్న ఆరోపణలపై ఏ చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నారని నిలదీశారు. రాష్ట్ర ప్రజాస్వామ్య చరిత్రలో బుధవారం చీకటి రోజుగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని టీఆర్ఎస్ బాహాటంగా ఖూనీ చేసిందని విమర్శించారు. 'మాపై శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు జాలి ఉన్నా... పాపం ఆయన చేతిలో ఏం లేదు.. కేసీఆర్ డైరెక్షన్ మేరకే నిర్ణయం వెలువడిందని ఆరోపించారు. శాసన మండలి చైర్మన్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై కోర్టులను ఆశ్రయిస్తామని ప్రకటించారు. తాను స్థానిక సంస్థల కోటా కింద ఏ పార్టీ గుర్తు లేకుండా ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాయనని, తనకు ఫిరాయింపు చట్టం వర్తించదని భూపతిరెడ్డి స్పష్టం చేశారు. తనకు ఇచ్చిన నోటీసులోనే అనేక లొసుగులు ఉన్నాయని, ఓ దగ్గర టీఆర్ఎస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరానని, మరో దగ్గర గవర్నర్ కోటా కింద నామినేట్ అయ్యానని, మరో దగ్గర కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించానని రాశారని విమర్శించారు. టీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన 26 మంది ఎమ్మెల్యేలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన తలసానిని ఏకంగా మంత్రిని చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాములు నాయక్ మాట్లాడుతూ.. 'శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ ఉద్యమ నేతగా సిగ్గుపడుతున్నా. ఉద్యమకారుడికి ఇలాంటి బహుమానం ఇచ్చినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు' అన్నారు. తాను గవర్నర్ కోటా కింద నామినేట్ అయ్యానని, ఏ పార్టీకి చెందిన ఎమ్మెల్సీని కాదని స్పష్టం చేశారు. ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ లాంటి టీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రజలు 88 సీట్లలో గెలిపించినా కేసీఆర్‌కు సంతోషం లేదని, ప్రజా సమస్యల పరిష్కారాన్ని గాలి కొదిలేసి సెంచరీ కోసం(100 మంది ఎమ్మెల్యేలు) ప్రయత్నిస్తున్నాడని ధ్వజమెత్తారు. స్వామిగౌడ్ నిర్ణయం చట్టాన్ని, ప్రజాస్వామ్యాన్ని వెక్కిరించినట్లు, అవహేళన చేసినట్లుగా ఉందని యాదవరెడ్డి అన్నారు. స్పీకర్, శాసన మండలి చైర్మన్‌కు కల్పించిన విశిష్ట అధికారులను తొలగించాలని డిమాండ్ చేశారు. అనర్హత నిర్ణయాన్ని కమిటీకి అప్పగించాలని సూచించారు. వేటు ప్రకటన అనంతరం ముగ్గురు నేతలు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సమావేశమయ్యారు. న్యాయ నిపుణులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని, తమ భవిష్యత్‌ను ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు.

స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుందాం

సహకరించాలని ప్రతిపక్షాలను కోరిన సీఎం కేసీఆర్.. ఆయా పార్టీల అధ్యక్షులకు ముఖ్యమంత్రి ఫోన్

ప్రతిపాదనకు అసదుద్దీన్, లక్ష్మణ్ అంగీకారం

నేడు కాంగ్రెస్ నిర్ణయం చెబుతామన్న ఉత్తమ్

స్పీకర్ పదవి ఎవరిని వరిస్తుందో తేలేది నేడే

ప్రచారంలో పోచారం, పద్మ సహా పలువురి పేర్లు

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుందామని, అందుకు సహకరించాలని ప్రతిపక్ష పార్టీలకు సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌లను బుధవారం ఫోన్ ద్వారా కేసీఆర్ సంప్రదించారు. కేసీఆర్ ప్రతిపాదనకు లక్ష్మణ్, ఒవైసీ తమ అంగీకారం తెలిపారని, ఉత్తమ్ మాత్రం తమ పార్టీలో చర్చించి గురువారం ఉదయం నిర్ణయం చెబుతామని బదులిచ్చినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇదిలా ఉండగా.. స్పీకర్ ఎన్నికకు సమయం దగ్గర పడుతుండటంతో ఆ పదవి వరించేది ఎవరినో తెలియక అధికార టీఆర్ఎస్ వర్గాలు ఉత్కంఠ ఎదుర్కొంటున్నాయి. సభలో టీఆర్ఎస్‌కు తిరుగులేని మెజారిటీ ఉన్న నేపథ్యంలో స్పీకర్ పదవి ఎలాగూ ఆ పార్టీకే దక్కనుంది. అయితే ఎన్నిక షెడ్యూల్ విడుదలయ్యే గురువారమే అభ్యర్థిని ప్రకటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించడంతో చివరివరకు ఈ ఉత్కంఠ కొనసాగనుంది. మరోవైపు స్పీకర్ పదవిపై రాజకీయ వర్గాల్లో పలువురి పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఇటీవల మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పలువురు ఎమ్మెల్యేలతో కలిసి సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లినప్పుడు, "ఎన్నికల్లో స్పీకర్ ఓడిపోయిండు. పరిస్థితి ఆగమాగం ఉంది. అంతా సెట్ చేయాలి" అని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఈ విషయం బయటికి పొక్కడంతో స్పీకర్ పదవిని పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. తెలంగాణ తొలి అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించిన మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి పేరు ఈసారి స్పీకర్ పదవి కోసం ఎక్కువగా వినిపిస్తోంది. డిప్యూటీ స్పీకర్‌గా అనుభవం, అసెంబ్లీ ప్రొసీడింగ్స్‌పై అవగాహన, మహిళ కావడం, రెడ్డి సామాజికవర్గం, న్యాయశాస్త్ర పట్టభద్రురాలు కావడం ఆమెకు అనుకూల అంశాలుగా చెబుతున్నారు. ఆమెతోపాటు మాజీ మంత్రులు ఈటల రాజేందర్, రెడ్యానాయక్, ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, ఎస్.నిరంజన్‌రెడ్డి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. స్పీకర్ పదవి కోసం ప్రచారంలో ఉన్న పేర్లలో ఎవరికీ అందుకు సిద్ధంగా ఉండాల్సిందిగా.. సీఎం కేసీఆర్ నుంచి గానీ, టీఆర్ఎస్ అధిష్ఠాన శిబిరం నుంచి గానీ ఫోన్ రాలేదని తెలుస్తోంది. దీంతో తమను స్పీకర్‌ను చేస్తే మంత్రి పదవి ఎక్కడ దూరమవుతుందోనని కేబినెట్ విస్తరణపై ఆశలు పెట్టుకున్నవారు ఆందోళన చెందుతున్నారు.



భారత్‌కు తొలి ఏసీహెచ్‌145 హెలీకాప్టర్

న్యూఢిల్లీ: ఎయిర్‌బస్‌కు చెందిన ఫుల్లీ కస్టమైజ్డ్ కార్పొరేట్ హెలీకాప్టర్ మోడల్ 'ఏసీహెచ్‌145' భారత్‌కు విచ్చేసింది. సీరమ్ ఇనిస్టిట్యూట్ సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అదర్ పూనావాలా ఈ హెలీకాప్టర్‌ను కొనుగోలు చేశారు. భారత కస్టమర్‌కు డెలివరీ అందించిన తొలి ఏసీహెచ్ 145 హెలీకాప్టర్ ఇదేనని ఎయిర్‌బస్ వెల్లడించింది. నెలాఖరుకల్లా గాల్లోకి ఎగిరేందుకు ఈ హెలీకాప్టర్ సిద్ధం కానుందని తాజాగా విడుదల చేసిన స్టేట్‌మెంట్‌లో పేర్కొంది.

ఇక వేగంగా ఐటీ రిఫండ్‌లు!



రూ.4,242 కోట్లతో కొత్త ఫైలింగ్ వ్యవస్థ

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్) ప్రాసెసింగ్ సమయాన్ని ఒక్క రోజుకు తగ్గించ డానికేకాకుండా వేగవంతంగా రిఫండ్స్‌ను అందించేందుకు దోహదపడే తదుపరి తరం ఐటీ ఫైలింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఎన్నికైంది. ఇంటిగ్రేటెడ్ ఈ-ఫైలింగ్ అండ్ సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్ 2.0 ప్రాజెక్టుకు అవసరమైన రూ.4,241.97 కోట్లను కేంద్ర కేబినెట్ మంజూరు చేసింది. ప్రస్తుతం ఐటీఆర్ ప్రాసెసింగ్‌కు 63 రోజులు పడుతోందని, ఈ కొత్త ప్రాజెక్టు అమలు తర్వాత ప్రాసెసింగ్ సమయం ఒక్క రోజుకు చేరుతుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. 18 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం ఉందని, మూడు నెలల పరీక్ష తర్వాత లాంఛనంగా ప్రార ంభిస్తామని ఆయన చెప్పారు. బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఇన్ఫోసిస్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వ్యవస్థ కూడా విజయవంతమైనదేనని అయితే కొత్త ప్రాజెక్టు మరింత మెరుగ్గా ఉంటుందని చెప్పారు. కొత్త విధానం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం కూడా పెరుగుతుందన్నారు. రిఫండ్స్ ప్రక్రియ వేగవంతంగా జరిగి సంబంధిత రిఫండ్స్ పన్ను చెల్లింపుదారు బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతాయని ఆయన తెలిపారు.

రేసులో ఇంద్రా నూయి!



ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్‌గా ట్రంప్ సర్కార్ నామినేట్ చేసే అవకాశం

న్యూయార్క్: పెప్సీకో మాజీ సీఈఓ, భారత్‌కు చెందిన ఇంద్రానూయిని ట్రంప్ సర్కార్, ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్‌గా నామినేట్ చేసే అవకాశం ఉందని న్యూయార్క్ టైమ్స్ పత్రిక తెలిపింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ ఈ మేరకు నూయి పేరును నామినేట్ చేసినట్టు పేర్కొంది. పెప్సీకోకు 12 సంవత్సరాలపాటు సీఈఓగా పని చేసి ఆ సంస్థను కొత్త పుంతలు తొక్కించిన నూయి, ఈ పదవికి సరిగ్గా సరిపోతారని ఇవాంకా భావిస్తున్నారు. అయితే ఈ ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ప్రపంచ బ్యాంక్‌లో అత్యధిక ఓటింగ్ ఉన్న అమెరికా ఎవరికి మద్దతు పలికితే వారే ఆ సంస్థ ప్రెసిడెంట్ అవుతారు. నూయిని తాను మంచి 'మార్గదర్శకురాలు+స్ఫూర్తిదాత'గా పరిగణిస్తున్నట్టు ఇవాంకా ఇటీవల ట్వీట్ చేశారు. అయితే అధ్యక్షుడు ట్రంప్ ఇందుకు ఆమోదం తెలిపినా, నూయి ఆ పదవి చేపట్టేందుకు అంగీకరిస్తారా? లేదా అన్నది పెద్ద ప్రశ్న. నూయితో పాటు భారత సంతతికి చెందిన ఐక్యరాజ్య సమితిలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ పేరును కూడా అధ్యక్షుడు ట్రంప్ ఇందుకోసం పరిశీలిస్తున్నట్టు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. అయితే హేలీ కూడా ఈ పదవికి అంగీకరిస్తారా? లేదా? అన్నది సందేహమే. 2024 ఎన్నికల్లో అమెరికా అధ్యక్ష పదవికి పోటీపడాలని భావిస్తున్న హేలీ, కొద్దికాలం పాటు ప్రైవేట్ రంగంలో పని చేయాలనుందని ఇటీవల ప్రకటించారు.

స్కోడా నుంచి కొత్త 'సూపర్బ్'

ధర రూ.23.99 లక్షలు

న్యూఢిల్లీ: స్కోడా ఆటో ఇండియా తన ప్రీమియం సెడాన్ సూపర్బ్ మోడల్‌లో కార్పొరేట్ ఎడిషన్‌ను బుధవారం మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర రూ.23.99 లక్షలు (ఎక్స్-షోరూమ్). 1.8 లీటర్ పెట్రోల్ ఇంజన్ కలిగిన ఈ వేరియంట్‌లో ఎనిమిది ఎయిర్ బ్యాగులు, ఎఎఫ్ఎస్ (అడాప్టివ్ ఫ్రంట్ లైటింగ్ సిస్టమ్) ఫంక్షన్, 20.32 సెంటీమీటర్ ఫ్లోటింగ్ టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే, వాతావరణానికి అనుగుణంగా పని చేసే ఎయిర్ కండీషనింగ్, క్లీన్ ఎయిర్ ఫంక్షన్ తదితర ఫీచర్లు ఈ కారులో ఉన్నాయని కంపెనీ తెలిపింది.

రియల్టీపై జీఎస్‌టీ హేతుబద్ధం

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగానికి జీఎస్‌టీని హేతుబద్ధీకరించి కాంపోజిషన్ స్కీమ్ అమలుపరిచేందుకు గల అవకాశాలపై గుజరాత్ ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్ సారథ్యంలోని మంత్రుల బృందం పరిశీలిస్తోంది. రియల్ ఎస్టేట్ రంగానికి జీఎస్‌టీ అమలు వ్యవహారం పరిశీలించేందుకు జీఓఎంను ఏర్పాటు చేయాలని ఇటీవలి సమావేశంలో జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయించిన విషయం విదితమే. భూమి అభివృద్ధి హక్కుల బదిలీ, జాయింట్ అగ్రిమెంట్‌లో అభివృద్ధి హక్కులు వంటి భిన్న అంశాలను కూడా జీఓఎం పరిశీలిస్తుందంటున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, పంజాబ్, యుపి, గోవా రాష్ట్రాల మంత్రులు ఈ బృందంలో సభ్యులు.

కొత్త వీసా నిబంధన ఐటీ కంపెనీలకు దెబ్బ

ముంబై: హెచ్‌1బీ వీసాల జారీలో అడ్వాన్స్ డిగ్రీ హోల్డర్లకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా ఇటీవల విధానాల్లో చేసిన మార్పు ఐటీ కంపెనీల లాభదాయకతను ప్రభావితం చేస్తుందని, ఆ కంపెనీలకు ఇచ్చే వీసాల సంఖ్య తగ్గుతుందని ఇక్రా తెలిపింది. కొత్త నిబంధన వల్ల సాధారణ దరఖాస్తుదారులకు అందించే వీసాల సంఖ్య 10 శాతం తగ్గుతుందని పేర్కొంది. ఒకవేళ ఆ ప్రభావాన్ని పరిమితం చేసుకునేందుకు కంపెనీలు వేరే మార్గాలు అనుసరించినా వాటి నిర్వహణాపరమైన మార్జిన్లు 2018 నాటికి 22.1 శాతం నుంచి 2021నాటికి 20.8 శాతానికి తగ్గవచ్చునని అంచనా వేసింది.

స్టార్టప్‌లకు ఊరట!

ఏంజిల్ ఫండ్ పెట్టుబడులపై ఐటీ మినహాయింపు నిబంధనల సడలింపు



న్యూఢిల్లీ: స్టార్టప్‌లకు ఏంజిల్ ఫండ్ పెట్టుబడులపై పన్ను మినహాయింపు కోరే ప్రక్రియను ప్రభుత్వం సరళీకరించింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభు ఇప్పటికే ఆమోదించారని, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పాలసీ అండ్ ప్రమోషన్ (డీఐపీపీ) త్వరలోనే దీన్ని విడుదల చేయనున్నట్లు తెలిసింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 56(2) ప్రకారంగా ఏంజిల్ ఫండ్ల నుంచి సేకరించిన పెట్టుబడులపై పన్ను చెల్లించాలంటూ ఐటీ శాఖ నుంచి తమకు నోటీసులందాయని ఈమధ్య పలు స్టార్టప్‌ల వ్యవస్థాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం స్టార్టప్ రంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్న ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం తాజా చర్యలు చేపట్టింది. సాధారణంగా ప్రతియేటా 300-400 స్టార్టప్‌లు ఏంజిల్ ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడులు సేకరిస్తుంటాయి. నోటిఫికేషన్ ద్వారా సవరించనున్న ప్రక్రియ ప్రకారం.. డీఐపీపీ నుంచి గుర్తింపు పొందిన స్టార్టప్‌లకు కొన్ని షరతులకు లోబడి పన్ను మినహాయింపు కోరేందుకు అర్హత లభిస్తుంది. పన్ను మినహాయింపు కోరేందుకు స్టార్టప్‌లు డీఐపీపీకి దరఖాస్తు చేసుకోవాలి. గుర్తింపు పొందిన స్టార్టప్ దరఖాస్తును ఈ డిపార్ట్‌మెంట్ అవసరమైన డాక్యుమెంట్లతో ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ)కు పంపుతుంది. డీఐపీపీ నుంచి అప్లికేషన్ అందుకున్న 45 రోజుల్లోగా సీబీడీటీ పన్ను మినహాయింపునకు అనుమతివ్వడం లేదా నిరాకరించడం జరుగుతుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇంతక్రితం స్టార్టప్‌లు పన్ను మినహాయింపు కోసం అంతర మంత్రిత్వ శాఖ సర్టిఫికేషన్ బోర్డుకు దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. తాజా నోటిఫికేషన్ ద్వారా ఈ నిబంధనను తప్పించనున్నట్లు తెలిసింది. స్టార్టప్‌లు తమ షేర్ల మార్కెట్ విలువపై మర్చంట్ బ్యాంకర్ నుంచి పొందిన రిపోర్ట్‌ను సమర్పించాల్సిన బెడద కూడా తప్పనుందని సమాచారం.

భారత స్టార్టప్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడి

మైక్రోసాఫ్ట్‌కు చెందిన కార్పొరేట్ వెంచర్ ఫండ్ 'ఎం12' భారత స్టార్టప్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అమితాసక్తిగా ఉంది. భారత్‌లోని పలు స్టార్టప్‌లలో 20 లక్షల నుంచి కోటి డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు తెలిపింది.

అత్యంత డైనమిక్

నగరాల్లో హైదరాబాద్

అగ్రస్థానంలో బెంగళూరు.. టాప్ 5లో నాలుగు మనవే

ముంబై: ప్రపంచంలోని అత్యంత డైనమిక్ నగరాల జాబితాలో బెంగళూరుకు అగ్రస్థానం దక్కగా.. హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. ఢిల్లీ 4, పుణె 5వ స్థానంలో ఉన్నాయి. ఇక చెన్నైకి 7, కోల్‌కతాకు 15వ స్థానం లభించాయి. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టింగ్ సేవల సంస్థ జేఎల్ఎల్ రూపొందించిన ఈ అధ్యయన జాబితాలోని టాప్ 20 స్థానాల్లో 19 ఆసియా పసిఫిక్ నగరాలే దక్కించుకోవడం విశేషం. ఈ ప్రాంతంలో శరవేగ పట్టణీకరణ, పటిష్ఠమైన ఆర్థికాభివృద్ధికిదే నిదర్శనమని జేఎల్ఎల్ పేర్కొంది. గత ఏడాదిలో ఈ సంస్థ విడుదల చేసిన సిటీ మూమెంటమ్ లిస్ట్‌లో హైదరాబాద్ నం.1గా నిలవగా.. బెంగళూరు 2, పుణె 4, కోల్‌కతా 5, ఢిల్లీ 8వ స్థానాల్లో నిలిచాయి.

బడ్జెట్ గురించి తెలుసుకోండి..

ట్విటర్ సిరీస్ ప్రారంభించిన ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ: బడ్జెట్ అంటేనే బ్రహ్మపదార్థం. ఇందులో వినియోగించే పదాలు, వాటి ప్రాముఖ్యం, అర్థాలు ఆర్థికవేత్తలకు తప్ప సాధారణ జనానికి కొరుకుడు పడవు. అందుకే చాలా మంది బడ్జెట్‌లోని ప్రకటించే ఆదాయ పన్ను శ్లాబులు, పన్ను మినహాయింపులు, కేటాయింపులు వంటి కొన్నింటికి తప్ప మిగతా వాటికి అంతగా ప్రాధాన్యం ఇవ్వరు. ఈ నేపథ్యంలో ట్విటర్ ద్వారా బడ్జెట్‌పై నెటిజన్లలో అవగాహన పెంచేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ శ్రీకారం చుట్టింది.

తన ట్విటర్ ఖాతాలో 'నో యువర్ బడ్జెట్' పేరుతో సిరీస్‌ను మంగళవారం నాడు ప్రారంభించింది. దీని ద్వారా కేంద్ర బడ్జెట్ ప్రాముఖ్యం, బడ్జెట్‌లో వినియోగించే పడికట్టు గురించి వివరిస్తోంది. ప్రభుత్వం 2019-20 సంవత్సరానికి సంబంధించిన మధ్యంతర బడ్జెట్‌ను ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రకటించనుంది. సార్వత్రిక ఎన్నికలు కొన్ని నెలలే ఉండటం ఇందుకు కారణం. ఎన్నికల తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రకటిస్తుంది.

రాజకీయ ప్రకటనలపై

ఎఫ్‌బీ నిబంధనలు కఠినం

న్యూఢిల్లీ/పారిస్, జనవరి 16 : ఇంకొన్ని నెలల్లో భారత్‌లో సార్వత్రిక ఎన్నికలున్న దరిమిలా రాజకీయ ప్రకటనల జారీకి సంబంధించిన నిబంధనలను కఠినతరం చేసింది ఫేస్‌బుక్. ఆయా ప్రకటనల డిస్‌క్లయిమర్ విభాగంలో ప్రకటనకర్తలు ఎవరు, ఎక్కడివారు అనే వివరాలు పొందుపర్చడం ద్వారా పారదర్శకతకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించింది. సార్వత్రిక ఎన్నికలకు నెలముందే రాజకీయ ప్రకటనల వివరాలతో 'యాడ్ లైబ్రరీ' అందుబాటులోకి తెస్తామని స్పష్టం చేసింది. రాజకీయ ప్రకటనలన్నీ యాడ్ లైబ్రరీలో ఏడేళ్ల వరకూ అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఈమేరకు తమ బిజినెస్ పేజీలో ఫేస్‌బుక్ ఓ ప్రకటన విడుదల చేసింది. త్వరలో ఎన్నికలు జరుగనున్న నైజీరియా, ఉక్రెయిన్‌లతో పాటు అమెరికా, బ్రిటన్, బ్రెజిల్ దేశాల్లోనూ సాధ్యమైనంత త్వరగా ఈ నిబంధనల అమలుకు కసరత్తు చేస్తున్నట్లు వివరించింది. దీంతోపాటు స్థానిక భాషల్లో వార్తలు చదవాలనే జనాసక్తి పెరుగుతున్న దృష్ట్యా 'స్థానిక జర్నలిజం' వికాసానికి 300 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఫేస్‌బుక్ ప్రకటించింది.

కోడికత్తి కేసులో ఢిల్లీ ఎన్‌ఐఏ బృందం రాక

» నిందితుడు శ్రీనివాసరావుకు ప్రశ్నల వర్షం

హైదరాబాద్/విజయవాడ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై కోడికత్తితో దాడి చేసిన నిందితుడు శ్రీనివాసరావును ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌ఐఏ ప్రత్యేక బృందం బుధవారం ప్రశ్నించింది. ఐజీ అజిత్ మిట్టల్ ఇందుకోసం ప్రత్యేకంగా హైదరాబాద్ వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘంగా సాగిన విచారణలో అధికారులు కేసు దర్యాప్తునకు అవసరమైన పలు ప్రశ్నలకు అధికారులు సమాధానాలు రాబట్టారు. ఎయిర్‌పోర్టు రెస్టారెంట్‌లో ఉద్యోగం ఎలా వచ్చింది? ఎవరు సిఫారసు చేశారు? వాళ్లతో పరిచయం ఎలా ఏర్పడింది? వంటి ప్రశ్నలు వేసినట్లు సమాచారం. జైల్లో ఉన్న సమయంలో శ్రీనివాసరావు రాసిన లేఖకు సంబంధించి అడిగారు. న్యాయవాది సమక్షంలో విచారిస్తున్న దర్యాప్తు అధికారులు ప్రతి విషయాన్ని వీడియో రికార్డింగ్ చేస్తున్నారు. దాడికి ముందు శ్రీనివాస్ ఎవరెవరితో టచ్‌లో ఉన్నాడనేదానిపై ఇప్పటికే కాల్ డేటాను విశ్లేషించారు. దాడికి ముందు అతను మాట్లాడిన సుమారు 20 మంది వివరాల్ని రాబట్టారు. కాగా, స్వల్ప అనారోగ్యానికి గురైన శ్రీనివాసరావుకు గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అతన్ని తిరిగి ఎన్‌ఐఏ కార్యాలయానికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని, విచారణలో అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నారని నిందితుడి తరపు న్యాయవాది సలీం వెల్లడించారు. రిమాండ్‌లో ఉన్న సమయంలో శ్రీనివాసరావు రాసిన 24 పేజీల లేఖను జైలు అధికారులు బలవంతంగా తీసుకున్నారని, దాన్ని తమకు అప్పగించాలని.. లేదంటే కోర్టును ఆశ్రయిస్తామని న్యాయవాది తెలిపారు. ఇదిలా ఉండగా.. విశాఖపట్నం ఎయిర్‌పోర్టు క్యాంటీన్ యజమాని హర్షవర్ధన్‌నూ అధికారులు బుధవారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. మరికొందరికి సెక్షన్ 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేసి వారి వాంగ్మూలాలనూ నమోదు చేస్తున్నారు. మరో రెండు రోజులపాటు ఎన్‌ఐఏ విచారణ కొనసాగనుంది.

• 10 వెబ్‌సైట్లు గుర్తించాం!

» షర్మిల ఫిర్యాదుపై సీసీఎస్ డీసీపీ

హైదరాబాద్ సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వైఎస్ షర్మిల ఇచ్చిన ఫిర్యాదుపై చేపట్టిన దర్యాప్తులో యూట్యూబ్, ఫేస్‌బుక్‌తోపాటు మొత్తం 10 వెబ్‌సైట్లను గుర్తించినట్లు సైబర్ క్రైం అదనపు డీసీపీ రఘువీర్ తెలిపారు. ఈ కేసును వ్యక్తిగత, రాజకీయ కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, 2 వారాల్లో నిందితులను పట్టుకుని దర్యాప్తు పూర్తి చేస్తామన్నారు. పోస్టులు పెట్టిన వారితోపాటు వారిని ప్రోత్సహించిన వారిపైనా చర్యలు తీసుకుంటామన్నా రు. గతంలో ఫిర్యాదు వచ్చినప్పుడు ముగ్గురిని అరెస్టు చేశామని చెప్పారు. హీరో ప్రభాస్‌తో సంబంధం ఉందంటూ తనను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్‌కు షర్మిల ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

సుప్రీం ప్రకంపన

(మూడో పేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. కొలీజియం నిర్ణయాలపై సీనియర్ జడ్జి జస్టిస్ సంజయ్ కౌల్.. సీజేకు ఓ లేఖాస్త్రం సంధించారు. "జస్టిస్ నంద్రజోగ్ ఢిల్లీ జోన్‌లోనే అత్యంత సీనియారిటీ, నిజాయితీ గల న్యాయనిపుణుడు. ఆయనను కాదని ఆయన కంటే జూనియర్ అయిన జస్టిస్ సంజీవ్ ఖన్నాను ఎంపిక చేయడం ఇన్నాళ్లూ అనుసరిస్తున్న సంప్రదాయాలకు విరుద్ధం. జస్టిస్ ఖన్నా అంటే నాకేమీ వ్యతిరేకత లేదు. కానీ ఖన్నాను కొన్నాళ్లు ఆపవచ్చు. నంద్రజోగ్‌ను కాదంటే అది తప్పుడు సంకేతాలను పంపుతుంది. ఆయన సుప్రీంకు రావడానికి అన్నివిధాలా అర్హుడు" అని తన లేఖలో పేర్కొన్నట్లు సుప్రీం వర్గాలు తెలిపాయి.



"కొలీజియం నిర్ణయం విస్మయం, ఆందోళన కలిగిస్తోంది. ఎంతో మంది సీనియర్లను కాదని ఓ జూనియర్‌కు పదోన్నతి నివ్వడం సరికాదు. కొలీజియం ఏ నిర్ణయమైనా పారదర్శకంగా తీసుకోవాలి. ఎందుకది తీసుకున్నామో చెప్పగలగాలి. అది ఒక వ్యవస్థలా పనిచేయాలి. నిరుడు జనవరి 12న నలుగురు సీనియర్ న్యాయమూర్తులు, కొలీజియం సభ్యులు అప్పటి సీజే పనితీరుకు వ్యతిరేకంగా మీడియాకెక్కారు. వారిలో జస్టిస్ రంజన్ గొగోయ్ కూడా ఒకరు. వారు ఏ కారణాలపై ఆనాడు ప్రెస్‌కాన్ఫరెన్స్ పెట్టారో ఆ ప్రయోజనం నెరవేరలేదు. ఆనాడు కొలీజియం నిర్ణయాలపైనా వారు మాట్లాడారు. ఇపుడూ అదే సమస్య. సమస్య మరింత జటిలమైందే తప్ప పరిష్కారం కాలేదు" అని మాజీ సీజే జస్టిస్ ఆర్ఎం లోధా విమర్శించారు. ఇదే మాటను అప్పటి నలుగురు జడ్జీల్లో ఒకరైన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ కూడా అన్నారు. "అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితి మారలేదు. ఇలాంటివి జరుగుతున్నందుకే నేను 2016లో కొలీజియం సమావేశాలకు వెళ్లడానికి నిరాకరించేవాణ్ని. కొందరు న్యాయనిపుణులతో ఈ విషయం మాట్లాడినపుడు- 'పదవిలో ఉండగా ఏమీ మాట్లాడవద్దు.. ఏ మాట్లాడదల్చుకున్నా రాజీనామా చేశాకే.' అన్నారు. ఇపుడు పదవిలో లేను కాబట్టి.. మాటాడుతున్నా.." అనిజస్టిస్ చలమేశ్వర్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీ షా కూడా కొలీజియం నిర్ణయం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. '2014లో జాతీయ జుడీషియల్ కమిషన్ ఏర్పాటు కేసును కొట్టేసి- సంస్కరణలు కోరిన జడ్జీలే నేడు తద్భిన్నంగా వ్యవహరిస్తున్నారు. కొలీజియం అంటే ఓ వ్యవస్థ. కానీ ఇదిప్పుడు పారదర్శకత లేని, జవాబుదారీతనం లేని, ఓ రహస్య వేదికగా మారింది" అని షా తీవ్రంగా ధ్వజమెత్తారు. "ముగ్గురు సీనియర్లను కాదని ఇద్దరు జూనియర్లకు పదోన్నతినిచ్చారు. దేశవ్యాప్తంగా సీనియారిటీ జాబితా చూస్తే 32 మందిని జడ్జీల అభ్యర్థిత్వాన్ని పక్కనపడేశారు. కొలీజియం నిర్ణయం ప్రకంపనలు రేపుతోంది" అని ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ కైలాస్ గంభీర్ తీవ్రంగా విమర్శించారు. "అసలు కొలీజియంకేమైంది? క్రిస్మస్ సెలవులకు ముందొక నిర్ణయం- వాటి తర్వాత వేరొక నిర్ణయమా? కొత్తగా ఎంపికైనవారిద్ద రూ నైపుణ్యం ఉన్నవారే. కానీ సీనియారిటీ అని చెప్పి జూనియర్లను ఎంపిక చేస్తారా?" అని ఆయన తన అసంతృప్తిని వెల్లడిస్తూ రాష్ట్రపతి కోవింద్‌కు ఓ లేఖ రాశారు. తీసుకున్న నిర్ణయంపై జస్టిస్ గొగోయ్ వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) కూడా 'ఈ నిర్ణయం అన్యాయం, అనుచితం, నిలకడలేనిది, తప్పుడు సంకేతాలు పంపేదని' తప్పుబట్టింది. కొలీజియం తీసుకున్న ఈ అసాధారణ నిర్ణయాన్ని తాము సమ్మతించడం లేదంటూ ఓ తీర్మానాన్ని కూడా ఆమోదించింది.



జస్టిస్ ప్రదీప్ నంద్రజోగ్



జస్టిస్ రాజేంద్ర మీనన్



జస్టిస్ దినేశ్ మహేశ్వరి



జస్టిస్ సంజీవ్ ఖన్నా

అసలు జరిగిందేంటి?

డిసెంబరు 10న జరిగిన కొలీజియం సమావేశంలో నంద్రజోగ్, రాజేంద్ర మీనన్‌ల పేర్లు క్లియర్ చేసినప్పటికీ వాటిని ప్రభుత్వానికి పంపలేదు. ఎందుకు పంపలేదన్నది ఎవరికీ తెలీదు. అవి వెళ్లాల్సినవి సీజే కార్యాలయం నుంచేనని న్యాయవర్గాల వాదన. ఆ కొలీజియంలో ఓ సభ్యుడైన మదన్ లోకూర్ డిసెంబరు నెలాఖర్లో పదవీ విరమణ చేశారు. (ఓ నిఖార్సైన, నిజాయితీ గల జడ్జీగా జస్టిస్ లోకూర్ ఇలాంటి మార్పులకు ఎన్నడూ అంగీకరించేవారు కాదు.) ఆయన స్థానే అరుణ్ మిశ్రా వచ్చారు. ఎంపిక చేసిన ఇద్దరి పేర్లూ బయటకు పొక్కాయన్న కారణంతో సీజే.. ఈ రెండు పేర్లపై పునరాలోచించాలని నిర్ణయించుకున్నట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. జనవరి 5-6తేదీల్లో జరిగిన సమావేశంలో ఈ ఇద్దరి పేర్లూ పక్కన పడేసి- జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నాల పేర్లు ఎంపిక చేశారు. నిజానికి- అనేక ఆరోపణలు ఉన్న దృష్ట్యా- జస్టిస్ దినేశ్ మహేశ్వరి పేరును ఎన్నడూ పరిగణనలోకి తీసుకోరాదని అక్టోబరు 30న జరిగిన కొలీజియం సమావేశంలోనే నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ఆయన వ్యవహరిస్తున్నట్లు 2018లో జస్టిస్ చలమేశ్వర్ ఆయన పనితీరును తీవ్రస్థాయిలోతప్పుబడుతూ లేఖ రాశారు కూడా! కానీ ఆకస్మికంగా ఆయన పేరు తెరపైకి వచ్చి కొలీజియం ఆమోదం పొందడం అందర్నీ విస్మయపర్చింది. ఢిల్లీ హైకోర్టులో సీనియర్లయిన జస్టిస్ ప్రదీప్ నంద్రజోగ్, జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ రవీంద్ర భట్‌లను కాదని అదే హైకోర్టులో వారి కంటే జూనియర్ అయిన జస్టిస్ సంజీవ్ ఖన్నాను ఎంపిక చేయడం కూడా వివాదాస్పదమయ్యింది. జాతీయస్థాయిలో సీనియారిటీ లిస్టులో ఖన్నా 33 వ స్థానంలో ఉన్నారు. అయితే- జస్టిస్ నంద్రజోగ్ సారథ్యం వహించిన ఓ ధర్మాసనం ఓ తీర్పులో - గూగుల్ ఉన్న ఓ 35 పేరాగ్రాఫ్‌ల సమాచారాన్ని యథాతథంగా తమ జడ్జిమెంట్‌లో పొందుపర్చిన విషయాన్ని కొలీజియం దృష్టికి వచ్చింది. హాఫ్‌మన్ వర్సెస్ సిప్లా కేసులో 2013లో ఓ ఆర్టికల్‌లో వచ్చిన సమాచారం అందులో ఉంది. అయితే ఓ కోర్టు గుమాస్తా తప్పిదం వల్ల అది జరిగిందని అంటూ నంద్రజోగ్ వివరణ ఇచ్చి జరిగిన తప్పు ఒప్పుకున్నారు. తీర్పులో ఆ పార్టును తీసేశారు కూడా! కానీ కొలీజియం ఆయన పేరును తొలగించడానికి దీన్ని ఒక సాకుగా వాడుకుందని న్యాయవాద వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

కర్ణాటకలో ఆపరేషన్ కమల్ విఫలం!

» కుమార ప్రభుత్వానికి తప్పిన ముప్పు

బెంగళూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఉవ్వెత్తున ఎగసిన సంక్షోభం చల్లారింది. 'ఆపరేషన్ కమల్' మరోసారి విఫలమైంది. కుమారస్వామి సారథ్యంలోని కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వానికి పెనుముప్పు తప్పింది. బీజేపీలో చేరేందుకు సిద్ధమైన ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తగినంత మద్దతును కూడగట్టలేక దెబ్బతిన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు బుజ్జగించడంతో మూడ్రోజుల నాటకీయ పరిణామాలకు బుధవారం తెరపడింది. మంత్రి పదవి నుంచి ఇటీవల ఉద్వాసనకు గురైన కాంగ్రెస్ నేత రమేశ్ జార్కిహోళి మరో నలుగురు ఎమ్మెల్యేలతో కలిసి ముంబైలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మకాం వేశారు. కేబినెట్‌లో చోటివ్వనందుకు ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు హెచ్.నగేశ్, ఆర్.శంకర్ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు గవర్నర్ వజూభాయ్ వాలాకు మంగళవారం లేఖ రాశారు. వీరు కూడా జార్కిహోళితో కలిసి ముంబై హోటల్లో బస చేశారు. తమ శిబిరంలోకి కనీసం 10 మంది ఎమ్మెల్యేలైనా వస్తే సర్కారును కూలదోయవచ్చని భావించారు. అయితే కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి కె.సి.వేణుగోపాల్, సీనియర్ మంత్రి డి.కె.శివకుమార్ రంగంలోకి దిగి అసంతుష్ట ఎమ్మెల్యేలను బుజ్జగించినట్లు తెలిసింది. 'ఆపరేషన్ కమల్' విఫలం కావడంతో సంక్రాంతి తర్వాత సర్కారు కూలిపోతుందన్న కథనాలతో నిద్రలేని రాత్రులు గడిపిన ఉభయ పార్టీల నేతలు ఊపిరి పీల్చుకున్నారు. తమ ఎమ్మెల్యేలంతా ఐక్యంగా ఉన్నారని చాటేందుకు కాంగ్రెస్ పార్టీ శుక్రవారం శాసనసభాపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయనుంది. మద్దతు ఉపసంహరించిన ఇద్దరు స్వతంత్రులను కూడా ఈ సమావేశానికి తీసుకొస్తామని వేణుగోపాల్ చెప్పారు. ఇద్దరు స్వతంత్రులు వెళ్లినా నష్టం లేదని, సంఖ్యాబలం తన వైపే ఉందని, తన ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేదని, అందుకే తాను చాలా ప్రశాంతంగా ఉన్నానని సీఎం కుమారస్వామి తెలిపారు. 'ఆపరేషన్ కమల్' విఫలం కావడం ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాలకు చెంపపెట్టు లాంటిదని కేపీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండూరావు అన్నారు. 224 మంది ఎమ్మెల్యేలతో కూడిన కర్ణాటక అసెంబ్లీలో బీజేపీ 104 స్థానాలతో అతిపెద్ద పార్టీగా ఉంది. కాంగ్రెస్(80), జేడీఎస్(37), ఒక బీఎస్పీ(1), ఇద్దరు స్వతంత్రులతో కూడిన సంకీర్ణ ప్రభుత్వ బలం 120. ఇద్దరు స్వతంత్రులు వైదొలిగినా ప్రభుత్వానికి ఢోకా లేదు. కాగా, తమ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ కూడా ఎరవేస్తున్నట్లు వార్తలు రావడంతో బీజేపీ హరియాణాలోని గురుగ్రాం రిసార్టుకు 100 మంది ఎమ్మెల్యేలను తరలించింది.

దేశంలో కొత్తగా 13 సెంట్రల్ వర్సిటీలు

న్యూఢిల్లీ, జనవరి 16: దేశంలో కొత్తగా 13 సెంట్రల్ వర్సిటీలు ఏర్పాటు కానున్నాయి. జమ్ముకశ్మీర్‌లో రెండు, బిహార్, గుజరాత్, హరియాణ, ఒడిసా, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళలలో ఒక్కొక్కటి చొప్పున మూడేళ్ల వ్యవధిలో వీటిని ఏర్పాటు చేస్తారు. ఈ వర్సిటీల మౌలిక సదుపాయాలకు రూ.3639.32 కోట్ల విడుదలకు మంత్రి మండలి ఆమోదం తెలిపినట్టు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

'ఉపాధి'కి మరో 6వేల కోట్లు: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 16: ఉపాధి హామీ పథకానికి రూ.6,084కోట్ల నిధులు అదనంగా కేటాయించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది. దీంతో ఇప్పటి వరకూ ఏ ఆర్థిక సంవత్సరంలోనూ లేనివిధంగా 2018-19లో కేటాయింపులు అత్యధికంగా రూ.61,084కోట్లకు చేరినట్లు తెలిపింది. 2014-15లో ఉపాధి పథకానికి రూ.37,588కోట్లు కేటాయించామని, ఆ సంవత్సరంలో లబ్ధిదారులకు 15రోజుల్లోపు 26.85శాతం చెల్లింపులు చేయగా, ఇప్పుడు అది 91.82శాతానికి చేరిందని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి 3నెలల ముందే అంటే ఎంజీఎన్ఆర్ఈజీఏ నిధులు 99శాతం పూర్తయినట్లు పేర్కొంది. ఈ పథకానికి నిధుల కొరతపై మోదీకి 90మంది పార్లమెంట్ సభ్యులు, రైతు సంఘాల నేతలు లేఖ రాయడంతో అదనపు కేటాయింపులపై నిర్ణయం వెలువడింది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
2.96	3.50	100	120		
36321.29	10890.30	32,490	39,315	71.24	60.38

మేలిమి 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

డాక్టర్ రెడ్డీస్ శ్రీకాకుళం ప్లాంట్‌పై ఎఫ్‌డీఏ అభ్యంతరాలు

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు చెందిన మరో ఉత్పత్తి యూనిట్ నాణ్యతా ప్రమాణాలపై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) అభ్యంతరాలు వ్యక్తం చేసింది. శ్రీకాకుళం జిల్లాలోని కంపెనీ ఫార్ములేషన్స్ తయారీ యూనిట్‌లో ఎఫ్‌డీఏ అధికారులు జరిపిన తనిఖీలు బుధవారం ముగిశాయి. తనిఖీ ముగిసిన వెంటనే ఎఫ్‌డీఏ అధికారులు నాలుగు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. వీటికి సంబంధం ఎఫ్‌డీఏ అధికారుల నుంచి ఫారం-483 అందుకున్నట్టు పేర్కొంది. నాణ్యతకు సంబంధించి ఎఫ్‌డీఏ అధికారులు లేవనెత్తిన ఈ అభ్యంతరాలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్టు పేర్కొంది.

ఎగ్జిమ్ బ్యాంక్‌కు రూ.6,000 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగంలోని ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎగ్జిమ్ బ్యాంక్)కు రూ.6,000 కోట్ల మూల ధనం సమకూర్చేందుకు సంబంధించిన ప్రతిపాదనకు ఆమోదం లభించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేబినెట్ ఈ బ్యాంక్ అధీకృత మూలధనం రూ.10,000 కోట్ల నుంచి రూ.20,000 కోట్లకు పెంచేందుకు కూడా ఆమోద ముద్ర వేసింది. రూ.6,000 కోట్లతో ఎగ్జిమ్ బ్యాంక్ తన వ్యాపారాన్ని విస్తరించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4,500 కోట్లు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1,500 కోట్ల ఈక్విటీని ప్రభుత్వం సమకూర్చుతుంది. ఈ మేరకు ప్రభుత్వరంగ బ్యాంకులకు జారీ చేసిన మాదిరిగానే రీక్యాపిటలైజేషన్ బాండ్లను జారీ చేయనున్నారు. ఎగ్జిమ్ బ్యాంక్‌కు మూలధనం సమకూర్చడం ద్వారా దాని క్యాపిటల్ అడిక్వసీ పెరగనుంది.

నిరోధం 10930

టెక్ వ్యూ

నిఫ్టీ పాజిటివ్‌గానే ప్రారంభమై 10930 పాయింట్ల వరకు వెళ్లి గరిష్ఠ స్థాయిలో రియాక్షన్‌తో సుదీర్ఘ కన్సాలిడేషన్ సాధించింది. చివరికి డే కనిష్ఠ స్థాయిలో మానసిక అవధి 10900కన్నా దిగువన క్లోజ్ కావడం స్వల్ప అప్రమత్తతను సూచిస్తోంది. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. మంగళవారం ప్రధాన రివర్సల్ సాధించినందు వల్ల మార్కెట్ మైనర్ పుల్‌బ్యాక్ రియాక్షన్‌లో పడింది. మార్కెట్ మరోసారి జనవరి ఒకటో తేదీన ఏర్పడిన టాప్ 10930 వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 10800 **మద్దతు** : 10700

- మరింత రియాక్షన్‌లో పడి మైనర్ ఇంట్రాడే మద్దతు స్థాయి 10850కన్నా దిగజారితే మైనర్ కరెక్షన్ సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10800. అంతకన్నా దిగజారితే మరింత కరెక్షన్‌లో పడిపోగలుస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10700.
- ఇంట్రాడే నిరోధం 10930. మరింత అప్‌ట్రెండ్ కోసం మార్కెట్ ఈ స్థాయికన్నా పైన నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక ట్రెండ్ నిర్ణయించే స్థాయి, ప్రధాన నిరోధం 11000.

■ వి.సుందర్ రాజా

ప్రథమార్ధం మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య శుక్ల ఏకాదశి
నక్షత్రం : కృత్తిక/రోహిణి

ఆర్ద్ర, స్వాతి, శతభిషం/పునర్వసు, పుష్యమి, ఉత్తరాభాద్ర నక్షత్ర జాతకులు, వృషభ, కన్యా రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10890.30 (-3.50)

ట్రెండ్ మార్పు వేళలు : 1.39

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 9.55 నుంచి 1.10 వరకు మెరుగ్గా ట్రేడవుతూ 1.50 నుంచి చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2 గంటల తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవలసి ఉంటుంది.


నిరోధం : 10930, 10975

మద్దతు స్థాయిలు : 10850, 10815

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.


■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in



బులియన్


బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	33,390	---	33,470	---	32,490
క్రితం ముగింపు	33,430	---	33,150	32,700	32,350
22 క్యారెట్లు	30,910	---	30,790	---	31,020
క్రితం ముగింపు	30,870	---	30,490	30,280	30,880
వెండి (కిలో)	40,400	---	40,500	---	42,900
క్రితం ముగింపు	40,300	---	40,300	40,200	42,600

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.95 నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	433	చిత్తూరు	443
వరంగల్	435	చెన్నై	450
విజయవాడ	435	నమక్కల్	435
గోదావరి	435	బెంగళూరు	445
విశాఖపట్నం	435	ముంబై	483

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	87	విజయవాడ	89
కరీంనగర్	88	గుంటూరు	90
వరంగల్	87	ఒంగోలు	91
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	91
కర్నూలు	87	నెల్లూరు	91
విశాఖపట్నం	86	అనంతపురం	83
గోదావరి	86		

ఎస్సార్ స్టీల్ అప్పుల విక్రయం

ఈఓఐలను ఆహ్వానించిన ఎస్‌బీఐ

విక్రయానికి రూ.15 వేల కోట్ల రుణాలు



న్యూఢిల్లీ: ఎస్సార్ స్టీల్‌కు ఇచ్చిన రూ.15,000 కోట్ల రుణాలను విక్రయించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కసరత్తు ప్రారంభించింది. ఈ మొండి బకాయిలను కొనుగోలు చేసి వాటిని వసూలు చేసుకునే అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలు (ఏఆర్‌సీ), బ్యాంకింగేతర సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ), విదేశీ సంస్థల నుంచి ఎస్‌బీఐ ఆసక్తి వ్యక్తీకరణ బిడ్ల (ఈఓఐ)ను ఆహ్వానించింది. రూ.15,431.44 కోట్ల మొండి బకాయిల రిజర్వ్ ధరను రూ.9,587.64 కోట్లుగా ప్రకటించింది. ఎస్సార్ స్టీల్ మొండి బకాయిల (ఎన్‌పీఏ) రికవరీకి తాము ప్రతిపాదించిన పరిష్కార ప్రణాళికను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), అహ్మదాబాద్ బెంచ్ ఆమోదించింది. బెంచ్ తీర్పు ప్రకారం తమకు కనీసం రూ.11,313.42 కోట్ల విలువ గల ఈ ఎన్‌పీఏలు వసూలు కావచ్చునని బ్యాంకు తెలిపింది. ఆసక్తి గల సంస్థలు తక్షణం ఈఓఐ సమర్పించి, బ్యాంకుతో నాన్ డిస్‌క్లోజర్ ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత అప్పులకు సంబంధించిన చట్టపరమైన పత్రాలన్నింటినీ పరిశీలించుకోవచ్చునని పేర్కొంది. జనవరి 30వ తేదీన ఎన్‌పీఏ ఖాతాలను ఇ వేలం వేయనున్నట్టు ఎస్‌బీఐ తెలియజేసింది. వాస్తవానికి వీటిని గత సెప్టెంబరులోనే వేలం వేయాలని ఉన్నప్పటికీ ఆర్సెలర్ మిట్టల్, అనిల్ అగర్వాల్ యాజమాన్యంలోని వేదాంత రెండో విడత బిడ్లు దాఖలు చేయడానికి అవకాశం కల్పించాలని ఎన్‌సీఎల్‌ఏటీ కోరడంతో ఆ ప్రయత్నాన్ని బ్యాంకు విరమించుకుంది.

రూ.49,000 కోట్ల బకాయిలు

ఎస్సార్ స్టీల్ ఏటా కోటి టన్నుల సామర్థ్యం గల ఉక్కు ప్లాంట్‌ను గుజరాత్‌లో నడుపుతోంది. ఎస్‌బీఐ సారథ్యంలోని రెండు డజన్లకు పైగా బ్యాంకులకు రూ.49 వేల కోట్ల బకాయి పడింది. దీంతో రుణదాతలు ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడంతో దివాలా ప్రక్రియ ప్రారంభమైంది. దివాలాలో ఉన్న ఎస్సార్ స్టీల్‌ను ఆర్సెలార్ మిట్టల్ స్వాధీనం చేసుకునేందుకు రుణదాతల కమిటీ (సీఓసీ) అంగీకరించింది. ఎస్సార్ స్టీల్ కోసం ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ సమర్పించిన రిసొల్యూషన్ ప్రణాళిక ప్రకారం ఎస్సార్ స్టీల్ బకాయిల చెల్లింపునకు బ్యాంకులకు నేరుగా రూ.42 వేల కోట్లు చెల్లిస్తుంది. అది కాకుండా రూ.8 వేల కోట్లు కంపెనీలో వర్కింగ్ క్యాపిటల్‌గా ఇన్వెస్ట్ చేస్తుంది. కాగా ఎస్సార్ స్టీల్ హోల్డింగ్ కంపెనీ అయిన ఎస్సార్ స్టీల్ ఏషియా హోల్డింగ్స్ నేరుగా రూ.54,389 కోట్లు చెల్లించి యాజమాన్యాన్ని తిరిగి సాధించేందుకు సీఓసీకి ప్రతిపాదనలు పంపింది. ఎన్‌సీఎల్‌టీ అహ్మదాబాద్ బెంచ్ దానిపై తీర్పును రిజర్వులో ఉంచింది.

ఏఐ భవనంపై 'మహా' సర్కారు ఆసక్తి

ముంబై: ప్రభుత్వ రంగ విమాన సంస్థ ఎయిర్ ఇండియా (ఏఐ)కు దక్షిణ ముంబైలో ఉన్న భవనాన్ని కొనుగోలు చేసేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి కనబరుస్తోంది. నారిమన్ పాయింట్ ప్రాంతంలోని మెరీన్ డ్రైవ్‌లో ఉన్న ఈ 23 అంతస్తుల నిర్మాణమే 2013 వరకు ఎయిర్ ఇండియా ప్రధాన కార్యాలయం. అప్పుల భారంతో సతమతమవుతున్న ఎయిర్ ఇండియా పునరుద్ధరణ ప్రణాళికలో భాగంగా సంస్థ కీలక స్థిరాస్తులను విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ భవనాన్ని కొనుగోలు చేసేందుకు తమ ప్రభుత్వం ఇప్పటికే బిడ్ సమర్పించిందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం ప్రిన్సిపల్ సెక్రటరీ భూషణ్ గగ్రానీ తెలిపారు.

మైండ్‌ట్రీ లాభంలో 35 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ మైండ్‌ట్రీ లాభం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో 35 శాతం పెరిగి రూ.191.2 కోట్లకు చేరుకుంది. ఆదాయం 29.7 శాతం వృద్ధి చెంది రూ.1,787.2 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది జనవరి-మార్చి మధ్యకాలానికి సంస్థ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని మైండ్‌ట్రీ సీఈఓ, ఎండీ రోస్తోవ్ రావణన్ ధీమా వ్యక్తం చేశారు. కంపెనీ వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.3 మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని బోర్డు డైరెక్టర్లు ప్రతిపాదించింది. గత ఏడాది చివరినాటికి సంస్థకు 340 యాక్టివ్ క్లయింట్లు ఉన్నారు. సంస్థ ఉద్యోగుల సంఖ్య 19,908కి చేరుకుంది.

లాభ నష్టాలు లేని ముగింపు



ముంబై: ఆటుపోట్ల నడుమ దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం ఫ్లాట్‌గా ముగిసింది. సెన్సెక్స్ 2.96 పాయింట్ల లాభంతో 36,321.29 దగ్గర, నిఫ్టీ 3.5 పాయింట్ల లాభంతో 10,890.3 దగ్గర క్లోజయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి ఇందుకు ప్రధాన కారణం. ఇంట్రా డే ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం రేటు 20 పైసలు క్షీణించడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. బ్రెగ్జిట్‌పై బ్రిటిష్ ప్రధాని మే ఎదుర్కొంటున్న కష్టాలతో అంతర్జాతీయ ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గురువారం వెలువడే మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ కౌంటర్ లోనూ, ట్రేడింగ్ అంతంత మాత్రంగానే కొనసాగింది. దేశ, విదేశీ మార్కెట్ల నుంచి ఎలాంటి సానుకూల వార్తలు లేవు. దీంతో మార్కెట్ నిస్తేజంగా ట్రేడైంది' అని ఎమ్కే వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ జోసెఫ్ థామస్ చెప్పారు. కంపెనీల ఆర్థిక ఫలితాలు, బ్రెగ్జిట్, అమెరికా ప్రభుత్వ కార్యకలాపాల స్తంభనపై చోటు చేసుకునే పరిణామాలు, నిధుల లభ్యత (లిక్విడిటీ) కోసం చైనా కేంద్ర బ్యాంక్ తీసుకునే చర్యలు వచ్చే కొద్ది రోజుల్లో మార్కెట్ గమనాన్ని నిర్ణయిస్తాయని తెలిపారు.

సెన్సెక్స్ షేర్లలో యస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, ఎస్‌బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ కంపెనీల షేర్లు 2.66 శాతం వరకు లాభాలు నమోదు చేశాయి. భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, వేదాంత, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌యూఎల్, హీరో మోటోకార్ప్, కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ కంపెనీల షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడితో 1.38 శాతం వరకు నీరసించాయి.

నష్టాల్లో జెట్ ఎయిర్‌వేస్ షేరు

జెట్ ఎయిర్‌వేస్ షేర్లు బుధవారం నష్టాలతో ట్రేడయ్యాయి. డిస్కౌంట్‌తో ఇస్తే తప్ప ఈ కంపెనీ ఈక్విటీలో మరింత వాటా తీసుకునేది లేదని ఎతిహాద్ కంపెనీ చెంపిందన్న వార్తలతో ఈ షేర్లు నీరసించాయి. బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు ఒక దశలో 9.62 శాతం నష్టపోయింది. చివరికి 7.95 శాతం నష్టంతో రూ.271 వద్ద ముగిసింది.

ఆల్ టైమ్ హైలో టోరెంట్ ఫార్మా షేరు

టోరెంట్ ఫార్మా కంపెనీ షేరు బుధవారం జీవిత కాల గరిష్ఠ స్థాయిలో ముగిసింది. మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుంటాయన్న అంచనాతో బీఎస్ఈలో ఈ కంపెనీ షేరు 2.84 శాతం లాభంతో రూ.1,945.25 వద్ద ముగిసింది. గత ఆరు రోజులుగా ఈ కంపెనీ షేర్లు లాభాలతో ట్రేడవుతున్నాయి.

సంక్షిప్తంగా..

ఐడీఎఫ్‌సీ బ్యాంకు

ఐడీఎఫ్‌సీ బ్యాంకుతో క్యాపిటల్ ఫస్ట్ విలీనమైన తర్వాత ఏర్పడిన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో నమోదయ్యాయి. ఈ కార్యక్రమానికి ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఎండీ, సీఈఓ వి వైద్యనాథన్, ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ విక్రమ్ లిమయే హాజరయ్యారు.

సాగర్ సిమెంట్స్

ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన జారీ చేయనున్న 31 లక్షల కన్వర్టిబుల్ వారెంట్ల ధరను సెక్యూరిటీస్ కేటాయింపుల కమిటీ నిర్ణయించినట్లు సాగర్ సిమెంట్స్ తెలిపింది. బుధవారం జరిగిన సమావేశంలో ఒక్కో వారెంట్ ధరను రూ.730గా కమిటీ నిర్ణయించింది.

ఐఓసీ నుంచి 300 కోట్ల డాలర్ల బాండ్ల ఇష్యూ!

న్యూఢిల్లీ: విదేశాల్లో రుణ పత్రాల (బాండ్స్) జారీ ద్వారా 300 కోట్ల డాలర్ల వరకు సమీకరించాలని ప్రభుత్వ రంగంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ ఐఓసీ భావిస్తోంది. అయితే ఎప్పుడు ఈ ఇష్యూ జారీ చేయాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కంపెనీ ఛైర్మన్ సంజీవ్ సింగ్ చెప్పారు. ప్రభుత్వ రంగంలోని ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలు తమ నిర్వహణ మూల ధన అవసరాల కోసం విదేశాల్లో డాలర్ బాండ్ల జారీ ద్వారా 1,000 డాలర్ల వరకు సమీకరించుకునేందుకు ఆర్‌బీఐ గత ఏడాది అక్టోబరులో అనుమతించింది. ఇందులో ఐఓసీ ఒక్కటే 500 కోట్ల డాలర్ల వరకు సమీకరించేందుకు అవకాశం ఉంది. ఐఓసీ ఇప్పటికే బాండ్ల జారీ ద్వారా 90 కోట్ల డాలర్లు సమీకరిస్తోంది. ఈ బాండ్లపై కంపెనీ 4.75 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది.

ఆస్ట్రేలియా, సింగపూర్‌లో సువెన్ లైఫ్ ఔషధానికి పేటెంట్

న్యూఢిల్లీ: కొత్త రసాయన మూలకాల(ఎన్‌సీఈ)తో హైదరాబాద్‌నకు చెందిన సువెన్ లైఫ్ సైన్సెస్ కంపెనీ అభివృద్ధి చేసిన ఔషధానికి ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాల్లో ఉత్పత్తి పేటెంట్ హక్కులు లభించాయి. అల్జీమర్స్, పార్కిన్‌సన్ వంటి నరాల క్షీణత వ్యాధుల చికిత్సలో ఈ కొత్త ఔషధం ఉపయోగపడుతుందని కంపెనీ సీఈఓ వెంకట్ జాస్తి తెలిపారు. జ్ఞాపక శక్తితోపాటు, నరాలను క్షీణింపజేసే అనేక వ్యాధుల చికిత్సలో ఈ కొత్త ఔషధం ఉపయోగపడుతుంది. ప్రపంచంలోని మిగతా దేశాల్లోనూ ఈ ఔషధానికి భారీగా డిమాండ్ ఉందని తెలిపింది. సింగపూర్, ఆస్ట్రేలియా దేశాల్లో తమ కొత్త ఔషధానికి 20136 వరకు పేటెంట్ హక్కులు లభించినట్టు పేర్కొంది.

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM .64(.66)130
ADITYA SPIN. 6.32(6.65)200
AISHWARYA TE 3.15(3.03)1364
ALPHAGEO (I) 478.45(478)316
ALU FLUORIDE 121.85(114.9)2907
AMAR RAJA BA 765.15(765.9)23155
ANDHRA BANK 29.1(29)20764
ANDHRA CEMEN 5.8(5.77)1633
ANDHRA PETRO 67.15(64.9)60406
ANJANI PORTL 130.1(133.8)266
ASTRA MICRO 83.35(84.35)6339
AUROB.PHARMA 787.05(785.25)81172
AVANTEL LTD 230.7(231.7)484
AVANTI FEEDS 383.15(373.75)27546
B.N.RATHI SE 26(26.05)1293
BALAJI AMINE 483.45(442.75)25082
BAMBINO AGRO 193(189)7
BARTRONICSIN 7.21(7.2)7648
BCG 2.85(2.98)167155
BHAGIRA.CHEM 442.4(437.1)1374
BHAGYA INL 36.9(37.1)3087
BHARATFIN 964.9(949.15)9688
BNR UDYOG 16.64(16.32)7
CAMBRIDGE 44.1(44.5)717
CCHHL 7.42(7.25)2471
CCL PRODUCTS 264.25(265.95)72320
CELESTIAL 7.9(7.91)2069
CIL SECURITS 15.75(17.45)1804
COROM INTER 453.85(453.6)2338
CUBEX TUBING 14.78(14.08)551
CYBERMATE 2.16(2.15)57796
CYIENT 623.15(612.75)8985
DANLAW TECH. 94.55(96.15)1270
DECAN CEMENT 395(385.5)3
DHAN ROTO SP 29.9(28.5)1
DIAMONPOWER 1.42(1.49)270
DIVI'S LAB. 1520.75(1522.95)13883
DIVYA.GRANIT 94.2(89.75)10275
DQ ENT 7.92(8.13)21261
DR.REDDY'S 2621.85(2591.95)37323
EMPEE SUGARS 1.43(1.37)2740
EVEREST ORG. 116.25(123.75)1703
FACOR ALLOYS 1.97(2.04)63796
FIRSTOBJ 10.56(11.1)2688
GATI LTD. 81.45(82.3)33628
GAYATRI PROJ 184.15(182)1587
GENNEX LAB 3.63(3.6)37333
GMR INFRASTR 16.6(16.5)581065
GODAVARI DRU 22.55(22.75)198
GOLDSTONE EN 15.7(16.2)3252
GRANULES (I) 91.2(87.85)98979
GVK POWERINF 7.57(7.55)176118
HBL P SYS 28.75(28.55)22235
HERITGFOOD 537.2(534.75)1067
HIND.FLUROCA 16.5(15.75)3252
INCAP LTD. 39.9(38)50
IPAPPM 450.4(447.5)1965
IVRCL LTD .99(.99)41935
KAKATIYA CEM 196.25(199.25)1532
KALLAM 17.8(17.95)16934
KAVERI SEED 573.5(579.05)12398
KCP LTD 89.95(89.1)377
KERNEX MICRO 28.1(26.85)11244
KNR CONST 216.15(217.85)6503
KREBS BIOCHM 127.5(120.5)305
LOKESH MACH 45.5(44.9)1089
LOTUS CHOC 23.05(23.95)35
MADHUCON PRJ 6.71(6.25)27534
MOLD-TEK TEC 46.4(44.45)20340
MOSCHIP SEMI 25(25)22033
MSR INDIA 11.6(11.8)1813
N C L IND. 129(128.3)221
NACLIND 27.5(27.55)1311
NATCO PHARM 679.9(691.55)945868
NCC 88.55(89)437983
NEHA INTER. 4(4.09)4299
NETTLINX LTD 50.5(52.7)29861
NEULAND LAB. 502.1(499.85)132
NIHAR INFO 14(13.78)360
NILE LTD. 366.85(367.45)289
NTL 1.38(1.32)21500
OIL COUNTRY 15.4(15.6)700
OLECTRA 244.35(233.3)44528
PADMALAYA TE 2.3(2.26)50
PALRED 36.85(36.8)3086
PANYAM CEMEN 13.59(13.8)2069
PENNAR STEEL 37.9(38.55)20535
PFL INFOTECH 8.49(8.49)1
PHYTOCHEM I. 46.15(43.05)1176
PITTIENG 64.85(62.5)6962
POKARNA LTD 182.95(173.8)65245
PRAJAY ENGS. 8.35(8.43)1345
PREMIER EXPL 237.25(234.6)488
PRSMJOHNSN 85.4(85.7)45021
RAIN 123.45(117.6)139481
RAJ PACKAGIN 27(27.5)135
REG.CERAMIC 4.55(4.72)5
RESTILE CER. 3.98(3.9)1297
SAGAR CEM. 655.2(644.3)91
SAMKRG PIST. 194.65(196.2)2774
SANGHI IND. 60.75(60.45)4065
SATVAH.ISPAT 9.3(9.28)5000
SAVEN TECHNO 26.7(28.1)1580
SIBAR AUTO 32.7(32.8)252
SMPL .41(.43)31605
SMS PHARMACE 75.4(74.65)5679
SREE RAYALA 157.4(155.25)1152
STEEL EXCH 13.7(13.75)4678
SURANATP 4.6(4.76)76
SURYACHAKRA .31(.32)25836
SURYAMBA SP 68.6(70)537
SURYLAK.COTT 42.05(43.4)1536
SUVEN LIFE S 219.55(219.05)104340
TAJ GVK HOTL 180.05(182.3)2063
TANLA 30.25(29.45)37383
TRANSCORP IN 23.05(22.5)918
TRANSGENE BI 4.93(4.7)85448
TRANSPORT CO 294.5(302.7)6402
USHER AGRO 2.3(2.31)1000
VICEROY HOTE 4.55(4.64)1747
VIJAY TEXTIL 41.2(41.6)320
VIMTA LABS 291.1(300.45)3471
VIRAT CRANE 33.15(34.9)1420
VIRINCHI 81.15(80)5397
VISAKA IND. 429.75(428.35)1874
VISTA PHARMA 28.7(29.25)1575
VIVIMED LABS 33.7(34.55)22679
VST INDUS. 3269.2(3214.45)2223
WATERBASE 160.6(159.4)50139
XLENERGY 1.08(1.05)4019
ZEN TECH 81(79.4)1969
ZENOTECH 34.95(35.4)4975

ఎన్ఎస్ఈ-500 షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా (NSE)

AARTIDRUGS 599.45(606.45)7302
AARTIIND 1546(1565.55)112157
ABAN 74.7(74.3)487930
ABB 1287.45(1293.2)53823
ABFRL 201.2(209.7)862285
ABGSHIP 1.9(1.85)8072
ACC 1473.95(1483.45)419240
ADANIENT 148.45(148.65)1574176
ADANIPORTS 389.3(385.15)2847403
ADANIPOWER 49.8(50.25)5456511
ADANITRANS 226.4(219.7)232208
AEGISCHEM 210.05(210.2)136038
AHLUCONT 320.65(321.3)6577
AIAENG 1637.9(1666.65)68429
AJANTPHARM 1138.8(1160.3)301146
AKZOINDIA 1751.8(1743.75)8109
ALBK 44.45(43.95)3582394
ALLCARGO 110.45(110.65)89245
ALOKTEXT 3.65(3.65)1476159
AMARAJABAT 767.1(765.4)190686
AMBUJACEM 216.85(216.75)975644
ANANTRAJ 35.2(35.25)238470
ANDHRABANK 29.2(28.85)639699
APARINDS 635.3(621.8)10824
APLLTD 596.35(597.8)10674
APOLLOHOSP 1347.6(1329.15)513687
APOLLOTYRE 218.85(223.2)3263101
ARVIND 96.4(95.1)2313379
ASHIANA 115.6(117.1)60371
ASHOKA 130.75(135)346565
ASHOKLEY 93.95(93.6)10035208
ASIANPAINT 1389.75(1405.95)1189597
ASTRAL 1133.65(1137.45)14389
ASTRAZEN 1652.75(1638.9)7303
ATUL 3466.35(3460.55)6218
AUROPHARMA 788.3(786.55)1884849
AXISBANK 664(660.6)6598151
BAJAJ-AUTO 2717.45(2725.85)218357
BAJAJCON 388.65(385.95)131706
BAJAJELEC 479.7(481.3)61811
BAJAJFINSV 6464.85(6509.7)119680
BAJAJHIND 9.3(9.35)2711766
BAJAJHLDNG 2958.45(2998.35)5828
BALKRISIND 867.6(869.95)344487
BALLARPUR 4.9(5.05)1459317
BALMLAWRIE 200(199.25)28827
BALRAMCHIN 112.85(111.25)3987066
BANKBARODA 121(121.1)10282923
BANKINDIA 105.3(104.1)6408689
BASF 1547.4(1509.85)11752
BATAINDIA 1165.05(1167.3)352173
BBTC 1274.7(1280.95)88548
BEML 914(910.6)2459104
BERGEPAINT 322.9(325.8)251813
BFUTILITIE 222.45(224.35)227472
BGRENERGY 60.4(60.3)47548
BHARATFIN 966.7(948.85)809025
BHARATFORG 489.75(486.65)1218694
BHARTIARTL 333.95(337.75)6944533
BHEL 68.35(68.35)5484091
BIOCON 650.7(647.7)937081
BIRLACORPN 565.85(575.25)51124
BLISSGVS 163.15(162.85)545541
BLUEDART 3285.4(3201.85)2892
BLUESTARCO 612.25(611.95)136135
BOMDYEING 127.7(124.5)3335144
BOSCHLTD 19089.4(19130.05)6336
BPCL 347.25(341.7)4781001
BRFL 9.05(9)66072
BRIGADE 208.65(198.8)186870
CADILAHC 352.55(355.9)1206297
CANBK 275.35(275.35)3880186
CARERATING 998(1001.6)42984
CASTEXTECH 1.15(1.1)313064
CASTROLIND 165.55(167.9)2005949
CCL 265.05(265)10229
CEATLTD 1231(1236.4)303551
CENTRALBK 35.65(36)1204041
CENTURYPLY 182.9(180.15)216982
CENTURYTEX 902.2(892.25)509583
CERA 2622.35(2646.05)6005
CESC 703.95(688.75)809976
CHAMBLFERT 163.55(169)237841
CHENNPETRO 263.25(264.5)243405
CHOLAFIN 1192(1190.9)161753
CIPLA 511.5(514.95)1446921
CLNINDIA 411.85(404.45)27290
COALINDIA 232.05(232.65)2050899
COLPAL 1330.75(1324.25)791151
COROMANDEL 455(456.4)61566
CORPBANK 28.55(28.8)348265
COX&KINGS 174.7(172.3)187973
CRISIL 1647.8(1648.2)6478
CUB 186.05(189.45)491963
CUMMINSIND 841.7(877.7)858199
CYIENT 623.7(614.6)165757
DABUR 423.85(426.1)1621386
DBCORP 181(179.45)74723
DBREALTY 27.9(27.3)136178
DCBBANK 181.35(183.1)8015069
DCMSHRIRAM 359.55(357.45)33760
DEEPAKFERT 140.65(143.25)185640
DELTACORP 254.25(257.45)665468
DEN 70.05(70.25)271380
DENABANK 13.55(13.6)1055673
DHANUKA 422.65(423.8)5683
DHFL 223.1(223.75)5538351
DISHTV 36.2(35.95)5866770
DIVISLAB 1519.8(1522.2)362391
DLF 182.95(185.95)4131732
DREDGECORP 445.55(443)519407
DRREDDY 2616.95(2594.8)946148
DYNAMATECH 1473(1499.05)470
ECLERX 1101.65(1058.7)12721
EDELWEISS 173.15(174.65)1405944
EICHERMOT 20735.7(20638.15)67468
EIDPARRY 224.65(226.1)201724
EIHOTEL 181.6(183)62658
ELECTCAST 21.35(21.4)70475
ELGIEQUIP 261.75(259.8)4517
EMAMILTD 435.85(439.45)54879
ENGINERSIN 122.4(126.2)6296038
EROSMEDIA 83(83.3)179797
ESCORTS 737.7(756.1)1254789
ESSDEE 18.6(18.35)13708
ESSELPACK 109.85(108.25)133529
EVEREADY 224.9(228.3)2123028
EXIDEIND 252.65(257.6)1249346
FCONSUMER 43.45(43.45)1076783
FDC 171.95(171.85)63350
FEDERALBNK 91.2(91)13241747
FINCABLES 449.6(448.85)38085
FINPIPE 557.4(539.1)35660
FLFL 392.4(392.55)54815
FORTIS 137.9(138.25)818662
FSL 52.5(53.15)2478302
GAIL 325.5(324.55)5083489
GATI 81.35(82.05)263760
GDL 117.05(110.85)800882
GEPIL 818.05(811.95)16350
GESHIP 305.05(315.95)59288
GET&D 314.55(311.25)42248
GILLETTE 6499.5(6499.9)2601
GLAXO 1440.5(1444.5)9552
GLENMARK 655.95(665.05)786856
GLOBOFFS 13.8(13.8)2961
GMDCLTD 86.1(87.2)48250
GMRINFRA 16.55(16.5)5551145
GODFRYPHLP 964.5(985.75)420501
GODREJCP 774.95(781.45)505038
GODREJIND 529(527.1)276005
GODREJPROP 736.5(730.05)129304
GPPL 95.95(89.85)1464806
GRANULES 91.3(88.3)1044008
GREAVESCOT 124.1(121.5)430279
GREENPLY 139.85(140.1)31685
GRINDWELL 565.4(564.7)5734
GRUH 236.9(238.75)947047
GSFC 111.65(112.3)542961
GSKCONS 7440.05(7505.35)6527
GSPL 177.9(169.85)441968
GUJFLUORO 935.45(931.9)44856
GULFOILLUB 851.15(856.75)2367
GVKPIL 7.55(7.5)715762
HATHWAY 30.9(31)320748
HAVELLS 683.45(681.1)676883
HCC 13.15(13)7766092
HCL-INSYS 24.6(24.8)590805
HCLTECH 938.25(947.7)850621
HDFC 1975(1992.15)1878811
HDFCBANK 2120.2(2121.9)1313113
HDIL 28.25(28.05)4441528
HEIDELBERG 151.65(149.5)68394
HEROMOTOCO 2879.85(2910.95)261721
HEXAWARE 323.45(319.7)800826
HFCL 23.95(24.65)3381387
HIMATSEIDE 211.8(212.3)28257
HINDALCO 208.4(208.5)8209760
HINDCOPPER 50.1(49.55)562962
HINDPETRO 240.6(241.55)2721203
HINDUNILVR 1772.55(1789.85)2054033
HINDZINC 272.6(273)118186
HMT 20(19.25)1171
HMVL 124.15(126.35)41081
HONAUT 21819.55(21986)1074
HOTELEELA 15.5(14.8)288378
HSIL 257.6(255.3)77637
HTMEDIA 47.2(47.55)1132102
IBREALEST 85.9(85.95)1313278
IBULHSGFIN 829.6(808.85)5907953
ICICIBANK 375.3(372.75)15106484
ICRA 3189.45(3187.05)1606
IDBI 61.95(61.75)1327059
IDEA 36.4(36.25)8866060
IDFC 43.75(42.95)3845952
IFBIND 924.95(912.25)39604
IFCI 15.05(14.75)5917715
IGARASHI 532.4(540.95)4079
IIFL 473.85(470.9)48498
IL&FSTRANS 10.55(10.9)562917
INDHOTEL 139.8(138.95)487865
INDIACEM 87.8(87.95)4341283
INDIANB 257.05(252.3)1270955
INDOCO 223.55(222.1)32883
INDUSINDBK 1526.7(1495.2)2188162
INEOSSTYRO 697.7(698.75)1366
INFRATEL 275.85(279.75)3605390
INFY 736.8(726.6)9658944
INGERRAND 580.8(584.9)3792
INOXLEISUR 245.25(251.65)47746
INOXWIND 73.65(74.55)15651
INTELLECT 217.45(219.35)236747
IOB 14.55(14.45)431661
IOC 135.8(134.55)6605251
IPAPPM 451.8(448.35)28769
IPCALAB 788.8(783.4)38234
IRB 155.55(157.6)918529
ITC 294.05(296.55)7784035
J&KBANK 39.15(39.25)3020490
JAGRAN 111.85(113.05)91531
JAICORPLTD 113.45(113)1286257
JBCHEPHARM 319.3(315.75)35990
JBFIND 20.85(21.15)32366
JCHAC 1844.35(1785.2)7028
JETAIRWAYS 269.7(293.7)41556201
JINDALPOLY 245.25(244.65)8073
JINDALSTEL 146.65(146.9)6711156
JISLJALEQS 66.45(65.9)3186932
JKCEMENT 733.15(714.65)31927
JKIL 128.85(128)149765
JKLAKSHMI 306.4(308.55)46164
JKTYRE 101.5(100.7)437302
JMFINANCIL 89.6(90.7)144301
JPASSOCIAT 7.35(7.3)12224232
JPINFRATEC 3.55(3.55)549134
JPPOWER 1.95(1.95)1293957
JSWENERGY 69.8(68.9)506274
JSWHL 2602.8(2631.5)1985
JUBILANT 711.55(719.75)129717
JUBLFOOD 1214.75(1236)1556003
JUSTDIAL 496.8(478.45)2731980
JYOTHYLAB 197.45(197.85)537224
KALPATPOWR 374.3(372.35)45866
KANSAINER 456.75(457)67233
KEC 274.25(275.7)148230
KESORAMIND 83.7(80.5)399051
KIRLOSENG 194.4(195.25)12686
KITEX 109.05(109.3)34077
KOLTEPATIL 260.15(263.45)95660
KOTAKBANK 1202.75(1213.4)2374649
KPIT 216.2(211.85)14516070
KRBL 337.05(315.55)719628
KSCL 570.6(579.4)229615
KSK 1.45(1.5)699264
KTKBANK 119.2(119.3)1842887
KWALITY 7.95(7.65)3178556
L&TFH 141.85(141.05)5431451
LAKSHVILAS 76.55(77.35)231247
LAOPALA 219.95(219.9)43063
LAXMIMACH 5674.6(5699.25)2379
LICHSGFIN 481.85(486.05)1499699
LT 1342.15(1340.9)2454470
LUPIN 863.2(849.7)1681645
M&M 726.25(726.9)1288969
M&MFIN 446.9(444.05)1397353
MAGMA 107.65(108.7)24800
MAHINDCIE 232.85(239.7)82223
MAHLIFE 384.45(391.3)53727
MANAPPURAM 97.7(98.65)1132723
MANPASAND 85.15(85.7)150613
MARICO 380.4(381.45)884665
MARKSANS 27.95(27.8)642474
MARUTI 7310.25(7355.15)424769
MAYURUNIQ 395.35(395.7)7059
MCLEODRUSS 111(111.4)102838
MERCK 3203.35(3202.2)15302
MHRIL 215(215.05)60390
MINDACORP 150.7(152.25)18434
MINDTREE 841.2(854.5)2437761
MMTC 29.15(29.2)800503
MOIL 165.55(166.45)75354
MONSANTO 2561.4(2566.75)2613
MOTHERSUMI 162.3(160.7)2458362
MOTILALOFS 682.45(678.8)39057
MPHASIS 863.2(876.45)271073
MRF 65991.2(66195.6)3514
MRPL 70.85(70.4)630332
MTNL 15.6(15)3163704
MUTHOOTFIN 537.15(541.65)820323
NATCOPHARM 680(692.7)804818
NATIONALUM 61.65(62.15)3099309
NAUKRI 1677.35(1679.55)292846
NAVKARCORP 51.35(50.85)160856
NCC 88.4(88.95)5883826
NETWORK18 40.45(40.4)572567
NHPC 25.85(25.55)3668208
NIITTECH 1209.6(1186.1)1260881
NITINFIRE 1.8(1.8)78478
NLCINDIA 67.9(67.55)133892
NMDC 93.3(93.65)8325966
NTPC 146.35(145.8)4732815
OBEROIRLTY 453.75(452.3)216001
OFSS 3682.75(3661.9)14088
OIL 173.55(175.1)622333
OMAXE 214(212.05)253876
ONGC 146.35(145.15)3667241
ORIENTBANK 97.85(97.75)3786449
ORIENTCEM 77.15(76.95)27354
ORISSAMINE 894.6(901.15)5784
PAGEIND 23361.2(23760.6)60637
PARSVNATH 7.15(7.15)133314
PCJEWELLER 80.45(81.55)6580945
PEL 2372.15(2345.75)437127
PERSISTENT 551.75(549.3)135328
PETRONET 220.5(214.95)1896008
PFC 107.05(108.3)5624064
PFIZER 2722.5(2700.5)18917
PFS 17.3(17.55)414577
PGHH 9896.85(9939.75)2395
PHOENIXLTD 574.3(577.25)15240
PIDILITIND 1154(1168.9)408227
PIIND 835.1(842.15)27595
PNB 84.25(81.95)30560868
POWERGRID 192(192.45)4789937
PRAJIND 153.95(154.25)6548968
PRESTIGE 220.35(215.35)263461
PRSMJOHNSN 85.2(85.55)339354
PTC 90.4(90.95)832425
PUNJLLOYD 4.4(4.2)808231
PURVA 78.6(79.45)94284
PVR 1646.65(1660.55)200576
RADICO 414.95(418.6)312427
RAIN 123.65(117.8)960578
RAJESHEXPO 590.5(578)265519
RALLIS 171.2(168.75)188788
RAMCOCEM 633.9(630.05)350313
RAMCOSYS 264.35(263.4)4895
RATNAMANI 919.35(920.5)685
RAYMOND 815.85(815.2)504484
RCF 65.65(67.05)618284
RCOM 13.8(13.45)69538057
RECLTD 125.45(126.05)4827699
REDINGTON 80.9(83.8)169989
RELAXO 748.8(757.4)7161
RELCAPITAL 224.3(221.8)4532073
RELIANCE 1135.9(1129.65)6382777
RELINFRA 314.2(310.1)5355029
RENUKA 11.2(11.3)872434
REPCOHOME 439.95(432.65)663215
RIIL 338.45(338.05)185660
RKFORGE 514.95(517.3)9320
RNAVAL 13.4(13.3)1287701
ROLTA 8.25(7.9)1622277
RPOWER 30.25(30.2)6481904
RTNPOWER 3.55(3.55)1359142
RUCHISOYA 8.1(8.4)626108
SADBHAV 214.1(220.3)88453
SADBHIN 94.9(96.2)15103
SAIL 50.4(51.05)10092890
SANOFI 6383.35(6293.65)4904
SBIN 303.15(301.65)12111480
SCHAEFFLER 5676.05(5662.4)4577
SCHNEIDER 97.65(97.3)24714
SCI 45.9(46.35)178457
SHARDACROP 308.4(299.4)40852
SHILPAMED 396.15(386.3)32172
SHK 178.8(178.25)7959
SHOPERSTOP 522.6(517.2)22465
SHREECEM 15822.95(15618.7)16308
SHRIRAMCIT 1731.85(1697.8)5636
SIEMENS 1060.55(1063.05)240413
SIMPLEXINF 190.95(190.8)19711
SINTEX 11.4(11.55)1439417
SITINET 10.35(10.5)13581
SJVN 25.65(25.65)269942
SKFINDIA 1937.9(1927.1)32317
SMLISUZU 633.8(637.2)4078
SNOWMAN 34.7(35)55324
SOBHA 461.35(475)161572
SOMANYCERA 361.55(368.25)113187
SONATSOFTW 306.9(305.05)77135
SOUTHBANK 15.9(15.6)20214995
SPARC 178.5(182.8)538117
SREINFRA 33.65(33.4)1523896
SRF 2041.2(2071.5)285261
SRTRANSFIN 1188.2(1188.2)1185014
STAR 525.25(514.45)2111625
STCINDIA 132.45(131.25)192593
SUNDARMFIN 1455.2(1461.8)5765
SUNDRMFAST 534.05(528.55)53979
SUNPHARMA 453.8(452.45)5879148
SUNTV 573.45(579.55)1265311
SUPREMEIND 1100.55(1113.7)32225
SUVEN 218.6(218.55)960217
SUZLON 5.3(5.3)17125160
SWANENERGY 98.65(99.9)204529
SYMPHONY 1146.75(1164.5)14200
SYNDIBANK 39.8(39.2)2668694
SYNGENE 541.95(541.1)13569
TAKE 153.05(150.65)112945
TATACHEM 694.9(695.35)238062
TATACOFFEE 99.5(100.05)253835
TATACOMM 531.2(515.6)708703
TATAELXSI 970.5(979.2)327270
TATAGLOBAL 216.45(214.3)1088457
TATAMOTORS 185.45(185.35)11874245
TATAMTRDVR 98.75(98.45)2944836
TATAPOWER 76.5(75.05)4222858
TATASPONGE 785.85(783.85)67710
TATASTEEL 474.55(475.05)5280293
TATASTLBSL 36.55(37.05)358059
TBZ 62.65(63.45)49027
TCS 1870.15(1867.8)2359280
TECHM 699.9(706.25)1922647
TEXRAIL 59.65(59)904053
THERMAX 1095.9(1121.4)15241
THOMASCOOK 232.2(233.15)141153
TIDEWATER 5356.8(5366.05)313
TIMKEN 579(580.75)10185
TITAN 961.2(968.3)1118736
TNPL 235(237.95)131249
TORNTPHARM 1946.95(1891.7)449206
TORNTPOWER 263.3(267.7)1065781
TREEHOUSE 4.55(4.65)40159
TRIDENT 70.7(72.75)1714872
TRITURBINE 114.5(113.95)24436
TTKPRESTIG 7522.65(7550.2)6315
TTML 3.85(3.85)562015
TV18BRDCST 38.05(38.85)4381707
TVSMOTOR 548.9(544)535038
TVSSRICHAK 2419.95(2419.95)2454
TVTODAY 376.65(371.95)24921
UBL 1416.65(1419.2)371896
UCOBANK 20.6(20.55)561232
UFLEX 271.15(270.05)23582
ULTRACEMCO 3887(3827.65)201711
UNICHEMLAB 209.25(201.05)177691
UNIONBANK 96.2(94.15)9593343
UNITECH 1.95(2)1141693
UPL 766.1(775.95)2584090
VAIBHAVGBL 707.3(707.55)1844
VAKRANGEE 45.85(43.7)10040224
VEDL 196.3(198.9)12554389
VIDEOIND 3.05(3.2)94079
VIJAYABANK 48(48.7)1611094
VINATIORGA 1568.15(1598.35)14084
VIPIND 512.05(509.6)394627
VOLTAS 533.3(531.05)1219163
VRLLOG 288.75(285.5)38161
VSTIND 3265.6(3244.75)369
VTL 1104.55(1083.85)22197
WABAG 306.65(304.85)364253
WABCOINDIA 6407.35(6339.45)4027
WELCORP 128.45(132.75)295884
WELSPUNIND 61.5(62.6)292231
WHIRLPOOL 1459.6(1460.1)7593
WIPRO 336.55(329.8)9896290
WOCKPHARMA 510.45(509.4)681044
WONDERLA 273.75(269.8)27539
ZEEL 452.1(456.8)19555435
ZEELEARN 36(35.35)68391
ZYDUSWELL 1351.6(1366.9)2410



● సొంతంగా లేస్‌లు కట్టుకునే షూ

బూట్లు వేసుకున్నప్పుడల్లా లేస్‌లు కట్టుకోవడం పెద్ద తలనొప్పి. అదే బూట్లలో కాలు పెట్టగానే దానంతట అదే లేస్‌లు బిగించుకుంటే? నైకీ సంస్థ బాస్కెట్ బాల్ ఆటగాళ్ల కోసం అలా సొంతంగా లేస్‌లు కట్టుకునే షూను రూపొందించింది. ఆ బూట్లకు ఉండే బటన్ల ద్వారా గానీ, స్మార్ట్ ఫోన్ యాప్ ద్వారా గానీ లేస్‌లను బిగించవచ్చు లేదా వదులుగా చేయవచ్చు. ఫిబ్రవరి 17న మార్కెట్‌లోకి తేనున్న వీటి ధర రూ.25 వేలుగా ఉండనుంది.

ఈ పాపకు రక్తదాతలు లేరు



- 'న్యూరోబ్లాస్టోమా'తో బాధపడుతున్న రెండేళ్ల పాప
- ప్రపంచం మొత్తం వెతికినా ఇప్పటిదాకా దొరికింది నలుగురు దాతలే
- ఇంకా ఆరుగురు కావాలి


ఈ పక్కన చిత్రంలో కనిపిస్తున్న పాప పేరు జైనాబ్ మొఘల్. వయసు రెండేళ్లు.. బుడి బుడి నడకతో.. బుజ్జి బుజ్జి మాటలతో.. బొమ్మలతో ఆడుకోవాల్సిన వయసులో ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య పోరాడుతోంది. ఆమె కడుపులో పుట్టిన మాయదారి పుండు.. ముఖంపై చిరునవ్వును దూరం చేసింది. కొద్దికొద్దిగా పెద్దదై 'న్యూరోబ్లాస్టోమా' కేన్సర్‌కు దారితీసి విషమ దశకు చేర్చింది. చికిత్స చేయాలంటే రక్త మార్పిడి తప్పనిసరి. కానీ, అక్కడే అసలు సమస్య. ఆమెకు సరిపోయే రక్తదాతలు పది మంది కావాలి. కానీ, ఆ పదిమంది కూడా దొరకడం లేదు. ప్రపంచం మొత్తమ్మీదా కనీసం పది మంది రక్త దాతలు దొరకడం లేదా అంటే.. జైనాబ్ రక్తంలో ఇండియన్-బీ అనే ప్రొటీన్ లేదు. కానీ, చాలా మంది ఎర్ర రక్త కణాల్లో ఈ ప్రొటీన్ కచ్చితంగా ఉంటుంది. దీంతో ఎవ్వరి రక్తంతోనూ ఆమె రక్తం సరిపోలడం లేదు. వన్ బ్లడ్ అనే సంస్థ అష్ట కష్టాలు పడి అమెరికాలో ఒకర్ని, యూకేలో ముగ్గుర్ని దాతల్ని సంపాదించింది. అందులో ఒక దాత ఈ నెల 4నే లభించడం గమనార్హం. అయితే, జైనాబ్‌కు పూర్తిస్థాయి చికిత్స మొదలు పెట్టాలంటే కచ్చితంగా పది మంది దాతలు కావాలి. వన్ బ్లడ్ సంస్థ.. ప్రపంచ వ్యాప్తంగా తన వద్ద రిజిస్టర్ అయిన లక్షా 20వేల మందిని, 59 రకాల అరుదైన రక్త నమూనాలతో పోల్చి చూసినా జైనాబ్ రక్తంతో సరిపోయే రక్తం ఉన్న మరో ఆరుగురు దొరకలేదు.

రక్తం సరిపోవాలంటే మూడు షరతులు

దక్షిణ ఫ్లోరిడాకు చెందిన జైనాబ్ తల్లిదండ్రులు పాకిస్థానీయులు. అందువల్ల దాతలు పాకిస్థానీ, ఇండియన్, ఇరానీ దేశస్థులు అయ్యుండాలి. పైగా వారి ఎర్రరక్త కణాల్లో ఇండియన్-బీ ప్రొటీన్ ఉండకూడదు. అదీకాక, వారి రక్త గ్రూపు ఓ లేదా ఏ పాజిటివ్ అయ్యి ఉండాలి. ఈ మూడు దేశాల్లో ఇప్పటికే వెయ్యి మందిని పరీక్షించినా జైనాబ్ రక్తంతో సరిపోలలేదు. ఇప్పటికే కేన్సర్‌కు కీమోథెరపీ తీసుకుంటున్న ఆమెకు బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సి ఉంది. అందుకు రక్త మార్పిడి తథ్యం. అందువల్ల తమ బిడ్డను బతికించేందుకు దాతలు ముందుకు రావాలని జైనాబ్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

న్యూరోబ్లాస్టోమా అంటే..

నాడీ వ్యవస్థ లేదా ఇతర కణజాలాల్లోని ప్రత్యేకమైన నాడీ కణాలకు కేన్సర్ వ్యాధి సోకడాన్ని న్యూరోబ్లాస్టోమా అంటారు. అడ్రినల్(అధివృక్క) గ్రంథి వద్ద మొదలై వెన్నెముక, మెడ, ఛాతి, పొత్తి కడుపు, కాలేయం, చర్మభాగాలకు వ్యాపిస్తుంది. అమెరికాలో ఏటా 800 మంది పిల్లలు ఈ వ్యాధికి చికిత్స పొందుతున్నారు. అందులో ఎక్కువ శాతం 5 ఏళ్లలోపు వాళ్లే.




పత్తి గింజలు మొలకెత్తినట్లు రోవర్ పంపిన చిత్రం



అదిగదిగో చందమామ.. అక్కడ ఓ చెట్టు.. ఆ చెట్టు కింద కూర్చున్న ఓ ముసలామె రాట్నం వడుకుతూ ఉంది. ఆ రాట్నం నుంచి నూలు పోగు వచ్చిందా? నూలు పోగు అయితే వచ్చింది గానీ రాట్నం నుంచి కాదు. పత్తి మొక్క నుంచి. అవును! జీవ పదార్థం జాడ లేని జాబిల్లిపై చైనా శాస్త్రవేత్తలు అద్భుతాన్ని సృష్టించారు. చరిత్రలోనే తొలిసారిగా చంద్రుడిపై చీకటివైపున పత్తి గింజలు మొలకెత్తేలా చేశారు. ఈ ఘనతను సొంతం చేసుకున్న రోవర్ పేరు.. చాంగే-4. భూమి నుంచి మనకు కనిపించే చంద్రుడిపై నేల వెలుగులీనుతూ ఉంటుంది. అవతలి భాగం ఇందుకు పూర్తి విరుద్ధం. చీకటిగా.. గుట్టలు, లోయలతో నిండి ఉంటుంది. ఇక్కడి 'ఐట్ కెన్ బేసిన్' ప్రాంతంలో ఈ నెల 4న చాంగే-4 దిగింది. వెళ్తూ.. వెళ్తూ.. పది రకాల విత్తనాలను తీసుకెళ్లింది. దీనిలో భాగంగానే ప్రత్యేకమైన వాతావరణం, ఉష్ణోగ్రత వద్ద పత్తి గింజలు మొలకెత్తాయి. వాటిని రోవర్ తన కెమెరాల్లో బంధించగా ఒక ఫొటోను చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(సీఎన్‌ఎస్‌ఏ) విడుదల చేసింది. మరో 100 రోజుల్లో మరిన్ని గింజల్ని మొలకెత్తేలా చేయనున్నట్లు వెల్లడించింది. పత్తి గింజలతో పాటు ఆలుగడ్డలు, డ్రోసోఫిలా తదితరాలు కూడా త్వరలో పండుతాయని తెలిపింది.

చంద్రుడిపై తొలి పంట

మొలకెత్తుతున్న పత్తి గింజలు.. తొలిసారి పండుతున్న జీవ పదార్థం.. త్వరలో ఆలుగడ్డలు, ఈస్ట్ కూడా..చైనా శాస్త్రవేత్తల అద్భుత ఘనత



చంద్రుడిపై సీఎన్‌ఎస్‌ఏ లక్ష్యాలు

- చంద్రుడి ఉపరితలం నుంచి రాళ్లు, మట్టి నమూనాలను సేకరించేందుకు ఈ ఏడాది చివరి నాటికి చాంగే-5 మిషన్‌ను ప్రయోగించనుంది.
- చంద్రుడి దక్షిణ ధ్రువ అన్వేషణకు చాంగే-6ను పంపనుంది.
- అక్కడి ఉపరితలాన్ని, మూలక మిశ్రమాలను, వాతావరణాన్ని అధ్యయనం చేసేందుకు చాంగే-7ను రోదసిలోకి పంపనుంది.
- చాంగే-8.. చంద్రుడి ఉపరితల సాంకేతిక విశ్లేషణపై దృష్టి సారించనుంది.
- 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో ఒక ల్యూనార్ బేస్‌ను కట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.
- 2020నాటికి చైనా శాస్త్రవేత్తలు చందురుడిపై కాలు మోపడానికి ప్రణాళికలు రెడీ చేసుకున్నారు.

భూమిపై వాతావరణంతో పోల్చితే చంద్రుడిపై వాతావరణం పూర్తి తేడాగా ఉంటుంది. సూర్యుడి అతినీలలోహిత కిరణాలు చంద్రుడి ఉపరితలంపై నేరుగా చేరతాయి. ఉష్ణోగ్రత కూడా 127 డిగ్రీల నుంచి -173 డిగ్రీల మధ్య ఉంటుంది. ఈ వాతావరణం జీవం మనుగడకు ఏమాత్రం సరిపోదు. అందుకే చైనా శాస్త్రవేత్తలు 'లూనార్ బయోస్ఫియర్' పేరిట ఒక ప్రత్యేకమైన స్థూపాకార డబ్బాను రూపొందించారు. దాన్ని అల్యూమినియం మిశ్రమంతో తయారు చేశారు. 18 సెంటీమీటర్ల పొడవు, 16 సెంటీమీటర్ల వ్యాసంతో 3 కిలోల బరువు ఉంటుందది. అందులో గింజలు, నీళ్లు, పోషక ద్రావణాలు ఉంచి, నిరంతర పర్యవేక్షణకు కెమెరా, డేటా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను, చుట్టూ ఇన్సులిన్ లేయర్‌ను ఏర్పాటు చేశారు. దానిలోకి సూర్యుడి వెలుతురు తగిలేలా ఓ ట్యూబ్‌ను కూడా ఏర్పాటు చేశారు. శక్తి పొందేందుకు టిన్‌పై సోలార్ ప్యానెళ్లు ఉంచారు. వెలుతురు లేని సమయంలో మొక్కలకు శక్తి సోలార్ ప్యానెళ్ల ద్వారానే అందుతుంది. కాగా, ఈ నెల 4న రోవర్ చంద్రుడి ఉపరితలం మీదకి చేరిన వెంటనే జీవ పదార్థ తయారీ (పత్తి గింజల మొలక) ప్రక్రియ మొదలైంది. ఈ పరిశోధన వెనక చైనాకు చెందిన 28 వర్సిటీలు ఉన్నాయి. 2036 నాటికి చంద్రుడిపై నివాసం ఏర్పాటే లక్ష్యంగా చైనా ఈ పరిశోధనలు చేస్తోంది.



మాంసంపై తగ్గుతున్న మక్కువ!



చికెన్, మటన్, ఫిష్.. ఈ పేర్లు వినగానే నోరూరిపోతుంది. దక్షిణాది రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అయితే మరీ ఇష్టంగా తింటుంటారు. ఇప్పుడు వీరి దృష్టి కూరగాయలు, ఆకుకూరలపై మళ్లుతోందని సర్వేలో తేలింది. డయాబెటిస్ వంటి అనారోగ్య సమస్యలు పెరిగిపోవడమే ఇందుకు కారణమని పరిశోధకులు చెబుతున్నారు. ఇప్సోస్ అనే మార్కెట్ రీసెర్చ్ సంస్థ జరిపిన సర్వేలో దాదాపు 63 శాతం మంది మాంసం స్థానంలో ఆకుకూరలు తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారని తేలింది. అంతేకాదు అభివృద్ధి చెందిన దేశాల్లో బ్రిటన్‌లో 12%, జపాన్‌లో 13 శాతం మంది ఆర్గానిక్ ఫుడ్ తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తుండగా.. భారత్‌లో మాత్రం ఆ సంఖ్య 57 శాతం ఉంది. 'భారతీయుల ఆహారపుటలవాట్లపై ఇప్సోస్ అధ్యయనం' పేరుతో ఈ సర్వే నిర్వహించారు.

నకిలీ వార్తల్ని పసిగట్టే ఫేకో మీటర్

అభివృద్ధి చేసిన ట్రిపుల్‌ఐటీ-హెచ్ శాస్త్రవేత్తలు



ఫేకో మీటర్‌ను రూపొందించిన ట్రిపుల్‌ఐటీ శాస్త్రవేత్తలు

ఒక ప్రముఖ వ్యక్తి మరణించాడనే వార్త నెట్‌లో ఫ్లాష్‌లా వెలుగుతుంది. అది నిజమో కాదో తెలుసుకొనేలోగా ప్రపంచమంతా విస్తరిస్తుంది. ఇలాంటి వార్తలు ఒకటీ రెండు కాదు.. ప్రతిరోజూ అనేకం కనిపిస్తూ ఉంటాయి. అయితే ఈ నకిలీ వార్తలను గుర్తించేందుకు హైదరాబాద్‌కు చెందిన ట్రిపుల్‌ఐటీ శాస్త్రవేత్తలు ఒక వినూత్న పరిష్కారం కనిపెట్టారు. వీరు అభివృద్ధి చేసిన ఫేకో మీటర్ అనే సెర్చ్ ఇంజన్ నకిలీ వార్తలను క్షణాల్లో పసిగట్టేస్తుంది. ఈ సెర్చ్ ఇంజన్‌కు సంబంధించిన విశేషాలను ట్రిపుల్ ఐటీకి చెందిన ప్రొఫెసర్ వాసుదేవన్ వర్మ వివరించారు. "ట్రిపుల్‌ఐటీలో మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై పరిశోధనలు చేస్తున్నాం. సమాచారం మన జీవితాల్లో కీలకమైన పాత్ర పోషిస్తుంది కాబట్టి దీనికి సంబంధించిన విషయంపై అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పరిశోధనలు చేయాలనుకున్నాం. నాలుగైదు అంశాలు ఎంపిక చేసుకున్నాం. వీటిలో నకిలీ వార్తలను పసిగట్టే సెర్చ్ ఇంజన్ ఒకటి" అన్నారు.

ఎలా పనిచేస్తుందంటే..

ఒక వార్త హెడ్డింగ్‌లేదా ట్వీట్‌ను ఈ సెర్చ్ ఇంజన్‌లో పేస్ట్ చేస్తే వార్త కచ్చితత్వం ఎంతో చెప్పేస్తుంది. వార్త హెడ్డింగ్‌ను పేస్ట్ చేసిన వెంటనే సెర్చ్ ఇంజన్‌లోని అల్గారిథమ్స్.. వార్త ఎంత కచ్చితమైనదనే విషయాన్ని విశ్లేషిస్తాయి. ఆ తర్వాత ఆ వార్త ఎక్కడెక్కడ ప్రచారమైంది? ఎవరు ప్రచారం చేశారనే విషయాన్ని గుర్తించి వీటి ఆధారంగా ఆ వార్తకు ఆకుపచ్చ లేదా ఎర్ర రంగులను ఇస్తుంది. ఆకుపచ్చ రంగు ఎక్కువగా ఉంటే కచ్చితత్వం ఉన్నట్లు లెక్క. ఎర్ర రంగు ఉంటే తప్పుడు వార్త కింద లెక్క. ఈ సెర్చ్ ఇంజన్ రూపకల్పలో గ్రామీణర్ అనే కంపెనీ సహాయ సహకారాలు అందించగా.. ఐఐఐటీ-హెచ్‌లోని నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ల్యాబ్ కీలకమైన పాత్ర పోషించింది. ఇది ఇంగ్లిష్‌తోపాటు స్పానిష్, చైనీస్ భాషల్లో వచ్చే వార్తలను బేరీజు వేయగలదు. ఇది కేవలం మనుషులకు సహకరించటానికి ఉద్దేశించినదే తప్ప వారి మేధకు, సృజనాత్మకతకు ప్రత్యామ్నాయం కాదు.

- స్పెషల్ డెస్క్

బ్యాగులో.. ఆమె హృదయం!

ఆ యువతి పేరు.. రెబెక్కా హెండర్సన్. వయసు.. 24 ఏళ్లు. అందరిలాగే బాగా చదువుకోవాలని.. పెళ్లి చేసుకోవాలని.. పిల్లల్ని కనాలన్న ఆశ. కానీ, గుండెకు వచ్చిన కేన్సర్ భూతం.. ఆమె కలల్ని కల్లలు చేయాలని చూసింది. వైద్యుల వద్దకు వెళితే గుండెను తీసేయాలి.. కృత్రిమ గుండె అమర్చాలి అని తేల్చేశారు. ఆశలే శ్వాసగా బతికే రెబెక్కా.. సర్జరీకి సిద్ధమై కృత్రిమ గుండెను అమర్చుకుంది. అయితే, ఆమెకు మరో పెద్ద సవాలు ఎదురైంది. ఆ కృత్రిమ గుండెను నిజమైన గుండె స్థానంలో కాకుండా బ్యాగులో ఉంచాల్సిన పరిస్థితి. అదీకాక, కృత్రిమ గుండెకు ఉండే బ్యాటరీ రెండున్నర గంటల పాటే పనిచేస్తుంది. చార్జింగ్ అయిపోయిందా? ఆమె తుది శ్వాస విడవాల్సిందే. అందుకే 24 గంటల పాటు తన తల్లిదండ్రులను వెంటే ఉంచుకుంటోంది. మాస్టర్స్ పూర్తి చేయాలన్న సంకల్పంతో బ్యాగులో పుస్తకాలతో పాటు గుండెను కూడా మోసుకొని కాలేజీకి వస్తోంది ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ విద్యార్థిని.






సంతానోత్పత్తి మానవ హక్కుగా ఐరాస ఎన్నడో తీర్మానించింది. లైంగిక, దైహిక జన్యులోపాల కారణంగా సంతతికి నోచుకోని దంపతులకు సరగసి వైద్య ప్రక్రియ మానవాళికి సైన్సు అందించిన వరం. క్రమేణా పెడదోవ పట్టిన ఈ ప్రక్రియ వ్యాపార అవకాశంగా మారి, పేదరికం ఆసరాగా మహిళల గర్భాల్ని కొల్లగొట్టే దుర్దశకు చేరింది.

అద్దె గర్భాల వ్యాపారానికి చెక్

లా-లోచనం

Law lochanam



దగాకోర్లూ, దళారులూ విస్తరించి, 400 మిలియన్ డాలర్ల ఆదాయంతో భారత్ అద్దె గర్భాల పర్యాటక కేంద్రంగా పేరు మోయడం బాధాకరం. అనైతిక వైద్య చర్యలకు తలుపులు తెరిచిన క్లినిక్‌లు 'బిడ్డల షాపింగ్'కు దార్లు తెరిచిన వ్యాపార కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. పేద మహిళలను దోచుకోవడం మొదలైంది. ఈ క్రమంలో ఇన్నాళ్ళూ కోర్టులే తమ గుణాత్మకమైన తీర్పులతో కొంతమేర అశక్త సరగేట్ తల్లులకు అండగా నిలిచాయి. సరగేట్ తల్లికి కూడా సాధారణ ఉద్యోగిని లాగానే ఏడాది పాటు ప్రసూతి సెలవు మంజూరు చేయాలని బొంబాయి హైకోర్టు (హేమావిజయ కేసు-2015), వారు ప్రసూతి సెలవుకూ, వైద్య ఖర్చులకూ అర్హులేనని కేరళ హైకోర్టు (గీత కేసు-2015) తీర్మానించాయి. అయితే భారత సమాజంలో పాతుకుపోయిన విశ్వాసాలూ, సామాజిక కట్టుబాట్లూ, పేదరికం కారణంగా సరగసీ జననాల నైతికత మీద సందేహాలు పాతుకుపోయాయి. క్రమేణా ఆధునిక విజ్ఞానం అవగాహనలోకి రావడం మొదలైనా పెచ్చరిల్లిన వ్యాపార ధోరణులతో గత పదేళ్ళుగా సరోగసీ ప్రక్రియ న్యాయపరమైన చిక్కుల నెదుర్కొంది. సరోగసీని చట్టపరంగా గుర్తించి, క్రమబద్ధీకరణ చేయాల్సిన అవసరాన్ని 'బేబీ మాంజీ కేసు'లో సుప్రీం ధర్మాసనం నొక్కి చెప్పడంతో ప్రభుత్వంలో కదలిక ఏర్పడింది. దీంతో సరోగసీ క్రమబద్ధీకరణ బిల్లు 2016లో రూపొంది, ఇటీవల లోక్‌సభలో ఆమోదం పొందడంతో త్వరలో చట్టం వెలువడి, అమలయ్యే అవకాశం ఏర్పడింది. ప్రధానంగా ఈ చట్టం వ్యాపారాత్మక సరోగసీ ప్రక్రియలకు అడ్డుకట్ట వేసేందుకే పెద్దపీట వేయడంతో కొన్ని కొత్త సమస్యలు తలెత్తే అవకాశముంది. కొత్త చట్టం ప్రకారం కమీషన్డ్ దంపతులు చట్టబద్ధంగా వివాహితులై కనీసం అయిదేళ్లుగా కాపురం చేస్తూ ఉండాలి. తన గర్భాన్ని సరోగసీకి ఇచ్చేందుకు సిద్ధమైన మహిళ దంపతులకు సమీప బంధువు కావడం తప్పనిసరి. స్వలింగ సంపర్కులకు, సింగిల్ పేరెంట్స్‌కూ సంతానం పొందే అవకాశం మృగ్యం కావటం చట్టంలో ఒక లోపం. 2016లో బిల్లు రూపొందిన తర్వాత కాలంలో స్వలింగ సంపర్కాన్నీ, వారి వివాహాల్నీ హక్కుగా సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ తీర్పుకు అనుగుణంగా బిల్లులో మార్పులు చేయాల్సి ఉంది. సరగేట్ మహిళ గర్భాన్ని మోస్తున్న కాలంలో, వైద్యప్రక్రియ వికటించి ఆమెకు ప్రాణ, దైహిక హాని జరిగితే ఆమె సొంత సంతానానికి పోషణ, రక్షణ కల్పించాల్సిన అంశాన్నీ, జీవిత, ప్రమాద బీమా సదుపాయాలను ఏర్పర్చాల్సిన బాధ్యతనూ చట్టం విస్మరించింది. సరగసీ ప్రక్రియలో అద్దె గర్భాన్ని మోసే మహిళలకు ఎలాంటి పారితోషికం చెల్లించరాదని నిషేధించటం రెగ్యులేషన్ల పేరిట విధించే నిషేధాలు, ఇక ముందు అద్దెగర్భాల బ్లాక్ మార్కెట్‌కు దారితీస్తాయా? ఈ విపరీతాన్ని ఎదుర్కొనేందుకు మన అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందా? ఉచితంగా బిడ్డల్ని మోసే 'ఉదార దాతలు' ముందుకొస్తారా? ఏతావాతా ఈ చట్టం తీరుతెన్నులు ఎలా ఉండబోతున్నాయనేవి శేషప్రశ్నలే!

- వేదాంతం సీతారామావధాని,
భారత సుప్రీంకోర్టు మాజీ సెక్రటరీ జనరల్, ఈ మెయిల్ :
sitharam.avadhani@gmail.com

ముగ్గురు జడ్జిల వల్లే అయోధ్య కేసు ఆలస్యం

- దోషుల్లో కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలూ ఉన్నాయి
- ఆలయ నిర్మాణానికి ఆర్డినెన్సే సరైన మార్గం
- ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి ఇంద్రేశ్ వ్యాఖ్యలు

పుణె, జనవరి 16: కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, సుప్రీం కోర్టులోని ఇద్దరు, ముగ్గురు న్యాయమూర్తులు న్యాయ ప్రక్రియను ఆలస్యమయ్యేట్లు చేయడం ద్వారా అయోధ్యలో రామాలయ నిర్మాణానికి అడ్డం పడుతున్నారని ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి ఇంద్రేశ్ కుమార్ వ్యాఖ్యానించారు. వారిని ద్రోహులుగా అభివర్ణించారు. నిర్ణయం ఆలస్యం చేస్తోందని బీజేపీని తప్పుబట్టడంలో అర్థం లేదన్నారు. సత్వరమే న్యాయం జరిగేందుకు ప్రభుత్వం పార్లమెంటును సమావేశపరచి చర్చించాలని డిమాండ్ చేశారు. ఆలయ నిర్మాణానికి ఆర్డినెన్స్ తేవడమే సరైన మార్గమన్నారు. సాధ్యమైనంత త్వరగా ఆలయ నిర్మాణం జరగాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నట్లు చెప్పారు. అయోధ్య కేసు విచారణను సుప్రీంకోర్టు 29వ తేదీకి వాయిదా వేసిన నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ రాష్ట్రీయ ముస్లిం మంచ్ అధ్యక్షుడైన ఇంద్రేశ్ మాట్లాడుతూ, "కాబా, వాటికన్ సిటీ, దీక్ష భూమి, స్వర్ణదేవాలయం.. ఇలా అన్ని మతాల ప్రధాన వేదికలకు ప్రపంచమంతటా గౌరవం లభిస్తుంది. రాముడు పుట్టిన మందిరం విషయంలో ఎందుకింత వివక్ష? ప్రపంచ దేశాలు దీనికి సమాధానం చెప్పాలి" అన్నారు. "ఇది ఏదో ఒక పార్టీ లేదా మతం బాధ్యత కాదు. దేశంలోని 125 కోట్ల మంది ప్రజలకు ఈ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ఉంది" అన్నారు.

కుంభమేళా ప్రారంభం!

సంక్రాంతినాడు ప్రయాగ్‌రాజ్‌లో.. 2.25 కోట్ల మంది పుణ్యస్నానాలు





కుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగం వద్ద పోటెత్తిన భక్తులు, (ఇన్‌సెట్‌లో) పవిత్ర స్నానం ఆచరిస్తున్న ఓ సాధువు

లఖనవూ, జనవరి 16: హిందువులకు పరమ పవిత్రమైన కుంభమేళా బుధవారం ప్రారంభమైంది. మకర సంక్రాంతి సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో బుధవారం 2.25 కోట్ల మంది భక్తులు తొలి పుణ్యస్నానాలు(షాహీ స్నాన్) ఆచరించారు. 13 అఖాడాలకు చెందిన సాధు, సన్యాసులు కూడా పుణ్యస్నానాలు చేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ విషయం ప్రకటించారు. త్రివేణి సంగమం వద్ద కుంభ మేళా మార్చి 4 వరకు కొనసాగుతుంది. ఈ మేళా నిర్వహణకు యూపీ సర్కారు రూ.4,236 కోట్లు కేటాయించింది. 2013లో జరిగిన మహాకుంభమేళాకు అప్పటి ప్రభుత్వం 1300 కోట్లే వెచ్చించింది. దీన్నిబట్టి చరిత్రలో ఇదే అత్యంత ఖరీదైన కుంభమేళాగా పేర్కొనవచ్చు.

రాముడి గుడి కోసం జ్యోతి ప్రజ్వలన

అయోధ్యలో సాధ్యమైనంత త్వరగా రామాలయ నిర్మాణాన్ని చేపట్టాలని ఆకాంక్షిస్తూ అసంఖ్యాకమైన సాధువులు 33 వేల దీపాలను వెలిగించారు. ఒక నెలలోగా 11 లక్షల దీపాలను వెలిగించాలని వారు లక్ష్యంగా పెట్టుకున్నారు. కుంభమేళా సమాప్తమైన వెంటనే రామమందిర నిర్మాణం ప్రారంభమవుతుందని మోనీ మహారాజ్ అనే సాధువు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ఏడాది నుంచే 10% కోటా

న్యూఢిల్లీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో ఆర్థిక బలహీన వర్గాలకు 10% రిజర్వేషన్‌ను ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తామని హెచ్‌ఆర్‌డీ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దీని కోసం ఉన్నత విద్యా సంస్థల్లో 25% అదనపు సీట్లు కేటాయిస్తామని తెలిపింది. హెచ్‌ఆర్డీ మంత్రిత్వ శాఖ, యూజీసీ, ఏఐసీటీఈల మధ్య జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని, వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని హెచ్‌ఆర్డీ మంత్రి ప్రకాశ్ జావడేకర్ అన్నారు. దేశవ్యాప్తంగా 40 వేల కాలేజీలు, 900 యూనివర్సిటీలు ఉన్నాయని, వాటిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్‌కు ఆటంకం కలగకుండా అదనపు సీట్లు కేటాయిస్తామని చెప్పారు. అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, ప్రైవేటు యూనివర్సిటీలు సైతం ఈడబ్ల్యూఎస్ కోటా అమలుకు అంగీకరించాయన్నారు. అదనపు సీట్లకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేసుకోవాలని విద్యాసంస్థలకు సూచించారు. ఇప్పటికే ప్రవేశ పరీక్షలు పూర్తయిన ఐఐటీ, ఐఐఎంల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు కోసం కసరత్తు చేస్తున్నామన్నారు. 10% రిజర్వేషన్ల అమలు కోసం దేశవ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో అదనంగా 33 లక్షల సీట్లు సృష్టించాల్సి ఉంటుందని ఓ అధికారి తెలిపారు. కాగా, ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేసిన తొలి రాష్ట్రంగా గుజరాత్ నిలిచిందని సీఎం విజయ్ రూపానీ తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్‌ను ఈ నెల 14 నుంచి అమలు చేశామని తెలిపారు. నిజానికి గుజరాత్ సర్కారు 10% ఈడబ్ల్యూఎస్ కోటాను 2016 ఏప్రిల్ 29వ తేదీనే ప్రకటించింది. అయితే కోర్టు కేసుల వల్ల అది అమలు కాలేదు.

అరుణ్ జైట్లీకి కేన్సర్

(మూడో పేజీ తరువాయి)

చేయకున్నా ముప్పే. ఎందుకంటే ఆయనకు వచ్చిన కేన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు చాలా వేగంగా పాకే లక్షణం గలది. కాగా.. అరుణ్‌జైట్లీ వేగంగా కోలుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆకాంక్షించారు. జైట్లీ భావాలు, ఆలోచనలతో తాము నిత్యం విభేదించినప్పటికీ.. ఆయన ఆరోగ్యం బాగోలేదని తెలిసి కలత చెందానన్నారు. ఈ కష్టకాలంలో తాము ఆయనకు, ఆయన కుటుంబసభ్యులకు అండగా నిలుస్తామని రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు. అలాగే, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్.. జైట్లీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


ఈసారి ఎవరు?

జైట్లీ కేన్సర్ వ్యాధికి సర్జరీ నిమిత్తం అమెరికాకు వెళ్లినందున ఫిబ్రవరి 1న మోదీ సర్కార్ చివరి బడ్జెట్‌ను ఎవరు ప్రవేశపెడతారనే విషయం చర్చనీయాంశమైంది. చివరి బడ్జెట్ అయినప్పటికీ ఈ సారి రైతు బంధు తరహా నగదు బదిలీ, చిన్న, సన్నకారు రైతులకు వడ్డీ లేని బ్యాంకు రుణాలు, ఆదాయపన్ను చెల్లింపుదారులకు మినహాయింపు పరిమితి పెంచడం వంటి కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశాలున్నట్టు సమాచారం. గత ఏడాది కూడా అరుణ్ జైట్లీ మూత్రపిండాల మార్పిడి నిమిత్తం ఆస్పత్రిలో ఉండడంతో.. రైల్వే మంత్రి పీయూష్ గోయెల్ ఆర్థిక మంత్రిగా తాత్కాలిక బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

అసలేంటీ మృదు కణజాల కేన్సర్?

శరీరంలోని అవయవాలు, ఇతర భాగాలను మృదు సంధాయక కణజాలం చుట్టి ఉంటుంది. ఇందులో ఏర్పడే కేన్సర్‌నే సర్కోమా అంటారు. ముఖ్యంగా ఎముకలు లేదా కండరాలకు వస్తుంది. ఎముకల్లో ఏర్పడే కేన్సర్‌ను ఆస్టియో సర్కోమా అంటారు. కండరాలు, నరాలు, ఫైబ్రస్ కణజాలం, రక్తనాళాలు, చర్మాంతర్గత కణజాలాల్లో ఏర్పడే కేన్సర్‌ను మృదు కణజాల (సాఫ్ట్ టిష్యూ) కేన్సర్ అంటారు. ఇది శరీరంలోని ఏ భాగంలో అయినా రావొచ్చు. ఎక్కువగా కాళ్లు, చేతుల్లో ఏర్పడుతుంది. జైట్లీకి కూడా తొడ భాగంలోనే దీన్ని గుర్తించారు. వీటితో పాటు తల, మెడ, అంతర్గత అవయవాలు, ఉదర కోశం వెనకాల, మొండేనికి ఈ కేన్సర్ వస్తుంది. శరీరంలోని ఇతర భాగాలకు విస్తరించిన తర్వాతనే ఇది బయటపడే అవకాశం ఉందని యూకేలోని నేషనల్ హెల్త్ సర్వీసెస్ (ఎన్‌హెచ్‌ఎస్) వెల్లడించింది. సర్జరీ, రేడియోథెరపీతో పాటు కీమోథెరపీ ద్వారా చికిత్స అందించవచ్చు. అయితే ఈ కేన్సర్ మరింత విస్తరించకుండా మాత్రమే ఇది ఉపయోగపడుతుందని, పూర్తిగా తగ్గించడం సాధ్యం కాదని ఎన్‌హెచ్‌ఎస్ పేర్కొంది.

అమిత్‌షాకు స్వైన్‌ఫ్లూ



న్యూఢిల్లీ, జనవరి 16 : బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా స్వైన్‌ఫ్లూతో బాధపడుతున్నారు. ఛాతీ, శ్వాస సంబంధ సమస్యలతో బుధవారం రాత్రి 9 గంటలకు ఆయన న్యూఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యశాలలో చేరినట్లు తెలుస్తోంది. కాగా, తనకు స్వైన్ ఫ్లూ వచ్చిన విషయాన్ని ధ్రువీకరిస్తూ అమిత్‌షా ట్వీట్ చేశారు. ప్రజలందరి ప్రేమ, ఆశీస్సులతో త్వరలోనే కోలుకుంటానని తెలిపారు.వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 20 నుంచి నెలపాటు పశ్చిమ బెంగాల్‌లో జరిగే ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. అనారోగ్యం బారినపడటంతో అమిత్‌షా ప్రచార షెడ్యూల్ అమలు ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు కేంద్ర న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సైతం ముక్కుకు సంబంధించిన అనారోగ్య సమస్యతో సోమవారం ఎయిమ్స్‌లో చేరారు. అంతకుముందు ఐసీయూలో ఉన్న ఆయనను బుధవారం సాధారణ వార్డుకు తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు.

బీజేపీని వెంటాడుతున్న అనారోగ్యం

గత ఐదేళ్ల కాలంలో నరేంద్రమోదీ మంత్రి మండలిలోని పలువురు మంత్రులు తీవ్ర అనారోగ్యాల బారిన పడ్డారు. విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ మూత్రపిండ సంబంధిత సమస్యలతో బాధపడుతూ 2016లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నారు. జైట్లీ కూడా కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయనకు కేన్సర్ ఉన్నట్టు బయటపడింది. ఆయనకన్నా ముందు.. ఇద్దరు మంత్రులు కేన్సర్ బారిన పడ్డారు. వారిలో ఒకరు రసాయనాలు, ఎరువులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ బాధ్యతలు నిర్వర్తించిన అనంత్‌కుమార్ కాగా.. మరొకరు రక్షణ మంత్రిగా విధులు నిర్వహించిన మనోహర్ పర్రీకర్. ఊపిరితిత్తుల కేన్సర్‌తో బాధపడిన అనంత్ కుమార్ గత ఏడాది కన్నుమూశారు. మనోహర్ పర్రీకర్.. క్లోమ కేన్సర్‌కు అమెరికాలో చికిత్స చేయించుకుని వచ్చి ప్రస్తుతం గోవా ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఇక.. మోదీ కేబినెట్‌లో పర్యావరణ శాఖ బాధ్యతలు నిర్వహించిన అనిల్ మాధవ్ దవే హృద్రోగంతో 2017లో తుదిశ్వాస విడిచారు.

'రాఫెల్' మూల్యం ఎంత?

- ఫ్రాన్స్ సగం ధరకే కొంటున్నట్లు వార్తలు
- వెంటనే ఖండించిన ఫ్రాన్స్ ప్రభుత్వం
- 'రాఫెల్' నివేదిక వెల్లడించం: కాగ్

న్యూఢిల్లీ, జనవరి 16 : రాఫెల్ యుద్ధ విమానాల ధరపై కొత్త వివాదం భగ్గుమంది. భారత్ కొంటున్న ధరలో సగానికే ఫ్రాన్స్ సర్కారు రాఫెల్ విమానాలను సమీకరించుకుంటోందన్న వార్తలు గుప్పుమన్నాయి. అయితే... దీనిపై ఫ్రాన్స్ ప్రభుత్వం వెంటనే వివరణ ఇచ్చి, వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ప్రయత్నించింది. ఫ్రాన్స్‌కు చెందిన దసో నుంచి భారత్ ఒక్కో రాఫెల్ యుద్ధ విమానాన్ని రూ.1,638 కోట్లకు కొనుగోలు చేస్తోంది. ఇందులో సగం ధరకే 28 విమానాలను ఫ్రాన్స్ కొంటోందని... మంగళవారమే ఆ ఒప్పందం కుదిరిందని వార్తలు వచ్చాయి. దీనిపై భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి అలెగ్జాండ్రా జిగ్లేర్ స్పందించారు. "దసో నుంచి కొత్తగా విమానాలు కొనడంలేదు. 28 విమానాల కొనుగోలుకు గతంలో ఎప్పుడో కాంట్రాక్ట్ ఇచ్చాం. ఇప్పుడు... ఎఫ్4 శ్రేణి విమానాలుగా ఆధునీకరించేందుకే డబ్బులు చెల్లిస్తున్నాం" అని ట్విట్టర్‌లో తెలిపారు. ప్రస్తుతం భారత్ దసో నుంచి ఎఫ్3 శ్రేణి విమానాలు కొంటోంది.

సమాచారం చెప్పలేం: కాగ్

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోళ్ల వివరాలను బయటపెట్టడానికి కాగ్ నిరాకరించింది. ఈ ఒప్పందాన్ని సమీక్షించే ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని కాగ్ ప్రకటించింది. ఈ దశలో ఎలాంటి వివరాలను పంచుకోలేమని స్పష్టం చేసింది. ఈ వివరాల కోసం పుణెకు చెందిన విహార్ దుర్వే సమాచార హక్కు కింద పిటిషన్ దాఖలు చేశారు. "సమగ్రంగా లేని నివేదికలోని వివరాలు విడుదల చేయడం సభాహక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది" అని కాగ్ స్పష్టం చేసింది.

ఒడిసాలో కాంగ్రెస్‌కు షాక్

- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజీనామా
- 24న అధికార బీజేడీలో చేరనున్నట్టు ప్రకటన

భువనేశ్వర్, జనవరి 16: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒడిసాలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఝర్సుగుడ ఎమ్మెల్యే నబ కిశోర్ దాస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. అయితే శాసన సభ్యత్వానికి మాత్రం ఆయన రాజీనామా చేయలేదు. లోక్‌సభతోపాటు, రాష్ట్ర అసెంబ్లీకి ఈ ఏడాది ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి ఇది పెద్ద ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈనెల 25న రాష్ట్ర పర్యటనకు రానున్న పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఆయన రాజీనామా లేఖను పంపించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి జితేంద్ర సింగ్‌లకు కూడా ఆ లేఖ కాపీలు పంపించారు. పార్టీలో ఎవరితోనూ తనకు విరోధం లేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికార బీజేడీలో చేరుతున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు. నియోజకవర్గ ఓటర్లు అభివృద్ధిని కోరుకుంటున్నారని, వారి నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఇందుకు తనను క్షమించాలని కోరారు. ఈనెల 24న బీజేడీలో చేరనున్నట్టు వివరించారు. ఝర్సుగుడ జిల్లాలో ఆయన ప్రముఖ నేత. 2009, 2014 ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థులను ఆయన ఓడించారు. ఝర్సుగుడ జిల్లాలో 9 జిల్లాపరిషత్ స్థానాలు ఉండగా, 2017లో జరిగిన జెడ్పీ ఎన్నికల్లోనూ ఎనిమిది చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను ఆయన గెలిపించారు.

మమత ర్యాలీకి రాహుల్ దూరం

- అఖిలేశ్, మాయావతీ అనుమానమే
- కాంగ్రెస్ తరఫున మల్లికార్జున ఖర్గే
- చంద్రబాబు, దేవెగౌడ, కేజ్రీవాల్ రాక
- బీజేపీ రథయాత్రకు లభించని ఊరట



కోల్‌కతా, జనవరి 16: తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ 19వ తేదీన కోల్‌కతాలో భారీ స్థాయిలో నిర్వహించ తలపెట్టిన బీజేపీ వ్యతిరేక పక్షాల ర్యాలీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ హాజరు కావడం లేదు. కాంగ్రెస్ పార్టీ తరఫున లోక్‌సభాపక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరవుతున్నారు. రాహుల్ ప్రధానమంత్రి అభ్యర్థి అని స్టాలిన్ ప్రకటించగానే ఎన్నికలయ్యే దాకా ఇలాంటి చర్చ పెట్టొద్దని మమత కుండబద్దలు కొట్టి చెప్పడాన్ని బెంగాల్ కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. అయితే, బీజేపీ వ్యతిరేక పార్టీలను ఒకే వేదిక మీదకు తెచ్చేందుకు మమతా బెనర్జీ ఏడాది కాలంగా దేశమంతా పర్యటిస్తున్నారు. విపక్ష నేతలను కలుస్తున్నారు. దాంతో 19వ తేదీ ర్యాలీపై భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా వామపక్షాలు కూడా ఈ ర్యాలీకి హాజరు కారాదని నిర్ణయం తీసుకున్నాయి. బెంగాల్లో మమతకు సీపీఎం ప్రధాన ప్రత్యర్థిగా ఉంది. కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి నాయకులకు మమత నుంచి ఆహ్వానం రాకపోవడంతో వారెవరూ సభకు రావడం లేదు. వారి ఒత్తిడిపైనే రాహుల్, సోనియాలు కూడా సభకు దూరంగా ఉంటున్నారు. మమత స్థాయిలో లోక్‌సభ స్థానాలు తెచ్చుకొనే అవకాశం ఉన్న మాయవతి, అఖిలేశ్ యాదవ్‌లు కూడా కోల్‌కతా ర్యాలీకి వస్తామని ధ్రువీకరించలేదు. చంద్రబాబు, కేజ్రీవాల్, దేవెగౌడ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సభకు వస్తున్న నేతల్లో ఉన్నారు. ఇటీవలే ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదనతో మమతను కలిసిన కేసీఆర్ కూడా కోల్‌కతా సభకు రావడం లేదు. కాగా, బెంగాల్లో బీజేపీ రథయాత్రకు చుక్కెదురైంది. రథయాత్రకు సర్కారు నుంచి తాజాగా అనుమతి తీసుకోవాలని సుప్రీంకోర్టు బీజేపీని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతల విషయంలో ఆందోళన చెందడం సబబేనని వ్యాఖ్యానించింది.

సిగ్గులేని వామపక్షం

కమ్యూనిస్టులు సంస్కృతిని గౌరవించరు.. చరిత్రను, ఆధ్యాత్మికతను పట్టించుకోరు

- అయ్యప్పపై మరీ ఇంత ద్వేషమా!?
- ఎల్డీఎఫ్ ప్రభుత్వ ప్రవర్తన అత్యంత సిగ్గుమాలినదిగా చరిత్రలో నిలిచిపోతుంది
- యూడీఎఫ్ ఏమీ తక్కువ తినలేదు
- కేరళ సంస్కృతిని కాపాడేది బీజేపీయే
- లెఫ్ట్ సర్కారుపై ధ్వజమెత్తిన మోదీ



తిరువనంతపురంలోని శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో ప్రధాని మోదీ

కొల్లాం, జనవరి 16: "కమ్యూనిస్టులు భారతీయ చరిత్రను, సంస్కృతిని, ఆధ్యాత్మికతను గౌరవించరని మనందరికీ తెలుసు. కానీ... శబరిమల విషయంలో మరీ ఇంత ద్వేషం ఉందని ఎవరూ ఊహించలేదు. భారత దేశంలో మరే పార్టీ, మరే ప్రభుత్వమూ ఇంత సిగ్గులేని విధంగా వ్యవహరించలేదు. శబరిమల విషయంలో ఎల్డీఎఫ్ సర్కారు ప్రవర్తన.. అత్యంత సిగ్గుమాలినదిగా చరిత్రలో నిలిచిపోతుంది." అని ప్రధాని నరేంద్ర మోదీ కేరళలోని వామపక్ష కూటమి సర్కారుపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఏమీ తక్కువ తినలేదని దుయ్యబట్టారు. కొల్లాంలో జాతీయ రహదారిని అనుసంధానిస్తూ నిర్మించిన 16 కిలోమీటర్ల బైపాస్ రోడ్డును మంగళవారం ప్రధాని ప్రారంభించారు. అంతకుముందు ఆయన తిరువనంతపురంలోని అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. కొల్లాంలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. శబరిమల ఆలయ వివాదంపై మొట్టమొదటిసారి బహిరంగంగా స్పందించారు. కేరళలో కీలకమైన రెండు కూటములు.. ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "కేరళ అంటే ఆధ్యాత్మికత, ఆహ్లాదం, ఆనందం, సామరస్యం! ఇప్పుడు అదే కేరళను ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కూటములు అవినీతి, మతతత్వంతో ఘర్షణలకు కేంద్రంగా మార్చాయి. ఇది నాకు అంతులేని బాధ, ఆవేదన కలిగిస్తోంది" అని మోదీ ఆక్రోశించారు. శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలను అనుమతించే విషయంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమిది రెండు నాల్కల ధోరణి అని ప్రధాని విమర్శించారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో ఒక మాట చెబుతుంది, పథనంతిట్టలో మరో మాట చెబుతుందని మండిపడ్డారు. శబరిమల విషయంలో వైఖరేమిటో సూటిగా చెప్పాలని యూడీఎఫ్‌కు సవాలు విసిరారు. "ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ నాణేనికి రెండు పార్శ్వాల వంటివి. కేరళ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే పోరాటంలో ముందువరుసలో నిలిచింది బీజేపీ ఒక్కటే" అని ప్రధాని పేర్కొన్నారు. లింగ సమానత్వం, సామాజిక న్యాయంపై రెండు కూటములూ మాటలు మాత్రం బాగా చెప్తాయిగానీ.. చేతలు అందుకు వ్యతిరేకంగా ఉంటాయని దుమ్మెత్తిపోశారు. తక్షణ తలాక్ అంశంపై ఈ రెండు కూటములూ ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. "తక్షణ తలాక్ వల్ల మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. మేం దానిని నిర్మూలించాలని ప్రయత్నిస్తుండగా... కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మాత్రం సమర్థిస్తున్నాయి" అని విమర్శించారు. ప్రపంచంలోని పలు ఇస్లామిక్ దేశాలు ట్రిపుల్ తలాక్‌ను నిషేధించాయని.. అది మనదేశంలో మాత్రం ఎందుకుండాలని ప్రశ్నించారు. "వారి పేర్లు వేరు కావచ్చుగానీ.. కేరళ సంస్కృతినినాశనం చేయడంలో, రాజకీయ హింస విషయంలో రెండూ ఒకటే" అన్నారు. ఆర్థిక బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) పదిశాతం కోటా బిల్లు పార్లమెంటులో భారీ ఆధిక్యతతో ఆమోదం పొందిందని మోదీ తెలిపారు. "కులం, ప్రాంతం, మతం ఏదైనా సరే... ప్రతి భారతీయుడికీ సమానమైన అవకాశాలు లభించాలన్నది మా ఆకాంక్ష. విద్యాసంస్థల్లో సీట్ల సంఖ్యను పెంచుకునే అవకాశం కూడా కల్పించాం" అని మోదీ తెలిపారు. ఇ లాంటి బిల్లును కేరళలో కాంగ్రెస్ మిత్రపక్షమైన ఐయూఎంఎల్ వ్యతిరేకించిందన్నారు.

ఆమెను అత్త కొట్టింది!

నిషేధిత వయసులో ఉండీ శబరిమల అయ్యప్పను దర్శించుకున్న తొలి మహిళ కనకదుర్గ! బిందు అనే మహిళతో కలిసి ఆమె అయ్యప్ప గుడికి వెళ్లారు. అప్పటి నుంచి కేరళలో ఆందోళనలు, అల్లర్లు మొదలయ్యాయి. ఇప్పుడు కనకదుర్గ ఆస్పత్రి పాలయ్యారు. తన అత్త కర్రతో కొట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. "మంగళవారం ఉదయం 7 గంటలకు ఇంట్లోకి వెళ్లగానే మా అత్త నన్ను తిడుతూ కర్ర తీసుకుని దాడి చేసింది. 12సార్లు తల, వీపు, ముఖంమీద గట్టిగా కొట్టింది. నాకు కదలడం కూడా కష్టంగా ఉంది" అని కనకదుర్గ వాపోయారు.

ఇద్దరు మహిళల అడ్డగింత!

తిరువనంతపురం: శబరిమల ఆలయానికి బయలుదేరిన ఇద్దరు మహిళలను భక్తులు అడ్డుకున్నారు. వారిని వెనక్కి పంపించారు. కన్నూరు జిల్లాకు చెందిన రేష్మా నిషాంత్, షనీల ఇరుముడికట్టుకుని శబరిమల ఆలయం దిశగా కదులుతూ నీలిమల ప్రాంతంలో కనిపించారు. వీరిని చూసిన ఇతర భక్తులు అక్కడికక్కడే ఆందోళనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఆ ఇద్దరినీ వెనక్కి తీసుకొచ్చారు.

లెక్చర్లు ఆపండి!: లెఫ్ట్

మోదీ విమర్శలను సీపీఎం తిప్పికొట్టింది. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయడాన్ని విమర్శించడం సిగ్గుచేటని మండిపడింది. "మీరు భారత ప్రధానిగా రాజ్యాంగంపై ప్రమాణం చేశారు. మనుస్మృతిని, ఆరెస్సెస్ భావాలను కాకుండా... రాజ్యాంగాన్ని కాపాడం డి. సంస్కృతి, చరిత్ర గురించి లెక్చర్లు ఇవ్వడం ఆపం డి. ఎందుకంటే... మీది హిట్లర్ సంస్కృతి! దేవుడి సొం త భూమిలో మీ విద్వేష భావాలు నింపకండి" అని సీపీఎం ట్వీట్ చేసింది. బీజేపీ నేతలు రేపిస్టులను, సతీ సహగమనాన్ని సమర్థించడం సిగ్గుచేటని విమర్శించింది. శబరిమలలోకి మహిళల ప్రవేశాన్ని బీజేపీ అధిష్ఠానం తొలుత సమర్థించిందని... బీజేపీ రాష్ట్ర నాయకత్వం మాత్రం దీనిని రాజకీయంగా వాడుకోవాలని చూసిందని కేరళ కాంగ్రెస్ అధ్యక్షుడు రామచంద్రన్ విమర్శించారు.

ఈ వేదిక మీ ప్రదర్శనల కోసం కాదు: కేరళ సీఎం

కొల్లాం, జనవరి 16: 'శబరిమల' ఆందోళనకారులపై కేరళ సీఎం పినరయి విజయన్ ప్రధాని మోదీ సమక్షంలో విరుచుకుపడ్డారు. కొల్లాం బైపాస్ రోడ్డును ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించడానికి సిద్ధమవుతుండగా 'శరణం అయ్యప్ప' నినాదాలతో ఆందోళనకారులు హోరెత్తించారు. దీంతో వారిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అనవసరమైన అల్లరి సృష్టించడానికి ప్రయత్నించకండి. ఈ వేదికను మీ ప్రదర్శనల కోసం ఉపయోగించుకోవద్దు' అంటూ మండిపడ్డారు.

టెక్నికల్ టీచర్లకు 7వ పే కమిషన్

- ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం
- 30 వేల మంది ప్రభుత్వ టీచర్లకు లబ్ధి
- 3.5 లక్షల ప్రైవేటు టీచర్లకూ లాభం

న్యూఢిల్లీ, జనవరి 16: టెక్నికల్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ సాంకేతిక సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి 7వ పే కమిషన్‌ను అమలు చేసేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ బుధవారం ఆమోదముద్ర వేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రభుత్వ టెక్నికల్ కాలేజీల్లో పని చేస్తున్న 29,264 వేల మంది టీచర్లు, ఇతర సిబ్బందికి నేరుగా ప్రయోజనం చేకూరుతుంది. ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ప్రైవేటు టెక్నికల్ కాలేజీల్లో పని చేస్తున్న 3.5 లక్షల మంది ప్రైవేటు టీచర్లు, సిబ్బందికి కూడా లబ్ధి చేకూరుతుందని హెచ్‌ఆర్‌డీ మంత్రి ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. దీన్ని ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు చేస్తామని, దీంతో టెక్నికల్ విద్యా సంస్థలు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఫ్యాకల్టీని సమకూర్చుకునే అవకాశం లభిస్తుందన్నారు. 7వ పే కమిషన్‌ను 2016 జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేసినందున మూడేళ్ల బకాయిలు కూడా చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ బకాయిల్లో 50% నిధులను కేంద్రం భరిస్తుందని మంత్రి చెప్పారు. ప్రభుత్వం రూ.1,241 కోట్లు కూడా విడుదల చేసిందన్నారు.

టాప్ 200 వర్సిటీల్లో 25 భారత్‌వే

- జాబితాలో మొదటిసారి ఐఐటీ హైదరాబాద్

లండన్, జనవరి 16: ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని యూనివర్సిటీలకు ర్యాంకులిస్తూ ప్రఖ్యాత సంస్థ టైమ్స్ హైయర్ ఎడ్యుకేషన్ ఎమర్జింగ్ ఎకానమీస్ (టీహెచ్‌ఈ) రూపొందించిన జాబితాలో భారత వర్సిటీలు అత్యధిక ర్యాంకులను సొంతం చేసుకున్నాయి. ఈ జాబితాలో మొదటిసారి చోటు దక్కించుకున్న ఐఐటీ-హైదరాబాద్ (139వ ర్యాంకు) సహా మొత్తం 49 భారత వర్సిటీలు చోటు సంపాదించాయి. వీటిలో టాప్ 200 వర్సిటీల్లో 25 మనవే కావడం విశేషం. 14వ ర్యాంకులో నిలచిన ఐఎస్సీ ఈ జాబితాలో చోటు సంపాదించిన భారత వర్సిటీల్లో తొలి స్థానంలో ఉండగా, 27వ ర్యాంకుతో ఐఐటీ-బాంబే రెండో స్థానంలో ఉంది. నిరుడు 42 ర్యాంకులతో సరిపెట్టుకున్న భారత్ ఈసారి 49 ర్యాంకులు సాధించింది. సావిత్రీబాయి ఫూలే పుణె వర్సిటీ 93వ స్థానంలో నిలిచింది. జాబితా విడుదల తర్వాత టీహెచ్‌ఈ ఎడిటర్ ఇల్లీ బోత్‌వెల్ మాట్లాడారు. "ఈ ఏడాది భారత వర్సిటీలు అధిక స్థానాలు పొందాయి. దీన్ని ఇలాగే కొనసాగిస్తే ఉన్నత విద్యకు, పరిశోధనలకు అంతర్జాతీయంగానూ ఖ్యాతి పొందుతాయి" అని అన్నారు.

హార్దిక్ కుమిలిపోతున్నాడు...!

తండ్రి హిమాన్షు



సూరత్: మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ఆస్ట్రేలియా సిరీస్‌కు దూరమైన హార్దిక్ పాండ్యా కుమిలిపోతున్నాడని అతడి తండ్రి హిమాన్షు చెప్పారు. 'ఆస్ట్రేలియానుంచి ఇంటికి వచ్చినప్పటి నుంచి పాండ్యా బయటికి వెళ్లడమేలేదు. ఎవరి ఫోన్లకు కూడా స్పందించడం లేదు. సంక్రాంతికి పతంగులు ఎగరేయడం పాండ్యాకు చాలా ఇష్టం. ఈసారి వాటి జోలికే పోలేదు.. సస్పెన్షన్‌పై బాధపడుతున్నాడు' అని హిమాన్షు తెలిపారు.

అదిరిపోయే ఎండ.. 42 డిగ్రీలతో భగభగలాడిన భానుడు..అప్పటికే మూడున్నర గంటలు ఫీల్డింగ్ చేసిన విరాట్, వెటరన్ ధోనీ.. అద్భుత బ్యాటింగ్‌తో, చురుకైన కదలికలతో పరస్పరం స్ట్రయిక్ రొటేట్ చేసుకొంటూ జట్టును విజయ తీరాలకు చేర్చారు.. ముఖ్యంగా గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేసినా ఎక్కువ బంతులు తీసుకోవడంతో విమర్శలపాలైన మహీ ఈ వన్డేలో తన పాత రోజులను గుర్తుకు తెచ్చాడు..తనలో ఇంకా ఉత్తమ ఫినిషర్ దాగి ఉన్నాడని నిరూపిస్తూ ఆఖరి ఓవర్‌లో బెహ్రెన్‌డార్ఫ్ తొలి బంతిని లాంగాన్ దిశగా తనదైన స్టైల్‌లో సిక్సర్‌గా మలిచిన తీరు అమోఘం.. మొత్తంగా సిరీస్ రేస్‌లో నిలవాలంటే గెలవాల్సిన రెండో వన్డేలో 'చేజ్ మాస్టర్' కోహ్లీ, ధోనీ కదం తొక్కిన వేళ అభిమానుల సంక్రాంతి సంబరం రెండింతలైంది..

కోహ్లీ, ధోనీ షో



అడిలైడ్‌లో కోహ్లీ రెండో సెంచరీ.

2

వన్డే అరంగేట్రంలోనే అత్యధిక పరుగులు సమర్పించుకున్న రెండో భారత బౌలర్ సిరాజ్. 1975లో లార్డ్స్‌లో కర్సన్ ఘావ్రీ 11 ఓవర్లలో 83 పరుగులిచ్చాడు.

అదీ 'ఎంఎస్' క్లాసిక్ !
విరాట్ ప్రశంస

రెండు సిక్సర్లతో ముఖ్యంగా ఆఖరి ఓవర్లో లాంగాన్ దిశగా బెహ్రెన్‌డార్ఫ్ బంతిని సిక్సర్‌గా మలిచిన తీరు ధోనీకే చెల్లు. పాత ధోనిని మళ్లీ సాక్షాత్కరించిన ఈ మ్యాచ్‌లో అతడి బ్యాటింగ్ కెప్టెన్ కోహ్లీని మురిపించింది. అందుకే ఆ షాట్లను 'ఎంఎస్' క్లాసిక్‌గా విరాట్ అభివర్ణించాడు. 'ధోనీ ఈ భారత జట్టులో సభ్యుడిగా ఉంటాడన్న విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. ఈరోజు షాట్లు అతడి క్లాసిక్ బ్యాటింగ్‌కు నిదర్శనాలు. ఆటను బాగా అంచనా వేసి అందుకుతగ్గట్టుగా ఆడడం ధోనీ ప్రత్యేకత' అని ప్రశంసించాడు.

ధోనీ (55 నాటౌట్)
(54 బంతుల్లో 2 సిక్సర్లు)

కోహ్లీ (104)
(112 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లు)

అడిలైడ్ : వన్డే సిరీస్‌ను కోల్పోకుండా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ దుమ్మురేపింది. తొలి వన్డేకు ఏమాత్రం పొంతనలేని రీతిలో చెలరేగింది. ఫలితంగా మంగళవారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియాపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (52 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 43), ధవన్ (28 బంతుల్లో 5 ఫోర్లతో 32) వేసిన గట్టి పునాదికి కెప్టెన్ కోహ్లీ (112 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 104), ధోనీ (54 బంతుల్లో 2 సిక్సర్లతో 55 నాటౌట్) బాధ్యతాయుత బ్యాటింగ్‌కు తోడుగా ఆఖర్లో దినేశ్ కార్తీక్ (14 బంతుల్లో 2 ఫోర్లతో 25 నాటౌట్) మెరుపులు జతవడంతో 299 రన్స్ లక్ష్యాన్ని ఇంకా 4 బంతులు ఉండగానే 299/4తో భారత్ ఛేదించింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 50 ఓవర్లలో 298/9 పరుగులు చేసింది. షాన్ మార్ష్ (123 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 131) సెంచరీ చేయగా మ్యాక్స్‌వెల్ (37 బంతుల్లో 48) హాఫ్ సెంచరీ మిస్సయ్యాడు. భారత బౌలర్లలో భువనేశ్వర్ (4/45), షమి (3/58) సత్తా చాటారు. చివరి వన్డే శుక్రవారం మెల్‌బోర్న్‌లో జరగనుంది. హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఈ మ్యాచ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేశాడు.

ఆరంభం అదిరింది..

తొలి వన్డేలో మాదిరి కాకుండా అడిలైడ్‌లో భారత్ ఆరంభం అదిరింది. ముఖ్యంగా మొదటి వన్డేలో డకౌట్ అయిన ధవన్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు, వరుస ఫోర్లతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. మరోవైపు రోహిత్ కూడా సహజ శైలిలో ఆడడంతో ఓవర్‌కు 6.5 పరుగులకుపైగా వచ్చాయి. వీరిద్దరూ తొలి వికెట్‌కు 47 పరుగులు జోడించి జోరు కనబరుస్తున్న తరుణంలో మరో భారీ షాట్ కొట్టబోయి బెహ్రెన్‌డార్ఫ్ బౌలింగ్‌లో ధవన్ క్యాచవుటయ్యాడు. అనంతరం కోహ్లీ జతగా రోహిత్ రెండో వికెట్‌కు 54 పరుగులు జోడించగా భారత్ 18 ఓవర్లలో 100 మార్క్ చేరింది. వీరి జోడీ కుదురుకుంటున్న తరుణంలో స్టొయినిస్ బంతిని సరిగా పుల్‌షాట్ కొట్టలేకపోయిన రోహిత్ డీప్ ఫార్వర్డ్ స్క్వేర్‌లెగ్‌లో హ్యాండ్స్‌కోంబ్‌కు దొరికిపోయాడు. రోహిత్ స్థానంలో వచ్చిన రాయుడు (24)..విరాట్‌తో కలిసి మూడో వికెట్‌కు 59 పరుగులు జత చేసినా షాట్ల ఎంపికలో హైదరాబాదీ తడబాటుకు లోనయ్యాడు. మరోవైపు అలవోకగా బౌండరీలు సంధించిన విరాట్..66 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఇక..తడబడుతూనే రెండు ఫోర్లు కొట్టిన రాయుడు 31వ ఓవర్లో మ్యాక్స్‌వెల్ బౌలింగ్‌లో పెవిలియన్‌కు చేరాడు.



షాన్ మార్ష్ (131)

కోహ్లీ-ధోనీ వారెవ్వా..

విమర్శల నేపథ్యంలో క్రీజ్‌లోకి అడుగుపెట్టిన ధోనీ వాటికి జవాబు చెప్పాలన్న పట్టుదలతో బ్యాటింగ్ చేశాడు. ఎండ మండుతున్నా లెక్కచేయకుండా వికెట్ల మధ్య వేగంగా కదులుతూ కోహ్లీతో కలిసి స్ట్రయిక్ రొటేట్ చేశాడు. మరోవైపు బెహ్రెన్‌డార్ఫ్ వేసిన 34వ ఓవర్లో కళ్లుచెదిరేలా 4,6 బాదిన కోహ్లీ..లియాన్ రెండు ఓవర్లలో అద్భుత టైమింగ్‌తో రెండు సిక్సర్లు కొట్టాడు. 43వ ఓవర్లో వన్డేల్లో తన 39వ సెంచరీ పూర్తి చేశాడు. కానీ కొద్దిసేపటికే రిచర్డ్‌సన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు.

రెండో వన్డేలో భారత్ గెలుపు

మహీ ఫినిషింగ్ టచ్

ధోనీ..ఆ సిక్సర్..

విరాట్ వికెట్ నిష్క్రమించే సమయానికి మిగిలింది 38 బంతులుకాగా చేయాల్సినవి 57 పరుగులు. క్రీజులో ధోనీ ఉన్నా.. నిలకడలేని కార్తీక్ నిలుస్తాడో లేదోననే అనుమానం. కానీ ఇద్దరూ అభిమానుల అనుమానాలను పటాపంచలు చేశారు. 45వ ఓవర్లో లియాన్ బౌలింగ్‌లో క్రీజ్ బైటకు వచ్చి లాంగాన్ దిశగా ధోనీ కళ్లు చెదిరే సిక్సర్ కొట్టగా..46వ ఓవర్లో రిచర్డ్‌సన్ బంతిని బౌండరీకి తరలించిన కార్తీక్ అదే ఊపులో స్టొయినిస్ బంతిని ఫోర్‌గా మలిచి ఒత్తిడి తగ్గించాడు. ఆఖరి ఓవర్లో తన మార్క్ సిక్సర్ బాదిన ధోనీ వన్డేల్లో 69వ హాఫ్ సెంచరీ పూరించాడు. ఆ తర్వాతి బంతికి మరో రన్ పూర్తి చేసిన మహీ..అభిమానులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తాడు.

మార్ష్, మ్యాక్స్‌వెల్‌దే ఆట..

ఆసీస్ ఓపెనర్లు మరోసారి విఫలం కాగా ఆ జట్టు ఇన్నింగ్స్‌లో షాన్ మార్ష్, మ్యాక్స్‌వెల్ బ్యాటింగే హైలైట్‌గా నిలిచింది. దూకుడుగా ఆడిన మార్ష్..మ్యాక్స్‌వెల్ ఆరో వికెట్‌కు 94 పరుగులు (65 బంతులు) జోడించారు. వీరి ధాటికి ఆసీస్ అలవోకగా 300 పరుగులు చేస్తుందనిపించినా, ఒకే ఓవర్లో వీరిద్దరినీ భువనేశ్వర్ పెవిలియన్‌కు చేర్చి దెబ్బకొట్టాడు.



'మిస్టర్ కూల్' ఆగ్రహించాడు !

నరాలు తెగే ఉత్కంఠభరిత మ్యాచ్‌ల్లోనూ ఎంతో ప్రశాంతంగా ఉండగలగడం ఒక్క ఎంఎస్ ధోనీకే చెల్లుతుంది. అందుకే అతడు 'మిస్టర్ కూల్'గా పేరుపొందాడు. కానీ ఆస్ట్రేలియాతో మంగళవారం జరిగిన రెండో వన్డేలో యువ పేసర్ ఖలీల్ అహ్మద్‌పై మహీ అరవడం అందర్నీ ఆశ్చర్యానికి లోను చేసింది. డ్రింక్స్ బ్రేక్ సందర్భంగా వాటర్ బాటిళ్లు తీసుకొని పిచ్‌పై నుంచి ఖలీల్ పరుగెత్తెకు రావడం చూసి ధోనీ ఆగ్రహించాడు. వెంటనే గట్టిగా అరుస్తూ అతడిని హెచ్చరించాడు.

స్కోరు బోర్డు

ఆస్ట్రేలియా: కేరీ (సి) ధవన్ (బి) షమీ 18, ఫించ్ (బి) భువనేశ్వర్ 6, ఖవాజా (రనౌట్) 21, షాన్ మార్ష్ (సి) జడేజా (బి) భువనేశ్వర్ 131, హ్యాండ్స్‌కోంబ్ (స్టంప్డ్) ధోనీ (బి) జడేజా 20, స్టొయినిస్ (సి) ధోనీ (బి) షమీ 29, మ్యాక్స్‌వెల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 48, రిచర్డ్‌సన్ (సి) ధవన్ (బి) షమీ 2, లియాన్ (నాటౌట్) 12, సిడిల్ (సి) కోహ్లీ (బి) భువనేశ్వర్ 0, బెహ్రెన్‌డార్ఫ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు 10, మొత్తం (50 ఓవర్లలో) 298/9. వికెట్లపతనం:** 1/20, 2/26, 3/82, 4/134, 5/189, 6/283, 7/283, 8/286, 9/286. **బౌలింగ్ :** భువనేశ్వర్ 10-0-45-4, షమీ 10-0-58-3, సిరాజ్ 10-0-76-0, కుల్దీప్ 10-0-66-0, జడేజా 10-1-49-1.

భారత్: రోహిత్ (సి) హ్యాండ్స్‌కోంబ్ (బి) స్టొయినిస్ 43, ధవన్ (సి) ఖవాజా (బి) బెహ్రెన్‌డార్ఫ్ 32, కోహ్లీ (సి) మ్యాక్స్‌వెల్ (బి) రిచర్డ్‌సన్ 104, రాయుడు (సి) స్టొయినిస్ (బి) మ్యాక్స్‌వెల్ 24, ధోనీ (నాటౌట్) 55, కార్తీక్ (నాటౌట్) 25, **ఎక్స్‌ట్రాలు 16, మొత్తం (49.2 ఓవర్లలో) 299/4, వికెట్లపతనం :** 1/47, 2/101, 3/160, 4/242. **బౌలింగ్ :** బెహ్రెన్‌డార్ఫ్ 8.2-1-52-1, రిచర్డ్‌సన్ 10-0-59-1, సిడిల్ 8-0-58-0, లియాన్ 10-0-59-0, స్టొయినిస్ 9-0-46-1, మ్యాక్స్‌వెల్ 4-0-16-1

4

షాన్ మార్ష్ సెంచరీలు చేసిన గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఆస్ట్రేలియా పరాజయం పాలైంది.

విరాట్ 100 శతకాలు చేస్తాడు



న్యూఢిల్లీ: పరుగుల యంత్రం విరాట్ కోహ్లీని భారత మాజీ సారథి మహమ్మద్ అజరుద్దీన్ పొగడ్తలతో ముంచెత్తాడు. కోహ్లీ ఫిట్‌గా ఉంటే కచ్చితంగా 100 శతకాలు సాధిస్తాడని చెప్పాడు. కోహ్లీ ప్రస్తుత ఫామ్‌ను బట్టి వంద సెంచరీల రికార్డును అతడు చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదన్నాడు. కోహ్లీ సెంచరీలు చేసిన అతి కొద్ది సందర్భాల్లోనే భారత్ ఓడిందని గుర్తు చేశాడు. ఇక, 'ఆస్ట్రేలియాపై రెండో వన్డేలో ధోనీ చేసిన అర్ధసెంచరీ ఎప్పటికీ మరిచిపోలేనిది. ధోనీ మ్యాచ్‌ను ముగించిన తీరు అతడు బెస్ట్ ఫినిషర్ అని మరోసారి రుజువు చేసింద'ని అజర్ ప్రశంసించాడు.

పరుగు పూర్తి చేయని ధోనీ



అడిలైడ్ : భారత్ ఇన్నింగ్స్ 45వ ఓవర్లో ధోనీ ఓ పరుగును పూర్తి చేయకపోవడాన్ని ఫీల్డ్ అంపైర్లు గుర్తించలేకపోయారు. కానీ కామెంటేటర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ ఆ తప్పును కనిపెట్టడం గమనార్హం. ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. లియాన్ వేసిన ఆ ఓవర్ ఆఖరి బంతిని లాంగ్ ఆన్ దిశగా పుల్ చేసిన మహీ..నింపాదిగా ఓ పరుగు కోసం నడుచుకుంటూ వెళ్లాడు. కానీ అతడు బ్యాట్‌ను క్రీజ్‌లో ఉంచలేదు. ఈ పొరపాటును ఫీల్డ్‌అంపైర్లు గుర్తించకపోవడంతో ఆ పరుగు ధోనీ ఖాతాలో చేరిపోయింది.

మైదానంలోనే క్రికెటర్ మృతి

కోల్‌కతా: కోల్‌కతాలో ఒక యువ క్రికెటర్ మైదానంలోనే కుప్పకూలాడు. ఆల్‌రౌండర్ అనికేత్ శర్మ మంగళవారం సాధన చేసూ ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. హుటాహుటిన అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. అనికేత్ గుండెనొప్పితో మరణించి ఉండవచ్చని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. 21 ఏళ్ల అనికేత్ స్థానిక పైక్పార క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గురువారం వారు క్యాబ్ (క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్) ప్రథమ శ్రేణి లీగ్ మ్యాచ్‌లో మిలన్ సమితి క్లబ్‌తో తలపడాల్సి ఉంది. అందుకు సాధన చేస్తుండగా ఈ దుర్ఘటన సంభవించింది.

కలిసొచ్చిన జనవరి 15



జనవరి 15, 2017
ఇంగ్లండ్‌పై 122 రన్స్



జనవరి 15, 2018
దక్షిణాఫ్రికాపై 153 (టెస్టులో)



జనవరి 15, 2019
ఆసీస్‌పై 104 రన్స్

భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ వరుసగా మూడోసారి జనవరి 15న శతకం బాది కొత్త ఏడాదిని ఘనంగా ప్రారంభించాడు. ఇదే తేదీల్లో కోహ్లీ వన్డేల్లో రెండుసార్లు, టెస్టుల్లో ఒకసారి సెంచరీ నమోదు చేయడం విశేషం. 2017లో ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా పుణెలో జరిగిన తొలి వన్డేలో కోహ్లీ (105 బంతుల్లో 122) సెంచరీ చేశాడు. ఆ తర్వాతి ఏడాది దక్షిణాఫ్రికా పర్యటనలో సెంచూరియన్‌లో జరిగిన రెండో టెస్టులోనూ జనవరి 15నే శతకం బాదాడు. ఈ ఇన్నింగ్స్‌లో కోహ్లీ 153 పరుగులు చేశాడు. ఇక, మంగళవారం ఆస్ట్రేలియాతో ముగిసిన 2వ వన్డేలో కూడా సెంచరీ (112 బంతుల్లో 104) చేయడంతో కోహ్లీకి జనవరి 15 ప్రత్యేకంగా మారింది.



తెలంగాణ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూక్

హ్యాండ్‌బాల్ చాంపియన్ తెలంగాణ

సిద్దిపేట (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల బాలబాలికల విభాగాల్లో తెలంగాణ జట్లు చాంపియన్‌గా నిలిచాయి. తెలంగాణ జట్లు పోటీల చివరి రోజైన బుధవారం జరిగిన బాలుర ఫైనల్లో 25-19తో ఢిల్లీపై, బాలికల టైటిల్ పోరులో 16-12తో హరియాణాపై గెలుపొందాయి. పంజాబ్ బాలురు, ఢిల్లీ బాలికల జట్లు మూడోస్థానం దక్కించుకున్నాయి. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేశారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ పోటీల్లో మొత్తం 29 బాలుర, 26 బాలికల జట్లు పాల్గొన్నాయి. సిద్దిపేటలో క్రీడా వాతావరణం వెల్లివిరుస్తున్నదంటే అది మాజీ మంత్రి టి. హరీశ్‌రావు చలవేనని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు.

ప్రీ క్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్ ఓపెన్

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షటర్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్, పారుపల్లి కశ్యప్ ప్రీ క్వార్టర్స్‌లోకి అడుగుపెట్టారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఏడోసీడ్ సైనా 14-21, 21-18, 21-18తో అన్‌సీడెడ్ డెంగ్ జోయ్ జువాన్ (హాంకాంగ్)పై విజయం సాధించింది. గంటా ఐదు నిమిషాల పోరులో ఒలింపిక్ పతక విజేత సైనాకు ప్రత్యర్థి గట్టిపోటీ ఇచ్చింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఏడోసీడ్ శ్రీకాంత్ 21-17, 21-11తో వరుస గేముల్లో ఎన్జి కా లాంగ్ (హాంకాంగ్)పై అలవోకగా గెలిచాడు. మరో మ్యాచ్‌లో క్వాలిఫయర్ కశ్యప్ 19-21, 21-19, 21-10తో రాస్మస్ గెమ్‌కే (డెన్మార్క్)ని ఓడించాడు. మహిళల డబుల్స్ ఆరంభ రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ 21-16, 22-20తో ఎన్జి టిజ్ యా-యు యెన్ సిన్ యింగ్ (హాంకాంగ్) జంటపై గెలిచింది. అయితే మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కిరెడ్డి-ప్రణవ్ జెర్రీ చోప్రా జోడీ 19-21, 17-21తో క్వాలిఫయర్ రాబిన్ టబెలింగ్-సెలెనా పియెక్ (నెదర్లాండ్స్) ద్వయం చేతిలో ఓడింది.

చెమటోడ్చిన ఫెడరర్

మూడో రౌండ్‌లో నడాల్
అజరెంకా అవుట్
బోపన్న, పేస్ ఇంటిదారి
ఆస్ట్రేలియన్ ఓపెన్



రోజర్ ఫెడరర్

మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ముందంజ వేశాడు. ఏడో టైటిల్‌పై కన్నేసిన ఈ స్విస్ దిగ్గజం వరుసగా 20వ ఏడాది మూడో రౌండ్‌లోకి అడుగుపెట్టాడు. రెండో రౌండ్‌లో క్వాలిఫయర్ డాన్ ఎవాన్స్ (బ్రిటన్) గట్టిపోటీ ఇవ్వడంతో ఫెడెక్స్ కష్టమ్మీద గట్టెక్కాడు. స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్, ఏంజెలిక్ కెర్బర్ కూడా ముందంజ వేశారు. టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్, సెరెనా విలియమ్స్ శుభారంభం చేశారు. మాజీ నెంబర్ వన్ విక్టోరియా అజరెంకా మాత్రం ఆరంభ రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. డబుల్స్‌లో రోహన్ బోపన్న, లియాండర్ పేస్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు.

ఫెడెక్స్ కష్టంగా: పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఫెడరర్ (స్విట్జర్లాండ్) 7-6 (7/5), 7-6 (7/3), 6-3తో ఎవాన్స్‌పై కష్టపడి గెలిచాడు. రెండు గంటలా 35 నిమిషాల పోరులో ఆరుసార్లు టోర్నీ విజేత ఫెడెక్స్‌కు 180వ ర్యాంకర్ ఎవాన్స్ చెమటలు పట్టించాడు. అయితే 11 ఏస్‌లు, 56 విన్నర్లతో రోజర్ ప్రత్యర్థిపై పైచేయి సాధించాడు. 2000వ సంవత్సరం నుంచి రెండో రౌండ్‌లో రోజర్‌కు ఎదురులేదు. మరో మ్యాచ్‌లో రెండో సీడ్ నడాల్ 6-3, 6-2, 6-2తో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)పై అలవోక విజయం సాధించాడు. ఆరోసీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా) 7-5, 6-7 (9/11), 6-4, 6-4తో మెక్‌డొనాల్డ్ (అమెరికా)పై నెగ్గాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఐదో సీడ్ స్లోనె స్టీఫెన్స్ (అమెరికా) 6-3, 6-1తో టిమియా బబోస్ (హంగేరి)పై, కెర్బర్ (జర్మనీ) 6-2, 6-3తో హదాద్ (బ్రెజిల్)పై గెలిచారు.


నొవాక్ సులువుగా: పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ నెంబర్ వన్ జొకోవిచ్ (సెర్బియా) 6-3, 6-2, 6-2తో క్వాలిఫయర్ మిచెల్ క్రూజెర్ (అమెరికా)పై సులువుగా గెలిచాడు. ఇక 2017 విజేత సెరెనా విలియమ్స్ (అమెరికా) 6-0, 6-2తో మారియా (జర్మనీ)ని ఓడించింది. టాప్‌సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా) 6-7 (2/7), 6-4, 6-2తో కైయా కనేపి (ఎస్టోనియా)పై నెగ్గింది. బౌచర్డ్ (కెనడా) 6-2, 6-1తో షుయ్ పెంగ్ (చైనా)పై, ప్లిస్కోవా (చెక్‌రిపబ్లిక్) 6-3, 6-2తో ముచోవా (చెక్)పై గెలిచారు. అయితే మాజీ నెం:1 అజరెంకా 7-6 (7/5), 4-6, 2-6తో లారా సెగ్‌మౌండ్ (జర్మనీ) చేతిలో ఓడింది.

పేస్, బోపన్న అవుట్

పురుషుల డబుల్స్‌లో భారత్ పోరు ముగిసింది. రోహన్ బోపన్న, లియాండర్ పేస్ జోడీలు ఆరంభ రౌండ్‌లోనే ఇంటిదారిపట్టాయి. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో 15వ సీడ్ బోపన్న-దివిజ్ శరణ్ జోడీ 1-6, 6-4, 5-7తో అన్‌సీడెడ్ పాబ్లో కరెనో బస్టా-గార్సియా లోపెజ్ (స్పెయిన్) ద్వయం చేతిలో పరాజయం ఎదుర్కొంది. మరో మ్యాచ్‌లో వెటరన్ ఆటగాడు పేస్-ఏంజెల్ రెయెస్ వరేలా (మెక్సికో) జోడీ 5-7, 6-7 (4/7)తో ఆస్టిన్ క్రాజిసెక్ (అమెరికా)-సిటాక్ (న్యూజిలాండ్) ద్వయం చేతిలో ఓడింది.

గుహేశ్.. గ్రాండ్ మాస్టర్

చెన్నై చిన్నోడి అరుదైన ఘనత



గుహేశ్

చెన్నై (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్సులో చెస్ గ్రాండ్‌మాస్టర్ హోదా అందుకున్న రెండో క్రీడాకారుడిగా చెన్నైకు చెందిన డి.గుహేశ్ (12) చరిత్ర సృష్టించాడు. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ ఓపెన్ చెస్ పోటీల్లో గుహేశ్ 12 ఏళ్ల, 7 నెలల, 17 రోజుల వయస్సులో ఈ ఘనత సాధించాడు. సర్గీ కర్జికన్ (రష్యా) 12 ఏళ్ల, 7 నెలల వయస్సులోనే జీఎమ్ హోదా సాధించి ఈ జాబితాలో ప్రథమ స్థానంలో ఉన్నాడు. బుధవారం జరిగిన 9వ రౌండ్‌లో దినేశ్ శర్మను ఓడించడంతో జీఎమ్‌కి అవసరమైన 3వ నార్మ్‌ను గుహేశ్ సంపాదించాడు. దీంతో భారత్ నుంచి 59వ గ్రాండ్ మాస్టర్‌గా అవతరించాడు. గతంలో చెన్నైకే చెందిన ప్రజ్ఞానంద పేరిట ఉన్న భారతీయ పిన్న వయస్సు జీఎమ్ రికార్డును కూడా గుహేశ్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక, ఢిల్లీ అంతర్జాతీయ ఓపెన్ టైటిల్‌ను లివాన్ పంటులియా (జార్జియా) కైవసం చేసుకున్నాడు. మసూద్ (ఇరాన్) ద్వితీయ, స్టుపాక్ (బెలారస్) తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. తెలంగాణ గ్రాండ్ మాస్టర్లు హర్ష భరత్‌కోటి 13వ, ఇరగేసి అర్జున్ 17వ స్థానాల్లో నిలిచారు.

ఐఎం నార్మ్స్ పొందిన తెలుగు తేజాలు

తెలుగు రాష్ట్రాలకు చెందిన పోలూరి భరత్ కుమార్ రెడ్డి, బొమ్మిని మౌనిక అక్షయ చెస్ అంతర్జాతీయ మాస్టర్ హోదా సాధించడానికి అవసరమైన ఐఎం నార్మ్‌ను బుధవారం సంపాదించారు. ఢిల్లీ ఓపెన్‌లో వీరు ఈ నార్మ్స్ సాధించారు. కోదాడకు చెందిన భరత్ 2,253 పాయింట్లతో 2వ ఐఎం నార్మ్ కైవసం చేసుకోగా గుంటూరుకు చెందిన మౌనిక 1931 పాయింట్లతో తొలి నార్మ్ దక్కించుకొంది.

హరియాణా చేతిలో యూపీ చిత్తు

పంచకుల: ప్రొ.రెజ్లింగ్‌లో భాగంగా బుధవారం జరిగిన పోరులో హరియాణా హ్యామర్స్ 5-3తో యూపీ దంగల్‌ను చిత్తు చేసింది. 57 కిలోల విభాగంలో హరియాణా హ్యామర్స్ రెజ్లర్ రవికుమార్ 7-2తో నవీన్‌పై ఘన విజయం సాధించాడు. దాంతో నిరుటి రన్నరప్ హరియాణా 4-2తో తిరుగులేని ఆధిక్యం ప్రదర్శించింది. ఇక ఆఖరిగా జరిగిన మహిళల 57 కిలోల బౌట్‌లో జూనియర్ వరల్డ్ చాంపియన్ అనస్టాసియా నిచితా (హరియాణా) 9-0తో ఆసియా చాంపియన్‌షిప్స్ రజత పతక విజేత సరితను మట్టికరిపించింది. అంతకుముందు పురుషుల 86 కిలోల విభాగంలో అలీ షబనోవ్ 6-1తో ఇరాకి మిసుతురి (యూపీ)ని ఓడించాడు.

రేపు లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్: భువనేశ్వరి



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 18న రెండు తెలుగు రాష్ట్రాల్లో లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ నారా భువనేశ్వరి, సీఈవో విష్ణువర్ధన్ తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని బుధవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్‌తో పాటు రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులు పాల్గొంటాయని పేర్కొన్నారు.

15 వేల మందికి 'జీఎంఆర్' అన్న, వస్త్రదానం

రాజాం, జనవరి 16 : ప్రముఖ పారిశ్రామిక వేత్త, జీఎంఆర్ గ్రూపు అధినేత గ్రంధి మల్లికార్జునరావు ఏపీలోని శ్రీకాకుళం జిల్లా రాజాంలో సుమారు 10వేల మందికి అన్న, వస్త్రదానం చేశారు. ఏటా సంక్రాంతి రోజు సాధువులు, పేదలకు అన్న, వస్త్రదానం చేయడం జీఎంఆర్‌కు ఆనవాయితీ. ఈ క్రమంలో మంగళవారం జీఎంఆర్, ఆయన సతీమణి వరలక్ష్మితో పాటు కుటుంబ సభ్యులు, సంస్థ ప్రతినిధులు కలిసి.. 10వేల మంది సాధువులు, పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు.



రాజాంలో సాధువులు, పేదలకు వస్త్రదానం చేస్తున్న జీఎంఆర్



మంటల్లో ఎద్దుల పరుగు

వీక్షకుల కేరింతల నడుమ వేగంగా పరుగెత్తుకొస్తున్న ఎద్దులు ఎగసిపడుతున్న మంటల్లో నుంచి దూసుకెళ్లాయి. మకర సంక్రాంతి సందర్భంగా బెంగళూరులో బుధవారం నిర్వహించిన ఈ వేడుకలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తిలకించేందుకు భారీగా తరలివచ్చిన జనం ఇరువైపులా గుమిగూడగా, ఎండుగడ్డిని పెద్ద కుప్పలా వేసి మంట పెట్టారు. ఎద్దులతోపాటు యువత కూడా పరుగున వచ్చి ఆ మంటల మీదుగా వెళ్లిపోవడం విశేషం. ప్రతి ఏటా సంక్రాంతికి ఇక్కడ ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ వేడుకల వల్ల పంటలు, పశుసంపద వృద్ధి చెందుతాయని స్థానికుల నమ్మకం – బెంగళూరు

కమతాలెన్ని ఉన్నా ఖాతా ఒకటే

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామం యూనిట్‌గా ఒక రైతుకు 10 సర్వే నంబర్లలో భూములుంటే... ఆ రైతు భూముల వివరాలన్నీ ఒకే ఖాతాలో కనిపించనున్నాయి. 'సమీకృత భూరికార్డుల నిర్వహణ వ్యవస్థ(ధరణి)'ను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం.. కమతాలన్నీ ఒకే ఖాతాలో చేర్చింది. 2016లో భూరికార్డులన్నీ 'మాభూమి' వెబ్‌సైట్‌లో పెట్టినప్పుడు ఏ సర్వే నంబర్‌ను కొడితే.. ఆ సర్వే నంబర్‌లో భూముల యాజమాని డేటా మాత్రమే కనిపించేది. ధరణిలో మాత్రం ఒక రైతుకు 20 సర్వే నంబర్లలో భూములుంటే.. ఏదేని ఒక సర్వే నంబర్‌లో భూమిని శోధించగానే 1బీలో ఆ రైతు భూముల వివరాలన్నీ ఒకే ఖాతాలో చూపించే వెసులుబాటు కల్పించారు. ధరణి వెబ్‌సైట్‌ను పరిశీలించేవారి సంఖ్య ఏ రోజుకారోజు పెరుగుతూనే ఉంది. తొలిసారి భూముల రికార్డులన్నీ పబ్లిక్ డొమైన్‌లో పెట్టడంతో ఆయా వివరాల కోసం భూముల యాజమానులు/రైతులు http//:dharani.telangana.gov.in పేరుతో ఉన్న వెబ్‌సైట్‌ను పరిశీలించుకొని... రికార్డులు చూసుకుంటున్నారు. బుధవారం రాత్రి 7:50 గంటల సమయానికి 4,22,836 మంది వెబ్‌సైట్‌ను సందర్శించడం గమనార్హం. మరోవైపు రికార్డుల్లో తప్పులు జరిగినట్లే తేలితే... వెనువెంటనే ఫిర్యాదులతో పాటు సూచనల కోసం ప్రత్యేకంగా విభాగాలు పెట్టారు. రైతులు తమ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచి... లిఖితపూర్వక ఫిర్యాదు ప్రతిని అప్‌లోడ్ చేయవచ్చు. అయితే నవీకరించిన రికార్డులు(పహాణీ, 1బీ)ని మాత్రం మీసేవ నుంచి తీసుకోవచ్చు. ఇందులో భాగంగా 71.94 లక్షల ఖాతాల్లో డిజిటల్ సంతకాలు చేసిన 54,09,620 రికార్డులను ఈ వెబ్‌సైట్‌లో ఉంచారు. భూరికార్డుల నవీకరణలో 1,29,443 దాకా మ్యుటేషన్లు చేయగా... 80,528 వరకు పౌతీలు పూర్తి చేశారు.

6 ప్రశ్నలు తీసేయండి

- అనుబంధ మెరిట్‌లిస్ట్ ఇవ్వండి
- దాంతోపాటే మార్కులు వెల్లడించాలి
- ఎస్సై పోటీ పరీక్షపై హైకోర్టు ఆదేశం
- పోలీస్ నియామక బోర్డుకు నిర్దేశం



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు నిర్వహించిన ఎస్సై ప్రాథమిక పరీక్షలో ప్రశ్నలు తప్పుగా వచ్చాయంటూ హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు ఊరట లభించింది. ఎస్సై ప్రాథమిక పరీక్షను గత ఆగస్టు 26న నిర్వహించారు. కీని 27న నియామక బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యర్థుల అభ్యంతరాల్ని పరిశీలించిన తర్వాత ఫైనల్ కీని విడుదల చేశారు. తాము లేవనెత్తిన అభ్యంతరాల్ని పట్టించుకోలేదని, ఫలితంగా తమకు అన్యాయం జరిగిందని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. సెట్-బీలోని 117వ ప్రశ్న(ఇది ఫసల్ బీమా యోజనకు సంబంధించింది), 138వ ప్రశ్న (ఇది సుభాష్ చంద్రబోస్‌కు సంబంధించింది), 172వ ప్రశ్న(స్టేట్ జీఎస్‌టీకి సంబంధించింది), 181, 185 ప్రశ్నలు(తెలంగాణ పోరుయాత్ర), 189 ప్రశ్న(ఇది గిర్‌గ్లానీ కమిటీకి సంబంధించింది) విషయంలో అభ్యర్థుల అభ్యంతరాలతో న్యాయస్థానం ఏకీభవించింది. వాటిని తొలగించి, ఆ ప్రశ్నలకు మార్కులు కలిపి, అర్హత సాధించిన అభ్యర్థులకు మరోసారి మూల్యాంకనం చేసి, ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన వారి జాబితాను ప్రకటించాల్సిందిగా ఉమ్మడి హైకోర్టు పోలీస్ నియామక బోర్డును ఆదేశించింది. నియామక బోర్డు తరపున ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది శరత్ కుమార్ వాదనలు వినిపించారు. ప్రశ్న పత్రాలను జేఎన్‌టీయుహెచ్ తయారు చేసిందని తెలిపారు. అభ్యర్థులు ఆరోపించినట్లు ప్రశ్నల్లో తప్పులు, సందేహాలు లేవని అత్యంత ప్రతిభావంతులైన విద్యావేత్తలు తయారు చేసిన ప్రశ్నలను కోర్టులు నిర్ణయించలేవని, న్యాయ సమీక్షకు అవి లోబడవని చెప్పారు. అర్హులైన, అనర్హులైన అభ్యర్థుల మార్కుల జాబితాను ప్రకటించాల్సిన అవసరం లేదని లక్షలాది మంది అభ్యర్థులు ఉన్నప్పుడు ఇది సాధ్యం కాదన్నారు. పిటిషనర్ల తరపు న్యాయవాది రమేష్ చిల్లా తన వాదనలు వినిపిస్తూ... బోర్డు ఇచ్చిన రెండు రోజుల వ్యవధిలో అభ్యర్థులు సాధ్యమైనంత వరకు తప్పులను బోర్డు దృష్టికి తీసుకొచ్చారని, అభ్యంతరాలు తెలియజేసే పద్ధతి కూడా చాలా కష్టంగా ఉందన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు పిటిషనర్లు తెలిపిన సెట్-బీలోని 117, 138, 172, 181, 185, 189 ప్రశ్నలు(ఇతర సెట్లలో ఉన్న ఈ ప్రశ్నలతో సహా) తప్పుగాను లేదా సందేహాస్పదంగా ఉన్నాయని, అంతకు ముందు తీసిన మెరిట్ లిస్ట్ ఫైనల్ అని చెప్పడానికి వీలు లేదని పేర్కొన్నారు. ఆరు ప్రశ్నలను తొలగించి కొత్తగా సవరించిన జాబితాను ప్రకటించాలని, జాబితాతో పాటు వారికి వచ్చిన మార్కులను హాల్ టికెట్ నెంబరుతో సహా ప్రచురించాలని ఆదేశించారు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యేవరకు తదుపరి పరీక్షలు నిర్వహించరాదని పోలీస్ నియామక బోర్డుకు స్పష్టం చేశారు.

మా ఇంటిని మీదే అనుకోండి!

- కేటీఆర్‌కు ఓమర్ అబ్దుల్లా ఆఫర్



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌లో మంచులో కూరుకుపోయిన జమ్మూకశ్మీరు మాజీ సీఎం ఓమర్ అబ్దుల్లా ఇంటిని చూసి టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముగ్ధుడయ్యారు. తనకు ఆలాంటి అందమైన ఇల్లు కావాలని టీఆర్‌ఎస్ నేత ట్వీట్ చేయగా, దానికి అబ్దుల్లా ఓకే చెప్పారు. "దానికేముంది. మా ఇంటిని మీ ఇల్లే అనుకోండి. ఎప్పుడు కావాలంటే అప్పుడు వచ్చి అక్కడ ఉండొచ్చు" అని ఆఫర్ ఇచ్చారు. ఓమర్, కేటీఆర్‌లు బుధవారం దీనిపై ఆసక్తికరమైన ట్వీటులు చేసుకున్నారు. మంచులో కూరుకుపోయిన తన ఇంటి ఫొటోను అబ్దుల్లా ...కేటీఆర్‌కి ట్వీట్ చేశారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ...'కోరినవన్నీ నెరవేరే అవకాశముంటే తాను అలాంటి ఇంటిని కోరుకుంటాను' అని సమాధానమిచ్చారు. దానిపై ఓమర్ స్పందిస్తూ...'మా ఇల్లు మీదే అనుకోండి. అక్కడ ఎప్పుడైనా వెళ్లి ఉండొచ్చు' అని అన్నారు. దానికి మళ్లీ టీఆర్‌ఎస్ నేత బదులుచెపుతూ...'ఓమర్ సాబ్! ఆ ఇల్లు కావాలని నేను సీరియస్‌గానే చెబుతున్నా.' అని మరో ట్వీట్ చేశారు. శ్రీనగర్, కశ్మీరు లోయలో ప్రస్తుతం మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతతో తీవ్రస్థాయిలో మంచుకురుస్తోంది. జనజీవనం స్తంభించిపోయింది.

ప్రకాష్‌కు 'పర్యావరణ సంరక్షక్'

- గాంధీ వారసుల చేతుల మీదుగా అవార్డు



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జలవనరులను పరిరక్షించడంలో ఇటు తెలంగాణ ప్రభుత్వంతో పాటు జలవనరుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వి.ప్రకాష్ చేస్తున్న కృషికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోంది. 'వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు పొందిన రాజేంద్రసింగ్ సారథ్యంలోని తరుణ్ భారత్ సంగ్ సంస్థ... ప్రకాష్‌ను 'పర్యావరణ సంరక్షక్' అవార్డుకు ఎంపిక చేసింది. మంగళ, బుధవారాల్లో రాజస్థాన్‌లోని బీకంపురాలో జరిగిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ మనవడు అరుణ్ గాంధీ, మునిమనవడు తుషార్ గాంధీ చేతుల మీదుగా ప్రకాష్ ఈ అవార్డును అందుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను, వాటి ప్రాశస్త్యాన్ని ప్రకాష్ ఈ సందర్భంగా వివరించారు.

వైద్య విద్యార్థుల ఇంటర్న్‌షిప్ కఠినం

- ధ్రువీకరణకు ముగ్గురు సభ్యుల కమిటీ

హైదరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థుల ఏడాది ఇంటర్న్‌షిప్ ధ్రువీకరణకు అన్ని వైద్య కళాశాలల్లో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర వైద్య శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ ప్రొఫెసర్లతో కూడిన ఈ కమిటీ ధ్రువీకరిస్తేనే సూపరింటెండెంట్లు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్‌ను జారీ చేయాలి. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని, నిబంధనలను అతిక్రమిస్తే కమిటీ సభ్యులపై చర్యలుంటాయని, విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌ను పొడిగించాల్సి ఉంటుందని ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి బుధవారం హెచ్చరించారు. విధులకు హాజరు కాకుండానే సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని, దీనికి పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారుతోందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్త నిబంధనలను గాంధీతోపాటు ఉస్మానియా, నిజామాబాద్, వరంగల్, కాకతీయ మెడికల్ కళాశాలలకు, హైదరాబాద్ రిమ్స్‌కు జారీ చేశారు.

చిరుత మృతి కేసులో ఆరుగురు అరెస్టు

వేటగాళ్ల ఉచ్చుకు చిరుతపులి మృత్యువాతపడిన ఘటనను అటవీ శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. మంచిర్యాల జిల్లా రంగంపేటలో చిరుత మరణానికి కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వరుస ఘటనలపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశంతో వెంటనే స్పందించిన అటవీ అధికారులు డాగ్‌స్క్వాడ్ సహాయంతో మంగళవారం ఇద్దరు వేటగాళ్లను పట్టుకున్నారు. వారిని అటవీ అధికారులు విచారించడంతో మరో నలుగురి పేర్లను బయటపెట్టారు. దీంతో పరారీలో ఉన్న నలుగురు వేటగాళ్లను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు చిరుత మృతిచెందిన ప్రాంతాన్ని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శరవణన్ బుధవారం పరిశీలించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

వారెవ్వా...

'సిల్వర్' మోడళ్లకు గోల్డెన్ డేస్!

బంగారు వర్ణంలోని జుత్తును స్టయిలిష్‌గా కట్ చేసుకుని, కొద్దిగా నలుపు రంగు వేసుకుని, అందంగా అలంకరించుకుని ర్యాంప్ మీద నడుస్తున్న చైనీస్ మోడల్ **మా ఇన్‌హాంగ్‌**ను అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఇంతకీ ఆమె వయసు ఎంతనుకున్నారు? జస్ట్ 56. రెండేళ్ల క్రితమే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టి అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్స్



అయిన డొల్సే, గబ్బానాలకు మోడల్‌గా పనిచేస్తోంది. అవును... చైనాలో ఇప్పుడు యాభై ఏళ్లు దాటిన మోడల్స్‌కు డిమాండ్ బాగా ఉంది. వారిలో మా ఇన్‌హాంగ్ హాట్ ఫేవరేట్.

ఇంతకాలం యువత ఫ్యాషన్లు, ట్రెండ్లపై కన్నేసిన వారంతా ఒక్కసారిగా సరికొత్త మార్కెట్‌వైపు దృష్టిసారించారు. అదే 'సిల్వర్ స్పెండర్స్' మార్కెట్. అంటే 60 ఏళ్లు పైబడిన వారికోసం అన్నమాట. 2050 కి ప్రతీ ముగ్గురు చైనీయుల్లో ఒకరు 60 ఏళ్లు పైబడిన వారే ఉంటారట. ఈ లెక్కన అక్కడి జనాభాలో 48 కోట్ల 70 లక్షల మంది వయసు 60 ఏళ్లు ఉంటుంది. సరిగ్గా వీరిని దృష్టిలో పెట్టుకునే చైనాలో సరికొత్త మార్కెట్ పుట్టుకొస్తోంది. మా ఇన్‌హాంగ్ లాంటి మోడల్స్‌తో లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్‌కేర్ యాడ్స్ రూపొందిస్తున్నారు. అంతేకాదు అక్కడ ఆర్థికంగా బాగున్న ముసలివాళ్లు (ముఖ్యంగా మహిళలు) దుస్తులు, ఫ్యాషన్ యాక్సరీస్, కాస్మొటిక్స్, ట్రావెలింగ్ వైపు ఆసక్తి చూపుతున్నారని ఒక కన్స్యూమర్ రీసెర్చ్‌లో తేలింది. దీంతో వారికి కావాల్సినవి ఉత్పత్తి చేసి, మార్కెట్ చేసే పనిలో పడ్డారంతా. అందులో భాగంగానే వయసు పైబడిన మోడళ్లకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది.



"సీనియర్ మోడళ్లకు ఇప్పుడిప్పుడే మంచి అవకాశాలు వస్తున్నాయి. ఇది ఎవరూ ఊహించని పరిణామం" అని మోడల్ ఏజెంట్ మైఖేల్ చీన్ అంటున్నారు. నిజానికి వయసులో ఉన్నప్పుడే మోడల్ కావాలనుకుంది మా ఇన్‌హాంగ్. కానీ అప్పట్లో ఫ్యాషన్ ఫీజు చెల్లించలేని స్థితి ఆమెది. అయితే రెండేళ్ల క్రితమే ఆమె కల నెరవేరింది. ఇప్పుడామె మూడు వారాలకు ఒకసారి తన జుత్తుకు స్టయిలింగ్ చేసుకుంటోంది. జిమ్‌లో రెగ్యులర్ వర్కవుట్స్ చేస్తోంది. "ఫ్యాషన్‌కు వయసుతో నిమిత్తం లేదు. కాబట్టి నా ఈ కల చాలాకాలం కొనసాగుతుందనే అనుకుంటున్నా" అంటున్నారు మా ఇన్‌హాంగ్ చిరు దరహాసంతో.

నవ్య

కుటుంబ కదంబం

న్యూస్‌మేకర్

బిడ్డ ఆకలి తల్లికే అర్థమవుతుంది అంటారు. కానీ 'పసికందు ఏడుపునకు అర్థం కనిపెట్టడానికి తల్లి కానవసరం లేదు, తల్లి మనసుంటే చాలు!' అంటున్నారు మహిళా కానిస్టేబుల్ ప్రియాంక! గుక్కపట్టి ఏడుస్తున్న పసిపాపకు పాలిచ్చి, ఆ పాప ప్రాణాలను నిలిపి, అమ్మతనాన్ని చాటుకుని ఆమె ఇటీవల వార్తల్లోకి ఎక్కారు.

ఆ రోజు ఏం జరిగిందో ఆమె మాటల్లోనే...

ఆకలి ఏడుపు అని కనిపెట్టా!

ఎవరో తెలియని పసికందుకు పాలిచ్చి ప్రాణాలు కాపాడాను అనేది సంచలన విషయమేమీ కాదు. అసలు ఈ సంఘటన ఇంత ప్రచారం పొందుతుందని కూడా ఆ క్షణం నేను ఆలోచించలేదు. బిడ్డ ఆకలితో ఏడుస్తోంది. వెళ్లి వెంటనే పాలివ్వాలి! అని మాత్రమే అనిపించింది. అసలు ఆ రోజు ఏం జరిగిందంటే? అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో మా వారు రవీందర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. సమయానికి భోంచేశారో లేదో? అని తెలుసుకోవడం కోసం నేను ప్రతి రోజూ ఆయనకి ఫోన్ చేస్తూ ఉంటాను. అలాగే ఆ రోజూ చేశాను. ఆయనతో మాట్లాడుతున్నప్పుడు పసిబిడ్డ ఏడుపు వినిపించింది. ఆ సమయంలో పోలీస్ స్టేషన్‌లో పసిబిడ్డ ఎందుకుంది? ఎవరి పాప? అని ఆరా తీశాను. ఆయన విషయం చెప్పారు. ఆ వివరాల కంటే పాప ఏడుపు నన్ను కదిలించింది. ఎనిమిది నెలల బాబుకు తల్లిని. బిడ్డ ఏడుపునకు అర్థం కనిపెట్టలేనా? ఆకలి తీరి ఏడుపు ఆపాలంటే పాలివ్వాలి. ఆ పని నేనూ చేయగలను. అందుకే మరో ఆలోచన లేకుండా వెంటనే బయల్దేరి వస్తున్నానంటూ మా వారికి చెప్పాను. ఆయనా సరే నన్నారు. క్యాబ్ మాట్లాడుకుని పోలీస్‌స్టేషన్ చేరుకుని, పాపను ఒళ్లోకి తీసుకున్నాను. నెలన్నర వయసున్న పాప! పాపం! ఎంత ఆకలిగా ఉందో బిడ్డ? కనీసం 45 నిమిషాలపాటు ఆపకుండా పాలు తాగింది. అప్పుడు గమనించాను పరీక్షగా! ఎంత బలహీనంగా ఉందో? కంటి పైన గాయం కూడా ఉంది. సరైన పోషణ కూడా లేదని అర్థమైపోయింది. బిడ్డను నేను పెంచుకుంటే? ఈ ఆలోచనతో ఆయనను అడిగాను. కానీ అందుకు రూల్స్ ఒప్పుకోవని సున్నితంగా చెప్పారు. కానీ ఆ బిడ్డ తల్లిని చేరుకోకపోయి ఉంటే కచ్చితంగా ఆ పాపను పెంచుకునేదాన్నే! ఆ తల్లి ఇస్తానంటే బిడ్డను పెంచుకోవడానికి నేనిప్పటికీ సిద్ధమే!



అభినందిస్తున్న అధికారులు

• గోగుమళ్ల కవిత



భర్త, బాబుతో ...

ఇంటి నుంచి క్యాబ్ మాట్లాడుకుని పోలీస్‌స్టేషన్ చేరుకుని, పాపను ఒళ్లోకి తీసుకున్నా. నెలన్నర వయసున్న పాప! పాపం! ఎంత ఆకలిగా ఉందో బిడ్డ? కనీసం 45 నిమిషాలపాటు ఆపకుండా పాలు తాగింది. ఆ బిడ్డ తల్లిని చేరుకోకపోయి ఉంటే కచ్చితంగా పెంచుకునే దాన్ని!

మాకు ఆడపిల్లలంటే ఇష్టం!

డిసెంబరు 30 అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో ఓ వ్యక్తి పసిపాపతో అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కి వచ్చాడు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ దగ్గర నిలబడి ఉంటే ఓ మహిళ పాపను చేతికిచ్చి ఇప్పుడే వస్తానంటూ వెళ్లి పోయిందనీ, ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో తను పాపను ఇంటికి తీసుకెళ్లిపోయాననీ చెప్పాడు. అయితే పాప ఎంతకీ ఏడుపు ఆపకపోవడంతో పాలు పట్టించే ప్రయత్నం చేశాననీ, తన కుటుంబీకులు పాపను పోలీస్ స్టేషన్‌లో అప్పగించమని చెప్పడంతో తీసుకొచ్చాననీ చెప్పాడు. అప్పుడు కూడా పాప గుక్కపట్టి ఏడుస్తూనే ఉంది. మేం కూడా పాపను ఎత్తుకుని ఊరుకోబెట్టే ప్రయత్నం చేశాం. అదే సమయంలో మా ఆవిడ ఫోన్ చేసింది. ఫోన్లో పాప ఏడుపు విని పాల కోసం ఏడుస్తోందనీ, తాను వచ్చి పాపకు పాలిస్తానని చెప్పింది. ఇక్కడ మీకో విషయం చెప్పాలి. ప్రియాంకకూ నాకూ ఆడపిల్లలంటే చాలా ఇష్టం. కానీ మాకు బాబు పుట్టాడు. నేను ఎప్పుడైతే ఆడపిల్ల అని ఫోన్లో చెప్పానో తను ఆగలేకపోయింది. ఆమె ఆతృత అర్థం చేసుకున్న నేను కూడా వెంటనే రమ్మని చెప్పేశాను. అలా తను పోలీసు స్టేషన్‌కు చేరుకుని పాప ఆకలి తీర్చింది. ఒక వేళ పాప కోసం ఎవరూ రాకపోతే పెంచుకుందామని కూడా అనుకున్నాం! మరుసటి రోజు వైద్య పరీక్షల కోసం పాపను ఆస్పత్రికి తీసుకెళ్లాం! అక్కడి వైద్యులు పాపను పరీక్షించి పాలివ్వడం గంట ఆలస్యమైతే మరింత బలహీనమై ప్రాణాలకే ప్రమాదం జరిగి ఉండేది అన్నారు. మరుసటి రోజు పాప కన్నతల్లి పెట్రోలింగ్ పోలీసులకు కనిపించింది. పాపను ఎవరికిచ్చానో, ఎక్కడిచ్చానో గుర్తు లేదంటూ ఏడుస్తూ ఉండడంతో ఆమెను పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారు. చూడగానే పాపను గుర్తుపట్టిందామె. ఇక నుంచి పాపను జాగ్రత్తగా చూసుకోవాలని, మద్యం జోలికి వెళ్లొద్దని చెప్పి పాపను ఆమెకు అప్పగించాం!

- రవీందర్
కానిస్టేబుల్, అఫ్జల్‌గంజ్

సాధన

ఏడాది క్రితం వరకూ ఆమెకు యోగా అంటే తెలియదు. ఆరోగ్యం కోసం యోగా నేర్చుకొన్నారు. కఠోర సాధనతో కొద్ది కాలంలోనే ఆసనాల్లో పరిపూర్ణత్వం సాధించి అంతర్జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటున్నారు. గృహిణిగా ఇంటిని చక్కదిద్దుకుంటూ... ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తూ... యోగా సాధనతో యువతలో స్ఫూర్తిని నింపుతున్న హైదరాబాద్‌కు చెందిన చామర్తి రాధ (41) ప్రస్థానం ఆమె మాటల్లోనే...

అతివల ఆరోగ్యానికి తప్పని యోగం!



నేను మ్యాథ్స్‌లో పీజీ పూర్తి చేశాను. హైదరాబాద్‌లోని మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో ఆరేళ్లుగా పనిచేస్తున్నాను. నలభై పైబడిన వయసు, అధిక ఒత్తిడి వల్ల త్వరగా అలసిపోయేదాన్ని. నీరసం వల్ల క్లాసులు చెప్పలేకపోయేదాన్ని. ఏం చేయాలా అని ఆలోచిస్తుంటే యోగా దీనికి పరిష్కార మార్గంగా తోచింది. ఆ విధంగా ఏడాది క్రితం నుంచే యోగా సాధన చేయడం ప్రారంభించా.

యోగాలో ఎన్నో రకాలున్నాయి. కానీ దేని యోగం దానిదే ! ఆరోగ్యం కోసం నేను 'హఠయోగ' సాధన చేయడం ప్రారంభించా. మొదట్లో చాలా కష్టమనిపించింది. రెండు నెలల పాటు ఒళ్లంతా ఒకటే నొప్పులు. అవసరమా అనిపించింది. కానీ ఎందుకు చేయలేమన్న కసితో సాధన చేశాను. 'యోగా సాధకులలో చాలామంది మొదట్లో వచ్చే బాడీ పెయిన్స్ కారణంగానే ఆసనాలు వేయడం మానేస్తారు. నొప్పులు ఉన్నా ప్రాక్టీస్‌చేస్తే అలవాటయిపోతుంది' అని మా గురువులు ఇచ్చిన ప్రోత్సాహంతో పట్టుదలగా యోగ అభ్యసించాను.

మొదట్లో సాధారణ యోగాసనాలను ప్రాక్టీస్ చేసేదాన్ని. 'ఇండియన్ యోగా ఫెడరేషన్ పోటీల' గురించి తెలుసుకొని ఉత్సాహంగా పాల్గొన్నా. మొదటిస్థానం వచ్చింది. ఆ తర్వాత జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయ యోగా పోటీల్లో నా ఏజ్‌గ్రూప్‌లో 25 మంది పాల్గొన్నారు. మొదటి ప్రయత్నంలోనే ఐదో స్థానంలో నిలవడం సంతోషాన్ని, అంతులేని ఆత్మవిశ్వాసాన్నిచ్చింది. నిజానికి ఈ పోటీలకు ముందు 15 రోజులు నేను అనారోగ్యంతో బాధపడ్డాను. పోటీలకు వెళ్లలేమోనని భయపడ్డాను. ప్రాక్టీస్ కూడా లేదు. కానీ అవకాశం వదులుకోకూడదని పోటీలో పాల్గొన్నా. సాధన మొదలెట్టిన తొలి ఏడాదే జాతీయస్థాయికి చేరడమంటే మాటలు కాదు. మా గురువుల శిక్షణ, నేర్చుకోవాలనే తపన, సాధన నాకు గుర్తింపును తీసుకొచ్చాయి. ఇటీవల పాండిచ్చేరీలో పర్యాటక శాఖ నిర్వహించిన అంతర్జాతీయ యోగా పోటీల్లో 36-50 వయసు విభాగంలో 9వ స్థానం వచ్చింది. చాలా దేశాల నుంచి వచ్చిన యోగా నిపుణులతో పోటీపడి 9వ స్థానంలో నిలవడం సంతోషాన్నిచ్చింది.

కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో...

మా వారి సహకారం లేకుండా ఇదంతా సాధ్యమయ్యేది కాదు. ఆయన ప్రోత్సాహంతోనే నేను నా కలలను నెరవేర్చుకోగలిగాను. ఆయనే ఇప్పుడు అంతర్జాతీయ యోగా పోటీలకు తీసుకువెళ్తున్నారు. ఎప్పుడైనా నిరుత్సాహపడితే మా వారు, అబ్బాయి నువ్వు చేయగలవని ప్రోత్సహిస్తుంటారు. కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుంది. మహిళలు ఇంటి పని, ఉద్యోగం రెండింటినీ మేనేజ్ చేసుకుంటూనే ఆరోగ్యం కాపాడుకోవాలి. దానికి యోగా చక్కని మార్గం. ఈ తరం అమ్మాయిలకు నేను చెప్పే మాట ఏమిటంటే... ఆరోగ్యం పట్ల అవగాహన ఉండాలి... జిహ్వచాపల్యాన్ని నియంత్రించుకోవాలి. భవిష్యత్తులో యోగా ట్రైనర్ కావాలనుకుంటున్నా.

• పులగం గిరి



హెల్దీ డ్రింక్

కుంకుమపువ్వుతో లాభాలెన్నో..

కుంకుమపువ్వు చలి, జలుబుకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. కుంకుమ పువ్వు కలిపిన పాలను జలుబు చేసినప్పుడు నుదురు మీద రాసుకుంటే, ఉపశమనం లభిస్తుంది. ఈ పువ్వులో శరీరానికి వేడిని అందించే గుణాలుంటాయి.



జ్ఞాపకశక్తి: కుంకుమపువ్వు కలిపిన పాలు తాగితే మెదుడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తిని మెరుగుపరిచి, వయసు పైబడడం వల్ల వచ్చే మతిమరుపును తగ్గిస్తుంది. ఆక్సిడేటివ్ ఒత్తిడిని నిలువరిస్తుంది.

మెన్‌స్ట్రువల్ క్రాంప్స్: బహిష్టు సమయంలో పొత్తి కడుపులో నొప్పి తగ్గాలంటే కుంకుమపువ్వు కలిపిన పాలు తాగాలి. దీనిలో నొప్పిని నివారించే గుణాలుంటాయి. దాంతో కొంత ఉపశమనం పొందుతారు.

నిద్రలేమి: కుంకుమ పువ్వులోని క్రొసిన్, సాఫ్రనాల్, పిక్రోక్రోసిన్ వంటి ప్రొటీన్ యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. పాలలో లేదా టీలో కుంకుమ పువ్వు కలుపుకొని తాగితే నిద్రలేమి సమస్య దరిచేరదు. మానసిక ఒత్తిడిని పోగొడుతుంది. కుంకుమపువ్వులో మాంగనీస్ ఎక్కువగా ఉంటుంది. ఇది నిద్ర చక్కగా పట్టేలా చేస్తుంది.

గుండె ఆరోగ్యం: రక్త ప్రసరణ సవ్యంగా జరిగేందుకు, రక్తనాళాలు కుచించుకుపోకుండా కుంకుమపువ్వు చూస్తుంది. కుంకుమపువ్వులోని లక్షణాలు రక్తంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె సంబంధ వ్యాధులు వచ్చే ముప్పును నివారిస్తాయి.

ఆస్తమా, అలర్జీ: గ్లాసు పాలలో కుంకుమ పువ్వు కలిపుకొని తాగితే కీళ్ల నొప్పుల సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కుంకుమపువ్వులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఆస్తమా, ఇతర అలర్జీల సమస్యలను దూరంచేస్తాయి.

పేరెంటచ్

వ్యక్తిగత విషయాల్లో తలదూర్చితే..

ఇతరుల వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడటం అంటే కొందరికి సరదాగా అనిపిస్తుంది. నిజానికి, ఈ ధోరణి పూర్తిగా అసమంజసమైనది. ఎందుకంటే, మన వ్యక్తిగత విషయాలే మనకు సరిగా అర్థం కావు. అలాంటిది ఇతరుల వ్యక్తిగత విషయాలు మనకు ఎలా అర్థమవుతాయి? అలాంటప్పుడు ఇతరుల వ్యక్తిగత విషయాలపై వ్యాఖ్యానాలు చేయడం ఏ రకంగా న్యాయం?

ఒకవేళ ఎదుటి వాళ్లే స్వయంగా తమ వ్యక్తిగత విషయాలు చెప్పినా వాటిల్లో పూర్తి వాస్తవం ఉండదు. ఎందుకంటే ఎవరూ తమ వ్యక్తిగత విషయాల్ని పూర్తిగా విడమర్చి చెప్పరు. చెప్పీ చెప్పని ఆ నాలుగు మాటలపైనే ఒక అభిప్రాయానికి రావడం కష్టం. అవతలి వాళ్లు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు, వారిని ఆదుకోవడానికి ఏవైనా ఆలోచనలు చేస్తే అది వేరే విషయం. అంతేగానీ, ఎదుటి వారిని ఖండించడానికో, హేళన చేయడానికో అయితే అది పూర్తిగా హేయమైన పని.

చాలాసార్లు జరిగేదొకటి... బయటికి పైకి పొక్కేది మరొకటిగా ఉంటాయి. అయినా అందరూ కలిసి, ఆలోచించాల్సిన, పరిష్కరించాల్సిన, కలిసి పనిచేయాల్సిన బోలెడన్ని సామాజిక విషయాలు ఉండనే ఉంటాయి. అలాంటప్పుడు ఇతరుల వ్యక్తిగత విషయాల్లోకి తలదూర్చాల్సిన అవపసరమేముంది? దానివల్ల ఎదుటి వాళ్ల మనసు నొప్పించడం తప్ప ఒరిగేదేమీ ఉండదు. ఈ ధోరణి వల్ల కలిగే మరో నష్టం ఏమిటంటే, అప్పటిదాకా మిత్రులుగా ఉన్నవాళ్లు కాస్తా శత్రువులైపోతారు. పైగా వాళ్లు కూడా మన వ్యక్తిగత విషయాల గురించి వ్యాఖ్యానించడం మొదలెడతారు. నిజానికి ఈ అలవాటు బాల్యం నుంచే మొదలవుతుంది. అందుకే ఇతరుల వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడటం ఎంత తప్పో బాల్యంలోనే పిల్లలకు ఒక అవగాహన కలిగించడం అవసరం.!



ఫ్యామిలీ కౌన్సెలింగ్

సరైన నిర్ణయమేనా?


నాకు గతంలో వివాహమై కొన్ని కారణాల వల్ల విడాకులు తీసుకున్నా. మా వాళ్లు నాకు మళ్లీ పెళ్లి చేయాలనుకుంటున్నారు. ఒక వ్యక్తితో దాదాపుగా కుదిరినట్టే. నాకు అంతగా నచ్చకపోయినా అతని కుటుంబం మంచిది అని నచ్చజెప్పడంతో సరేనన్నా. అన్నీ అనుకూలిస్తే వచ్చే నెలలో పెళ్లి. ఈమధ్య అతనితో మాట్లాడుతుంటే తన స్నేహితుని భార్య గురించి అనుమానం వ్యక్తం చేశాడు. దాంతో అతన్ని చేసుకోవడం సరైనా నిర్ణయమేనా అనిపిస్తోంది... ఏం చేయాలి?

-లక్ష్మి

వివాహం అంటే మూడు ముళ్లు, ఏడడుగులు మాత్రమే కాదు. పెళ్లి అంటే సర్దుబాటు. అవతలి వారిని లోపాలతో సహా స్వీకరించడం. అలా అని లోపాలు ఉన్నవారిని చేసుకోవాలని కాదు. ఉన్నంతలో మనకు నచ్చేవారిని ఎంచుకోవడం. వందశాతం ఎవరూ నచ్చరు. సాధారణంగా అవతలి వారి కుటుంబ పరిస్థితి, గుణగణాలు చూస్తారు. బహుశా మీ విషయంలో కూడా అంతే. అయితే మీరు ఒకసారి దెబ్బతిన్నారు కాబట్టి మరోసారి మోసపోతానేమో అనే సందేహంలో ఉన్నారు. కానీ ఒకసారి మాత్రమే మాట్లాడి ఇలా అనుకోవడం సబబు కాదేమో. ఇప్పటికీ మించిపోయింది లేదు. మరోసారి అతనితో వివరంగా మాట్లాడండి. మీ భయాలు, సందేహాలు చర్చించండి. సంతృప్తిగా అనిపిస్తేనే చేసుకోండి. అయితే అనవసరమైన భయాలతో అందమైన జీవితం పోగొట్టుకోకండి.

• కె.శోభ, ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com





తెలంగాణలోని సిద్ధిపేట జిల్లాలో వెలసిన కోరమీసాల కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు అపురూపమైన జానపద సంస్కృతికి ప్రతీక. బొట్టు, బోనం, సిగం, పట్నం వంటి ఎన్నో విశిష్టతలకు ఆలవాలం.

సత్తేటి వారాల జాతర!

ఈ నెల 20 నుంచి కొమురవెల్లి బ్రహ్మోత్సవాలు



సాధారణంగా ఏ దేవాలయంలోనైనా బ్రహ్మోత్సవాలు 3రోజుల నుంచి 9రోజులు నిర్వహించడం పరిపాటి. కానీ కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు సుమారు మూడు నెలలు... సంక్రాంతి తరువాత వచ్చే ఆదివారం మొదలుకొని, ఫాల్గుణ మాసం చివరి ఆదివారం... అంటే ఉగాది ముందు వచ్చే ఆదివారం వరకూ కొనసాగుతాయి. అశేష భక్తజనంతో పాటు జోగినులు, శివసత్తుల సిగాలు, పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు దరువులు, బోనాలతో ఆలయ పరిసరాలు సందడిగా మారుతాయి. భక్తులు తమ కష్టాలు తీర్చిన స్వామి కోసం బోనం తయారు చేసి, పట్నాలు రచించి మొక్కులు తీర్చుకుంటారు. తమ పిల్లా పాపలనూ, పాడిపంటలనూ చల్లగా చూడాలని వేడుకుంటారు.

పుట్టమన్నుతో మూలవిరాట్

11వ శతాబ్దంలో కొమరవెల్లిలోని విజయాచలం గుట్టల్లో ఓ ముని తపస్సు చేయగా, శివలింగం వెలిసిందట! ఆ లింగంపై పెరిగిన పుట్టమన్నుతో మూలవిరాట్టును రూపొందించి, దాని నాభి ప్రదేశంలో ఆ శివలింగాన్ని ప్రతిష్ఠించారన్న గాథ ఒకటి ప్రచారంలో ఉంది.

బ్రహ్మోత్సవాల వివరాలు :

ఎప్పుడు?: జనవరి 20 నుంచి మార్చి 31 వరకూ

ముఖ్య కార్యక్రమాలు:

- మార్చి 4- మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి ఒంటి గంటకు పల్లకి సేవ, రాత్రి 2 గంటలకు పెద్దపట్నం
- మార్చి 5- ఏకాదశ రుద్రాభిషేకం, అన్నపూజ
- మార్చి 19- కామదహనం
- మార్చి 21- వసంతోత్సవం, (హోలీ వేడుకలు)
- మార్చి 31- రాత్రి 7గంటలకు వీరభద్ర ప్రస్థాయం, భద్రకాళి పూజ, అగ్నిగుండ ప్రజ్వలన
- ఏప్రిల్ 1- తెల్లవారుజామున గురుపూజ, బలిహరణ, అగ్నిగుండ ప్రవేశం, గెలుపు విజయోత్సవం, ఏకాదశ రుద్రాభిషేకం, మహదాశీర్వచనం

త్రిపురాసురులను శివుడు సంహరించిన పురాణ గాథను గుర్తు చేస్తూ, ఈ ఆలయంలో మల్లన్న పాదాల కింద ముగ్గురు రాక్షసుల తలలు ఉంటాయి.

పట్నం అంటే...

వీరశైవ సంప్రదాయం ప్రకారం వీరశైవార్చకులు మార్గశిర మాసంలో వేదమంత్రోచ్చారణలతో కల్యాణం చేస్తే, ఒగ్గు పూజారులు యాదవ సంప్రదాయం ప్రకారంగా మహాశివరాత్రి రోజున పట్నం (ముగ్గు) వేసి కల్యాణం జరుపుతారు. పసుపు, కుంకుమ, తెల్ల పిండి (వరిపిండి), సునేరు, పచ్చ... ఇలా అయిదు రంగుల పదార్థాలను ప్రమధ గణాలకు ప్రతీకలుగా సమ్మిళితం చేసి, నిమ్మకాయతో చిత్ర కన్ను నెలకొల్పుతారు. 43 వరుసల్లో పట్నాన్ని వేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతారు. మల్లన్న, కేతలమ్మ, మేడలాదేవిలకు నూతనవస్త్రాలను సమర్పించి, సుంకు పడతారు (బియ్యాన్నీ, పసుపునూ కలిపి దంచుతారు). గొంగళిలో బియ్యంతో మైలపోలు (దిష్టి) తీస్తారు. స్వామివారు ధరించే త్రిశూలం, ఢమరుకాలను నెలకొల్పిన అనంతరం పెద్దపట్నం పైకి ఆవాహన చేస్తారు. నిమ్మకాయలు, గుమ్మడికాయలతో బలిహరణ చేస్తారు. తెల్లవారుజామునే గర్భాలయం నుంచి వీరశైవులు ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి పట్నం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. పట్నంపై చిందేస్తూ భక్తులు తన్మయులవుతారు. స్వామివారిని దర్శించుకుంటారు. ఈ బ్రహ్మోత్సవాలు ఫాల్గుణమాసం చివరి ఆదివారం అగ్నిగుండాల కార్యక్రమంతో ముగుస్తుంది. శివసత్తులు, భక్తులు మల్లన్న ఆవాహనతో అగ్నిగుండాలను దాటుతారు

ఈ ఏడాది పదకొండు వారాలు!

సంక్రాంతి తరువాత వచ్చే మొదటి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చి పట్నాలు వేసి బోనాలు నివేదించి పండుగ జరుపుతారు. దీన్ని 'పట్నంవారం' అని పిలుస్తారు. రెండోవారం సికింద్రాబాద్ నుంచి భక్తులు ఎక్కువగా వస్తారు. కాబట్టి 'లష్కర్‌వారం'గా ప్రాచుర్యంలోకి వచ్చింది. గతంలో కేవలం 3 నెలల కాలంలో ఏడు ఆదివారాల పాటు జాతర కొనసాగడంతో 'సత్తేటి వారాల జాతర'గా పేరొందింది. కానీ తిథుల ఆధారంగా ఒక్కోసారి 12 వారాల వరకు జాతర కొనసాగుతుంది. ఈ ఏడాది 11 వారాలు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

పశ్చిమంగా మూలవిరాట్

సాధారణంగా దేవాలయాలలోని ప్రధాన దేవతామూర్తులు తూర్పు వైపు తిరిగి ఉంటారు. కానీ మల్లన్న ఆలయంలో మూలవిరాట్టు పడమరవైపు ఉంటుంది.

రెండు సంప్రదాయాలు

కొమురవెల్లి మల్లన్న వీరశైవులకు చెందిన మేడలాదేవీని వివాహమాడాడని చెబుతారు. వీరశైవాగమశాస్త్రం ప్రకారం గర్భాలయంలో వేద మంత్రోచ్చారణలతో ఆర్జితసేవలు నిర్వహిస్తారు. అలాగే యాదవుల ఆడబిడ్డ అయిన కేతలాదేవిని కూడా స్వామి పరిణయమాడారట! కాబట్టి యాదవులు పంచరంగులతో పట్నాలువేసి పూజలు జరుపుతారు.

బోనం నివేదన...

భక్తులు వంట చెరకు, మట్టికుండలు, కూరగాయలు, బెల్లం కొనుగోలు చేసి, పాయసం వండుతారు. బోనం తయారు చేస్తారు. మల్లన్నకు నివేదించిన అనంతరం ఇంటిల్లిపాది సహపంక్తి భోజనం చేస్తారు. మట్టికుండలతో పాటు స్వామివారి బండారిని (పట్నం వేసిన ముగ్గు పిండిని) తీసుకువెళ్లి పొలాలలో చల్లుకుంటారు. బండారిని నిత్యం ధరిస్తూ, నీటితో కలిపి సేవిస్తే దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని విశ్వాసం.

ఎక్కడుంది?: తెలంగాణలోని సిద్ధిపేట జిల్లా కొమురవల్లి మండల కేంద్రంలో

ఎలా వెళ్ళాలి?: హైదరాబాద్ నుంచి సుమారు 92 కి.మీ., సిద్ధిపేటకు 22 కి.మీ. దూరంలో కొమరవెల్లి ఉంది. ఆ ప్రాంతాలనుంచి రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.

● జిల్లా అజయ్‌కుమార్, ఆంధ్రజ్యోతి, చేర్యాల

విహంగాల విడిది!

మన దగ్గరే





దేశ, విదేశీ పక్షులకు శీతకాల విడిది పులికాట్ సరస్సు. సుదూర సీమల నుంచి తరలివచ్చిన ఈ అపురూపమైన అతిథుల పేరిట ఏటా నిర్వహిస్తున్న వేడుక ఫ్లెమింగో ఫెస్టివల్ లేదా పక్షుల పండుగ. ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట దీనికి వేదిక.

దేశంలో అతి పెద్ద ఉప్పు నీటి సరస్సుల్లో పులికాట్ రెండవది. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, తమిళనాడులోని పొన్నేరి తాలూకాల మధ్య విస్తరించి ఉంది. అక్టోబరు నుంచి మార్చి వరకూ... ఈ సరస్సు నీటితో కళకళలాడుతూ ఉండే సమయంలో... ప్రతి సంవత్సరం నెల్లూరు జిల్లాలోని నేలపట్టు గ్రామానికి దేశ, విదేశాలకు చెందిన పక్షులు వస్తుంటాయి. వీటిలో నైజీరీయా, కజకిస్తాన్, పాకిస్తాన్ దేశాలకు చెందినవి ప్రదానమైనవి. ఇవి ఆరు నెలలపాటు పులికాట్ సరస్సులోని ఆహారాన్ని తీసుకొంటూ, చెట్లపై నివాసం ఉంటాయి. అక్కడే గుడ్లను పొదిగి, ఆ పిల్లలు కొంచెం పెద్దవయ్యాక, వాటితో తమ దేశాలకు తరలిపోతాయి. పిడికిడి అంత ఉండే ఉల్లంకి పిట్టల నుండి చిన్న సైజు దూడ ఎత్తు ఉండే సముద్రపు రామచిలుకల (ఫ్లెమింగోలు) వరకు సుమారు నూటయాభై రకాల పక్షి జాతులు ఈ సరస్సులో ఈ సీజన్‌లో విహరిస్తుంటాయి. ముఖ్యంగా ఫ్లెమింగోలు. పెలికాన్‌లు (గూడబాతులు), పెయింటెడ్ స్టార్క్ (ఎర్రకాళ్ల కొంగలు) సమూహాలు సందర్శకులకు కన్నుల పండుగ చేస్తుంటాయి. ఈ సరస్సు ప్రాంతాన్ని పక్షుల రక్షిత కేంద్రంగా ప్రభుత్వం 1976లో గుర్తించింది. పులికాట్ సరస్సుతో పాటు నేలపట్టులోనూ వన్యప్రాణి విభాగాన్ని ఏర్పాటు చేసింది. శ్రీహరికోట, సూళ్లూరుపేట మార్గంలోని అటకానితిప్ప వద్ద పులికాట్ పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించారు. ఈ మార్గంలో పక్షుల విన్యాసాలను వీక్షించేందుకు వ్యూపాయింట్లను నిర్మించారు. బైనాక్యూలర్స్, టెలిస్కోప్‌లతో పక్షులను తిలకించే అవకాశాన్ని కల్పించారు.



ఎప్పుడు?: ఈనెల 20 నుంచి 22 వరకూ

ఎక్కడ?: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా సూళ్లూరిపేటలో

ఎలా వెళ్ళాలి?: చెన్నై నగరానికి 80 కి.మీ., నెల్లూరుకు 90 కి.మీ. దూరంలో సూళ్లూరుపేట ఉంది. బస్సు, రైలు మార్గాల ద్వారా చేరుకోవచ్చు. సూళ్లూరుపేట నుండి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో ఉన్న పులికాట్ సరస్సులో పక్షులను తిలకించవచ్చు. నెల్లూరు నుండి చెన్నైకు వెళ్లే మార్గంలోని దొరవారిసత్రానికి 3 కి.మీ. దూరంలో నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం ఉంది. తడ మండల కేంద్రం సమీపంలో ఉన్న భీములవారిపాళెం పడవలరేవు దగ్గర సరస్సులో బోట్ షికారు చెయ్యవచ్చు.

పండగ అలా మొదలైంది!

2001లో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్న ప్రవీణ్‌కుమార్ పులికాట్, నేలపట్టులను సందర్శించారు. పక్షి సమూహాలను చూసి అబ్బురపడ్డారు. ఈ ప్రాంతం ఖ్యాతిని నలుదిశల వ్యాపించేలా పక్షుల పండుగ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సరస్సులో పొడవాటి మెడతో, హొయలొలుకుతూ కన్నులపండుగచేసే ఫ్లెమింగో పేరుతో దానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఈ ఉత్సవాలను డిసెంబరు లేదా జనవరిలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ వేడుకలకు 2005లో అప్పటి రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి గీతారెడ్డి హాజరయ్యారు. పక్షుల పేరుతో పండుగ చేయడాన్ని అభినందించి, దీన్ని పర్యాటక క్యాలెండర్‌లో చేరుస్తానని హామీ ఇచ్చారు. అలా 2006లో ఫ్లెమింగో ఫెస్టివల్ రాష్ట్ర పర్యాటక క్యాలెండర్‌లో చోటుచేసుకుంది. అప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వమే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది పక్షుల పండుగకు రూ. మూడు కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

ఇవీ కార్యక్రమాలు:

- సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ఆవరణలో అన్ని ప్రభుత్వశాఖల ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర మంత్రులు, సినీతారలు, ఇతర ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొంటారు.
- నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం వద్ద, అటకానితిప్ప పర్యావరణ విజ్ఞానకేంద్రం వద్ద సందర్శకులకు సరస్సు విశిష్టత గురించి వివరిస్తూ, పక్షుల విన్యాసాలతో కూడిన వీడియోలను ప్రదర్శిస్తారు.
- తడ మండలం భీములవారిపాళెం దగ్గర గతంలో జాలర్లకు పడవ పందేలు నిర్వహించేవారు. కాని ప్రస్తుతం సందర్శకులకు బోట్ షికార్లు చేసే సదుపాయం మాత్రం ఉంది.

● ఆర్.ఎం.వి. భాస్కర్‌బాబు, సూళ్లూరుపేట



నింగిని తాకేలా...



దేశ పర్యాటక చిత్రపటంలో అరకుకు ప్రత్యేక స్థానం వుంది. ఎత్తైన కొండలు, లోతైన లోయలు, ప్రకృతి అందాలతో కనువిందుచేసే ఈ ప్రాంతం మరోసారి అంతర్జాతీయ హాట్ బెలూన్ల పండుగకు సిద్ధమైంది.





అరకు హాట్ బెలూన్ ఫెస్టివల్ వినోదానికి మాత్రమే పరిమితం కాదు. దీన్ని పర్యావరణ (ఎకో), (సాహసోపేత (అడ్వెంచర్) టూరిజం ఈవెంట్‌గా పరిగణించవచ్చు. ఈ ఏడాది సుమారు పదిహేను దేశాలకు చెందిన పైలెట్లు ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు.

ఎక్కడ?: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లాలోని అరకులో

ఎప్పుడు?: జనవరి 18 నుంచి 20 వరకూ

ఎలా వెళ్ళాలి?: రోడ్డు, రైలు, విమాన మార్గాలద్వారా విశాఖపట్నం చేరుకొని, అక్కడినుంచి అరకు వెళ్ళవచ్చు. విశాఖపట్నం నుంచి అరకుకు బస్సు సర్వీసులు ఉన్నాయి. కిరండోల్ మార్గంలో విశాఖ నుంచి అరకుకు రైలు మార్గంలో ప్రయాణం మరచిపోలేని అనుభూతిని అందిస్తుంది.

ప్రత్యేకతలు: ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ 2017 నవంబర్‌లో తొలిసారిగా అంతర్జాతీయ హాట్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఆహ్లాదమైన పర్యావరణం, జనావాసాలు తక్కువగా వుండడం, లోయలతో కొండలు ఉండడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని, అరకును వేదికగా ఎంపిక చేసింది. దాదాపు 13 దేశాలకు చెందిన పైలెట్లు పాల్గొని దాన్ని విజయవంతం చేశారు. ఈసారి 15 దేశాల నుంచి- భారత్‌తో పాటు ఇంగ్లండ్, థాయ్‌ల్యాండ్, యూఎస్ఏ, ఫ్రాన్స్, స్పెయిన్, మలేషియా, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, బెల్జియం, ఇటలీ, స్లొవాకియా, బ్రెజిల్ దేశాల నుంచి- పైలెట్లు పాలుపంచుకోబోతున్నారు.దేశంలో ఇటువంటి అడ్వెంచర్ ట్రావెల్ ఫెస్టివల్స్ నిర్వహణలో అనుభవం వున్న ఈ- ఫ్యాక్టర్ సంస్థ వీటి నిర్వహణ బాధ్యతలను చేపట్టింది. ప్రతి రోజు సూర్యోదయం కాగానే కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. సముద్రమట్టం నుంచి ఐదువేల అడుగుల ఎత్తు వరకూ బెలూన్లు ఎగరనున్నాయి. వీటికి ఆకట్టుకునేలా లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. వివిధ రంగుల్లో ఇంద్రధనస్సుల్ని తలపించేలా నింగిలోకి ఎగిరే బెలూన్లు సందర్శకులకు ఆహ్లాదం పంచబోతున్నాయి.

ఈసారి ఇలా...

ప్రపంచం కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టేసింది. ఈ ఏడాది ఏఏ కొత్త ప్రదేశాల్లో విహరించాలో సందర్శకులు చురుగ్గా ప్రణాళికలు వేసేసుకుంటున్నారని అగ్రశ్రేణి ట్రావెల్ ఏజెన్సీల ప్రతినిధులూ, పర్యాటక రంగ నిపుణులూ చెబుతున్నారు. పర్యాటక ప్రదేశాల ఎంపికలో, ఇతర విషయాల్లో 2019 ట్రెండ్స్ విభిన్నంగా ఉండబోతున్నాయని వారు అంచనా వేస్తున్నారు. ఎక్కువమంది ఓటేసిన ప్రధానమైన ట్రెండ్స్ ఇవి:

ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరుగుతోంది. పర్యాటకులు కూడా దీనికి మినహాయింపేం కాదు. కొన్నేళ్ళుగా వెల్‌నెస్ టూరిజం చాలా వేగంగా విస్తరిస్తోంది. రాబోయే కొద్ది సంవత్సరాల్లో దీని పరిమాణం రెట్టింపు అవుతుందని ఫ్లోరిడా కేంద్రంగా పని చేస్తున్న గ్లోబల్ వెల్‌నెస్ ఇనిస్టిట్యూట్ చేసిన అధ్యయనం చెబుతోంది. ఫిట్‌నెస్ కార్యకలాపాలు ప్రధానంగా ఉన్న రిసార్టులు, స్పా సేవలు అందించే హోటళ్ళు, ప్రకృతి సిద్ధమైన ఆరోగ్య కేంద్రాలకు ఈ ఏడాది గిరాకీ బాగుంటుందట! బిజీబిజీ జీవితానికి దూరంగా హాయిగా విహరించడంతోపాటు పునరుత్తేజాన్ని కలిగించి, జీవనశైలిని మెరుగుపరిచే మెలకువలు అందించే కేంద్రాలను ఎంచుకొనే పర్యాటకులు పెరుగుతున్నారని ఆ అధ్యయనం పేర్కొంది.

మినీ వెకేషన్స్

వారం రోజులో, పది రోజులో కుటుంబంతో, స్నేహితులతో ఎక్కడికైనా వెళ్తే బాగానే ఉంటుంది. అయితే దీనిలో చిక్కేమిటంటే, అందరికీ సెలవులు దొరకాలి. టిక్కెట్లూ, అనువైన వసతీ బుక్ చేసుకోవాలి. టూర్ చేసే రోజులు పెరుగుతున్న కొద్దీ వత్తిడి కూడా పెరుగుతుంది. అందుకే ఒకటి, రెండు రోజుల పర్యటనల వైపు టూరిస్టులు మొగ్గ చూపుతున్నారట! అంతేకాదు, ఎక్కువ రోజుల పర్యటనలు పెట్టుకున్నా, మధ్యలో విరామాలు ఉండేలా చూసుకుంటున్నారట! ఇలా బ్రేక్ తీసుకోవడం వల్ల రిలాక్స్ కావడంతో పాటు బస చేసిన ప్రదేశాలతో మరింతగా మమేకమయ్యే అవకాశం ఉందని వారు భావిస్తున్నారట! ఈ ధోరణి వల్ల ఏడాదిలో ఏదో ఒకే ప్రదేశానికి వెళ్ళే బదులు వీకెండ్స్ లేదా వరుస సెలవు రోజులు వచ్చిన సందర్భాల్లో ఎక్కువ టూర్స్ వేసే అవకాశం ఉంటుందనీ,

ట్రెండ్



ఆర్థికంగా కూడా కాస్త వెసులుబాటు ఉంటుందనీ టూరిజం రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

ఉభయకుశలోపరి...

ఉద్యోగ, వ్యాపార పనుల మీద కొత్త ప్రదేశాలకు వెళ్ళడం సాధారణమే. అయితే 2019లో ప్రస్ఫుటంగా పెరిగే కీలకమైన ట్రెండ్ 'బి-లీజర్ ట్రావెల్' అని న్యూజెర్సీకి చెందిన ట్రావెల్ ఎక్స్‌పర్ట్ బెత్ గిబ్సన్ చెబుతున్నారు. ఒకే ట్రిప్‌లో వ్యాపార పనులనూ, పర్యటనలనూ చక్కబెట్టుకుంటామని ఆయన సంస్థ నిర్వహించిన సర్వేలో 87 శాతం మంది బిజినెస్ ట్రావెలర్స్ వెల్లడించారట. ఇంకో విషయం ఏమిటంటే, సెలవు పెట్టి ఎక్కడైనా తీరిగ్గా గడపడానికి వెళ్ళినా, ఉద్యోగం లేదా వ్యాపారానికి సంబంధించిన పనులు కొన్ని చేయాల్సి వస్తూంటుందని 92 శాతం మంది చెప్పారట! "బిజినెస్ ట్రావెల్ చేసినప్పుడు ఖరీదైన సౌకర్యాలను కంపెనీలే భరిస్తాయి. కాబట్టి కాస్త జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటే కుటుంబంతో సహా వెళ్ళి ఎంజాయ్ చేసి రావచ్చు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే, భార్యా పిల్లలనూ, ఇతర కుటుంబ సభ్యులనూ బిజినెస్ ట్రిప్పుల్లో తీసుకువెళ్ళి, తీరిక దొరికినప్పుడు పర్యాటక ప్రదేశాలను చుట్టేసేవారి సంఖ్య దాదాపు 56 శాతం అని అంచనా. ఈ కొత్త సంవత్సరంలో బి-లీజర్ ట్రిప్స్ మరింత పెరుగుతాయి" అని గిబ్సన్ అంటున్నారు.

శాసించేది సాంకేతికతే!

ట్రావెల్, టూరిజం రంగాలు సాంకేతికతతో విడదీయనంతగా పెనవేసుకుపోయాయి. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ నుంచి వర్చ్యువల్ రియాలిటీ, స్పీచ్ రికగ్నిషన్‌తో సహా అందుబాటులోకి వచ్చిన అనేక సాంకేతికతలు 2019లో మన యాత్రలను మరింత సరళతరం చెయ్యబోతున్నాయి. మన అభిరుచులకు అనువైన గమ్యాలను ఎంపిక చేసుకోవడం, టిక్కెట్లు బుక్ చేసుకోవడం, సౌకర్యంగా ఉండే వసతిని ఖరారు చేసుకోవడం, ఎక్కడ ఏ రుచులు బాగుంటాయో, ఏఏ ప్రదేశాలను సందర్శించాలో, వాటి మధ్య దూరం ఎంతో, సదుపాయాలు ఎలా ఉంటాయో తెలుసుకోవడం... ఇలా ప్రతిదీ స్మార్ట్‌ఫోన్‌తో కరతలామలకమైపోతోంది. మీ ఫోన్ సాయంతో తెరుచుకొనే హోటల్ గదులూ, మీకు తెలియని భాషను మీ మాతృభాషలోకి అనువదించి చెప్పే అప్లికేషన్లు, మొబైల్ యాప్ ద్వారా నిజ సమయంలో మీ లగేజీ ఎక్కడుందో తెలుసుకొనే సౌలభ్యం... ఇలా మీ పర్యటనలకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సాంకేతికతే నిర్దేశిస్తుంది.

డైలీ సుడోకు - 427

					4		5	6
6	8							4
			6	3		9		
7				4		6	3	
5								2
	3	2		1				7
		5		6	2			
9							6	8
3	4		8					

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 426 సమాధానం

8	1	3	2	7	4	6	9	5
7	2	6	1	5	9	4	8	3
5	9	4	6	3	8	1	7	2
9	5	8	3	6	1	7	2	4
6	4	2	7	8	5	3	1	9
1	3	7	9	4	2	8	5	6
4	7	5	8	2	6	9	3	1
3	6	9	5	1	7	2	4	8
2	8	1	4	9	3	5	6	7

అడుగు పెట్టాలంటే ట్యాక్స్ కట్టాల్సిందే!

ఎఫెక్ట్

నీటి మీద తేలే నగరం? అనే ప్రశ్న అడిగితే, టక్కున అందరికీ గుర్తొచ్చేది 'వెనిస్'. దీనికి రోడ్లు ఉండవు. ఎక్కడికి వెళ్లాలన్నా పడవల్లోనే ప్రయాణించాలి. ప్రపంచ పర్యాటకులకు ఎంతో ఇష్టమైన ప్రాంతం అది. ఇటలీలోని ఈ నగరానికి కొత్త సమస్య వచ్చి పడింది. రాను రాను పర్యాటకుల సంఖ్య పెరుగుతూనే ఉంది. దాంతో ఆ నగరంలో ఉండే జనాభా 55 వేల మంది మాత్రమే. కానీ ఏటా 3 కోట్ల మంది వెనిస్‌ను సందర్శిస్తున్నారని ఇటలీ అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అక్కడి ప్రముఖ పర్యాటక స్థలాలైన సెయింట్ మార్క్స్ స్క్వేర్, రైల్టో బ్రిడ్జ్ లాంటివి పర్యాటకుల కారణంగా దెబ్బతింటున్నాయి. అంతేకాదు కాలుష్యం కూడా అధికం కావడంతో వెనిస్ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇక నుంచి వెనిస్‌లోకి అడుగుపెట్టాలంటే ఎంట్రీ ట్యాక్స్ చెల్లించాల్సిందే. ఒక్కొక్కరి నుంచి 2 నుంచి 10 యూరోలు (దాదాపు రూ. 800) వసూలూ చేయాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సీజన్ల బట్టి ఈ ప్రవేశ రుసుములో మార్పులు ఉంటాయి. అయితే ఇలాంటి ట్యాక్స్ విధించిన దేశాల్లో ఇది రెండవది. కొన్నాళ్ల క్రితం చైనాలోని లిజియాంగ్ అనే చారిత్రక నగరాన్ని చూడాలంటే దాదాపు ఇదే మొత్తాన్ని వసూలు చేస్తున్నారు.






తను నాకు 'యస్' చెప్పింది

- విశాల్


విశాల్, అనీశా

హీరో విశాల్ తన పెళ్లి గురించి ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త కుమార్తె అనీశాతో విశాల్ పెళ్లి ఉంటుందని ఇటీవల ఆయన తండ్రి జి.కె.రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి వధువు అనీశా ఎవరా? అందరిలోనూ ఆసక్తి నెలకొంది. ఈ విషయం గురించి విశాల్ సంక్రాంతి సందర్భంగా ట్విట్టర్‌లో ప్రకటించారు. 'నా జీవితంలో అత్యంత గొప్ప మార్పు. అవును. సంతోషం. చాలా సంతోషం. తన పేరు అనీశా అల్లారెడ్డి. తను నాకు 'యస్' చెప్పింది. పెళ్లి తేదీని త్వరలోనే వెల్లడిస్తాను" అని విశాల్ ట్వీట్ చేశారు. అంతకు ముందే అనీశా ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. "నాకోసం మీరంతా ఎంతో చేశారు. దానికి ధన్యవాదాలు. నా అభివృద్ధిలో, నా అభ్యాసంలో, నా అవగాహనలో, నా స్ఫూర్తిలో, నా నిజాయతీలో, నా బాధలో, నా బలంలో, అంతెందుకు.. ఇవాళ నన్ను నన్నులా నిలపడానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు. త్వరలో నేను కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నాను. నా కలలు, నా లక్ష్యాలు సాకారం కాబోతున్నాయి. విశాల్‌ది మంచి మనసు. ఆయనతో జీవితాన్ని పంచుకోవాలనుకుంటున్నాను" అని అందులో రాశారు. 'పెళ్లిచూపులు', 'అర్జున్‌రెడ్డి' చిత్రాల్లో నటించారు అనీశా.

పెళ్లి కళ వచ్చేసిందే రిచా!


జో, రిచా గంగోపాధ్యాయ

రిచా గంగోపాధ్యాయ గుర్తున్నారా... 'బార్బీ గర్ల్...' అంటూ 'మిర్చి'లో ప్రభాస్‌తో ఆడిపాడారుగా. అంతకు ముందు 'లీడర్', 'నాగవల్లి', 'మిరపకాయ్' చిత్రాల్లో నటించారు. చివరిగా తెలుగులో ఆమె నటించిన చిత్రం నాగార్జున 'భాయ్'. ఆ తర్వాత సినిమాలకు దూరమయ్యారు. ఆమెకు ఇటీవల జో తో నిశ్చితార్థమైంది. ఈ విషయాన్ని ఆమె ట్విట్టర్‌లో వ్యక్తం చేశారు. "మీతో నా నిశ్చితార్థం గురించి చెప్పాలనుకుంటున్నాను. జో, నేను బిజినెస్ స్కూల్‌లో కలిశాం. రెండేళ్లు కలిసి గడిపాం. జీవితంలో తర్వాతి దశకు వెళ్లాలనుకుంటున్నాం. ఇంకా వివాహ తేదీ ఖరారు కాలేదు" అని రిచా ట్వీట్ చేశారు.

హారర్ థ్రిల్లర్...


అనుష్క

మాధవన్, అనుష్క, అంజలి, షాలిని పాండే ప్రధాన తారలుగా హేమంత్ మధుకర్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుంది. టి.జి. విశ్వప్రసాద్, కోన వెంకట్ నిర్మాతలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిలిం కార్పొరేషన్ పతాకాలపై రూపొందనున్న ఈ హారర్ థ్రిల్లర్ చిత్రీకరణ మార్చిలో ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "తెలుగు, తమిళ, హాలీవుడ్ నటీనటులు, సాంకేతిక నిపుణులతో రూపొందిస్తున్న క్రాస్ ఓవర్ చిత్రమిది. మార్చిలో అమెరికాలో చిత్రీకరణ ప్రారంభించి... ఈ ఏడాది ద్వితీయార్థంలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం" అన్నారు. అవసరాల శ్రీనివాస్, సుబ్బరాజు ప్రధాన పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: షనీల్ డియో, రచయితలు: గోపీ మోహన్, కోన వెంకట్, స్టయిలిస్ట్: నీరజ కోన, సంగీతం: గోపీ సుందర్.

వేసవిలో 'చిత్రలహరి'


సాయిధరమ్‌తేజ్

"ఓ వైపు కూల్‌గా ఉంటూ, మరోవైపు ఎమోషన్స్‌ని క్యారీ చేస్తూ అలరించే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మా 'చిత్రలహరి' అని అంటున్నారు సాయిధరమ్‌తేజ్. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రమిది. ఏప్రిల్ 12న విడుదల కానుంది. కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నారు. కల్యాణి ప్రియదర్శన్, నివేదా పెతురాజ్ నాయికలు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ (సి.వి.యమ్) మాట్లాడుతూ "అనుకున్న ప్రకారం షూటింగ్ సాఫీగా జరుగుతోంది. అన్ని పనులు పూర్తి చేసి ఏప్రిల్ 12న చిత్రాన్ని విడుదల చేస్తాం" అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ "ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ ఇది. టైటిల్‌లో అయిదు అక్షరాలు ఉన్నట్టు సినిమాలోనూ ఐదు పాత్రలకు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. కథ ఈ ప్రధాన పాత్రల చుట్టూ తిరుగుతుంటుంది. సాయిధరమ్‌తేజ్ కెరీర్‌లో మంచి సినిమా అవుతంది" అని చెప్పారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.


పచ్చటి పల్లెటూరి నేపథ్యంలో...


నవీన్ విజయ్‌కృష్ణ, కృష్ణ, విజయనిర్మల, నరేశ్

"పచ్చటి పల్లెటూరి నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. నవీన్ విజయ్‌కృష్ణ, శ్రీనివాస్ అవసరాల, మేఘా చౌదరి, సోఫియా సింగ్ కీలక పాత్రధారులు. రోవాస్కైర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతోంది. బాలాజి సానల దర్శకుడు. శ్రీహరి మంగళంపల్లి, రమ్యగోగుల, పి.ఎల్.ఎన్.రెడ్డి, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. నవీన్ విజయ్‌కృష్ణ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్ లోగోను సూపర్‌స్టార్ కృష్ణ, ఫస్ట్‌లుక్‌ను విజయనిర్మల, హీరో ఫస్ట్ లుక్‌ను నరేశ్, ఫస్ట్ లుక్ టీజర్‌ను కృష్ణ, విజయనిర్మల బుధవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. కృష్ణ మాట్లాడుతూ "ఆంగ్ల టైటిళ్లు వస్తున్న ఈ కాలంలో 'ఊరంతా అనుకుంటున్నారు' అనే టైటిల్ ఆకట్టుకుంటుంది. టైటిల్ బావుంటే సగం సినిమా హిట్ అయినట్టే. ఈ చిత్రంతో నవీన్‌కు ఫ్యాన్ ఫాలోయింగ్ రావాలి" అని అన్నారు. సినిమా పెద్ద హిట్ కావాలని విజయనిర్మల, సంగీత దర్శకుడు కె.ఎం.రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే చిత్రమని నిర్మాత అన్నారు. 'నందిని నర్సింగ్ హోమ్' తర్వాత నవీన్ ఈ సినిమాను ఎంపిక చేసుకుని మంచి పని చేశాడని నరేశ్ చెప్పారు. అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా అని నవీన్ తెలిపారు.

నాన్నగారి బయోపిక్ తీద్దామని అడుగుతున్నారు!

- రమేశ్ ప్రసాద్


ఎల్వీ ప్రసాద్



"సినిమాలపై ఎనలేని ప్రేమ, అమితమైన ఓపిక, స్వచ్ఛమైన ఆలోచనలు, క్రమశిక్షణ... నాన్నగారి పేరు తలచుకుంటే ముందుగా నాకు గుర్తొచ్చే లక్షణాలు ఇవే" అని నిర్మాత, ప్రసాద్ ల్యాబ్స్ అధినేత రమేశ్ ప్రసాద్ అన్నారు. తెలుగు చిత్రసీమలో తొలితరం నటుడు, దర్శకుడు, నిర్మాత ఎల్వీ ప్రసాద్ 111వ జయంతి గురువారం. ఈ సందర్భంగా ఆయన తనయుడు రమేశ్ ప్రసాద్ తండ్రితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారిలా...

● నా చిన్నతనంలో షూటింగులు ఎక్కువగా రాత్రిపూట జరిగేవి. నేను స్కూల్‌కి వెళ్లేటప్పుడు నాన్నగారు ఇంటికి వచ్చేవారు. నేను ఇంటికి తిరిగొచ్చే సమయానికి ఆయన షూటింగుకు వెళ్లేవారు. అందువల్ల, నాన్నతో నేను గడిపిన క్షణాలు అరుదైనవి.

● చిన్నతనంలో సినిమాలంటే నాకు ఆసక్తి ఉండేది కాదు. క్రికెట్ ఆడేవాణ్ణి. ఓ ఆదివారం నన్ను షూటింగుకు తీసుకువెళ్లారు... ఎన్టీఆర్, ఏయన్నార్ హీరోలుగా నాన్న దర్శకత్వం వహించిన 'సంసారం'లో చిన్న వేషం వేయాలని. స్కూల్‌కి సెలవు కావడంతో క్రికెట్ ఆడుకోవాలనుకున్నా. షూటింగుకు తీసుకువెళ్లడంతో త్వరగా అదేదో పూర్తి చేసి క్రికెట్ ఆడుకోవాలని పదే పదే నాన్నను 'ఇంకా ఎంతసేపు' అని విసిగించేవాణ్ణి. వెళ్లిపోతానని మారం చేసేవాణ్ణి. 'మిగతా ఆర్టిస్టుల కాంబినేషన్‌లో సన్నివేశాలున్నాయి. నువ్వు వెళితే బాగోదు. కూర్చో' అని చెప్పారు. నేను వినలేదు. దాంతో చూసి చూసి చివరికి చెంప మీద ఒక్కటి ఇచ్చారు నాన్న. అప్పుడు మౌనంగా పక్కకి వెళ్లి కూర్చున్నా. కొంతసేపటికి నన్ను పిలిచి నా షూటింగు పూర్తి చేశారు. తర్వాత నన్నెప్పుడూ షూటింగులకు తీసుకువెళ్లలేదు. ఎందులోనూ నటించమని అడగలేదు.

● సినిమాలపై నాన్నకు ఎంత ప్రేమంటే... మద్రాస్ తీసుకువెళ్లిన వంద రూపాయలూ ఖర్చయితే ఇంటికి తిరిగివెళ్లకుండా ఓ టైలరింగ్ షాపులో శుభ్రం చేసే పని చేశారు. ఓ థియేటర్ గేట్ కీపర్‌గానూ చేశారు. నేను ఎమ్మెస్ చేయడానికి అమెరికా వెళ్లినప్పుడు ఆ 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' అనేది అర్థమైంది. ఇటీవల పిప్పి పన్ను వస్తే.. చికిత్స చేయించుకున్నప్పుడు మద్రాస్ వెళ్లిన తొలినాళ్లలో నాన్న ఎంత బాధ అనుభవించారనేది మరోసారి తెలిసింది. మత్తుమందు ఇంజెక్షన్‌కి 25 పైసలు లేక, నొప్పిని భరిస్తూ పిప్పి పన్ను తీయించుకున్నానని నాన్న ఓసారి నాతో చెప్పారు. సినిమాలపై ప్రేమతో ఇటువంటి కష్టాలెన్నో ఆయన అనుభవించారు. అమితమైన ఓపికతో, సహనంతో దర్శకుడు అయ్యేవరకూ వేచి చూశారు. క్రమశిక్షణతో మెలిగారు.

● నాన్న ఆలోచనలు ఎంత గొప్పగా, స్వచ్ఛంగా ఉండేవంటే... 'నేను తీసిన సినిమాలు ప్రజలు చూడటంతో ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నాను. ఎవరైతే చూపు లేక బాధ పడుతున్నారో... సినిమాలు చూడలేకపోతున్నారో... వాళ్లకు నేను సహాయం చేస్తా' అని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్‌కి రూపకల్పన చేశారు.

● హిందీలో రాజ్‌కపూర్ కుటుంబం తరహాలో మా కుటుంబమంతా సినిమాల్లో ఉండాలని నాన్న ఆకాంక్ష. మా కుటుంబం ఈ స్థాయికి రావడానికి కారణమైన చిత్రసీమకు ఏదో ఒకటి చేయాలని చెప్పేవారు. నేను చదువు పూర్తయ్యాక కొన్నాళ్లు ఓ వ్యాపారం చేశా. అది మానేశాక సినిమా కెమెరాలు అద్దెకు ఇచ్చే వ్యాపారం ప్రారంభించా. తర్వాత ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్ స్థాపించాం. నాన్నగారి బయోపిక్ తీద్దామని చాలామంది నన్ను అడుగుతున్నారు. చూడాలి.

'సైరా'... రాజా పాండీ



'సైరా'లో విజయ్ సేతుపతి లుక్ విడుదలైంది. ఈ చిత్రంలో ఆయన 'రాజా పాండీ' పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ బుధవారం ట్విట్టర్‌లో ప్రకటించింది. "మక్కళ్ సెల్వన్ విజయ్ సేతుపతికి పుట్టినరోజు శుభాకాంక్షలు. మా 'సైరా నరసింహారెడ్డి'లో 'రాజా పాండి' డైనమిక్ లుక్ ఇది" అని విజయ్‌సేతుపతి లుక్ విడుదల చేశారు. చేతిలో మొండికత్తి, మెడలో పులిగోరు గొలుసు, నుదుట ఈశ్వరుడిని తలపించే విభూతి రేఖల మధ్య కుంకుమ బొట్టుతో ఠీవీగా కనిపించే విజయ్ సేతుపతి లుక్ ఆకట్టుకుంటోందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. 'సైరా'లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగా... టైటిల్ పాత్రలో చిరంజీవి నటిస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు, తమిళ్, మలయాళంలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాత రామ్‌చరణ్ సన్నాహాలు చేస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, నయనతార, కిచ్చా సుదీప్, తమన్నా, జగపతిబాబు తదితరులు నటిస్తోన్న ఈ చిత్రాన్ని దసరాకు విడుదల చేయనున్నారు.

Bulletin Board

Dean's scholarship

The Faculty of Humanities and Social Sciences at the University of Strathclyde, Glasgow is offering Indian students a scholarship opportunity towards their tuition fees of the undergraduate and postgraduate courses in International Relations and Diplomacy. This is applicable to the full-time programmes beginning in September 2019. The last date to submit the applications is August 30, 2019. For details, log on to https:// www.strath.ac.uk/studywithus/scholarships/humanitiessocialsciencesscholarships/government-publicpolicyscholarships/deansindianscholarshipinternationalrelationsanddiplomacy/

Data visualisation

The Center for Global Data Visualisation (CGDV) has designed a programme to build data visualisation capacity and strengthen a culture of data use in international development. The CGDV will launch globally in the spring of 2019. For more information, visit www.qedgroupllc.com.

PhD in Design

The World University of Design announces admissions for PhD in Design, Design Management, Visual Arts & Architecture. The last date to submit the applications is January 11, 2019. For details, visit: www.worlduniversityofdesign.ac.in. Postgraduate programmes Azim Premji University has invited applications for a two-year full-time Postgraduate Programmes in Education, Development and Public Policy & Governance and One-year Programme LL M in Law and Development. The last date for applications for the programmes is January 26, 2019. For details, log on to www.azimpremjiuniversity. edu.in/pg or email: admissions@apu.edu.in.

Scholarship programmes

The Canadian International School, Bengaluru has announced its scholarship programme for meritorious students for the academic year 2019. The last date for submitting the application form is January 20, 2019. For further details, call 9902929403 or email: scholarships@cisb.org.in.

BA Economics

The University of Sheffield, UK is inviting applications for BA Economics course starting in September 2019. The last date to apply is June 30, 2019. For further information, email: economics-admissions@sheffield.ac.uk.

AIEED 2019 scholarship

ARCH College of Design & Business invites design aspirants for the All India Entrance Examination for Design (AIEED) – Scholarship Aptitude Test (SAT) 2019 for undergraduate & postgraduate level courses where they can get a scholarship up to Rs 2,50,000. Registrations commence between January 15 and January 30, 2019. For further details, email: admission@archedu.org.

LAMP fellowship

The Legislative Assistants to Members of Parliament (LAMP) Fellowship provides an opportunity for young Indians to learn law-making and public policy. It invites applications from graduates across disciplines with a stipend of Rs 20,000 per month. The last date to apply is January 27, 2019. Further queries, contact lampfellowship @ prsindia.org

PhD programme

Bengaluru Central University invites online applications from eligible candidates for admission to a doctoral programme leading to PhD in the prescribed format. For details, log on to www.bcu.ac.in. Online application portal will be open upto January 30, 2019.

Courses in Astronomy

MP Birla Institute of Fundamental Research, Bengaluru will be conducting a basic course in Astronomy on Saturdays for all interested general public between January 12, 2019, and February 9, 2019. The application forms can be downloaded from the webpage at www.mpbifr-blr.in. For details, call 080-2238 5956 or email: info@mpbifr-blr.in.

Loan scholarship

The JN Tata Endowment awards is a one-time loan scholarship to Indian nationals at the beginning of the course for full-time postgraduate, PhD, postdoctoral studies or research fellowships, studies abroad, in all fields. The last date to submit applications is March 10, 2019. For details, log on to www.jntataendowment. org/loan-scholarship-process.

PhD programme

IIHMR University is inviting applications for a 3-year PhD programme. The last date for submission of the application form is January 25, 2019. Candidates aspiring for admission to the PhD programme may apply online or download the application form from the website: www.iihmr.edu.in.

ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, హ్యూమానిటీస్.... ఏదైనప్పటికీ రియల్ సైన్స్ బోధించాలి. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి. సత్యం కోసం అన్వేషించాలని జి.డి. బిర్లా ఆకాంక్షించారు. బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) వ్యవస్థాపక ఛైర్మన్‌గా అప్పట్లో ఆయన చెప్పిన మాటలు అవి. పిలానీలో స్థాపించిన బిట్స్ సరిగ్గా ఆయన ఆశయాలకు అనుగుణంగా ఎదుగుతోంది. బిట్స్‌కు పిలానీతో పాటు దుబాయ్, గోవా, హైదరాబాద్‌లోనూ క్యాంపస్‌లు ఉన్నాయి. రెండు వందల ఎకరాల సువిశాల స్థలంలో హైదరాబాద్ క్యాంపస్ అన్ని ఆధునిక హంగులతో ఏర్పాటైంది.

BITS AT - 2019

ఎగ్జామ్

బిట్స్ అడ్మిషన్ టెస్ట్ కాలవ్యవధి మూడు గంటలు. పరీక్షలో నాలుగు విభాగాలు ఉంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి చెరి 40 ప్రశ్నలు అడుగుతారు. అలాగే మేథ్స్/బయాలజీ (ఎంపికనుబట్టి) 45 ప్రశ్నలు వస్తాయి. ఇంగ్లీష్ ప్రొఫిసియెన్సీ నుంచి 15, లాజికల్ రీజనింగ్ నుంచి 10 మొత్తం 150 ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. కరెక్ట్‌గా గుర్తించిన ప్రతి సమాధానానికి మూడు మార్కులు కేటాయించారు. తప్పుగా గుర్తిస్తే పెనాల్టీ కింద ఒక మార్కు కట్ చేస్తారు. విడిచిపెట్టిన ప్రశ్నలకు ఎలాంటి పెనాల్టీ ఉండదు. ఎగ్జామ్ అటు జెఇఇ మెయిన్‌కు, ఇటు రాష్ట్రంలో జరిగే ఎంసెట్‌కు మధ్యస్థంగా ఉంటుంది.



- బిట్స్ పిలానీ డీమ్డ్ యూనివర్సిటీ. పిలానీలో ఏర్పాటు చేసిన బిట్స్. 'బిట్స్ పిలానీ' పేరుతోనే డీమ్డ్ యూనివర్సిటీగా నమోదైంది. అందువల్లే పిలానీ సహ దుబాయ్, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఎక్కడ చదివినా సర్టిఫికెట్లను బిట్స్, పిలానీ పేరు మీదుగా అందిస్తారు.
- ఈ సంస్థలో లెర్నింగ్‌కు సంబంధించి విద్యార్థికి అపరిమితమైన స్వేచ్ఛ ఉంటుంది. సెమిస్టర్ మొదట్లోనే ఏ సబ్జెక్టుకు ఎన్ని క్లాసులకు హాజరు కావాలన్నది తెలియజేస్తారు. వివిధ టెస్టులు సహ ప్రతీ సెమిస్టర్‌కు ఒక టైమ్ టేబుల్ ఉంటుంది. అందులో నుంచి విద్యార్థి తనకు అనుగుణంగా టైమ్ టేబుల్‌ను సర్దుబాటు చేసుకుంటాడు. ఉదాహరణకు ప్రత్యేకించి ఒక సబ్జెక్టుకు ఆ సెమిస్టర్లో ఇరవై క్లాసులకు తప్పనిసరిగా హాజరు కావాలన్న నిబంధన ఉందనుకోండి. ఆ సబ్జెక్టును వేర్వేరు సమయాల్లో పలువురు అధ్యాపకులు బోధిస్తుంటారు. ఈ నేపథ్యంలో సెమిస్టర్ మొదటి రోజే విద్యార్థి ఆ ఇరవై క్లాసులకు సంబంధించి తనకు నచ్చిన టీచర్, అలాగే సమయాన్ని ఎంపిక చేసుకునే వెసులుబాటు ఇక్కడ ఉంది. అలా మొదటి రోజే ఆ సెమిస్టర్ మొత్తానికి టైమ్ టేబుల్‌ని తనకు తాను విద్యార్థి నిర్దేశించుకోవచ్చు. చివరకు సెమిస్టర్ చివరి పరీక్ష ఎప్పుడు అవుతుందన్నది కూడా ఆ రోజే తెలుస్తుంది. తదనుగుణంగా సెమిస్టర్ అనంతరం ఇచ్చే సెలవుల్లో ఇంటికి వెళ్ళేందుకు టికెట్ రిజర్వేషన్ సహా ప్లానింగ్ చేసుకోవచ్చు.
- ఇంజనీరింగ్, సైన్స్, హ్యూమానిటీస్ ఏదైనా ఆరంభంలో అది ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్ మాత్రమే. ఏదైనా నాలుగేళ్ళ కోర్సే. మొదట్లో ఎందులో చేరినా, మొదటి రెండేళ్లలో సాధించిన ప్రగతి, మార్కుల ఆధారంగా బ్రాంచీలు మారడం మొదలుకుని అదనపు ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. బిటెక్ చేస్తూ ఎంటెక్ లేదంటే ఎంటెక్ చేస్తూ పిహెచ్‌డికి ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. అలాగే ఒక కోర్సు చేస్తూ వేరే కోర్సుకు బదిలీ కావచ్చు. డ్యూయల్ డిగ్రీ పొందే సదుపాయం ఉంది. 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న పద్ధతి ఇక్కడ ఉండదు.
- ప్యూర్ సైన్స్ కోర్సు చేస్తున్న ప్రతి విద్యార్థికి ఒక ప్రొఫెషనల్ డిగ్రీని పొందే హక్కు కల్పిస్తారు. అయితే కొన్ని నిబంధనలను ఆ విద్యార్థి పూర్తి చేస్తేనే ఆ వెసులు బాటు లభిస్తుంది.
- బిట్స్‌లో ఎవాల్యుయేషన్ నిరంతరం కొనసాగే ప్రక్రియ. అది సెమిస్టర్లో ఏ ఒక్క రోజుకో పరిమితం కాదు. కోర్సు ఏదైనా నాలుగు సెమిస్టర్లు అంటే రెండేళ్ళు పూర్తికాగానే ప్రతి విద్యార్థిని ఇండస్ట్రియల్ హౌస్‌కు అబ్జర్వేషన్ కోసం పంపుతారు. ఇది రెండు నెలలు ఉంటుంది. ప్రతి పది మంది విద్యార్థులను ఒక టీచర్‌కు అటాచ్ చేస్తారు. ఆయన ఆధ్వర్యంలో అక్కడి వ్యవహారాలను విద్యార్థులు చూసి తెలుసుకుంటారు. నోట్స్ రూపొందిస్తారు. అలా చేయడం వల్ల తిరిగి తరగతులకు హాజరైనప్పుడు వారికి రియల్ ఎక్స్‌పోజర్ కొంత ఉండటం వల్ల పాఠాలు బాగా అర్థమవుతాయి. చదువుకున్న విషయానికి, చూసిన వ్యవహారానికి మధ్య పొంతన బాగా కుదిరి మరింత బాగా చదవగలు గుతారు. అవగాహన బాగా పెరుగుతుంది.
- చివర్లో తిరిగి ఏడున్నర నెలల పాటు ఇండస్ట్రియల్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఇక్కడ నేరుగా ఆయా పరిశ్రమల్లో విద్యార్థులు పని చేయాలి. అందుకు స్టయిపెండ్ కూడా చెల్లిస్తారు. ఒక రకంగా ఇది పూర్తి స్థాయి ఉద్యోగం కింద లెక్క. ఏ రోజుకా రోజు డైరీ మెయింటైన్ చేయాలి. చివర్లో ప్రాజెక్టు రిపోర్టు రూపొందించాలి. ఇందులో భాగంగా కొందరు విదేశాలకు కూడా వెళుతుంటారు.
- ఈ రెండు వ్యవహారాల్లో టీచర్ల ప్రమేయం కూడా ఉంటుంది. దేశంలోని పలుపరిశ్రమలతో బిట్స్‌కు అనుబంధం ఉంది. దేశంలోని ప్రముఖ పట్టణాల్లో బిట్స్ ప్రతినిధులు ఉంటారు. పరిశ్రమల యజమానులు, ఇతరులతో వీరంతా ఎప్పటికప్పుడు ఇంటరాక్ట్ అవుతుంటారు. ఈ సంబంధ బాంధవ్యాలతో ఎప్పటికప్పుడు పరిశ్రమ అవసరాలు ఏమిటి అన్నది తెలుసుకుంటూ ఉంటారు. తదనుగుణంగా కరికులమ్ తదితరాలన్నింటినీ అప్‌డేట్ చేస్తారు. ఇక్కడి విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు కూడా అదే ఉపకరిస్తోంది.
- బిట్స్‌లో చేరేందుకు ఉద్దేశించిన టెస్ట్ బిట్స్ ఎట్. అంటే బిట్స్ అడ్మిషన్ టెస్ట్.
- ఈ పరీక్షకు హాజరు కావడంతోనే అభ్యర్థి పని పూర్తి కాదు. కోర్సులో ప్రవేశానికి అంటే క్యాంపస్, కోర్సు తదితరాలను తెలియజేస్తూ మరొక దరఖాస్తు చేసుకోవాలి.

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్ పిలానీ) పరిధిలోని వివిధ కళాశాల్లో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే బిట్‌శాట్-2019 ప్రకటన విడులైంది.
ప్రవేశ ప్రాంగణాలు: పిలానీ, గోవా, హైదరాబాద్.
కోర్సులు: బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ
విభాగాలు: బిఇ, ఎమ్మెస్సీ

నోటిఫికేషన్

అర్హత: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ ఇంటర్ ఉత్తీర్ణత. ఒక్క బిఫార్మసీ కోర్సుకు మాత్రం బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీతో ఉత్తీర్ణులై ఉండాలి. ఆప్షనల్ సబ్జెక్టుల్లో కనీసం 75 శాతం అగ్రిగేట్ మార్కులు పొందాలి. అలాగే ప్రతి సబ్జెక్టులో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరిగా పొంది ఉండాలి.
ఎంపిక: ప్రవేశ పరీక్ష ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
చివరి తేదీ: 2019 మార్చి 20
ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేదీలు: మే 16 నుంచి 26 వరకు
వెబ్‌సైట్: www.bitspilani.ac.in

క్యాంపస్‌లు - కోర్సులు

- బిట్స్ (బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌లలో వివిధ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది.
- **హైదరాబాద్ క్యాంపస్**
  కోర్సులు: బిఇ ఆనర్స్ (కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ ఇంజనీరింగ్); ఎమ్మెస్సీ(బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్)
- **పిలానీ క్యాంపస్**
  కోర్సులు: బిఇ(కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్); ఎమ్మెస్సీ ఆనర్స్ (బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్); ఎమ్మెస్సీ(జనరల్ స్టడీస్)
- **గోవా క్యాంపస్**
  కోర్సులు: బిఇ(కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్); ఎమ్మెస్సీ(బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్).

జాబ్ కార్నర్

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)- వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 358
ఉద్యోగాలు: అసిస్టెంట్ ప్రొఫెసర్ 16 (అనెస్థీషియా, కార్డియాలజీ, సీటీవీఎస్, గ్యాస్ట్రో మెడిసిన్, గ్యాస్ట్రో సర్జరీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, సైకియాట్రీ, పల్మనరీ మెడిసిన్, సర్జికల్ అంకాలజీ, రేడియాలజీ, యూరాలజీ), ఇంజనీర్ అండ్ షిప్ సర్వేయర్ కం డిప్యూటీ జనరల్ (టెక్నికల్) 1, బి గ్రేడ్

యూపీఎస్సీ

UPSC

సైంటిస్ట్ (జూనియర్ జియో ఫిజిసిస్ట్) 3, జీడీఎంఓ మెడికల్ ఆఫీసర్ 327, సీనియర్ లెక్చరర్ 11 (అనెస్థీషియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, ట్యుబరిక్యులోసిస్ అండ్ రెస్పిరేటరీ డిసీజెస్, పాథాలజీ, రేడియా డయాగ్నసిస్)
అర్హత: సంబంధిత ఉద్యోగ నిబంధనల ప్రకారం ఎంబీబీఎస్/ ఎండీ/ ఎంఎస్/ డీఎం/ ఎంసీహెచ్/ పీహెచ్‌డీ/ డీఎస్సీ/ పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 31
వెబ్‌సైట్: www.upsc.gov.in

టెక్నీషియన్లు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ)- సూరత్ ప్లాంట్ కోసం టెక్నీషియన్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 36
విభాగాలవారీ ఖాళీలు: అసిస్టెంట్ టెక్నీషియన్లు (మెకానికల్/ ఎలక్ట్రికల్) 12, జూనియర్ అసిస్టెంట్ టెక్నీషియన్లు (ఫిట్టర్/ డీజిల్/ ఎలక్ట్రికల్/ ప్రొడక్షన్) 21, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ (కెమిస్ట్రీ) 3
అర్హత: విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ డిప్లొమా/ ఎమ్మెస్సీ పూర్తిచేసి ఉండాలి. గ్యాస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లో అయిదేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.370
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 24
వెబ్‌సైట్: www.ongcindia.com

టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ - ఒప్పంద ప్రాతిపదికన కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఉద్యోగాలు: లా విభాగంలో జూనియర్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌లు
ఖాళీలు: 10
ఒప్పంద వ్యవధి: ఏడాది
అర్హత: ఎల్‌ఎల్‌బి ఉత్తీర్ణులై ఉండాలి
ఎంపిక: ఆబ్జెక్టివ్ టెస్ట్, డిస్క్రిప్టివ్ టెస్ట్, పర్సనల్ ఇంటరాక్షన్ ఆధారంగా
వేతనం: నెలకు రూ.40,000
దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 23
వెబ్‌సైట్: www.ncw.nic.in

సాంకేతిక సిబ్బంది

చెన్నైలోని జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తాత్కాలిక ప్రాతిపదికన కింది ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 10
ఉద్యోగాలు: సీనియర్ రీసెర్చ్ ఫెలో 2, జూనియర్ రీసెర్చ్ ఫెలో 4, ఫీల్డ్ కలెక్టర్ కం అసిస్టెంట్ 2, కంప్యూటర్ ఆపరేటర్ కం అకౌంటెంట్ 1
అర్హత: ఇంటర్ / డిగ్రీ / ఎమ్మెస్సీ / ఎంఫిల్ పూర్తిచేసి ఉండాలి. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో అనుభవం ఉండాలి.
వయసు: డిసెంబరు 31 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
ఇంటర్వ్యూకి మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి.
ఇంటర్వ్యూలు: జనవరి 25, 28
వెబ్‌సైట్: http://zsi.gov.in

ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం

నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) ఆధ్వర్యంలోని క్రాప్స్ డివిజన్- ఒప్పంద ప్రాతిపదికన కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 32
ఉద్యోగాలు: నేషనల్ కన్సల్టెంట్ 6, కన్సల్టెంట్ 4, ప్రోగ్రామ్ మేనేజర్ 1, లీడ్ ప్రోగ్రామర్ 1, సీనియర్ ప్రోగ్రామర్ 1, ప్రోగ్రామర్ 1, టెక్నికల్ అసిస్టెంట్ 18
వయసు: ఏప్రిల్ 1 నాటికి 65 ఏళ్ల మించకూడదు
విద్యార్హతలు, అనుభవం తదితర సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 22
వెబ్‌సైట్: www.nfsm.gov.in



అసిస్టెంట్ ప్రొఫెసర్లు

అలహాబాద్‌లోని మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 142
విభాగాలు: అప్లయిడ్ మేథమెటిక్స్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, మేథమెటిక్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఫిజిక్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం సెల్
ఒప్పంద వ్యవధి: ఏడాది
అర్హత: విభాగాన్ని అనుసరించి బీటెక్/ ఎంటెక్/ ఎంసీఏ/ బిఏ / బీకాం/ బీఎస్సీ/ ఎమ్మే/ ఎమ్మెస్సీ/ ఎంకాం/ ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 60 ఏళ్లు మించకూడదు
వేతనం: రూ.15,600 నుంచి రూ.39,100
దరఖాస్తు ఫీజు: రూ.500(ఎస్సీ/ ఎస్టీ/ మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 31
వెబ్‌సైట్: www.mnnit.ac.in